వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 11 సంచిక : 7 హైదరాబాద్ 144 జూలై 2013 పేజీలు : 68 రూ. 15

- ఉత్తరాఖండ్ బీభత్స కారణాలు
- దర్భాఘూట్‌ను ఎలా అర్ధం చేసుకోవాలి?
- సంక్షేమ పథకాలు - పేదరిక నిర్మూలన
- ఓట్ల కోసమే ఆహార భద్రతా బిల్లు
- ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీయేనా ?
- సమాచార హక్కు - రాజకీయ పార్టీలు
- ప్రజల సొమ్ముతో ప్రజలపై నిఘా

ISSN 2231-6892

144

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జూలై 2013
సంపుటి : 11
సంచిక : 7

వ్యవస్థాపక సంపాదకులు: **వి. హనుమంతరావు** | సంపాదకులు: **ఎన్. వేణుగోపాల్** | కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్: **వై. రామచంద్రం** | కంపోజింగ్: **సి. రాజశేఖర్** | సబ్ ఎడిటర్ : **ఎ. మల్లేశ్** | ఆఫీస్ అసిస్టెంట్ : **ఎస్. వెంకటేష్**

లోపలి పేజీల్లో...

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – డి. రవికుమార్

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం ఆర్థిక స్థితి గురించిన విజ్ఞప్తికి ప్రతిస్పందనగా లోకే రాజ్‌పవన్ (మంథని కరీంనగర్ జిల్లా) రు. 1,000 ఆర్థిక సహాయం అందించారు. వారికి కృతజ్ఞతలు.

వీక్షణం జూన్ సంచికలో నేను రాసిన 'లెనిన్ ఏంచేయాలి' వ్యాసంలో 'నరోద్నిజం' అని అచ్చయింది దాన్ని నరోదిజం అని చదువుకోవాలి. 42 పేజీ మొదటి పేరా దిగువన బ్రాకెట్లలో 'నరోద్నయా వోల్య సభ్యులు ఇతరులని చంపాలని చూసినా' అనే చోట ఇతరులని అనే పదానికి బదులుగా 'ఈయన్నీ, అనగా మూడో అలెక్సాండ్రనీ' అని చదువుకోవాలి. 43 పేజీ మొదటి పేరాలో రెండవ లైన్‌లో బ్రాకెట్లో ఉన్న 1807 బదులుగా 1887 అని చదువుకోవాలి.

– *ఎస్.వి.ఎస్. నాగభూషణ్*

పాలకొల్లు

ఫిబ్రవరి సంచికలో నా వ్యాసానికి స్పందిస్తూ రంగనాయకమ్మ గారు వీక్షణం మార్చ్ సంచికలో నా వ్యాసం బాగుందంటూనే ఆ వ్యాసంలో కొన్ని తప్పు అభిప్రాయాలున్నాయని రాశారు. అయితే, వాటిని నేను సరైన అభిప్రాయాలుగానే భావిస్తున్నందున ఒక ఆరోగ్యకర చర్చలో భాగంగానే, రంగనాయకమ్మపై గౌరవం, తన విమర్శ పట్ల సహృదయంతోనే నేను ఏప్రిల్ సంచికలో నా సమాధానం రాశాను. నా వ్యాసంలో తప్పు అభిప్రాయాలున్నాయని అన్నప్పుడు దానికి సమాధానం ఇవ్వడం నా నైతిక బాధ్యత, హక్కు కూడా.ఎంతో స్నేహపూర్వకంగా నేను స్పందిస్తే, మే సంచికలో రంగనాయకమ్మ నాపై వ్యక్తిగత దూషణలు, దెప్పి పొడుపు మాటలతో స్పందించారు. నాకు లోకజ్ఞానం లేదన్న రంగనాయకమ్మ, తను మాత్రం తన జ్ఞానానికి అనుగుణంగానే స్పందించారా? తన దృష్టిలో నా సమాధానాలు ఎంత తప్పు అభిప్రాయాలుగా అనిపించినా, చర్చ ద్వారా నావి తప్పు అభిప్రాయాలని తేల్చాలి. అంతే తప్ప వ్యక్తిగత దూషణలు, దెప్పి పొడుపు మాటలతో కాదు. రంగనాయకమ్మ తీరుగానే లేదా ఇంకొంచెం ఎక్కువగానే నేనూ స్పందించవచ్చు. నాకు భాషా సమస్య ఏమీ లేదు. కాని సంస్కారం అడ్డొస్తుంది. చర్చను ఇరువర్గాలు తమ అహంను సంతృప్తి పరుచుకోవడానికి వాడుకోవడం వలన ఇరువర్గాలకు స్వీయ ఆనందం లభిస్తుందేమో కాని దాంట్లో ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు.

'నిజమే, నేను ఇంత తప్పు చేశానా!' అని నేను ఆలోచించుకోలేదని రంగనాయకమ్మ అన్నారు. తప్పు ఎవరిదనేది చర్చలో తేలుతుంది తప్పించి, తప్పని ఏకపక్షంగా రంగనాయకమ్మ తేల్చేస్తే కాదు. తను చెప్పేదంతా పరమ సత్యాలని, వాటిని గుడ్డిగా నమ్మాలని, తనను ప్రశ్నించకూడదని ఈ వాక్యం ద్వారా తను చెపుతున్నారు. తమ మెదడుకు ఎక్కడ పని చెప్పాల్సి వస్తుందోనని రంగనాయకమ్మ చెప్పేదంతా పరమ సత్యాలుగా గుడ్డిగా నమ్మే వారికి తెలుగు పాఠకులలో కొదవ లేదు. అది వారి వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. 'లోక జ్ఞానం' లేకపోవడం వలన సమాజానికి కలిగే నష్టమేమీ లేదు. ఒక వ్యక్తి నోటి నుండి వచ్చేవన్నీ పరమ సత్యాలని గుడ్డిగా నమ్మడం, తనను అలా నమ్మాలని ఆ వ్యక్తి కోరుకోవడం సమాజానికి అత్యంత ప్రమాదకరమం . ఈ అంశం మానవ నాగరికతకు చేసిన, చేస్తున్నంత నష్టం బహుశా ఇంకే అంశం చేయడం లేదేమో.

నా వ్యాసం 'అద్భుతంగా' ఉందన్న రంగనాయకమ్మ, నా వ్యాసంలో తప్పు అభిప్రాయాలని ఎత్తిచూపి వాటికి నేను సమాధానం చెప్పగానే, ఆ వ్యాసానికి 'అంత విలువ లేదు' అని అన్నారు. తన అభిప్రాయాలే సరైనవని రంగనాయకమ్మ ఎలా అనుకుంటున్నారో, అవతలి వ్యక్తికి కూడా అలా అనుకునే హక్కు ఉంది. కేవలం చర్చ ద్వారానే ఎవరివి సరైన అభిప్రాయాలనే అంశం తేలుతుంది. అయితే, ఆ చర్చకు ఆరోగ్యకర వాతావరణం ఉండాలి. దాన్ని ఇరువైపుల వారు తయారు చేయాలి. అలాంటి వాతావరణం ఇప్పుడు లేనందున, రంగనాయకమ్మ అభిప్రాయాలతో నాకు ఏకాభిప్రాయం ఎందుకు లేదో వివరంగా చెప్పాలని ఎంతగానో ఉన్నప్పటికీ చర్చించే ధైర్యం చేయడం లేదు. నాకు 'లోక జ్ఞానం' లేదని ఆవిడ నిర్ణయించినప్పటికీ, కేవలం చర్చ ద్వారానే జ్ఞానం పెరుగుతుందని నా ప్రగాఢ విశ్వాసం. అయితే చర్చకు దిగితే ఈ సారి రంగనాయకమ్మ ఇంకా ఏ రకమైన దూషణలు, దెప్పి పొడుపు మాటలు అంటుందోననే భయంతో చర్చను కొనసాగించడం లేదు. మంచి చర్చ పట్ల ఆసక్తి ఉన్న వారెవరైనా ఉంటే వారిని నిరుత్సాహ పరిచినందుకు క్షమాపణలు.

– *లోక సంచారి*

హైదరాబాద్

సవరణ

జూన్ సంచిక ముఖపత్రంపై ప్రకటించిన 'వ్యవస్థీకృత అవినీతి' వ్యాసం అనివార్య కారణాల వల్ల ప్రచురించలేకపోయాం. – సం

లంకా పాపిరెడ్డి తన ఉత్తరంలో (వీక్షణం జూన్ 2013) మూడు ప్రపంచాల సిద్ధాంతంను మావో విదేశీ నాయకుని (కెన్నెత్ కౌండా) చెవిలో ఊదాడు అనే వార్త ఉంది అని మాత్రమే రాశారు. వాస్తవానికి ఆ సంభాషణకి ముందే ఆ సిద్ధాంత ఛాయలు చైనా పార్టీలో ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి – 1965 లిన్ పియావో రచన 'లాంగ్ లివ్ విక్టరీ ఆఫ్ పీపుల్స్ వార్'లో ఆ ప్రస్తావన ఉన్నట్లు దాఖలాలు ఉన్నాయి. డెంగ్ జియావో పింగ్ 1974 ఏప్రిల్ ఐక్య రాజ్య సమితి ప్రసంగంలో దీన్ని ప్రస్తావించాడు. నవంబర్ 1977లో పీపుల్స్ డెయిలీ 'ఛైర్మన్ మావోస్ థియరీ ఆఫ్ డిఫరెన్షియేషన్ ఆఫ్ ది త్రీ వరల్డ్స్ ఈజ్ ఎ మేజర్ కంట్రిబ్యూషన్ టు మార్క్సిజం లెనినిజం' (ఫారెన్ లాంగ్వేజెస్ ప్రెస్, బీజింగ్) అనే పుస్తకాన్ని ప్రచురించింది. కాబట్టి ఇది ఏదో అనుమానాస్పదమైన వార్తగా భావించనవసరం లేదు. అది చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ విధానంగానే చూడాలి. నాకు తెలిసినంతవరకు గత ఇరవై సంవత్సరాలలో ఎం ఎల్ పార్టీలు మూడు ప్రపంచాల సిద్ధాంతం గురించి ప్రస్తావించలేదు. అలాగని దానిని విశ్లేషించి తిరస్కరించినట్లు కూడా తెలియదు. ఒకవేళ ఏ పార్టీ అయినా అలా చేసి ఉంటే వీక్షణం దానిని ప్రచురించడం చర్చకు, ఉద్యమాలకు దోహదం చేస్తుంది.

– *కె. నరేంద్రమోహన్*

ఆస్ట్రేలియా

(వీక్షణం బ్లాగ్ www.veekshanam.wordpress.com పై పోస్ట్ చేసిన వ్యాఖ్య)

వీక్షణం జూన్ సంచికలో రంగనాయకమ్మ రాసిన 'శ్రమశక్తి ఉపయోగపు విలువ గురించి' వ్యాసం మొదటి భాగం చూసి ఆశ్చర్యపోయినాను. వ్యాసం పూర్తి కాకుండా దాని మీద రాయడం మర్యాద కాదు గాని, ఆమె రాసిన 'ఏమిటి మార్క్సూ? ఏమిటిది మరీనూ', 'ఏమిటిది మార్క్సూ' వంటి మర్యాద లేని మాటలు చూసినాక రెండు ముక్కలు రాయక తప్పడం లేదు. ముందు కొన్ని తప్పులు, కొన్ని ఒప్పులు కలిసి ఉన్న లోకసంచారి వ్యాసం మీద ఆమె రాసిన ఉత్తరంలో అపసవ్యాల గురించి రెండు నెలల కింద రాయవలసింది. కాని ఆమె నోట్లో ఎవరు నోరు పెడతారు అని అందరూ చెప్పుకునే మాట గుర్తొచ్చి ఆగిపోయినాను. ఏదో పాపం, లోకసంచారి తనను తాను సమర్థించు కుంటూ నాలుగు ముక్కలు రాస్తే దాని మీద ఆమె విరుచుకుపడి, అసలు ఆయనను పూర్తిగా కొట్టిపారేసిన సంగతి చూస్తే నిజంగానే జడిసిపోయినాను. కాని ఇట్ల అందరినీ కుమ్ముతూ ఆఖరికి మార్క్సును కూడ కుమ్మబోతుంటే ఇంక తప్పదని అనిపిచ్చింది. బాలగోపాల్ ఎప్పుడో రాసినట్టు మార్క్సిజంలో ముఖ్యమైన భాగం గతితర్కం ఆమెకు ఇసుమంత కూడ అర్థం కాలేదు. ఆమెకు తెలిసిందల్లా తర్కం, కుతర్కం, నవలారచన. వాటికి కాసింత మార్క్సిజం కలిపి పోపు వేసి మార్క్సిస్టు పండితురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఆమె ఇప్పటిదాకా రాసిన అవాకులూ చవాకులూ మార్క్సిజం తెలిసినవారు ఎందుకు విమర్శించడం లేదో నాకైతే ఆశ్చర్యం. ఆమె నోటికి జడిసే కావచ్చు. ఇంక ఇప్పుడు మార్క్సు మీద రాసిన దాంట్లో మార్క్సు చెప్పింది వేరు, దానికి ఆమె తీసిన అర్థాలు వేరు. పొరపాటు పడవచ్చు, మార్క్సు అనుకోని అర్థం తీయవచ్చు. నవలా రచయిత్రిగా ఆమెకు అన్ని హక్కులూ ఉన్నాయి. కాని మార్క్సే పొరపాటు చేశాడని, దాన్ని తాను దిద్దుతున్నానని అనడం, అనుకోవడం అంటే ఆత్మవిశ్వాసం మితిమీరిందేమో. 'ప్రపంచంలో చాలా విషయాల్లో అసలు జరిగే నిజాలు వేరూ, పైకి కనబడేవి వేరూగా ఉంటాయి' అని ఈ వ్యాసంలో ఆమె రాసిన మాటలు చదివి దిమ్మ తిరిగి పోయింది. ఈ మాటను ఆమె నిజంగా నమ్మితే ఇరవై ముప్పై ఏండ్లుగా లెక్కలేనంత మంది రచయితల మీద, ప్రజా ఉద్యమ నాయకుల మీద ఆమె చెయ్యి చేసుకోని ఉండేది కాదేమో. అవన్నీ పోనియ్యండి, లోకసంచారి వ్యాసంలో కొన్ని తప్పులు ఉన్నాయి కావచ్చు. వాటిని సరి చేయవచ్చు. కాని ఆ వ్యాసం చదవగానే 'నాలుగు మంచిమాటలు ఉన్నందుకే పొంగిపోయి' 'అమృతభాండంతో పోల్చడం', ఒక్క నెల తిరగకుండానే దాన్ని 'చాలా తెలివిమాలిన చేష్ట'గా చెప్పుకుని, 'ఆ వ్యాసానికీ వ్యాసకర్తకీ అంత విలువ లేదు నా మనసులో ఈనాడు' అని పారవేయడం సరైన పనేనా? ఒక మంచి అభిప్రాయం ఉన్నదని అమృతభాండం అనడమూ

(మిగతా 63వ పేజీలో...)

చలో అసెంబ్లీ, ప్యాకేజీ, రాయల తెలంగాణ...!!

వీక్షణం

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమమూ, దాని పట్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్పందనా కూడ వేడెక్కుతున్నాయి. కొత్త నిర్బంధాలూ కొత్త భ్రమలూ కొత్త వాగ్దానాలూ కొత్త ఆశాభంగాలూ ముస్తాబవుతున్నాయి. లోకసభకూ ఆంధ్రప్రదేశ్ శాసనసభకూ కూడ మరొక తొమ్మిది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగవలసి ఉంది. అంత దూరం కూడ కాకపోవచ్చునని, ముందస్తుగా మధ్యంతర ఎన్నికలు వస్తాయని ఊహాగానాలు కూడ వినబడుతున్నాయి. ఎన్నికల లోపు తెలంగాణ సమస్యకు ఏదో ఒక పరిష్కారం దొరుకుతుందని దాదాపు ప్రతి ఒక్కరూ నమ్ముతున్నారు, ప్రకటిస్తున్నారు. అయితే గత రెండు సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడ తెలంగాణ సమస్య పరిష్కారమైపోతుందని ఇలాగే ఆశలు వ్యక్తమయ్యాయి. 2004 ఎన్నికలలో కాంగ్రెస్ ఆ వాగ్దానం చేసింది. అధికారంలోకి రాగానే కనీస ఉమ్మడి కార్యక్రమంలో, రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన చేసి, ఏకాభిప్రాయం కోసం ప్రణబ్ ముఖర్జీ కమిటీ వేసి ఆశలు రేకెత్తించింది. అంతే, ఆ తర్వాత ఏమీ జరగలేదు. 2004లో వ్యతిరేకించిన ఇతర పార్టీలు కూడ 2009 ఎన్నికలలో తెలంగాణ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఇక తెలంగాణ ఏర్పాటుకు అడ్డంకి ఏదీ లేదనే అనిపించింది. ఆ అభిప్రాయం డిసెంబర్ 7 అఖిలపక్ష సమావేశంలో కూడ వ్యక్తమయింది. ఆ తర్వాత డిసెంబర్ 9 ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నాననే చెప్పింది. నాలుగున్నర ఏళ్లు గడిచినా ఆ ప్రారంభానికి ఇంకా ప్రారంభం రాలేదు.

ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రానున్నాయి గనుక తెలంగాణ మళ్లీ ఎజెండా మీదికి వస్తున్నది. కాంగ్రెస్ చేసిన నమ్మకద్రోహం ప్రజల కళ్లముందర కనబడుతున్నది గనుక, కాంగ్రెస్ విశ్వసనీయత కోల్పోయింది గనుక దాన్ని చూపి తాను వోట్లు సంపాదించాలని భారతీయ జనతా పార్టీ ఆశిస్తున్నది. తాను అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తానని నమ్మబలుకుతున్నది. గతంలో ఇటువంటి వాగ్దానమే చేసి కుంటిసాకులతో ఎగరగొట్టిన సంగతిని మూసిపెట్టాలని చూస్తున్నది. మరొకవైపు తెలంగాణ కోసమే ఏర్పడిన రాజకీయ పక్షం తెలంగాణ ప్రజల ఐక్యతను సాధించలేకపోతున్నది. తెలంగాణ ప్రజా ఆకాంక్షలను నిజంగా ప్రతిఫలించే, నెరవేర్చగలిగే సమరశీల పోరాట రూపాలను చేపట్టలేకపోతున్నది.

ఈ స్థితిలో జాయింట్ యాక్షన్ కమిటీ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అసెంబ్లీ సమావేశాలు లేనప్పుడు అనుమతి ఇస్తామని వెటకారం చేసిన ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యంలో కనీస ప్రజా ఉద్యమ సంప్రదాయాలు తనకు తెలియవని నిరూపించుకున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినా తాము అనుమతి ఇవ్వబోమని నగర పోలీస్ కమిషనర్ ఈ రాష్ట్రంలో పోలీసులు ప్రభుత్వంలో భాగం కాదని, ప్రభుత్వానికన్న ఎక్కువ అని ఉన్న నిజం చెప్పారు. ఎవరు పిలుపు ఇచ్చినా, ఎవరు పాల్గొన్నా పాల్గొనకపోయినా, పాల్గొంటామని ప్రకటిస్తూనే వెనుకనుంచి వెన్నుపోట్లు పొడిచినా, అనుమతి ఉన్నా లేకపోయినా చలో అసెంబ్లీ పిలుపుకు ప్రజలు స్పందించారు. ప్రభుత్వం పెద్దఎత్తున దమనకాండకు పాల్పడి వేలాది మందిని నిర్బంధించింది. వేలాది మంది మీద బైండ్ ఓవర్ ఆంక్షలు విధించింది. జిల్లాల నుంచి హైదరాబాదుకు రాగల వాహనాలన్నిటినీ ఆపివేసింది. హైదరాబాదు నగరాన్ని చక్రబంధం చేసింది. నగరం లోపల వందలాది చోట్ల దారులు మూసివేసింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ చుట్టూ ముళ్లకంచెలు కట్టి ప్రజలను కాదు, ప్రజాప్రతినిధులనబడే వాళ్లను ఖైదు చేసింది. అయినా కొన్ని డజన్ల మంది ఆందోళనకారులు శాసనసభా భవనం దాకా వెళ్లి నిరసన తెలపగలిగారు. తెలంగాణ రాష్ట్ర సమితి శాసన సభ్యులిద్దరు అసెంబ్లీ భవనం మీద తమ నిరసన జెండా ఎగరేయగలిగారు. పోలీసు నిర్బంధాన్ని అధిగమించి వేలాది మంది ఎక్కడికక్కడ నిరసన తెలిపారు.

దమనకాండతో చలో అసెంబ్లీ పిలుపును, తెలంగాణ ప్రజల ఆకాంక్షను అడ్డుకోవడం సాధ్యం కాలేదని అర్థమైన తర్వాత కాంగ్రెస్ అధిష్టానం ప్యాకేజీ అనే కొత్త పాచికను బైటికి తీసింది. చరిత్ర తెలియని కాంగ్రెస్ నాయకులు ఇది కొత్త ప్యాకేజీ అనుకుంటున్నారేమో గాని, 1956 నాటి పెద్దమనుషుల ఒప్పందం నుంచి నిన్న మొన్నటి దాకా కాంగ్రెస్ తెలంగాణకు ఎన్నో ప్యాకేజీలు ప్రకటించింది. ఒక్క ప్యాకేజీని కూడ అమలు చేయలేదు. అందువల్లనే ఇక ప్యాకేజీలు వద్దు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తప్ప అని ప్రజలు నినదిస్తున్నారు. ప్యాకేజీ గురించిన వార్తలు బైటికి వదిలి, వాటి పట్ల తీవ్ర నిరసన వ్యక్తమైన తర్వాత కాంగ్రెస్ అధిష్టానం మరొక కొత్త ఎత్తు ఎత్తుతున్నట్టు కనబడుతున్నది.

రాయలసీమలోని రెండు జిల్లాలను తెలంగాణతో కలిపి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేసే ప్రకటన మూడు నాలుగు రోజుల్లో రాబోతున్నదనే వదంతులు ఇది రాసే సమయానికి బలంగా ఉన్నాయి. ఆ వదంతులు కూడ అబద్ధమని రుజువు కావచ్చు. లేదా, కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలలో భాగంగా ఆ ప్రకటన వెలువడవచ్చు. అటువంటి ప్రతిపాదన రాయలసీమ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు కూడ ఆమోదయోగ్యం కాదు. రెండు ప్రాంతాల ప్రజలమీద, ప్రజా ఆకాంక్షల మీద అది దుర్మార్గమైన దాడి. దానివల్ల నాలుగు జిల్లాల రాయలసీమ రెండు ముక్కలై, రెండు రాష్ట్రాల్లో కలిసి ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోతుంది. తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికే రాష్ట్రం కోరుతున్న తెలంగాణ ప్రజలు మరొకసారి మరొక అస్తిత్వంతో కలవవలసి వస్తుంది. భిన్న అస్తిత్వాలను కలిపి కుట్టినందువల్ల ఆరు దశాబ్దాలు గడిచినా ఆంధ్రప్రదేశ్ ఎటువంటి ఉద్రిక్తతలను చవిచూడవలసి వచ్చిందో ఈ ప్రతిపాదిత రాష్ట్రం కూడ అదే అవకరంతో పుట్టినట్టవుతుంది. ఇది కేవలం ప్రజావ్యతిరేక కాంగ్రెస్ దుష్ట రాజకీయాలలో భాగమైన వ్యూహమే తప్ప, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కాదు. అందువల్ల అటు రాయలసీమ ప్రయోజనాల నుంచి చూసినా, ఇటు తెలంగాణ ప్రయోజనాల నుంచి చూసినా ఈ కొత్త ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించవలసి ఉంది.

వీ

ఆహారభద్రత సరే, సమాజ అభద్రత సంగతేమిటి?

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో దేశంలోని ప్రధాన కూటములు రెండూ వేస్తున్న ఎత్తుగడలు అసహ్యకరంగా ఉన్నాయి. ఆ రెండు కూటములకూ భిన్నంగా ఉన్నామని చూపుకుని అధికారం సంపాదించాలని మూడో ఫ్రంట్ పేరిట అవకాశవాదులు చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ఈ అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాలూ కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అధికారం వెలగబెట్టి సంపూర్ణంగా ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేశారనేది పట్టపగటి లాంటి సత్యం. మరొక అవకాశం లేక ప్రజలు ఎవరో ఒకరికి వోటు వేయవలసిందే తప్ప వీరిలో ఏ ఒక్క పార్టీకీ ప్రజల వోట్లు అడిగే అర్హత లేదు. ప్రజల దృష్టిలో ఏ రాజకీయ పార్టీకీ విశ్వసనీయత లేదు, రాజకీయ నాయకులందరూ దొంగలే. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ బతుకులు బాగుపడతాయని ప్రజలు భావించడం లేదు. ఇవాళ దేశపు వాస్తవ స్థితి ఇది కాగా, ప్రజలకు ఏవో తాయిలాలు చూపి, ప్రజల కళ్లముందర ఏవో సర్కస్‌లు ఆడించి, ఏవో రంగుల కలలు చూపించి గద్దెనెక్కాలని పార్టీలూ కూటములూ ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ కూటమికి దొరికిన అస్త్రం ఆహారభద్రత బిల్లు. అరవై ఆరు సంవత్సరాల వలసానంతర భారతంలో యాభై ఏళ్ల కన్న ఎక్కువ పాలించి ప్రజల ఆహారాన్ని, ఆహారభద్రతను, జీవనోపాధిని, జీవనాన్ని కొల్లగొట్టే విధానాలు అమలు చేసిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రజల ఆహార భద్రతకు హామీ ఇస్తానంటున్నది. దేశ జనాభాలో దాదాపు డెబ్బై శాతంగా ఉన్న నిరుపేద ప్రజలకు చౌకధరలకు ఆహార ధాన్యాలు అందించే కార్యక్రమానికి చట్టబద్ధమైన హామీ కల్పిస్తానంటున్నది. రానున్న ఎన్నికలలో అత్యధిక సంఖ్యాక వోటర్లను ఆకర్షించడానికి తప్ప ఈ పథకం నిజంగా అమలు చేయడానికి కాదు. ఏది ఏమైనా సరే, ఆర్డినెన్స్ ద్వారానైనా ఈ బిల్లు తీసుకువచ్చి తాను ప్రజల ఆహార భద్రత కోసం ప్రయత్నిస్తుంటే, ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని చూపి ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రయత్నం. కాంగ్రెస్ తక్షణ ఆహారపు కలను అమ్మడానికి ప్రయత్నిస్తుంటే, భారతీయ జనతా పార్టీ నాయకత్వం లోని ఎన్‌డిఎ కూటమి అభివృద్ధి కలను నరేంద్ర మోడీ ఆకర్షణతో కలిపి అమ్మజూపుతున్నది. ఈ ప్యాకేజీలో కనబడీ కనబడకుండా దాగి ఉన్నది ముస్లింల పట్ల ద్వేష భావాన్ని రెచ్చగొట్టి హిందూ వోట్లను కేంద్రీకరించుకోవాలనే దుష్ట ప్రయత్నం. గుజరాత్ మారణకాండకు ప్రత్యక్షంగా కారకుడైన నరహంతకుడు మోడీని భావి ప్రధానిగా ప్రతిపాదిస్తూ, మీడియా సాయంతో ఉన్నత మధ్యతరగతిని ఆకర్షించాలనీ, ప్రజలను మభ్యపెట్టేందుకు అబద్ధాల గుజరాత్ అభివృద్ధి నమూనాను చూపాలనీ భాజపా ప్రయత్నిస్తున్నది. ఈ రెండు కూటములకు లోపలి నుంచో బైటి నుంచో మద్దతు తెలిపిన వామపక్షా లతో సహా ఇతర పార్టీలు తాము ఆ తానులో ముక్కలం కామని చూపుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు సఫలమయ్యే అవకాశమే లేదు. అన్ని పార్లమెంటరీ పార్టీల రంగూ బయటపడిన ఈ తరుణంలో ప్రజాప్రత్యామ్నాయాన్ని బలోపేతం చేయడమే ఏకైక మార్గం. వీ

సామ్రాజ్యవాద సైన్యంలో ప్రజాస్వామ్య ప్రియులు

గంజాయివనంలో తులసిమొక్క అనేది నుడికారం మాత్రమే కాదు, నిత్యజీవితంలో అటువంటి ఎన్నో ఉదాహరణలు కనబడతాయి. ఉద్యోగ విధినిర్వహణలో భాగంగా దేశదేశాలలో అమెరికా సామ్రాజ్యవాదం కోసం, బహుళజాతి సంస్థల కోసం ఎన్నో తప్పుడు పనులు చేసిన జాన్ పెర్కిన్స్ ప్రపంచ వాణిజ్య సంస్థ భవనాలు కుప్పకూలిన తర్వాత పశ్చాత్తాపం రగిలి రాసిన 'ఒక దళారీ పశ్చాత్తాపం' అందరికీ తెలుసు. అటువంటి మరొక రెండు ఉదంతాలతో అమెరికా ఇప్పుడు అట్టుడికి పోతున్నది. ఇది ఒక నిరంతర ధోరణి అయి తన పాపాల చిట్టా బయటపడితే తన అంతం సమీపిస్తుంది గదా అని గంగవెర్రులెత్తుతున్నది. ఆ మహా బలసంపన్నమైన మట్టికాళ్ల మహారాక్షసి కాగితపు పులి అమెరికన్ సామ్రాజ్యవాదానికి వెన్నులో వణుకు పుట్టిస్తున్నవారు ఒకరు ఇరవై ఐదేళ్ల యువకుడు బ్రాడ్లీ మానింగ్, మరొకరు ఇరవై తొమ్మిదేళ్ల యువకుడు ఎడ్వర్డ్ స్నోడెన్. అమెరికన్ ప్రభుత్వం ఇరాక్‌కు పంపించిన దురాక్రమణ సైన్యంలో ఒకానొక సైనికుడు మానింగ్. అతికీలకమైన సైనిక రహస్య సమాచారం చూసే అవకాశం కలిగి వాటి హంతక రాజకీయ కుట్రలు అర్థమై వాటిని ప్రపంచానికి తెలపాలనుకున్నాడు. వికీలీక్స్‌కు ఆ సమాచారమంతా అందించాడు. అమెరికన్ పాలకులు మానింగ్‌ను మే 2010లో అరెస్టు చేసి, దేశద్రోహిగా ప్రకటించి చిత్రహింసలు పెట్టి, అనేక నేరాలు ఆరోపించి విచారణ జరుపుతున్నారు. మరణశిక్ష గాని, యావజ్జీవశిక్ష గాని విధించవచ్చునంటున్నారు. అలా ఒకవైపు మానింగ్ పట్ల అమెరికన్ ప్రభుత్వం అనుసరిస్తున్న దమననీతిని చూస్తూనే స్నోడెన్ తనకు తెలిసిన అమెరికన్ సైనిక రహస్యాలు బయటపెట్టడానికి నిశ్చయించుకున్నాడు. సామ్రాజ్యవాద నిఘాసంస్థ సిఐఎకు చెందిన నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీకి సాంకేతిక సలహాదారుగా పనిచేస్తూ స్నోడెన్, అమెరికన్, బ్రిటిష్ ప్రభుత్వాలు ఇతర దేశాల ప్రభుత్వాలకు, ప్రజలకు చెందిన సమాచారాన్ని ఎట్లా కూపీ లాగుతున్నాయో, ఈ పనిలో అంతర్జాతీయ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ బహుళజాతిసంస్థలు ఎట్లా సాయపడుతున్నాయో పూర్తి సమాచారం సేకరించాడు. రక్షణ కోసం అన్ని ఏర్పాట్లూ చేసుకుని, హాంకాంగ్ వెళ్లి తన దగ్గర ఉన్న రహస్య సమాచారమంతా గార్డియన్ పత్రికకు అందజేశాడు. గార్డియన్ జూన్ మొదటివారం నుంచి ఆ సమాచారాన్ని ప్రచురించడం మొదలుపెట్టింది. అమెరికా ప్రభుత్వం తనను చంపడానికి ప్రయత్నిస్తుందనీ, చంపినా సరే ఈ తప్పుడు పనిని బయట పెట్టాలని అనుకున్నాననీ స్నోడెన్ అన్నాడు. స్నోడెన్‌ను దేశద్రోహిగా అభివర్ణిస్తూ తనకు అప్పగించమని చైనా ప్రభుత్వం మీద అమెరికా ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. ఈలోగా స్నోడెన్ హాంకాంగ్ వదిలి వెళ్లిపోయాడు. ఈక్వడార్‌లోనో, వెనిజువెలాలోనో రాజకీయ ఆశ్రయం కోరవచ్చునని వార్తలు వస్తున్నాయి. ఏది ఏమైనా ఈ ఇద్దరి ఉదాహరణలు ప్రభుత్వ, ప్రజావ్యతిరేక, హంతక సంస్థలలో పనిచేస్తున్న వారందరికీ ఆదర్శం కావాలి. భుక్తి కోసం ఏదో ఒక ఉద్యోగంగా ఇటువంటి దుర్మార్గ సంస్థలలో చేరినా అవకాశం వచ్చినప్పుడు ప్రజల పక్షాన, సత్యం పక్షాన నిలిచి తమకు తెలిసినది ప్రజలకు తెలియజెప్పడమే వ్యక్తుల ప్రజాస్వామిక కర్తవ్యమని ఇప్పటికి చరిత్రలో ఎందరో చూపిన ఉదాహరణను వీళ్లు మళ్లీ చూపుతున్నారు.

వీ



❖ **విజయపథంలో పురోగమిస్తున్న ఫిలిపినో విప్లవోద్యమానికి జేజేలు**– విప్లవ రచయితల సంఘం ప్రచురణ, 40 పేజీలు, 1/8 డెమీ, రు: 15, ప్రతులకు: దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ మార్క్; నవోదయ బుక్‌హౌస్



❖ **భారత రాజ్యాంగం –** గ్రాన్‌విల్ ఆస్టిన్, తెలుగు: ప్రభాకర్ మందార – నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ – 483 పేజీలు, 1/8 డెమీ, రు:250, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్–500006; ఫోన్ : 23521849;www.hyderabadbooktrust.blogspot.com




❖ **అభివృద్ధి – పర్యావరణం** (వ్యాస సంకలనం) – ఎ. నర్సింహారెడ్డి, 84 పేజీలు, 1/8 డెమీ, రు: 40, 4–6–84/2, వెంకన్నకుంట, జనగాం, వరంగల్–506 167, ప్రతులకు: వీక్షణం, దిశ పుస్తకం కేంద్రం



❖ **భారత వ్యవసాయ రంగంలో భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు ఏ స్థాయిలో ఇంకా కొనసాగుతున్నాయి?** – రమేష్ పట్నాయక్, లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు – 32 పేజీలు, 1/8 డెమీ, రు : 15, ప్రతులకు: లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇ.నెం. 5–85–4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522 002; సెల్: 9848877596



❖ **ప్రవాహం–** సజయ – లిఖిత ప్రెస్ – 182 పేజీలు, 1/8 డెమీ, రు: 150, ప్రతులకు: లిఖిత ప్రెస్, వై. నిర్మల, ఎచ్ఐజి–2, బ్లాక్–12, ఫ్లాట్–1, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500 044; ఫోన్: 27660000



❖ **బందీకాని గొంతుక బులిటెన్–** కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్, ఎ.పి.చాప్టర్, 72 పేజీలు, 1/4 డెమీ, రు: 60, ప్రతులకు: 301, తిరుమల రెసిడెన్సీ, రాంనగర్ గుండు, హైదరాబాద్ – 500044



❖ **మహానీయంత** – కుందుర్తి ఆంజనేయులు– శ్రీశ్రీ సాహిత్య నిధి ప్రచురణ – 31 పేజీలు, 1/8 డెమీ, రు : 20, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతినగర్, విజయవాడ – 520004, ఫోన్: 0866–661737, సెల్:9246277375 ఇమెయిల్: srisri_sahityanidhi@yahoo.com



❖ **ఏది తెలుగు? ఎవరు తెలుగువారు? ఇతర వ్యాసాలు–** వాసిరెడ్డి భాస్కరరావు – ప్రజాహిత ప్రచురణలు–122 పేజీలు, 1/8 డెమీ, రు: 40, ప్రతులకు: ప్రజాహిత ప్రచురణలు, ఇంటి.నెం. 1–7–454, రెవెన్యూ కాలనీ, సుబేదారి, హనుమకొండ, వరంగల్–506 001, ఫోన్ నెం:0870–2431361, సెల్: 093901 01251, ఇ.మెయిల్: విశాలాంధ్ర; బుక్‌బర్డ్; నవోదయ




❖ **ప్రాతినిధ్య కథ–2012 –** సంపాదకులు– కుప్పిలి పద్మ, డా. సామాన్య– సామాన్య కిరణ్ ఫౌండేషన్–166 పేజీలు, 1/8 డెమీ, రు : 60, ప్రతులకు : సామాన్య కిరణ్ ఫౌండేషన్ కేరాఫ్ ఇడిగినేని గురప్పనాయుడు డోర్ నెం: 25–1–370, 6వ క్రాస్ రోడ్, పోస్టల్ కాలనీ, ఎ.కె. నగర్ , నెల్లూరు– 524 004 ఫోన్: 9866690656, 09775600900, అన్ని ప్రముఖ పుస్తక షాపులు



❖ **అంతర్లయ (కవిత్వం) –** ఎలనాగ – పాలపిట్ట బుక్స్, 184 పేజీలు, 1/10 డెమీ, రు : 90, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036; ఫోన్: 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **ఒద్దిరాజు సోదరుల దుష్ట పంచాయితి మరికొన్ని నాటకాలు** – పాలపిట్ట బుక్స్, 184 పేజీలు, 1/8 డెమీ, రు: 90, ప్రతులకు : పాలపిట్ట బుక్స్



❖ **ఫ్లోరోసిస్... ఫ్లోరోసిస్... (దీర్ఘ కవిత)** – డా. రూప్ కుమార్ డబ్బీకార్ – పాలపిట్ట బుక్స్, 43 పేజీలు, 1/8 డెమీ, రు: 30, ప్రతులకు : పాలపిట్ట బుక్స్



❖ **నిర్నిద్రగానం (కవిత్వం)–** కొండపల్లి నీహారిణి– ప్రచురణ: కొండపల్లి వేణుగోపాల్ రావు డిసెంబర్ 2012– 135 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు : పాలపిట్ట బుక్స్



❖ **నన్ను సాయిబును చేసింది వాళ్లే** – (ముస్లిం సామాజిక వ్యాసాలు) **–** షేక్ కరీముల్లా – ప్రచురణ: ముస్లిం రచయితల సంఘం, 100 పేజీలు, 1/8 డెమీ, రు : 50, లైబ్రరీ ప్రతి: 75. ప్రతులకు : షేక్ కరీముల్లా ఇ.నెం. 21–55, పెద్ద మసీదు బజారు, వినుకొండ–522 647, గుంటూరు జిల్లా; అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు



❖ **తల్లడిల్లుతున్న జనహృదయాలు**–మానేరు, మంజీర పబ్లికేషన్స్–68 పేజీలు, 1/8 డెమీ, రు: 80, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, దిశ పుస్తక కేంద్రం చిక్కడపల్లి, సహచర బుక్ మార్క్ బాగ్‌లింగంపల్లి, నవయుగ పబ్లికేషన్స్, కాచిగూడ.



❖ **నేను.. ఎడ్లపాడు.. ఎర్రజెండా..–** పోపూరి రామారావు – భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచురణ, ఎడ్లపాడు గ్రామ శాఖ, ఎడ్లపాడు, గుంటూరు జిల్లా, 136 పేజీలు, 1/8 డెమీ, రు: 10, ప్రతులకు: సెక్రటరీ, సిపిఐ(ఎం) విలేజ్ కమిటీ, ఎడ్లపాడు–522 233

రుక్నుద్దీన్ మృతి

కవి, రచయిత, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ రుక్నుద్దీన్(66) మే 27న గుజరాత్‌లోని జాంగర్‌లో అనారోగ్యంతో మరణించారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లా వెల్దండ మండలం రాచూర్ గ్రామంలో 1947 మే 2న జన్మించారు. ఆయన తెలుగు పండితుడిగా, జూనియర్ లెక్చరర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపకుడిగా, రీడర్‌గా పనిచేశారు. తెలుగు భాషపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ కూడా పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలో రచయిత యాదగిరితో కలిసి విప్లవ ఢంకా పుస్తకాన్ని రచించారు.

సీనియర్ జర్నలిస్టు రమణ మృతి

సీనియర్ జర్నలిస్టు కొమర్రాజు వెంకట రమణ (45) మెదడులో రక్తనాళాలు చిట్లడంతో చికిత్స పొందుతూ మే 31న మరణించారు. ఆయన 20 సంవత్సరాలకు పైగా జర్నలిస్టు వృత్తిలో ఉంటూ, తెలుగు, ఆంగ్ల దిన పత్రికలలో పని చేశారు.

మంత్రి వర్గం నుంచి డిఎల్ బర్తరఫ్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డిఎల్ రవీంద్రరెడ్డిని, ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి జూన్ 1న రాష్ట్ర మంత్రి వర్గం నుంచి తొలగించారు. ప్రభుత్వంలో ఉంటూ ప్రభుత్వంపై, ప్రభుత్వ సంక్షేమ పథకాల పనితీరుపై అసమ్మతిని వ్యక్తం చేస్తూ, వాటిని విమర్శించడం వల్లనే మంత్రి పదవి నుంచి తొలగించడానికి కారణమంటున్నారు.

పంచాయితీల రిజర్వేషన్లు

గ్రామ పంచాయితీ ఎన్నికలకు జిల్లాల వారీగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వాటి వివరాలను జూన్ 12న ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం అందజేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం వివిధ కేటగిరీలకు కేటాయించిన రిజర్వేషన్లను పంచాయితీ రాజ్ కమిషనర్ రాంగోపాల్ వెల్లడించారు. మొట్టమొదటిసారిగా ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టం, అలాగే మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. రాష్ట్రంలో మొత్తం 21590 పంచాయితీలు ఉన్నాయి. ఎస్‌టి షెడ్యూల్డ్ ఏరియా మొత్తం 1218, పురుషులకు 609, మహిళలకు 609, ఎస్.సి. రిజర్వేషన్లు మొత్తం 3958 కాగా పురుషులకు 1979, మహిళలకు 1979, ఎస్.టి. నాన్‌షెడ్యూల్డ్ ఏరియా రిజర్వేషన్లు మొత్తం 1279, పురుషులకు 639, మహిళలకు 640, బి.సి. రిజర్వేషన్లు మొత్తం 6926, పురుషులకు 3463, మహిళలకు 3463, జనరల్ మొత్తం 8209, పురుషులకు 4105, మహిళలకు 4104.

మైనంపాటి భాస్కర్ మృతి

ప్రముఖ నవలా, కథా రచయిత మైనంపాటి భాస్కర్(68) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బంజారా హిల్స్‌లోని కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ జూన్ 4న మరణించారు. ఆయన ప్రకాశం జిల్లా ఒంగోలులో జన్మించారు. ఆయన తెలుగులో 30 నవలలూ, 100కు పైగా కథలూ, సినిమా రివ్యూలూ రాశారు.

చలో అసెంబ్లీ

తెలంగాణ రాజకీయ జెఎసి జూన్ 14న చలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, టిడిపి, న్యూడెమోక్రసీ పార్టీలతో పాటు తెలంగాణ విద్యార్థి సంఘాలూ, మహిళా సంఘాలూ, వివిధ తెలంగాణ జెఎసి సంఘాలూ పాల్గొన్నాయి. అలాగే వేలాది మంది తెలంగాణ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనేక మంది రాజకీయ నాయకులనూ, విద్యార్థులనూ, మహిళలనూ, ప్రజా సంఘాల నాయకులనూ అరెస్టు చేశారు. అనేక వేల మంది ఉద్యమకారులపై బైండోవర్ కేసులు పెట్టారు.

సిబిఐ జెడిగా అరుణాచలం

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కొత్త జాయింట్ డైరెక్టర్‌గా అరుణాచలం జూన్ 15న పదవీ బాధ్యతలు స్వీకరించారు. అరుణాచలం తమిళనాడు జోన్ సిబిఐ జెడిగా పని చేశారు. సిబిఐ జెడి లక్ష్మీనారాయణ డిప్యుటేషన్ కాలం పూర్తి కావడంతో ఆయన తన స్వంత క్యాడర్ అయిన మహారాష్ట్రకు వెళ్లారు.

పౌరహక్కుల నేత ఆంజనేయులు మృతి

మహబూబ్‌నగర్ జిల్లా పౌరహక్కుల నేత ఆంజనేయులు జూన్ 17న మృతి చెందారు. ఆయన కొంత కాలంగా కిడ్నీలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్‌లో చనిపోయారు. ఆయన స్వగ్రామం మిడ్జిల్ మండలం, రేవల్లి గ్రామం. ఆయన నాలుగో తరగతి వరకే చదువుకున్నారు. పౌరహక్కుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు.

గాండ్ల వెంకటరావు మృతి

ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, పట్టణ కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ గాండ్ల వెంకటరావు(70) జూన్ 17న అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులో చనిపోయారు. ఆయన మూడు దశాబ్దాలుగా అభ్యుదయ కళారంగ వేదికలో పని చేశారు.

ఆలూరి భుజంగరావు మృతి

విరసం సీనియర్ సభ్యులు, ప్రముఖ రచయిత, అనువాదకుడు ఆలూరి భుజంగ రావు జూన్ 20న మరణించారు. ఆయన 1928లో గుంటూరు జిల్లా కొండముదిలో జన్మించారు. ఆయన కథలూ, నవలలూ రాశారు. ఆయన జీవితం హోటల్ కార్మికుడిగా ప్రారంభమై, గుడివాడలో హిందీ పండితునిగా పని చేశారు. కొండవాగు, ప్రజలే అజేయులు, గమనా గమనం, గమ్యం దిశగా గమనం మొదలైన రచనలు చేశారు. ఆయన సింహావలోకనం, రంగభూమి, వాయు గుండం, పరాజయం మొదలైన రచనలను అనువాదం చేశారు.

ఆత్మీయ రథంపై దాడి

నమస్తే తెలంగాణ దిన పత్రిక 'విభజన వికాసానికే' అనే నినాదంతో ఆత్మీయ రథ యాత్రను ప్రారంభించింది. తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో కొంత మంది జూన్ 25న ఆత్మీయ రథంపై దాడి చేశారు. నమస్తే తెలంగాణ పత్రిక ప్రతులను తగులపెట్టారు. ఈ దాడిలో సిబ్బందికి గాయాలైనాయి. పత్రిక వ్యాను ధ్వంసమైంది.

జర్నలిస్టుల ర్యాలీ

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, 'ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు జూన్ 26న ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షుడు బసవ పున్నయ్య, ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, సమాఖ్య జాతీయ సమన్వయ కమిటీ సభ్యులు అమరయ్య, మంజరిలు పాల్గొన్నారు. వీ

పాలకుల దుర్మార్గానికి వేల ప్రాణాల బలి

ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సానికి వేలాది మంది తీర్థ యాత్రికులు, స్థానికులు మరణించిన పరిణామం వెనుక కారణాలను విశ్లేషిస్తున్నారు **రాజవరం పార్థసారథి**

ఉత్తరాఖండ్‌లో జూన్ రెండో వారంలో కురిసిన భారీ వర్షాల వల్ల గంగ ఉపనదులైన భాగీరథి, అలక్ నంద, మందాకిని వంటి నదులకు పెద్దఎత్తున వరదలు వచ్చాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. పెద్దపెద్ద బండరాళ్లు వరదకు కిందికి దొర్లుతూ వచ్చాయి. బురదనీరు వెల్లువలా ప్రవహించింది. రహదార్లు ధ్వంసమైపోయాయి. ఈ ప్రాంతంలో చార్ ధామ్ పేరుతో సుప్రసిద్ధమైన కేదార్ నాథ్, బదరీనాథ్, గంగోత్రి, యమునోత్రి అనే నాలుగు హిందూ పుణ్యస్థలాల యాత్రకు వెళ్లిన వేలాది మంది యాత్రికులు, ఆ ప్రాంతంలో నివాసం ఉన్న స్థానికులు, వ్యాపారస్తులు ప్రాణాలు కోల్పోయారు. ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయాయి. కేదార్ నాథ్ పట్టణం పూర్తిగా శిథిలమైపోయింది. గౌరీకుండ్, రామ్ బాడ, సోన్ ప్రయాగ వంటి వ్యాపారస్థలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎన్నో బహుళ అంతస్తుల భవనాలు పేకమేడల్లా కూలిపోయి వరదలో కొట్టుకుపోయాయి.

ఈ బీభత్సం జరిగిన జూన్ 15-16 నుంచీ ప్రచార సాధనాలలో చాల వివరాలు వెలువడుతున్నాయి గాని దీన్ని ప్రకృతి విలయం అనో మానవ కల్పితం అనో మాత్రమే అభివర్ణిస్తున్నాయి. దీనిలో ప్రకృతి విలయం అనే అంశం ఉన్నమాట నిజమే. ఆ ఒక్కరోజునే సాధారణ వర్షపాతం కన్న ముప్పై రెట్లు, వందరెట్లు కూడ నమోదయింది. ఒక్కుమ్మడిగా వచ్చిన వరదతో సరసుల గట్లు తెగిపోవడంతో కొండల మీది నుంచి నీళ్లు పరవళ్లు తొక్కుతూ కిందికి దూకాయి. గతంలో అదే రోజున ఎంత వర్షం కురిసిందనే దానితో పోల్చి చూసినప్పుడు జూన్ 16న కురిసిన వర్షం ఎక్కువ కూడ కావచ్చు. కాని హిమాలయాలలో సాధారణంగానే వర్షపాతం ఎక్కువ. హిమాలయాల నుంచి ప్రవహించే నదులన్నిటిలోనూ నీటి పరిమాణమూ ఎక్కువే, చాల ఎత్తు నుంచి దూకుతుండడం వల్ల ఉరవడీ ఎక్కువే. అయినా, ఇంతకన్న ఎక్కువ వర్షపాతం ఉన్నప్పుడు కూడ గతంలో ఎన్నడూ ఇంత విలయం జరిగిన దాఖలాలు లేవు. కనుక ఈసారి విలయానికి ప్రకృతితో పాటుగా, ప్రకృతికన్న ఎక్కువగా ఇతర కారణాలు ఉండి ఉండాలి.

ప్రకృతి ఏకైక కారణమో, ప్రధాన కారణమో కాదని అనేవాళ్లు చాలమంది ఇది 'మానవ కల్పితం' అంటూ ఉంటారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ విలయానికి కూడ ఇటువంటి వివరణలు వస్తున్నాయి. నిజానికి ప్రస్తుత బీభత్సంలోనైతే 'మానవ' అని అనిర్దిష్టంగా ఎవరో తెలియని అనామకుల మీద నెపం పెట్టడానికి కూడ వీలు లేదు. ఉత్తరాఖండ్‌లో జరిగిన బీభత్సానికి కారణం మనిషి అనే అనామక జీవి కాదు. చాల స్పష్టంగా, ఉద్దేశపూర్వకంగా పాలకవర్గ కుటిలనీతి, అవినీతి, ప్రపంచీకరణ విధానాలు కారణం. పాలకులు దశాబ్దాలుగా అనుసరిస్తున్న ప్రకృతి వ్యతిరేక, ప్రజావ్యతిరేక అక్రమ విధానాలు ఇవాళ్టి స్థితికి దారితీశాయి.

ఈ పాలక విధానాలలో ప్రధానమైనది ఇతోధికంగా జలవిద్యుత్తు ఉత్పత్తి చేయాలనే దురాశ. ఉత్తరాఖండ్ లో ప్రవహించే నదులపై 25000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం గల విద్యుదుత్పత్తి కేంద్రాలను నిర్మించవచ్చునని, ఇప్పటికి అందులో ఆరువేల మెగావాట్ల కేంద్రాలు మాత్రమే ఏర్పాటయ్యాయని ఉత్తరాఖండ్ ప్రభుత్వం అంటున్నది. ఆ నదుల మీద కొత్త విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయదలచుకున్న పెట్టుబడిదారులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని ఎర్ర తివాచీలు పరిచి ఆహ్వానిస్తున్నది. మైక్రో (వంద కిలోవాట్ల లోపు), మినీ (వంద కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు), స్మాల్ (రెండు మెగావాట్ల నుంచి 25 మెగావాట్ల వరకు) విద్యుదుత్పత్తి కేంద్రాలు కొన్ని వందలు ఏర్పాటయ్యాయి, లేదా ఏర్పాటయ్యే దిశలో నిర్మాణ పనులు సాగుతున్నాయి. వీటికన్న పెద్దవీ, డెబ్బై మెగావాట్ల నుంచి వెయ్యి మెగావాట్లదాకా సామర్థ్యం ఉన్నవీ విద్యుదుత్పత్తి కేంద్రాలు దాదాపు డెబ్బై దాకా ఉన్నాయి. మొత్తంగా ఉత్తరాఖండ్ లో 600 జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నాయనీ, వాటిలో 90 శాతం గత పన్నెండు సంవత్సరాలలో రాష్ట్రం ఏర్పడినతర్వాతనే నెలకొల్పారనీ పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ఇంతకూ ఒక కోటి మాత్రమే జనాభా ఉన్న ఉత్తరాఖండ్ కు అంత విద్యుత్ అవసరాలు లేవు. తమ రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే జల విద్యుత్తునంతా ఉపయోగించుకునే పారిశ్రామిక, గృహ అవసరాలు ఉత్తరాఖండ్‌లో లేవు. కాని ఢిల్లీకీ, పొరుగు రాష్ట్రాలకూ అమ్మడం కోసమే విద్యుత్తు తయారు చేయడానికి ఉత్తరాఖండ్ ప్రభుత్వం తన నదులను ప్రైవేటు పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు అప్పగిస్తున్నది. ఈ విధానాన్ని పొరుగురాష్ట్రాల ప్రభుత్వాలూ, కేంద్ర ప్రభుత్వమూ ప్రోత్సహిస్తున్నాయి. జివికె, జిఎంఆర్, లాంకో వంటి ఆంధ్రప్రదేశ్ కు చెందిన సంస్థలూ, ఎల్ అండ్ టి వంటి బహుళజాతి సంస్థలూ, ఉత్తరాఖండ్ జల విద్యుత్ నిగమ్ వంటి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలూ ఈ విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశాయి, చేస్తున్నాయి. ఈ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో, నిర్వహణలో అనేక అక్రమాలు జరిగాయని, జరుగుతున్నాయని కాగ్ నివేదికలు, ప్రత్యేకంగా నియమించిన బి కె చతుర్వేది కమిటీ నివేదిక స్పష్టం చేశాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రం 2000లో ఏర్పడితే గడిచిన పన్నెండు సంవత్సరాలలో ఏడుగురు ముఖ్యమంత్రులు మారారు. భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఏడు సంవత్సరాలు సాగగా ఆరుగురు ముఖ్యమంత్రులు పాలించారు. ఇలా అస్థిర ప్రభుత్వాల వల్ల, పదవీకాలం తక్కువగా ఉన్నందువల్ల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు

విచ్చలవిడిగా అవినీతికి పాల్పడి, ఇష్టారాజ్యంగా అనుమతులు జారీ చేశారు.

ఆ అక్రమాల వల్ల తామరతంపరగా పుట్టుకొచ్చిన జల విద్యుత్ కేంద్రాల వల్ల ఉత్తరాఖండ్‌లో నదుల మీద కనీసం మూడు వందల కొత్త ఆనకట్టలు కట్టవలసి వచ్చింది. అలా నదుల సహజ గమనం మీద ఆటంకాలు ఏర్పడ్డాయి. అలాగే విద్యుత్ కేంద్రాల కోసం లోతుగా తవ్వకాలు, భారీ నిర్మాణాలు, అడవి నరికివేతలు ఇబ్బడిముబ్బడిగా జరిగాయి.

జల విద్యుత్‌తో పాటే సాగినవి ఖనిజ వనరుల తవ్వకాలు. ఒకవైపు ప్రపంచీకరణ విధానాల 'అభివృద్ధి' నమూనా, మరొకవైపు కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అభివృద్ధి పరుగులో ఇతర రాష్ట్రాలతో పోటీ కలిసి ఉత్తరాఖండ్‌లో అటు భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం విపరీతంగా ఖనిజాల తవ్వకాలకు అనుమతులిచ్చాయి. హిమాలయ పర్వత శ్రేణి గర్భం సంపన్నమైన ఖనిజ వనరులకు నిలయం. అక్కడ డోలమైట్, సున్నపురాయి, మాగ్నెసైట్, నాపరాళ్లు, సుద్దరాళ్లు, సీసం, జింక్, రాగి, బంగారం, టంగ్‌స్టన్, ఆంటిమొనీ వంటి ఎన్నో ఖనిజ నిలువలు ఉన్నాయి. ఇప్పటికి కనిపెట్టిన నిక్షేపాలు తక్కువే గాని పారిశ్రామికీకరణ పరుగులో వాటి తవ్వకాలు విపరీతంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా సున్నపురాయి గనుల తవ్వకంతో సున్నితమైన హిమాలయ పర్వత ప్రాంతం ఒకవైపు భూకంపాలకు నిలయంగా మారిపోయింది. మరొకవైపు అడవుల నిర్మూలన విస్తారంగా సాగిపోయింది.

హిమాలయ పర్వత సానువులలో, అతి ఎక్కువ వర్షపాతంతో, నిత్యం ప్రవహించే నదులతో ఈ ప్రాంతం వేల సంవత్సరాలుగా దట్టమైన సహజారణ్యాలకు నిలయంగా ఉండేది. బ్రిటిష్ పాలనాకాలంలో పరిశ్రమలకు, రైల్వేలకు కలప అవసరాల కోసం ఇక్కడ అడవి నరకడం ప్రారంభమయింది. అవే విధానాలు 1947 తర్వాత కూడ కొనసాగాయి. పందొమ్మిదో శతాబ్దం నుంచీ ఇక్కడ అడవి నిర్మూలన ఎలా పథకం ప్రకారం జరుగుతున్నదో, అది మొత్తంగా గంగా మైదాన పర్యావరణాన్ని ఎలా దెబ్బతీయనున్నదో పర్యావరణ పరిశోధకులు ఇప్పటికే వివరించారు. తమ జీవనాధారమైన అడవిని ప్రభుత్వం, ప్రైవేటు వ్యాపారస్తులు ఇలా నిర్మూలించడానికి వీలు లేదని, 1970లలో చెట్లను కాపాడుకోవడానికి సాగిన చిప్కో ఉద్యమం కూడ ఇక్కడే ప్రారంభమయింది. కాని గత ఒకటి రెండు దశాబ్దాలలో అటు సున్నపురాయి గనులకోసమూ, ఇటు కలప అవసరాల కోసమూ, పర్యాటక అవసరాల కోసమూ అడవుల నరికివేత విపరీతంగా జరిగిపోతున్నది.

ఉత్తరాఖండ్ ప్రకృతి సౌందర్యానికి నిలయం గనుకా, హిందువులు పవిత్రంగా భావించే ప్రదేశాలు ఉన్నందువల్లా ఇక్కడ ఎన్నో దశాబ్దాలుగా పర్యాటక రంగం విస్తృతంగానే ఉంది. అయితే ఇటీవలి కాలంలో దేశంలో పెరిగిపోతున్న హిందూ మతోన్మాదంతో భక్తి, హిందూ పుణ్యస్థలాల పర్యటన విచ్చలవిడిగా పెరిగిపోయాయి. చార్‌ధామ్ యాత్ర ప్రాధాన్యత సంతరించుకుంది. నిజానికి ఉత్తరాఖండ్ లోని చార్‌ధామ్ అసలు చార్‌ధామ్ కాదు, దేశం నలుమూలల ఉన్న ద్వారక, బదరీనాథ్, పూరీ, రామేశ్వరంలను చార్‌ధామ్ అంటారు. కాని చోటా చార్‌ధామ్ పేరుతో ఉత్తరాఖండ్‌లోని నాలుగు పుణ్యస్థలాలకు ప్రాధాన్యత కల్పించడంలో సంఘపరివార్ పాత్ర ఉంది. నిజంగా ఆస్తికులైనా ప్రతిచోటా భగవంతుడు ఉన్నాడని అనుకోవాలి గాని కొన్ని స్థలాలకే ప్రత్యేకత, ప్రాధాన్యత కలిపించడం భక్తిని వ్యాపార, రాజకీయ ప్రయోజనాలుగా మార్చుకునేటందుకే.

ఈ పర్యాటక రంగ అభివృద్ధితో ఉత్తరాఖండ్‌లో మారుమూలల్లో కూడ రిసార్టులు, హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్‌లు, పార్కింగ్ లాట్లు, టూర్ ఆపరేటర్ల వ్యవస్థ ఏర్పడింది. కొండల అంచుల్లో, అడవులు నరికి రహదారుల నిర్మాణం జరిగిపోయింది. చాల సందర్భాలలో ఈ భవన నిర్మాణాలు నదుల ఒడ్డున, నదీ గర్భాలలో కూడ జరిగాయి. అక్కడి ఆహ్లాదకర వాతావరణం వల్ల దేశంలోని సంపన్నులు కూడ అక్కడ తమ విలాస గృహాలు నిర్మించుకోవడం మొదలయింది. రియల్ ఎస్టేట్ విపరీతంగా పెరిగిపోయి అటవీ భూమినీ, వ్యవసాయ భూమినీ వ్యవసాయేతర అవసరాలకు, భవన నిర్మాణానికి వాడడం మొదలయింది. గతంలో నీటి ప్రవాహాలు ఉండిన ప్రాంతాలలో భవనాలు నిర్మించి ఆ ప్రవాహాలను అడ్డుకోవడం జరిగింది.

ఈ అన్ని కార్యక్రమాలూ కూడ హిమాలయ పర్వత పాద ప్రాంతంలోని పర్యావరణపు సున్నితత్వాన్ని ధ్వంసం చేశాయి. ఆ ప్రాంతం మీద మూకుమ్మడిగా, దుర్మార్గంగా దాడి చేశాయి. లక్షల ఏళ్లుగా సురక్షితంగా ఉన్న జీవావరణాన్ని ఒక్క తరంలో అతలాకుతలం చేశాయి. ఈ అన్ని కార్యక్రమాలనూ 'మానవ కల్పితం' అనే మాటతో పిలవడం తప్పు. ఇవన్నీ కూడ పాలకవర్గ విధానాల ఫలితాలే. పెట్టుబడిదారుల లాభాపేక్ష ఫలితాలే. హిందూ మతోన్మాద ఫలితాలే. సంపన్నుల విలాసాకాంక్షల ఫలితాలే.

ప్రస్తుత బీభత్సంలో ఆలోచించవలసిన అంశం మరొకటి ఉంది. రెండు శక్తి స్థలాలు (గంగోత్రి, యమునోత్రి), ఒక శైవ క్షేత్రం (కేదార్‌నాథ్), ఒక విష్ణు క్షేత్రం (బదరీనాథ్) లతో కలిసిన చార్‌ధామ్ హిందూ మతంలోని ప్రధాన పాయలన్నిటికీ కేంద్రం. అక్కడికి ప్రతి ఏటా జూన్ జూలై మాసాల్లో రెండు మూడు లక్షల మంది యాత్రికులు వెళుతుంటారు. ఈ సారి జూన్ లో అలా వెళ్లిన లక్ష మంది యాత్రికులలో కనీసం పదివేల మంది మృత్యువాత పడి ఉంటారని ప్రస్తుత అంచనాలు తెలుపుతున్నాయి. భగవంతుడు ఉంటే గింటే ఒక్కుమ్మడిగా ఇంతమంది భక్తుల ప్రాణాలు ఇలా ఎందుకు తీశాడో, తన ఆలయాలనూ, తన భక్తులనూ కూడ ఎందుకు రక్షించుకోలేకపోయాడో భక్తులు ఇప్పటికైనా ఆలోచించాలి.

భగవంతుడి మీద భారం వేసి, భగవదేచ్ఛ వల్లనే ఇన్ని ఇబ్బందులు పడ్డామని అనుకునే భక్తులు విధ్వంసానంతర రక్షణ కోసం మాత్రం ప్రభుత్వం వైపు చూస్తున్నారు. ప్రభుత్వం తగిన రక్షణ సౌకర్యాలు, పునరావాస, భద్రతా సౌకర్యాలు కల్పించలేదని విమర్శిస్తున్నారు. ప్రజల జీవన భద్రతను పరిరక్షించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అనడంలో సందేహం లేదు. కాని ప్రస్తుత పాలకవర్గాల ప్రభుత్వం నుంచి అది ఆశించడం అత్యాశే. అసలు ముందు జీవన విధ్వంస విధానాలను ప్రవేశపెట్టిందీ, ఆచరించిందీ ఈ పాలకవర్గాలే. కనుక వారు ఆ విధ్వంసం నుంచి రక్షిస్తారని, సహాయం అందిస్తారని కూడ ఆశించలేం. మొత్తం మీద పదివేల మంది భక్తుల ప్రాణాల బలితో పాలకవర్గాల స్వభావం మరొకసారి రుజువైంది.

(రచయిత పాత్రికేయులు) వీ

భాజపాలో మోడీ ఆధిపత్యం

భారతీయ జనతా పార్టీలో అగ్రనాయకుల మధ్య ముఠా తగాదాలలో నరేంద్రమోడీ గెలుపు పూర్వాపరాలను వివరిస్తున్నారు ఎ. నర్సింహారెడ్డి

సంవత్సరంలోపు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి దిశా నిర్దేశం చేయాల్సిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాలు కాస్తా అగ్రనేతల మధ్య విభేదాలను రచ్చకీడ్చాయి. ఇన్నాళ్లూ పార్టీలో అంతర్గతంగా సాగుతున్న ఆధిపత్య పోరు ఈ సమావేశాల వేదికలో బహిర్గతమయింది. బిజెపి అగ్రనేత ఎల్.కె. అద్వానీ, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 'పెద్ద' పాత్ర పోషించాలని ఉవ్విళ్లూరుతున్న గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. మోడీకి ఎన్నికల్లో పార్టీ ప్రచార కమిటీ సారథ్య బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అద్వానీ.. మే 7న జరిగిన పదాధికారుల సమావేశానికి హాజరు కాలేదు. మే 8న గోవాలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. అద్వానీతో పాటు ఉమాభారతి, జశ్వంత్‌సింగ్, యశ్వంత్‌సిన్హా, శతృఘ్నసిన్హా, యోగి ఆదిత్యానంద్ వంటి ఆయన సన్నిహితులైన సీనియర్ నాయకులు కూడా జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరుకాలేదు. మరోవైపు.. మోడీ పట్ల అద్వానీ వ్యతిరేకతను నిరసిస్తూ ఆయన ఇంటి ముందు మోడీ మద్దతుదారులు ఆందోళనకు దిగారు. వచ్చే ఎన్నికల్లో ప్రచార కమిటీ సారథిగా మోడీని నియమించాలని, పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆయన పేరును ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలనే దానిపై బిజెపి అగ్రనాయకత్వం మల్లగుల్లాలు పడింది. అద్వానీ వచ్చినా రాకున్నా మోడీపై ప్రకటన చేయాలని బిజెపి నాయకత్వానికి ఆర్ఎస్ఎస్ ఆదేశాలు ఇచ్చింది. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక ప్రముఖుడు, సీనియర్ నాయకుడు లాల్ కిషన్ అద్వానీ పార్టీలో ముఖ్యమైన మూడు పదవులకు – జాతీయ కార్యవర్గం, పార్లమెంటరీ బోర్డు, ఎన్నికల కమిటీలకు మే 10న రాజీనామా చేయడంతో బిజెపిలో ముసలం బద్దలైంది. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీని పార్టీ లోక్‌సభ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా గోవాలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశం నియమించిన మరునాడే అద్వానీ రాజీనామా ప్రకటన పార్టీని గందరగోళంలో పడేసింది. మోడీ నియామకంతో ఆయన అభిమానుల్లో ప్రస్ఫుటమైన ఉత్సాహం కన్పించింది. మోడీని ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించడమంటే పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థిగా పరోక్ష ప్రకటన చేయడమే. ఈ నియామక ప్రకటనను గోవాలో చేయకుండా చేయడానికి అద్వానీ వర్గం గట్టి ప్రయత్నమే చేసింది. మోడీని ప్రచార కమిటీకి అధ్యక్షునిగా కాకుండా కన్వీనర్‌గా ప్రకటించాలని, అలా చేస్తే ఎన్నికల కమిటీ సమావేశాలకు పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షత వహిస్తారని ఈ సమావేశానికి హాజరుకాని అద్వానీ సూచించినట్లు వార్తలు వచ్చాయి. సీనియర్ నాయకులు యశ్వంత్ సిన్హా, జస్వంత్ సింగ్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సన్యాసిని ఉమా భారతి, సినీనటుడు శతృఘ్నసిన్హా కూడా గోవా సమావేశాల్లో పాల్గొనలేదు. మోడీ నియామకాన్ని అద్వానీ వర్గం వ్యతిరేకిస్తున్నట్లు మీడియా చేస్తున్న ప్రచారం దాని సృష్టి అని నాయకులు కొట్టిపారేస్తూ వచ్చారు. కాని అది వాస్తవమేనన్నట్లుగా అద్వానీ రాజీనామా ఉపసంహరణ రుజువు చేసింది. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగవత్ –బిజెపి నాయకుల మధ్య హడావుడిగా చర్చలు జరిగాక, భగవత్ ఆదేశించాక రాజీనామా ఉపసంహరించుకోవడం వల్ల ఆర్ఎస్ఎస్ ఆదేశాలకు తిరుగులేదని మరోమారు రుజువైంది. మోడీ, అద్వానీ ఇరువురు ఆర్ఎస్ఎస్ మానస పుత్రులే, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలన్నది ఆర్ఎస్ఎస్ భావన. అయితే ఇదంతా అద్వానీ బిజెపిలో మితవాద నేతగా ముందుకు వచ్చేయత్నం.. మిత్ర పక్షాలకు ఆమోదనీయంగా అవతరించే ప్రయత్నం.

గోవాలో మే 8, 9 తేదీలలో జరిగిన భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని, మోడీ – అద్వానీ ఆ విభేదాలు, సంఘ్ పరివార్ వ్యూహాన్ని ఆచరణ నుంచి పరిశీలించవల్సి ఉంది. సుప్రీం కోర్టు మోడీని 'నీరో' అని వ్యాఖ్యానించింది. కేశూబాయ్ పటేల్ ఆయనో 'హిట్లర్' అన్నారు. సోనియా 'మృత్యు బేహారి' అని పేర్కొంది. గుజరాత్ భాజపా కార్యకర్తలు మాత్రం 'హిందు హృదయ సామ్రాట్' అంటున్నారు. అసలు మోడీని అర్థం చేసుకోవడానికి ఈ దేశ ప్రజలకు 2002 నాటి గుజరాత్ నరమేధం సంఘటన ఒకటి చాలు. 2000 మంది ముస్లింల హత్యకు సహకరించిన వ్యక్తి ఈ దేశ ప్రధాని పదవికి అర్హుడేనా? అని ఆలోచించే క్రమంలో అసలు గుజరాత్ అభివృద్ధి నమూనా దేశానికి ఆదర్శమా? గుజరాత్‌లో సాధారణ ప్రజల జీవితాలు ఇతర రాష్ట్రాల ప్రజల కంటే ఏమైనా మెరుగ్గా ఉన్నాయా? అయన ఏమన్న ప్రజాస్వామ్య లౌకిక వాదా? అంటే, అదేమి కాదు. ఆర్ఎస్ఎస్ హిందుత్వ సిద్ధాంత ప్రతినిధిగా, హిందూ మతేతరుల పట్ల వ్యతిరేకిగా, కార్పొరేట్లకు కొమ్ముగాసే వ్యక్తిగా ఆయన్ని చూడవల్సి ఉంటుంది. అంతేగాకుండా మోడీ రూపంలో మరోసారి మతోన్మాద ఎజెండాను ముందుకు తెచ్చేందుకు సంఘ్ పరివార్ వ్యూహం సిద్ధం చేస్తుంది. దేశం ఆర్థికంగా చితికి పోతున్న పరిస్థితుల్లో మోడీలాంటి కరుడు గట్టిన మతోన్మాద ఫాసిస్టు అవసరం దళారీ బడా బూర్జువా వర్గానికి పెరుగుతుందని చరిత్ర చెపుతున్న సత్యం. అందుకేనేమో అమెరికాతో సహా ప్రపంచంలోని పలు దేశాలు ఇప్పుడు వరుసగా మోడీపై బహిరంగంగా ఆసక్తి చూపుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలకు ఏడాది ముందుగానే ప్రధాన ప్రతిపక్షం బిజెపిలో

'అగ్రస్థానం' కోసం సీనియర్ల మధ్య యుద్ధం ముదిరింది. పార్టీ నుంచి పెద్ద పదవి'ని ఆశిస్తున్న నాయకులు నలుగురికన్నా ఎక్కువ మందే ఉన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ బాహాటంగానే ప్రధానమంత్రి పదవిపై తన కోరికను ప్రకటించి ఆ దిశగా మద్దతు కూడగట్టుకుంటూ వేగంగా దూసుకెళ్తోంటే అగ్రనేత ఎల్.కె.అద్వానీ అలకబూని మోడీ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఆధిపత్య పోరులో మిగతా సీనియర్ నాయకులు రెండు వైపులా మోహరించారు. అయితే అవకాశం వస్తే 'పెద్ద పదవి'కి పోటీ పడేందుకు పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకురాలు సుష్మా స్వరాజ్, రాజ్యసభలో ప్రతిపక్ష నేత అరుణ్ జైట్లీ కూడా సిద్ధంగా ఉన్నారు. ఎఐఎడిఎంకె అధినేత్రి పురచ్చితలైవి జయలలిత వంటి ప్రాంతీయ జాగీర్దారులు–మోడీని ఒక స్నేహితుడిగా గుర్తించినప్పటికీ – ఆయన పార్టీని సమర్థించే పరిస్థితి ఉండదు. బిజెడి నేత నవీన్ పట్నాయక్ (ఒడిశా) ఎలా వ్యవహరిస్తారో ఊహించలేం. కాగా, టిడిపి నాయకులు చంద్రబాబు నాయుడు, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతాలు మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎను బలపరిస్తే సమస్త మైనారిటీలను దూరం చేసుకోవలసి వస్తుందనే భయంతో సమర్థించే అవకాశం లేదు. కాగా నితీశ్ కుమార్ (బీహార్) తన లౌకిక మైనారిటీ భూమికను కోల్పోయేందుకు సిద్ధంగాలేరు. దీనికితోడు ఎన్‌డిఎ కూటమిలోని అనేక మంది సీనియర్ నాయకులు ప్రధాని స్థానానికి తామే ఏకాభిప్రాయ అభ్యర్థులమని భావిస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజాదరణ చూరగొన్నవాడే నాయకుడు అంటూ పార్టీ జాతీయ ఎన్నికల కమిటీ చైర్మన్ పదవిని మోడీకి రాజ్‌నాథ్‌సింగ్ కట్టబెట్టారు. ఆయన మాటే గీటురాయి అయితే ఏ ప్రజాదరణ ఉందని తాను భాజపా జాతీయ అధ్యక్షుడయ్యారు? 2009లో పార్టీలో తరం మార్పును శాసించిన ఆర్‌ఎస్‌ఎస్ – ఎవరికీ తెలియని గడ్కరీని తీసుకొచ్చి భాజపా అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టింది. డొల్ల కంపెనీల (బొగ్గు) ఉచ్చులో గడ్కరీ చిక్కుకొని వైదొలగగా, ఆయన స్థానంలో రాజ్‌నాథ్‌సింగ్‌ను సంఘ్ నేతలే ఎంపిక చేశారు. నేడు మోడీ సారథ్యంలో ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహం ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలదేనంటున్నారు. ఆర్థికాభివృద్ధిలో గుజరాత్ నమూనా దేశానికి ఆదర్శప్రాయమంటూ అక్కడ మూడు సార్లు విజయ ఢంకా మోగించడం ద్వారా జాతి జనుల దృష్టిని ఆకర్షించిన మోడీ – జాతీయస్థాయికి ఎదగాలన్న తన ఆకాంక్షల్ని ఏనాడూ దాచుకోలేదు. ప్రధాని అభ్యర్థిగా మోడీని ప్రకటిస్తే భాజపా సాధించే సీట్ల సంఖ్య గణనీయంగా మెరుగుపడుతుందన్న ముందస్తు సర్వేలకు తోడూ పార్టీలో 'మోడీ మేనియా' జతకలిసింది. 'వరుస కుంభకోణాలతో జనంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ దిగజారింది. అదే సమయంలో భాజపా ప్రజల్లో తనపట్ల నమ్మకాన్ని పెంచుకోలేకపోయింది' అంటూ ఇటీవల అద్వానీ చేసిన వ్యాఖ్య వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ ఏడాదిలోగా ఐదు రాష్ట్రాల ఎన్నికలు, వాటి వెన్నంటి సార్వత్రిక ఎన్నికల సమరం సాగనున్న నేపథ్యంలో – అరివీర భయంకరంగా విమర్శ విచ్చుకత్తులతో విరుచుకుపడే మోడీకే సారథ్య బాధ్యతలు అప్పగిస్తే బహుళ ప్రయోజనకరమని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తున్నట్లుంది. రోగగ్రస్తమైన పార్టీకి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని లోగడ స్పష్టీకరించిన ఆర్‌ఎస్‌ఎస్ – అందుకు సాధనంగా మోడీని ఎంచుకొన్నట్లుంది.

నరేంద్రమోడీ వరుసగా మూడవసారి గుజరాత్‌లో పార్టీని అధికారంలోకి తెచ్చిన దరిమిలా పార్టీలోని ఒక వర్గం, మీడియాలో ఒకవర్గం సహాయంతో ఆయన్ను 2014 ఎన్నికలకు బి.జె.పి. ప్రధాన మంత్రి అభ్యర్థిగా ముందుకుతేవడం మొదలు పెట్టాయి. మోడీ పరిపాలనా దక్షుడంటూ కార్పొరేట్ రంగంలోని కొందరు పారిశ్రామిక దిగ్గజాలు కూడా అదే పల్లవి అందుకున్నారు. వాగ్ధాటి గల వ్యక్తిగా జనాకర్షణగల నాయకునిగా పార్టీ శ్రేణుల్లోని వీర హిందూత్వవాదులు మోడీని జాతీయ రాజకీయ రంగంలోకి తేవాలంటూ ఒత్తిడి ప్రారంభించారు. అన్నిటికీ మించి ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశించింది. బి.జె.పి. నాయకత్వం శిరసావహించింది. మార్చి నెలలో మోడీని జాతీయ కార్యవర్గంలోకి, పార్లమెంటరీ బోర్డులోకి తీసుకున్నారు. అంతిమంగా, గోవాలో ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ పదవి అప్పగించారు. ఇప్పుడాయన్ని దేశమంతా తిప్పి అందరికీ ఆమోద యోగ్యుణ్ని చేయాలని పార్టీ నిర్ణయించింది.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పని చేస్తున్న నరేంద్రమోడీని ఆ నాయకత్వం పుష్కరకాలం క్రితం గుజరాత్ ముఖ్యమంత్రిగా పంపింది. 2002 నాటి గోద్రా అల్లర్ల అనంతరం గుజరాత్‌లో విశ్వహిందూ పరిషత్ తదితర ఉగ్ర హిందూత్వ సంస్థలు మైనారిటీలకు వ్యతిరేకంగా సాగించిన నరమేధానికి మోడీ అండగా నిలిచారన్న ముద్ర ఆయన్ను వెంటాడుతోంది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కొన్ని 'నరమేధం' కేసులు ఇప్పటికీ దర్యాప్తులో, విచారణలో ఉన్నాయి. ఈ ఘోరకలిని దేశ ప్రజలు మరిచిపోయి మోడీకి పట్టం గడతారని ఆయన వీరాభిమానులు ఆశిస్తున్నారు. రామ జన్మభూమి రథయాత్రల ద్వారా అద్వానీ సృష్టించిన హిందూ మతోన్మాదం బాబ్రీ మసీదు కూల్చివేతకు దారితీసి, లౌకిక జీవనాన్ని నాశనం చేసి హిందువులు – ముస్లింల మధ్య విభజన తేగా, ఉగ్ర హిందూత్వవాద పర్యవసానం ఎంత క్రూరంగా, భయంకరంగా ఉంటుందో 2002 నాటి గుజరాత్ అల్లర్లు నిరూపించాయి. ఆనాడు ప్రధానమంత్రిగా ఉన్న ఎ.బి.వాజ్‌పేయి మోడీకి 'రాజధర్మం' బోధించడంతో పాటు పదవి నుండి తొలగించే ప్రయత్నం చేస్తే దానికి అడ్డుపడింది అద్వానీయే. ప్రధాన మంత్రి కావాలన్న తన ఆకాంక్షను మోడీయే ఎసరుపెడతాడని అద్వానీ బహుశా ఆనాడు ఊహించి ఉండరు!

ప్రధాని పదవిపై ఆకాంక్ష చాటుకుంటూ, ముస్లిం ఓటర్లను ఆకట్టుకునేందుకు మోడీ 2011 సెప్టెంబర్ 17 నుంచి మూడు రోజులు 'సద్భావన' పేరిట చేపట్టిన నిరాహార దీక్షతో అద్వానీ, మోడీల నడుమ సంబంధాలు దాదాపు బెడిసికొట్టాయి. ఢిల్లీలోని శ్రీరాం కళాశాలలో, టివి 18 థింక్ ఇండియా కార్యక్రమంలో, ఫిక్కీ మహిళల సమావేశంలో, కోల్‌కత్తా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఆయన వరుసగా ఉపన్యాసాలు ఇచ్చారు. జాతీయస్థాయి అంశాలపై మీడియాలో తరచూ మాట్లాడడం ప్రారంభించారు.

ఆయన నియంతృత్వ పోకడ, అహంకారం, సమస్యలపై మొండి వైఖరి, మాట పెళుసుదనం, గుజరాత్ వెలుపల ఎలాంటి అనుభవం లేకపోవడం, 2002 మతతత్వ మరకలు ఆయన్ని హిందుత్వ మతతత్వ వాదిగా నిలబెట్టాయి. అందువలన మరోవైపు ఆయన దేశ రాజధానిని చేరుకోవడం అంత తేలికగా అయ్యే పనిలా కనబడడం లేదు. నితిశ్ కుమార్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు పావులు కదుపుతున్నారు. బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. 2014

ఎన్నికల తర్వాత ఏర్పడబోయేది 'ఫ్రెండ్లీ ప్రభుత్వం' అంటూ జయలలిత గొంతు కలుపడం విశేషం.

గుజరాత్‌లో 2000 మంది మైనారిటీల ఊచకోతకు 2002లో కారణం నరేంద్రమోడీ ప్రభుత్వం! ఆ రోజుకీ, ఈ రోజుకీ మానవ హక్కుల సంఘాల కృషి ఫలితంగా మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆధ్వర్యంలో జరిగిన విచారణల ఫలితంగా సుప్రీంకోర్టు జోక్యంతో ఇంకా ఆ నరమేధం తాలూకు కేసులు నడుస్తూనే ఉన్నాయి. అయినా వాటి తాలూకు శిక్షల నుంచి తప్పించుకునేందుకు గుజరాత్ పాలకవర్గం పడనిపాట్లులేవు. పాలక పక్షమూ, 'సిట్' లాంటి విచారణ సంస్థలూ సాక్షులను తారుమారు చేసే ప్రయత్నాలకు గుజరాత్‌ను పాలక పక్షం ప్రయోగ వేదికగా మార్చడానికి అక్కడనే ప్రారంభోత్సవం జరిగిందంటే అతిశయోక్తి కాదు. చివరికి ఆ నాటి హోంమంత్రి హిరేన్ పాండ్యా స్వయంగా జస్టిస్ కృష్ణయ్యర్ కమిటీ ముందు నరేంద్రమోడీ సమక్షంలో జరిగిన నిర్ణయాలను వెల్లడించిన 'పాపాని' కి పాండ్యాను హత్యచేయడాన్ని ఇంకా భారత ప్రజలు మరవలేదు!

2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో బి.జె.పి అధికార ఆశలు నెరవేరలేదు. వయసు మీరిన అద్వానీ నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో అది నెరవేరుతుందనే ఆశలేదని అంచనాకు వచ్చిన ఆర్ఎస్ఎస్, యువ నాయకత్వాన్ని ముందుకు తేవాలని నిర్ణయించింది. దాని పర్యవసానంగానే మోడీని ఇంద్రుడు – చంద్రుడంటూ ఆకాశానికెత్తే కార్యక్రమం మొదలైంది. అయితే మోడీ 'అందరికీ' ఆమోదయోగ్యుడైన నాయకుడు కాదని, 'విభజనవాది'గా, 'విచ్ఛిన్నవాది'గా ఉన్న ముద్ర పార్టీకి, లౌకిక బంధం ఆధారంగా ఉన్న ఎన్.డి.ఎ.కు చేటు చేస్తుందన్నది అద్వానీ వర్గం అభిప్రాయం. కాబట్టి అద్వానీ సారథ్యమే ప్రయోజనకరమన్నది వారి భావన. అయితే పార్టీని, యువకులను ఉత్తేజపరచగలవాడు మోడియేనని, అందువల్ల భావి ప్రధాని పదవికి అత్యంత అర్హుడని ఆర్ఎస్ఎస్ భావించింది. ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ పదవి, ప్రధాని అభ్యర్థిత్వానికి తొలిమెట్టు. ఇంతదాకా వచ్చినాక అడ్డుకోవడం సాధ్యంకాదనే కావచ్చు – అద్వానీ అనారోగ్య కారణంతో గోవా సమావేశానికి వెళ్లలేదు. గైరుహాజరు ద్వారా తన ప్రతిష్ఠను, పర్సనాలిటీని మోడీకి వ్యతిరేకంగా ఒడ్డినా నిర్ణయం ఆగలేదు. తన మాటకు, వ్యక్తిత్వానికి తగిన గౌరవం లభించలేదన్న బాధతో పార్టీ పదవులకు రాజీనామా చేశారు. పార్టీ ఒకనాటి ఆదర్శనీయమైన సిద్ధాంతాలతో పనిచేయడం లేదని, నాయకులు వ్యక్తిగత ఆకాంక్షలతో పని చేస్తున్నారని అధ్యక్షునికి రాసిన లేఖలో అద్వానీ పేర్కొన్నారు. అయితే ఎన్.డి.ఎ. చైర్మన్ పదవికి రాజీనామా చేయకపోవడం గమనార్హం.

2005లో అద్వానీ పాకిస్తాన్ వెళ్లినప్పుడు మహ్మద్ అలీ జిన్నాకు లౌకిక కితాబులిచ్చిన తర్వాత అద్వానీని అధ్యక్ష పదవి నుంచి తప్పించిన తర్వాత 2009లో ప్రధాని అభ్యర్థిగా ఎన్నికల్లో ముందుకు తెచ్చారంటే ఆయన పరివార్ బంధం ఎంత బలమైందో తెలుస్తుంది. ఈ సమయంలోనే బిజెపి అంతర్గత సంక్షోభాలు అవినీతి ఆరోపణలతో అట్టుడికిపోయింది. ఇలాంటి సమయంలో గుజరాత్‌లో 2013లో మూడోసారి గెలిచిన మోడీ తన బ్రహ్మాస్త్రమన్న భ్రమ కలిగించేందుకు సంఘ్ పరివార్ వ్యూహం పన్నింది. మోడీకి ఒకవైపున హిందూత్వ ముద్ర, మరోవైపున కార్పొరేట్ అభివృద్ధి ముద్ర జోడించబడ్డాయి. ఈ విషయంలో కార్పొరేట్ మీడియా కూడా ఉత్సాహంగా సహకరించింది.

చివరకు దేశ రాజకీయాలంటే కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ, బిజెపి నవనేత నరేంద్ర మోడీల పోటీయేనన్నట్టు అమెరికా సెనెట్ అధికార పత్రాలు కూడా ప్రచారంలో పెట్టాయి. గోవా నిర్ణయం వెనక ఇన్ని వ్యూహాత్మక కారణాలున్నాయన్న విషయం మర్చిపోలేం.

నిజానికి మోడీ అద్వానీ శిష్యుడిగానే ఎదిగారు. కేశూభాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోడీ తెర వెనుక సూపర్ చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. వాఘేలా చేపట్టిన 'ఖజురహో తిరుగుబాటు' ఫలితంగా కేశూభాయ్ సర్కారు 1996లో కుప్పకూలిపోయేంత వరకు మోడీకి అద్వానీ అండగా నిలిచారు. అనేక సందర్భాలలో పార్టీ నాయకులు మోడీ పెత్తనాన్ని వ్యతిరేకించారు. 2002లో గుజరాత్ మారణహోమం జరిగినప్పుడు మోడీపై పార్టీ లోపలా, బయటా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రతి సందర్భంలో ఆయనను అద్వానీ వెనకేసుకు వచ్చారు. కానీ అద్వానీ పాకిస్తాన్ వెళ్లి జిన్నాను శ్లాఘించినందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కన్నెర్ర చేసినప్పుడు మాత్రం మోడీ, అద్వానీకి మద్దతుగా నిలువలేదు. గుజరాత్ రాజకీయాలలో తన ప్రత్యర్థులను తొక్కిపెడుతూ ఎదిగిన మోడీ కన్ను జాతీయ రాజకీయాలపై పడ్డది. మోడీ అనేక సందర్భాలలో అద్వానీని అవమానించాడనే ఆరోపణలు ఉన్నాయి. 2011 అక్టోబర్ 2 నుంచి అద్వానీ పోరుబందర్ నుంచి అవినీతి వ్యతిరేక యాత్ర చేపట్టవలసి ఉండగా, మోడీ 2011 సెప్టెంబర్ 17 నుంచి మూడు రోజుల సద్భావన దీక్ష చేపట్టారు. దీంతో అద్వానీ బీహార్‌లోని జయప్రకాశ్ జన్మస్థలి సీతాబ్దియారో నుంచి తన యాత్రను ప్రారంభించవలసి వచ్చింది. ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్నందు వల్ల మోడీ వైఖరిని బిజెపి పెద్దలెవరూ ఖండించలేని పరిస్థితి ఏర్పడింది. అద్వానీ అంతరాత్మలో ఏముందో తెలియదు కానీ ఇటీవలి కాలంలో ఆయన వ్యవహార సరళిలో బయటికి మాత్రం ఎంతో మార్పు కన్పిస్తుంది. తాను స్వయంగా పెంచి పోషించిన మతవాద రాజకీయాలే చివరకు ఆయన రాజకీయ భవితవ్యాన్ని కబళించాయి.

ఎన్.డి.ఎ ఐక్యంగా ఉండి, కొత్త మిత్రులను ఆకర్షించి ఒకవేళ 'మ్యాజిక్ సంఖ్య'ను చేరి అధికారంలోకి వస్తే ప్రధానిగా మోడీ, కూటమి చైర్మన్‌గా అద్వానీ పొసిగే విషయం కాదు. మిత్రపక్షాలను పెంచుకునేందుకు 'లౌకిక' భావన ప్రాతిపదిక అవుతుంది కాబట్టి 'అందరికీ ఆమోదయోగ్యుణ్ని' తానే అవుతానన్న ఆశ అద్వానీకి ఉండవచ్చు. ఇది అద్వానీ దింపుడుకళ్లం ఆశ. నాయకత్వ స్థాయిలో ఈ కుమ్ములాటలను ఎలా సర్దుబాటు చేసుకుంటారన్నది బి.జె.పి. అంతర్గత విషయం. కాని మోడీ నాయకత్వం విషయంలో పార్టీలో కొంతకాలంగా జరుగుతున్న రచ్చ దేశ ప్రజలకు బహిర్గతమైంది. దీని ప్రభావం ఎన్.డి.ఎ.పై కూడా ఉంటుంది. 'మోడీ హిందూత్వ ముఖం' బి.జె.పి.కి బలమో, బలహీనమో ఓటర్లు నిర్ణయిస్తారు. లౌకిక వ్యవస్థ పరిరక్షణను కోరుకునే పార్టీలకు, వ్యక్తులకు కూడా ఇదొక సవాలు.

గుజరాత్ రాష్ట్రంలో విదర్భ, సౌరాష్ట్ర తదితర ప్రాంతాలలో వందల సంఖ్యలో 2003–2007 సంవత్సరాల మధ్య జరిగిన రైతులు, వృత్తిదారుల ఆత్మహత్యలు మోడీకి పట్టలేదు. అంతేకాదు, ఎలాగోలా దేశ ప్రధాన మంత్రి పదవిని తాను అలంకరించడం ద్వారానే గాక, హత్యా నేరారోపణలు ఆధారంగా అనేక దొంగ ఎన్‌కౌంటర్ కేసులలో ఉండి, ప్రస్తుతం బెయిల్ మీద ఉన్న మోడీ అనుచరుడు, ఉత్తరప్రదేశ్

బిజెపి కార్యదర్శిగా ఉన్న అమిత్‌షాను 2014 జనరల్ ఎన్నికలలో గుజరాత్ పార్టీ ఇన్‌చార్జిగా మోడీ నియమించడమూ అద్వానీ ప్రభృతులకు నచ్చలేదు. 2002లో ప్రధాన మంత్రిగా ఉన్న వాజ్‌పేయి గుజరాత్ ఊచకోతలకు స్పందించి "నీవు రాజధర్మం తప్పుతున్నావు, ధర్మంపాటించు" అని నరేంద్రమోడీని ఆదేశించి మందలించవలసి వచ్చిందో, ఆ నాటి నుంచి కూడా మోడీ అనుసరిస్తున్నది తనకు తోచిన 'అధర్మా'న్నే కాని రాజధర్మాన్ని కాదు.

దేశాన్ని మత ప్రాతిపదికన విభజించి అధికారం చేజిక్కించుకోవాలనే నాయక గణం అధికారం రాకముందే తమలో తాము ఏ స్థాయిలో కీచులాడుకుంటారన్నది ఇప్పుడు దాచేస్తే దాగని సత్యంలా వెల్లడైపోయింది. నాగపూర్‌లో కొలువు తీరిన ఆర్‌ఎస్‌ఎస్ అగ్రగణం ఆదేశాలతో ఏమైనా సర్దుబాటైనా అంతర్గత పరిస్థితి అంతః కలహాలమయమేనని తేలిపోయింది. సహజంగానే చాలా మంది ఇది బిజెపి అంతర్గత వ్యవహారమని వ్యాఖ్యానించారు. మోడీ పట్టాభిషేకానికి వ్యతిరేకంగా అద్వానీ ఆక్రోశం, ఆ పైన అలుక వీటన్నిటి నేపథ్యంలో కీలకమైన ఈ అంశం కాస్తా మరుగున పడిపోయింది. భారత రాజకీయాలలో సంఘ్ పరివార్ భావజాలాన్ని అయోధ్య కాండతో ప్రధాన అజెండాగా మార్చి ప్రభుత్వాధికారానికి సోపానం చేసింది అద్వానీయే. కాగా అదే రాజకీయాలతో వచ్చిన అధికారాన్ని జాతి హత్యాకాండకు ఆయుధంగా చేసుకున్న మోడీ మరింత ప్రమాదకరమైన రాజకీయ ఎత్తుగడలకు ప్రతీకగా నిలిచారు. మొదటి నుంచి మోడీని ముందుకు తెచ్చింది, గుజరాత్ మారణహోమం తర్వాత దిగిపోకుండా చక్రం అడ్డువేసిందీ అద్వానీయే అన్నది ఇక్కడ ముఖ్యాంశం. ఇదే గోవాలో 2002లో మోడీ దిగిపోవలసిందేనని నాటి ప్రధాని వాజ్‌పేయి గంభీర ప్రకటన చేసినా తర్వాత తోకముడవాల్సి వచ్చిందంటే కారణం అద్వానీ వంటి వారే. దేశ రాజకీయాలను మతతత్వ మలుపు తిప్పిన రథయాత్ర కూడా గుజరాత్‌లోని సోమనాథ్ నుంచే ప్రారంభమైంది. ఆ యాత్ర సూత్రధారులలో మోడీ ఒకరన్నది అందరికి తెలిసిన విషయమే. కనుక వీరిద్దరినీ విడివిడిగా చూడడం గాని, ఎవరు మెరుగని విశ్లేషించడం గాని అర్థరహితం. ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఇప్పుడు ఎవరైతే అధికార క్రీడకు దోహద పడతారని చూస్తున్నది తప్ప మరో కారణం లేదు. ప్రస్తుతం లౌకిక ప్రజాస్వామిక వాదులు చేయాల్సింది వ్యక్తిగతంగా ఎవరు ఏ స్థానంలో వస్తారనే దానికన్నా బిజెపి మొత్తంగా అనుసరించే మతతత్వ రాజకీయాలను ఎండగట్టడం చాలా ముఖ్యం.

అయోధ్యలో రామ జన్మభూమి ఉద్యమాన్ని ఎవరు నిర్మించారు? సాధ్వీ రితంబర, రమాశంకర్ అగ్నిహోత్రి, వినయ్ కతియార్, ప్రవీణ్ తొగాడియా, అశోక్ సింఘాల్ వంటి నేతలు ఎవరు? వారు కల్పించిన వాతావరణాన్ని ఉపయోగించుకుని, సంఘ్ సిద్ధాంతాలకనుగుణంగా 1990లో రథయాత్ర చేపట్టినందుకే కదా 1984లో బిజెపి లోక్‌సభలో 2 సీట్ల నుంచి 1996లో 161 సీట్ల వరకు సంఖ్యా బలాన్ని పెంచుకున్నది. బాబ్రీ మసీదును ఆవేశంతో కూలగొడుతూ దాని శిథిలాల కిందే చనిపోయిన వారెవరో అద్వానీకి తెలియదా? అనంతరం దేశ వ్యాప్తంగా మైనారిటీలపై జరిగినా దాడులు అద్వానీకి తెలియవా? అప్పుడు అద్వానీ సంఘ్ సిద్ధాంతాలకు రాజకీయ సారథిగా ముందుకు వచ్చినందువల్లే బిజెపిలో ప్రముఖ నాయకుడుగా నిలదొక్కుకోగలిగారు. పార్టీకి వాజపేయి ముఖోటా (ముసుగు) అని, అద్వానీ దాని వెనుక ఉన్న సైద్ధాంతిక రూపం అన్నది నిజం కాదా?

దేశంలో మతతత్వ వ్యాప్తికి ప్రధాన కారకుడైన అద్వానీ అధికార పేరాశల గురించి, బిజెపి పదవీ కుమ్ములాటల గురించి లౌకిక శక్తులకు ఏమీ ఆసక్తి ఉండనవసరం లేదు. కానీ వాస్తవంగా చూస్తే గుజరాత్‌లో కూడా మొన్నటి మోడీ విజయం అనుకున్నంత ఘనమైందేమీ కాదని ఓట్లు, సీట్లు కూడా చెప్పాయి. ఇక గుజరాత్ వెలుపల ఆయన మంత్రజాలం పనిచేసింది శూన్యం. బీహార్‌కు రావద్దని జెడియు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తలుపులు మూయడమే కాదు, స్వంత పార్టీవారు కూడా రావద్దు మహాప్రభో అని నివారించడం నిజం. ఆయన ప్రచారం చేసిన హిమాచల్‌ప్రదేశ్‌లోనూ, కర్ణాటకలోనూ కూడా ఓటమి పాలైన మాటా నిజం. ఎన్‌డిఎలో రెండవ పెద్ద భాగస్వామి జెడియు, బిజెపి మతతత్వ నేస్తం శివసేన కూడా ఆయనను ఆమోదించేందుకు సుముఖంగా లేవు. సర్వేలన్నీ కాంగ్రెస్ ఓడిపోతుందని చెపుతున్నాయే గాని బిజెపి గెలుస్తుందని ఎక్కడా చెప్పడం లేదు. అందుకే అన్యథా శరణం నాస్తి అన్నట్టు సంఘ్ పరివార్ మోడీకరణ మార్గం చేపట్టింది. స్వంతపార్టీలోనూ, స్వంత కూటమిలోనూ ఏకాభిప్రాయం పొందలేని నేత భిన్న మతాలకు నిలయమైన ఈ సువిశాల భారత దేశంలో విస్తార ప్రజామోదం పొందుతాడనేది మామూలుగా ఊహకందని విషయం. మోడీ ఎంపిక తర్వాత అద్వానీకి హిట్లర్లూ, ముస్సోలినీలు గుర్తుకు రావడం యాదృచ్ఛికం కాదు.

అద్వానీతో పోల్చినప్పుడు వాజపేయి సౌమ్యుడిగా, ఉదారుడిగా కనిపించడం – ఆయన ప్రధానమంత్రి కావడానికి దోహదం చేసింది. మాజీ సోషలిస్టులు కూడా ప్రభుత్వాన్ని సమర్థించడానికి ప్రాతిపదిక ఏర్పరచింది. అద్వానీ ఆ అనుభవం నుంచి యాంత్రికమయిన పాఠం నేర్చుకున్నట్టు కనిపిస్తుంది. అందరికీ ఆమోదయోగ్యుడైన నేతగా పరిణామం చెందడానికి అద్వానీ 2004 నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. జిన్నాపై చేసిన వ్యాఖ్యలను ఆ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలేమో. మోడీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడాన్ని వ్యతిరేకించడంలో, తాను అతని కంటె మెరుగైన వాడినని, ఉదారవాదినని సూచించడం కూడా ఒక ప్రయోజనం కావచ్చు. కానీ, దేశంలో ఫాసిస్టుగా వ్యవహరించేవారి పట్ల కొన్ని సెక్షన్లలో మోడీ పట్ల ఆరాధన పెరుగుతూ వస్తున్నది. నరేంద్రమోడీపై ఏ విమర్శలయితే ఉన్నాయో, అవే విమర్శలు

ఆయనపై మోజును, అభిమానాన్ని పెంచడానికి కారణాలవు తున్నాయని గుర్తించక తప్పదు. గోవా సమావేశాల్లో నరేంద్రమోడీకి దాదాపుగా పట్టాభిషేకమే జరిగింది. పేస్‌బుక్, ట్విట్టర్‌లలో మోడీ ప్రధాని అయినంత సంబరమే కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా బిజెపికి ఏమంత సానుకూల పరిస్థితి లేదని, మోడీ ప్రచారం చేసినా కర్ణాటకలో ఫలితం ఏమీ మారలేదని మరిచి, 2014లో తమకు అధికారం చిక్కినట్లే అన్నంత హడావుడి పార్టీ శ్రేణుల్లో కనిపిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే.. నాటి అద్వానీ కరుడుగట్టిన పాత్రలో నేడు మోడీ ఉన్నాడు. నాటి మితవాద వాజ్‌పేయి పాత్రలోకి వెళ్లేందుకు అద్వానీ ప్రయత్నిస్తున్నాడు. మౌలికంగా లౌకికతత్వాన్ని, మత సామరస్యాన్ని కోరుకునే భారత ప్రజానీకం అందుకు అవకాశం ఇవ్వరని ఆశిద్దాం.

ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహంలో మరో ముఖ్యాంశం బాబ్రిమసీదు సంఘటన కు ముందు అయోధ్యలో జరిగిన రహస్య సమావేశంలో కరసేవకులకు ఎల్.కె. అద్వానీ, వినయ్ కతియార్ చేసిన ఆవేశపూరిత ప్రసంగాల నేపథ్యాన్ని గమనించి, విచారించిన జస్టిస్ శ్రీవాత్సవ బిజెపి నాయకులకు

తుంటి నొప్పికి పంటి మందు వేస్తే ఎలా?

తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేస్తున్న ఆదివాసుల హక్కులను కాలరాస్తూ, ఖనిజ వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెడుతూ వారికి అండగా నిలుస్తున్న పాలకులు తీరును వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

తుంటి నొప్పికి పంటి మందు వేస్తే తగ్గుతుందా? తగ్గదని మెడ మీద తలకాయ ఉన్న వాడెవడైనా అంటాడు. కాని మన పాలకుల తలకాయలెక్కడో ఉన్నాయి. మావోయిస్టుల సమస్య ప్రధానంగా సామాజికార్థిక సమస్య. ఆ సమస్యకు పాలకుల పరిష్కారం సిఆర్‌పిఎఫ్, సల్వాజుడుం తుపాకీ గుండ్ల వర్షం, వందల మంది ఆదివాసుల మరణాలు, వేలాది మంది నిర్వాసితులు కావటం. అందుకనే 1967 నుంచి సమస్య సమస్యగానే ఉండిపోయింది. ఫలితం, ఇటీవల ఒక కాంగ్రెస్ నాయకునితో సహా ఇరవై తొమ్మిది మంది మరణం. అంతకు ముందు సంవత్సరంలో 74 మంది సెక్యూరిటీ జవాన్ల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అపుడు సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్ ఎక్కడున్నారు? మావోయిస్టులను టెర్రరిస్టులని ముద్ర వేయడం తప్ప చేసిందేమీ లేదు. కాని ఇప్పుడు ఇరవై తొమ్మిది మంది కాంగ్రెస్ నాయకులు, అనుయాయులు మరణిస్తే అటు సోనియా, ఇటు ప్రధాని ఆఘమేఘాల మీద లగెత్తుకు వచ్చారు. 74 మంది జవాన్లు చనిపోయినపుడు ఈ నాయకులు రాకపోవడానికి జవాన్ల జీవితాలు అంత చవకా? ఆ కాంగ్రెస్ నాయకునికి సెక్యూరిటీ బలగాల దన్ను ఇవ్వకపోవడంలో రమణ్‌సింగ్ ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందట. అసలు సెక్యూరిటీ కోరారా? సోనియా అగ్గి మీద గుగ్గిలమై విరుచుక పడిపోయిందని 'హిందూ' పత్రిక వార్త. కాంగ్రెస్ నాయకులు ప్రచారానికి వెళ్లినప్పుడల్లా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సెక్యూరిటీ బలగాలను తోడుపంపాలా? పోలీసు మాన్యువల్‌లో ఎక్కడా లేదే? అయినా, ఇది శాంతిభద్రతల సమస్య, ఇది హోంశాఖ మంత్రి, ప్రధాని బాధ్యతలకు సంబంధించిన వ్యవహారం.

పశ్చిమ బెంగాల్ రాజధాని నగరంలో వామపక్షాలు బహిరంగ సభ ఏర్పాటు చేస్తే వేలమంది పోలీసుల బలగాలను సమీకరించారు. అలాగే కాంగ్రెస్ సమావేశాలకు కూడా సెక్యూరిటీ కోసం వేలమందిని సమీకరించాలని పోలీస్ మాన్యువల్‌ను సవరిస్తే, ఏ స్థాయి నాయకులకు ఎంతమందిని పంపవచ్చునో కూడా ఆ మాన్యువల్‌లో పొందుపరిస్తే, వాళ్లు మామూలు తుపాకులు, లాఠీలు, బాష్పవాయు ప్రయోగాలు, ఎకె 47లు ఏ మోతాదులో తీసుకొని వెళ్లాలో ఆయా మాన్యువల్‌లో పొందుపరిస్తే, ప్రభుత్వోద్యోగులు అలాగే చేస్తారు. చత్తీస్‌గడ్‌లో ఉన్నది బిజెపి ప్రభుత్వం కాబట్టి, నాలుగు రాళ్లు విసిరే అవకాశాన్ని దొరకపుచ్చుకోవడం, అందులోనూ ఇలాంటి విషయంలో ఆమె విరుచుకపడడం చాలా చీప్‌గా అనిపిస్తుంది.

దేశంలో లక్షల మంది రైతాంగం వేరే గతిలేక ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. సునామీలు, తుపాన్లు, వర్షాభావ పరిస్థితులు, 40–50 డిగ్రీల వేడిలో వందలాది మంది చనిపోయారు. సోనియా స్పందించ లేదేమిటి? చత్తీస్‌గడ్‌లో ఉన్నది బిజెపి ప్రభుత్వం. అయినా మావోయిస్టుల విషయంలో ఇద్దరూ ఒకే తాటి మీద నడుస్తున్నారు. అలాంటప్పుడు ఈ కత్తులు నూరుకోవడమేమిటి? ఈ పరిణామం చూసి మావోయిస్టులు లోలోన సంతోషిస్తుంటారు.

సోనియాగాంధీ కాంగ్రెస్ నాయకులు తప్పొప్పులు ఎన్ని చేసినా బారా ఖూన్ మాఫ్ అనవచ్చు, కాని చత్తీస్‌గడ్‌లో మావోయిస్టులకు బలి అయిన కాంగ్రెస్ నాయకుడు ఎలాంటివాడు? సల్వాజుడుం అనే అనధికార ప్రైవేట్ సైనిక దళాన్ని ఏర్పాటు చేశాడు.

'క్రూరమైన హత్యలు, స్త్రీలపై విచ్చలవిడి అత్యాచారాలు, గ్రామాలను తగుబెట్టడం వంటి కార్యక్రమాలు కొనసాగాయి. రెండు మూడేళ్లలోనే దాదాపు 644 గిరిజన గ్రామాలు ఖాళీ అయ్యాయి. అంటే వాటిని తగులబెట్టడం లేదా ప్రజలను అక్కడ నుంచి తరలించడం జరిగిందన్న నివేదికలు వెలువడ్డాయి. దాదాపు మూడు లక్షల మంది జనం వారి గ్రామాలను విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వీరిలో లక్ష మంది వరకూ సల్వాజుడుం ఏర్పాటు చేసిన క్యాంపుల్లో ఉండిపోయారు. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలను క్యాంపులుగా, తమ స్థావరాలుగా

విధించిన శిక్షలను ఏదో ఒక మిషపైన పదవులు అడ్డం పెట్టుకుని తప్పించుకుంటూనే వచ్చినా, గౌరవ సుప్రీంకోర్టు వదలడం లేదు, లిబర్‌హాన్ కమిషన్ నివేదిక పూర్తి వివరాలు దేశం ఇంకా చూడవలసే ఉంది! అదే పద్ధతిలో గుజరాత్ మారణకాండ తాలూకు విచారణలూ పూర్తి కాలేదు. 'సుప్రీం' గుజరాత్ కోర్టులను విశ్వసించ గలస్థితిలో లేదు. ఇవి పూర్తయి పాలకపక్ష నిందితులకు శిక్షలు పడేలోగా పార్టీలోనూ, దేశంలోనూ అత్యున్నత స్థానాలకు (ప్రధానమంత్రి పదవికి) ఎగబాకితే అదే తమకు 'శ్రీరామరక్ష' కాగలదన్న విశ్వాసంతోనే గోవా కార్యవర్గ సమావేశంతో నిమిత్తం లేకుండా పార్టీలో మోడీ ప్రమోషన్‌కు రాజ్‌నాథ్‌సింగ్ పథక రచన చేశాడు! అందుకే దేశ రాజకీయ రంగంలో మోడీ నేతృత్వంలో బిజెపి భవిష్యత్తుపైనా, మోడీ మతోన్మాద పునాదులు చూపే ప్రభావం పైనా, దేశ విదేశాల పారిశ్రామిక వేత్తలు మోడీపై ఆసక్తి చూపడంపైనా చర్చ జరగాల్సి ఉంది. ఈ క్రమంలో మోడీని ఆకాశానికెత్తే ప్రచారాల వెనుక మతతత్వ రాజకీయాలనూ, కార్పొరేట్ ప్రయోజనాలనూ ఎండగట్టడం ప్రజాస్వామిక, లౌకిక శక్తుల కర్తవ్యం.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

మార్చడంతో పిల్లలకు కొన్నేళ్లపాటు చదువు దూరమైంది.' (ఆంధ్రజ్యోతి) ఇలాంటి నరరూప రాక్షసుడి చావుకేనా సోనియాగాంధీ నోరు పారేసుకుంది.

ఈ సంఘటనలో ప్రాథమికంగా, ప్రముఖంగా ఏ విషయం చుట్టు పరిభ్రమించాలో, ఆ విషయాన్ని అప్రాముఖ్యంగా పత్రికల్లో చోటు చేసుకొన్న విషయం భూమి, పరిశ్రమలు, నీటి ప్రాజెక్టులు, గృహ నిర్మాణం – ఇలా ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా కావాల్సింది భూమి. భాక్రానంగల్ ప్రాజెక్టు నాటి నుంచి ఈ సమస్యను అపరిష్కృతంగా వదిలిపెట్టేశారు పాలకులు. మావోయిస్టు కార్యకలాపాలు ఈ సమస్యల చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. అటవీ భూమి అంతా చెట్లతో పాటు ఖనిజ సంపదల కాణాచి. ఈ భూమే కొన్ని కోట్ల మంది ఆదివాసుల జీవనాధారం. వారు నివసిస్తున్న అటవీ భూముల్లో అపారమైన ఖనిజ సంపద ఉన్నదని వారికి తెలియదు. కేంద్ర, రాష్ట్ర గనుల శాఖలు ఈ సంపదను కనుక్కోవడంతో ఆదివాసులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ సంపద అంతా దేశాభివృద్ధికి అత్యవసరం. దేశంలోని ఇనుప ఖనిజంలో 19 శాతం, బొగ్గు, బాక్సైట్, సున్నపురాయి 11 శాతం ఒక్క చత్తీస్‌గడ్‌లోనే లభిస్తున్నాయి. సహజంగానే పారిశ్రామికవేత్తల కళ్లు ఈ నిధుల మీద పడ్డాయి. అటవీ శాఖ ఈ నిధుల తవ్వకాన్ని నిషేధించింది. కాని తర్వాత కేంద్రం ఈ నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ ఖనిజ సంపద దేశావసరాలకు అవసరమైనదని ప్రభుత్వం భావించింది. అయితే ఈ ఖనిజాల తవ్వకం ప్రారంభిస్తే, ఆ అడవుల్లో అనాదిగా నివసించే ఆదిమ వాసులేమవ్వాలి. చట్టం ప్రకారం అలా ఖాళీ చేయించిన వారికి ప్రత్యేక నివాస గృహాలు నిర్మించి ఇవ్వాలి.

ఉదాహరణకు, చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలోని బస్తర్‌లో దాతుగడ్‌లోనే ఇరవై వేల ఎకరాల విస్తీర్ణంలో గనులున్నాయి. కాగా ఆ భూమి మీద ఆధారపడ్డ ఆదివాసులేం కావాలి? వాళ్లను ఖాళీ చేయించాలంటే ఆయా గ్రామాల పంచాయితీలు తీర్మానాలు చేయాలని చట్టాలున్నాయి. కాని ఆచరణలో చట్టాలు పారిశ్రామికవేత్తల చుట్టాలయిన తర్వాత, ఆ పారిశ్రామికవేత్తల చేతుల్లో ప్రభుత్వం చుట్టం అయిన తర్వాత ఆదివాసుల మొరలాలకించే వారెవరు? పంచాయితీల పేరును నగర పంచాయితీలుగా మార్చారు. పంచాయితీల అధికారాలు చెత్తబుట్టలోకి వెళ్లిపోయాయి. చట్టం ప్రకారం ఈ భూములను కౌలుకివ్వవచ్చునే గాని, స్వాధీనం చేసుకోకూడదు. ఆ కౌలుకివ్వడం కూడా ప్రభుత్వ రంగ సంస్థలకే ఇవ్వాలి కాని పబ్లిక్ – ప్రైవేట్ విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత ప్రైవేట్ రంగానికి పగ్గాలు వేసే నాథుడే లేడు. ప్రైవేట్ రంగానికి అవకాశం ఇచ్చిన తర్వాత, ఆ రంగంలో పెట్టే పరిశ్రమల అవసరాల కోసమే వినియోగించాలి.

కాని ఆచరణలో ఆ ఖనిజాలను అమ్మి సొమ్ము చేసుకొంది ప్రైవేట్ రంగం. అటవీ ప్రాంతంలో ఆదిమ వాసులకే భూమిపై స్వంత హక్కు ఉంది. ఆదివాసేతరులకు ఆ హక్కు లేదు. కాని ఆచరణలో జరిగిన దేమంటే ఈ ఆదివాసేతరులు స్త్రీలను లాంఛనంగా వివాహమాడి ఆ నిబంధన నుంచి తప్పించుకొని, స్వంతదారులయ్యారు. కాగితం మీద మాత్రం ఆదివాసుని పేరే ఉంటుంది. వడ్డించేవాడు మనవాడైతే చివరి బంతిలో కూర్చుంటేనేమి.

ఈ అడవుల్లో ఉన్న బొగ్గు గనుల మీద ప్రైవేట్ రంగం కన్ను పడింది. దేశంలో బొగ్గు కొరత ఉన్న విషయం తెలిసిందే. ఆ గనులు తవ్వడానికి కార్పొరేట్‌సంస్థలు, బహుళజాతి సంస్థలు లైసెన్సుల వేట ప్రారంభించాయి. బహుళజాతి సంస్థలు నేరుగా లైసెన్సులు సంపాదించడంలో ఇబ్బందులుంటాయి కాబట్టి దేశీయ కార్పొరేట్ సంస్థలతో చెయ్యి కలిపి, ఈ అడవుల్లో ప్రవేశించాయి. ఉదాహరణకు, టాటా కంపెనీ ఒక బహుళజాతి సంస్థతో జతకూడి కోరస్ అనే బోర్డు తగిలించుకొంది. హోల్సిమ్ ఒక స్విస్ బహుళజాతి సంస్థ. స్పెయిన్, అమెరికాలో ఉన్న సిమెంట్ సంస్థలను అమ్మేసి మన దేశంలోని ఎసిసి, అంబుజా సిమెంట్ కంపెనీలను కొనేసి దేశంలోని సిమెంట్ ఉత్పత్తిలో 13 శాతంపై పట్టు సాధించింది. చత్తీస్‌గడ్‌లోని రాయ్‌గడ్ ప్రాంతంలో ఎక్కడ చూసినా జిందాల్ సంస్థ బోర్డులే. 26 వేల ఎకరాల వ్యవసాయ భూములన్నీ జిందాల్‌వే. ఈ కంపెనీలతో ప్రభుత్వం ప్రేమలో పడింది. ఇలాంటి పరిశ్రమలు కొన్ని ప్రభుత్వ అనుమతులు పొందాలి. కాని ఆచరణలో అనుమతులు సంపాదించకుండానే ఆ భూమిలో ప్రవేశించవచ్చు. అనుమతులు తర్వాత తెచ్చుకోవచ్చు అని ప్రభుత్వమే మినహాయింపు ఇచ్చిందంటే ఆ రైతులు తమ గోడును ఎవరికి వినిపించాలి? ఇలా అనేక పెద్ద, చిన్న పరిశ్రమలకు అడవులు వారి జాగీరైపోయాయి. ఎక్కడైనా ఏ కంపెనీ అయినా హద్దు మీరితే బారాఖూన్ మాఫ్ అంటుంది. చత్తీస్‌గడ్‌లోనే 70 విద్యుదుత్పత్తి కర్మాగారాలు 60 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇన్ని కేంద్రాల స్థాపనకు ప్రభుత్వం వద్ద నిధులేవి? ఈ కేంద్రాలన్ని ప్రైవేట్ రంగం చేతుల్లోకి వెళ్లిపోతాయి. ఇనుప ఖనిజం తవ్వడానికి టాటా కంపెనీ, ఎస్సార్ కంపెనీతో ఒప్పందాలు చేసుకొంది ప్రభుత్వం.

ఈ నేపథ్యంలో అంటే కార్పొరేట్, బహుళజాతి సంస్థలు ఖనిజాలున్న భూమిని తమ సొంత జాగీర్లుగా మార్చుకొని వేలమంది ఆదిమవాసులను వారి భూముల నుంచి తొలగిస్తుంటే, వారి హక్కులను రక్షించడానికి, వారికి తోడునీడగా నిలవడానికి మావోయిస్టులు నడుం బిగించారు. రెండో వైపు కార్పొరేట్, బహుళజాతి సంస్థల హక్కుల రక్షణకు ప్రభుత్వం సమాయత్తం కావడంతో ఉద్యమ జ్వాలలు రగులుకొన్నాయి. ప్రజా యుద్ధం ఎంత బలీయంగా తయారైందంటే ఒక సందర్భంలో సైనిక బలగాలను ఈ రాష్ట్రానికి పంపడానికి ప్రయత్నించింది కాని సైనికాధికారులు పౌర సంబంధాల విషయంలో తాము తలదూర్చబోమని అభ్యర్థనను నిరాకరించారు. చిదంబరం హోంశాఖ మంత్రిగా ఉన్నప్పుడు మావోయిస్టుల పనిపడతానని చెప్పి చేతులు కాల్చుకొన్నాడు. 1967లో నక్సలైట్ల పేరుతో ఈ ప్రజా తిరుగుబాటు ప్రారంభమై 2013 వచ్చే సరికి రెండు వైపులా కొన్ని వందల ప్రాణాలు పోయాయి. ఆ రాష్ట్రంలో మావోయిస్టులు దుర్భేద్యమైన కోటను నిర్మించుకొన్నారు. ప్రధానిని, సోనియాను పరుగులు తీయించారు. ఉద్యమం కొన్ని రాష్ట్రాలకు విస్తరించింది. కోట్ల రూపాయల కుమ్మరించారు. ప్రభుత్వం ఓడిపోతూనే ఉంది. ఆదివాసుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ప్రభుత్వం తన బలగాలతో ఈ సమస్యను పరిష్కరించ పూనడం వృథా ప్రయాస అని మేధావులు, ప్రజా సంస్థలు సుద్దులు చెపుతూనే ఉన్నాయి. ప్రభుత్వం, మావోయిస్టులు తమ వ్యూహాల గురించి పునరాలోచించుకోవాలి. ఆదివాసుల పునరావాస, తదితర సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ఆ వ్యూహాలు రచించుకోవాలి.

(రచయిత వీక్షణం గౌరవ సంపాదకులు) వీ

స్థానిక వనరులు స్థానికులకే దక్కాలి

***అభివృద్ధి, ప్రజలకు ఉపాధి అంటూ స్థానిక వనరులను కొల్లగొట్టి, వాటిని తమ అనుయాయులకు, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్న పాలకుల నిరంకుశ విధానాలను విశ్లేషిస్తున్నారు* పి. వరలక్ష్మి**

'బయ్యారం ఉక్కు – తెలంగాణ హక్కు' అనే నినాదంలో ప్రాంతీయ ఆకాంక్షలతో పాటు స్థానిక సంపద, స్థానికులకే దక్కాలనే ప్రజాస్వామిక విలువ ఉంది. దీనిని ప్రాంతీయ అసమానతలపై పోరాటంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజలు సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల్లో, స్వావలంబన, స్వయం నిర్ణయాధికార లక్ష్యాల్లో చాటుతున్నారు. దోపిడి, అసమ అభివృద్ధి ఆధారంగా నడుస్తున్న వ్యవస్థపై మౌలిక ప్రశ్న ఇందులో ఉంది. పెట్టుబడి దాని విస్తరణకు చవకగా ముడిసరుకులు దొరికే ప్రాంతాలను, వాటిని మార్కెట్ చేసుకోడానికి అనువైన కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటుంది. అట్లా చవకగా దొరికే వనరుల కోసమైతేనేమి, భూముల కోసమైతేనేమి వలసలు, అంతర్గత వలసలు సాధారణ మవుతాయి. కోస్తా ప్రాంతాల నుండి వ్యాపార, పెట్టుబడిదారీ వర్గాలు తెలంగాణలో ఎన్నో అనుకూలతలు చూశారు. ఆ తర్వాత పరిణామాలు కొత్తగా చెప్పనక్కరలేదు. తెలంగాణ ఉద్యమంలో సాంస్కృతిక అంశాలున్నా కీలకంగా అది అసమ అభివృద్ధిని, వనరుల దోపిడిని ప్రశ్నిస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రాయలసీమలో దీనికి భిన్నమైన స్థితి ఉంది. రెండు ప్రాంతాలూ అనేక హామీల ఉల్లంఘనలకు గురైనాయి. అయితే రాయలసీమలో బైటి నుండి పెట్టుబడి రాలేదు. (అందుకు అనుకూలమైన స్థితీ లేదు.) పెట్టుబడిదారులు అభివృద్ధి కాలేదు. ఇక్కడ భూస్వామ్య భావజాలం పునాదిపై ఎదిగి వచ్చిన నాయకత్వం, భూమిని, గనులను కొల్లగొట్టి అమ్ముకునే ఒక లంపెన్ దళారీ వర్గం అభివృద్ధి చెందింది. అది రాయలసీమకు గుదిబండగా మారింది. రాష్ట్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పై వర్గం నుండి ఎదిగి వచ్చిన రాయలసీమవాళ్లే ఉంటారు. రాయలసీమ సాంఘిక, రాజకీయార్థిక రంగాలన్నీ వీళ్ల అధీనంలో ఉంటాయి. ఇక్కడి ఫ్యూడల్ పునాదులను కాపాడుకుంటూ వీళ్లు రాష్ట్ర స్థాయిలో వ్యవహారాలు నడుపుతారు. కోస్తా ప్రాంతపు నాయకులకు పూర్తి అనుకూలంగా ఉండే వీళ్లవల్ల రాయలసీమకు మరింత నష్టమే జరిగింది.

రాయలసీమ అభివృద్ధి కోసం జరిగిన ఉద్యమాలు ముఠా నాయకులకు సోపానాలుగా మారాయి. అట్లా ఈ ప్రాంతం నుండి ప్రామిసింగ్ లీడర్‌గా ఎదిగి వచ్చిన వై.ఎస్. రాజశేఖరరెడ్డి అయిదేళ్లూ చాలా హడావుడి చేశాడు. అందులో బ్రాహ్మణీ ఉక్కు పరిశ్రమ స్థాపన ఒకటి. దాని చుట్టూ ఆయన స్వర్గమే చూపించాడు. అది ఎంతగా ఖనిజాన్ని కొల్లగొట్టడానికి కారణమైందో ఇప్పుడు అదే ఖనిజ సంపదను ఇక్కడే వినియోగంలోకి తేవాలనే డిమాండును అంత బలంగా ముందుకు తీసుకొచ్చింది.

ఫ్యాక్షన్ రక్తపు మడుగుగా ప్రసిద్ధికెక్కిన జమ్మలమడుగు పారిశ్రామిక కేంద్రంగా తన తలరాత మార్చుకోబోతోందని జమ్మలమడుగే కాదు, 'మన' ముఖ్యమంత్రి కడప జిల్లా రూపమే మారుస్తాడని ఆనాడు ప్రజా ప్రతినిధులన్నారు. అనుచరగణం కేరింతలు, జనం చప్పట్ల మధ్య అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్‌లో సుపుత్ర పరివార సమేతంగా జమ్మలమడుగులో అడుగు పెట్టి ఎన్నెన్నో వాగ్దానాలు చేసి వెళ్లారు. 1.7 మిలియన్ టన్నుల భారీ సామర్థ్యంతో నిర్మించబోయే భారీ ఉక్కు ఫ్యాక్టరీ, ఒక పెద్ద విమానాశ్రయం వస్తుందని, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు మాదిరి ఇక్కడ విమానాలొచ్చి దిగుతాయని, లక్ష మందికి ఉపాధి కల్పించబడుతుందని అర'చేయి'లో అన్నీ చూపించారు. అన్నట్లుగానే చకచకా పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభమయ్యి అవి కొనసాగుతూనే వచ్చాయిగాని ఫ్యాక్టరీ నిర్మాణం అప్పుడప్పుడే పూర్తయ్యేలా కనిపించలేదు. ఇంకో సంవత్సరంలో.., ఇంక కొద్ది నెలల్లో.., అంటూ పత్రికల్లో ప్రకటిస్తూ వచ్చారు. భూసేకరణ దగ్గరి నుండి ప్రహరీగోడ నిర్మాణం, మైలవరం నీళ్ల మళ్లింపు వంటి అనేక విషయాల్లో నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఈగ వాలనివ్వలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు బ్రాహ్మణి స్టీల్స్ అధినేత గాలి జనార్దనరెడ్డి అంగరక్షకుల్లా వ్యవహరించారు. బాలగోపాల్ వంటి పౌరహక్కుల కార్యకర్తలు, ప్రజాసంఘాలు రూల్సు మాట్లాడితే, ప్రభుత్వం, అధికారులు ఆయన కోసం ఏకంగా రూల్సు మార్చి చూపించారు.

ఇంత హంగామా చేసి నాటకం రక్తి కట్టిస్తూ గాలి జనార్దనరెడ్డి మాత్రం ఫ్యాక్టరీ కోసమని లీజుకు తీసుకున్న ఇనుప ఖనిజం గనులను దర్జాగా దిగమింగేసి కలిసిరాని కాలంలో జైలుకెళ్లాకగాని బ్రాహ్మణి స్టీల్స్ అనేది ఒక కల్పన అని, ఇనుప ఖనిజాన్ని తెగనమ్ముకోవడం కోసం వైఎస్ సహకారంతో దాన్ని సృష్టించారని అర్థం కాలేదు. 2007లో బ్రాహ్మణి ఉక్కు పరిశ్రమ కోసం ప్రభుత్వం 10,760 ఎకరాల భూమిని కేటాయించినప్పటి నుండి వరుసగా జరిగిన కుంభకోణాలు బైటికి వచ్చాయి. రు. 20,000 కోట్ల విలువైన కాప్టివ్ స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించిన భూమితో పాటు ఇంకో 4000 ఎకరాలు ఇక్కడే నిర్మాణమయ్యే విమానాశ్రయం కోసం కేటాయిస్తున్నట్లు అప్పటి ముఖ్యమంత్రి ఆనాడు పెద్ద సభ పెట్టి మరీ ప్రకటించాడు. ఈ నాలుగువేల ఎకరాలను కూడ విమానాశ్రయం కోసం 'అభివృద్ధి' చేసేందుకు గాలి జనార్దనరెడ్డికే ఇచ్చారు. సేకరించిన భూములకు ఎకరానికి రు. 18,500 లెక్కన ప్రభుత్వం నష్ట పరిహారం ప్రకటించింది.

18 కోట్ల రూపాయలతో భూములు కొని దాన్ని చూపించి గాలి జనార్దనరెడ్డి 350 కోట్ల రూపాయల బ్యాంకు రుణం పొందాడు. ఇనుప ఖనిజం గనులు తవ్వడానికి కాంట్రాక్టు ఇచ్చేటప్పుడు ఆ గనులు క్యాప్టివ్ యూనిట్ అని చెప్పి వేరే ఎవ్వరినీ పోటీకి రానివ్వలేదు. క్యాప్టివ్ యూనిట్ అంటే అది ఫ్యాక్టరీలో ఉత్పత్తి కోసమే వాడాలి తప్ప బైట అమ్ముకోడానికి వీల్లేదు. తీరా వాటిని గాలి జనార్దనరెడ్డికి కేటాయించాక ఖనిజాన్ని ఎక్కడైనా అమ్ముకోడానికి పర్మిషన్ ఇచ్చారు. ఎప్పటి నుండో ఉన్న ప్రభుత్వరంగ సంస్థ అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా కాదని ఇంకా నిర్మాణంలో కూడ లేని బ్రాహ్మణికి గనులు కేటాయించడం ఆనాడు రాయలసీమ అభివృద్ధికేనని చెప్పారు. రాయలసీమ భూమిని, గనులను కబ్జాదారులకిచ్చి రాయలసీమను రాయలసీమ నాయకులే వంచించారు. ఇదేమీ కొత్త కాదు. ఇక్కడ రాజకీయాధిపత్యం భూమి మీద, భూగర్భ సంపద మీద ఎంతగా పెరుగుతూ వచ్చిందో ప్రజలు అంతకంతకూ దారిద్ర్యంలోకి నెట్టబడుతూ వచ్చారు.

సిబిఐ విచారణలో 'ఎంత తవ్వారు, ఎవరికి అమ్మారు, ట్రాన్స్‌పోర్టు పర్మిట్లు ఎవరిచ్చారు' ఏం తేలింది, ఎంతమంది గుట్టుబైటపడింది అన్న విషయాలు అలా ఉంచితే ఈ కేసుల హడావుడి కన్నా ముందు గడిచిన నాలుగేళ్లలో ఇనుప ఖనిజం రవాణా ఎన్ని ప్రాణాలను బలిగొన్నదో లెక్కే లేదు. దారి పొడవునా మనుషులు, పశువుల ప్రాణాలు గాల్లో కలిపేస్తూ, రోడ్లను నాశనం చేస్తూ, ఎర్రటి దుమ్మును ఎగజిమ్ముతూ గాలి జనార్దనరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి అనుయాయుల వాహనాలు ఖనిజాన్ని ఓడరేవుకు చేర్చాయి. క్రిష్ణపట్నం రేవు ప్రాంతాన్ని కలుషితం చేస్తూ దర్జాగా ఇనుప ఖనిజాన్ని దేశం దాటించి అమ్ముకున్నారు. దేనికీ, ఎవరికీ జవాబు పడనవసరం లేదన్నట్లే వ్యవహారాలు నడిపారు. అడ్డుచెప్పిన అధికారులకు ప్రాణం మీదికి తెచ్చుకున్నంత పనైంది. కొండ దేవతను కొట్టి ఏడుకొండల వాడికి బంగారు కిరీటం చేయించగల ఘనులు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను మేనేజ్ చేయగలిగారు. ఓబుళాపురం గనుల దగ్గర రాష్ట్రాల సరిహద్దుల గొడవ వచ్చి అవి సీజ్ చేసే దాకా ఇది నడిచింది. అది కూడా రాజశేఖరరెడ్డి హఠాన్మరణం తర్వాత ఆయన వారసుని దెబ్బకు కేంద్ర ప్రభుత్వానికి తలనొప్పి వచ్చేదాకా.

సిబిఐ విచారణ కూడ ఏదో శత్రు దేశంలో గూఢచర్యం లాగా అత్యంత రహస్యంగా, ఉపగ్రహ చిత్రాలతో చేయవలసి రావడం కర్ణాటక నుండి కడప దాకా విస్తరించి ఉన్న ఫ్యాక్షన్ కారిడార్ పవరేంటో చెప్పకనే చెప్పింది.

ఇదంతా అలా ఉంచితే ఇప్పుడు బ్రాహ్మణి పరిశ్రమ కోసం సేకరించిన భూముల్ని, పాక్షికంగా నిర్మాణమైన కట్టడాలను ఏం చేయబోతున్నారనేది రాయలసీమ ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పవలసిన ప్రశ్న. బ్రాహ్మణి ఇండస్ట్రీస్‌కు కేటాయించిన భూముల్నైతే రద్దుచేశారు. వస్తుందనుకున్న పరిశ్రమ పోయినట్లేనా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో పారిశ్రామిక కేంద్రాల కోసం ప్రభుత్వ భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే రాయలసీమలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. 'పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించండి మొర్రో అన్న చోట ప్రభుత్వాలు పలకవు. మీ అభివృద్ధి మాకొద్దు, మా వ్యవసాయం మేము చేసుకుంటాం అనేచోట మాత్రం బలవంతంగా పరిశ్రమలు పెడుతున్నారేమిటి' అని ఇక్కడి ప్రజలు అడుగుతారు. యురేనియం ప్లాంటును పులివెందుల ప్రజలపై బలవంతంగా రుద్దిన సంగతి చెపుతున్నారు. విషయం ఏమిటంటే అసలు అభివృద్ధి ప్రజల కోసం కాదు. కాలువలు తవ్వేది కాంట్రాక్టర్ల కోసం, భూములు సేకరించేది రియల్ ఎస్టేట్ కోసం, పరిశ్రమలు స్థాపించేది బహుళాతి కంపెనీల కోసం అనేదే.

తరతరాలుగా కరువుతో అల్లాడుతున్న అనంతపురం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చి అభివృద్ధి చేయాల్సిన పాలకులు ఆ పని చేయకపోగా, లక్షల కోట్లు విలువజేసే ప్రకృతి సంపదను అప్పనంగా అయినవాళ్లకు కట్టబెట్టేసి అడవులు, మైదానాలు, కొండలు, గుట్టలు నాశనం చేశారు. గాలి జనార్దనరెడ్డిని శిక్షించినా(?), ఆయన అక్రమ సంపాదనను స్వాధీనం చేసుకున్నా ధ్వంసమైన ప్రకృతి తిరిగి రాదు. ప్రకృతి ఎంతగా దెబ్బ తింటుందో దాని చుట్టూ ఉండే వాతావరణం, ప్రజల జీవితాలు అంతగా దెబ్బతింటాయి. ఈ ప్రజలకు ఏవిధంగా పరిహారం చెల్లిస్తుందో ప్రభుత్వం చెప్పదు. అది చెప్పలేదు కూడా. ఎందుకంటే దాని అభివృద్ధి ప్రణాళికలో వీటికి సమాధానాలుండవు. చివరికి ఏ ఫ్యాక్టరీ కోసమైతే కాప్టివ్ మైన్స్ కేటాయించారో ఆ ఫ్యాక్టరీ నిర్మాణం కాలేదు. ప్రజలు భూములూ కోల్పోయారు, ప్రకృతి సంపదనూ నష్టపోయారు. 'ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, అనంతపురం మైనింగ్ కంపెనీ, ఇంకా 3,4 కంపెనీలకు గనులను కేటాయించడంలో కాబినెట్ పాత్ర లేదు, అది వైఎస్ తీసుకున్న నిర్ణయమేనని' ఆ మధ్య కడప జిల్లాకే చెందిన మంత్రి చేత ప్రకటన ఇప్పించి, ఇప్పుడు భూకేటాయింపులు రద్దుచేసి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. బ్రాహ్మణి స్టీల్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేయాలని ఒకవైపు రాయలసీమ ప్రజలు అడుగుతుంటే ఇప్పుడు అటు బయ్యారం గనులు, ఇటు ఓబుళాపురం గనులు (రాజశేఖరరెడ్డి అల్లుడు, మిత్రుడు దోచుకోగా మిగిలినవి) విశాఖకు తరలించాలని చూస్తోంది ప్రభుత్వం. తెలంగాణ ఉద్యమం స్థానిక వనరులు స్థానికులకే దక్కాలనే విలువను, పోరాట నినాదాన్ని సమున్నతంగా నిలిపింది. దీనిని ఈ రోజు రాయలసీమ ప్రజలూ అందుకుంటున్నారు. నిజానికి బ్రాహ్మణి ఉక్కు రాయలసీమ హక్కు అనే నినాదం తీసుకొని ఏడాది క్రితమే రాయలసీమ విద్యార్థి వేదిక ముందుకు రాగా, బ్రాహ్మణి స్థానంలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించాలని వామపక్ష ప్రజాసంఘాలు ఆందోళనలు చేశాయి. ఇప్పుడది రాయలసీమ రాష్ట్ర నినాదంతో పాటుగా విస్తరిస్తున్నది. రాయలసీమ నాలుగు జిల్లాల ప్రజలు నాలుగు దిక్కులు వలసపోయే దౌర్భాగ్యం పోవాలంటే నీళ్లు, నిధులు, అభివృద్ధిలో న్యాయమైన వాటా దక్కాలని రాయలసీమ కూడా గొంతెత్తుతున్నది.

(రచయిత విప్లవ రచయితల సంఘం కార్యదర్శి) వీ

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి. – సం.

దర్భాఘాట్ ఘటన - విభిన్న స్పందనలు

***ఛత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ నాయకులపై మావోయిస్టులు చేసిన దాడి ఎవరెవరి నుంచి ఎటువంటి స్పందనలకు దారి తీసిందో విశ్లేషిస్తున్నారు* ఎడ్ల పోచయ్య**

ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా దర్భాఘాట్ దగ్గర మే 25 సాయంకాలం కాంగ్రెస్ పార్టీ వాహన శ్రేణి మీద మావోయిస్టు గెరిల్లాలు దాడిచేసిన ఘటనలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్, సాల్వాజుడుం నాయకుడు మహేంద్ర కర్మలతో సహా దాదాపు ముప్పై మంది కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసులు, వాహనాల డ్రైవర్లు, ఇతరులు చనిపోయారు. ఆ దాడిలో గాయపడిన కేంద్ర మాజీమంత్రి విద్యాచరణ్ శుక్లా ఆ తర్వాత పది రోజులకు చనిపోయారు. మృతుల సంఖ్య వల్ల, ఘటన జరిగిన తీరు వల్ల, విభిన్న రాజకీయ పార్టీల కీచులాటల వల్ల ఈ ఘటనకు చాల ఎక్కువ ప్రచారం దొరికింది. ఘటన జరిగినప్పుడు అక్కడ ఒక్క విలేఖరి కూడ ఉండే అవకాశం లేకపోయినా, పత్రికలలో చిలవలు పలవలుగా, సాక్షాత్తూ అక్కడ ఉండి చూసి రాసినట్టుగా వార్తాకథనాలు వచ్చాయి. ఖండన మండనలు, మావోయిస్టుల మీద విమర్శలు, పార్టీల పరస్పర ఆరోపణలు, భద్రతా వైఫల్యాల మీద విమర్శలు, కుట్ర సిద్ధాంతాలు, ఎవరు పాల్గొన్నారనే ఊహాగానాలు, మావోయిస్టులను నిర్మూలించాలనే పెడబొబ్బలు పెద్ద ఎత్తున వెల్లువెత్తాయి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, అధికార కూటమి యుపిఎ అధ్యక్షురాలు, అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ ఘటనను ఖండించారు. ప్రధాని, యుపిఎ అధ్యక్షురాలు హుటాహుటిన బాధితులను పరామర్శించ డానికి వెళ్లారు. అన్ని ప్రధాన స్రవంతి పత్రికలు సంపాదకీయాలు రాశాయి. అతి ఎక్కువ సంపాదకీయాలు ఈ ఘటనను ఖండించాయి. మావోయిస్టుల మీద కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ను మాజీ పోలీసు అధికారులు, వ్యవస్థా నిర్వాహకులు మళ్లీ ఒకసారి ముందుకు తెచ్చారు. కొంతమంది స్వతంత్ర మేధావులు, మానవహక్కుల ఉద్యమకారులు కూడ ఈ ఘటనను ఖండించారు. సాల్వాజుడుం చేసిన అక్రమాల గురించి తెలిసిన మేధావులు కొందరు ఈ దాడిలో మహేంద్ర కర్మకు శిక్ష పడడాన్ని పరోక్షంగానైనా సమర్థిస్తూనే మిగిలిన ప్రాణాలు పోవడాన్ని ఖండించారు.

మరొకవంక భారత విప్లవోద్యమ చరిత్రలో ఇది ఒక చరిత్రాత్మక సంఘటన అని కొందరు అభివర్ణించారు. నిజంగానే అది ఎన్నో స్థాయిలలో గుర్తించదగిన సంఘటన. భారత విప్లవోద్యమ చరిత్రలో ఇంత పకడ్బందీగా, ఇంత పెద్దఎత్తున జరిగిన సంఘటనలు చాల తక్కువ. భారత పాలకవర్గాల మీద ప్రత్యక్షంగా జరిగిన దాడులలో ఇంతగా విజయవంతమైన సంఘటనలు తక్కువ. కేంద్ర స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను కీలకమైన నేతలు ఇంతమంది ఒకే ఘటనలో చనిపోయిన ఘటనలు అసలు లేవనే చెప్పాలి. దాదాపు ముప్పై వాహనాలు ఉన్న వాహనశ్రేణిలో పెద్ద సంఖ్యలోనే సాయుధ భద్రతా బలగాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ మావోయిస్టులు తమవైపు ఏ నష్టమూ లేకుండా ఈ దాడిని నిర్వహించారు. ఈ దాడిలో ఎక్కువమంది ఆదివాసులు, మహిళలు పాల్గొన్నారని వస్తున్న వార్తలు విప్లవోద్యమంలో మహిళల కీలకస్థానానికి, ఆదివాసుల ప్రధాన పాత్రకు అద్దం పట్టాయి.

ఇంత పరస్పర వ్యతిరేకమైన ప్రతిస్పందనలకు కారణమైన దాడిని, ఆ దాడికి ప్రతిస్పందనలను జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది. ఏ సమాజంలోనైనా బహిరంగంగానో అంతర్గతంగానో, ప్రత్యక్షంగానో పరోక్షంగానో వర్గపోరాటం జరుగుతూనే ఉంటుంది. ఆ వర్గపోరాటానికి, వర్గ భావజాలానికి ప్రతిఫలనంగానే ప్రతి మనిషి ప్రతిస్పందనలూ ఉంటాయి. కాకపోతే వర్గపోరాటం తీవ్రంగా లేని సమయంలో, వర్గదృక్పథం స్పష్టంగా లేని మనుషులలో, ఏవో భ్రమలకు, తప్పుడు చైతన్యానికి గురైన మనుషులలో వర్గేతర అభిప్రాయాలు కూడ ఉండడం, వారి ప్రతిస్పందనలలో గందరగోళం ఉండడం కూడ కనబడుతుంది. దర్భాఘాట్ సంఘటన పట్ల ప్రతిస్పందనలను బట్టి ఇవాళ మన సమాజంలోని వర్గపోరాట స్థితిని, ఆ వర్గపోరాటంలో ఆయా వ్యక్తులు తీసుకుంటున్న వైఖరులను అంచనా కట్టవచ్చు.

దాడి జరిగిన వెంటనే వెలువడిన వార్తల దగ్గర ప్రారంభిద్దాం. వార్తను వార్తగా తటస్థంగా రాయవలసిన పత్రికలు, చూపవలసిన ఛానళ్లు సంపాదకుల మీద, యాజమాన్యం మీద ఉన్న ప్రభావాల వల్ల ఒక పక్షం తీసుకుని వార్తలు వెలువరించాయి. వార్తలు రాసిన, చూపిన, వ్యాఖ్యానించిన పద్ధతిలో ఈ దాడి పట్ల ఆయా వార్తాసంస్థల అభిప్రాయ మేమిటో బయటపడింది. తెలుగులో కొన్ని పత్రికలు 'భీకర దాడి', 'మావోల పంజా', 'కర్మ కాల్చివేత', 'మహేంద్ర కర్మ హతం' అని తటస్థ శీర్షికలు పెట్టగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) దినపత్రిక ప్రజాశక్తి మాత్రం 'మావోయిస్టుల ఘాతుకం' అని పతాకశీర్షిక పెట్టింది. ఇక వార్తారచనలో అన్ని పత్రికలూ కూడ జరిగినదాన్ని వివరించడం కన్న ఎక్కువగా సంచలనాత్మకతకు ప్రాధాన్యత ఇచ్చాయి.

అక్కడ ఏమి జరిగి ఉంటుందో చూసిన విలేఖరులు లేకపోయినా, ప్రత్యక్ష సాక్షులు చెప్పేవాటిలో భయం వల్ల, దిగ్భ్రాంతివల్ల అతిశయోక్తులు, అసమగ్రతలు ఉండే అవకాశం ఉన్నా, మర్నాడో, ఆ తర్వాతో అక్కడికి చేరిన పత్రికా ప్రతినిధులతో సాక్షులో, సాక్షులు కానివారో తమ ఇష్టం వచ్చిన విషయాలు చెప్పినా, ఎటువంటి నిజానిజాల పరిశీలన లేకుండానే అన్ని పత్రికలూ, చానళ్లూ జరిగింది చూసినట్టే రాశాయి, చెప్పాయి. దాడిలో వంద నుంచి 1200 మంది మావోయిస్టులు పాల్గొన్నారని, కొందరిని కిడ్నాప్ చేశారని, ఎత్తుకుపోయి బందీలుగా పెట్టుకున్న వారిని ఆ తర్వాత కాల్చారని రాశాయి. ఒకవంక నందకుమార్

పటేల్ ను, ఆయన కొడుకును అపహరించుకు పోయారని రాశారు. అంటే వాళ్ల వెంట గెరిల్లాలు తప్ప ఇతరులు ఉండే అవకాశం లేదు. కాని, మళ్లీ చూసినట్టుగా తనను చంపినా, కొడుకును వదిలిపెట్టమని నందకుమార్ పటేల్ అడిగాడని, కాని మావోయిస్టులు తండ్రి ముందరే కొడుకు తల నరికారని రాశారు. తనను చంపి మిగిలినవాళ్లను వదిలిపెట్టమని మహేంద్ర కర్మ అడిగాడని, కాని మావోయిస్టులు వినలేదని, కర్మను 78 చోట్ల పొడిచారని, మృతదేహం మీద నాట్యం చేశారని రాశారు. ఈ వార్తల మీద ఆధారపడి మావోయిస్టు గెరిల్లాలు ఎంత రక్తపిపాసులో, హింసోన్మాదులో అర్థం అవుతున్నదని మాజీ పోలీసు అధికారి కెపిఎస్ గిల్ వ్యాఖ్యానించారు. ఈ దాడికి వ్యూహరచన ఎవరు చేసి ఉండవచ్చునో, దాడిలో ఎవరు పాల్గొని ఉండవచ్చునో కూడ పత్రికలూ ఛానళ్లూ చాల ఊహాగానాలు చేశాయి. వంద మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసులు ఉన్న వాహనాల వరుస మీద మావోయిస్టులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని పత్రికలు, ఛానళ్లు అన్నాయి. కాని ఒకవైపు లోయ, మరొకవైపు దట్టమైన అడవి ఉండి, రోడ్డు తెగిపోయి ఉన్నచోట, మావోయిస్టులకు పూర్తి ఆధిపత్యం ఉన్నచోట నిజంగానే విచక్షణా రహితంగా కాల్పులు జరిగి ఉంటే మృతుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేది. మావోయిస్టు గెరిల్లాలు నిర్దిష్టంగా పేర్లు అడుగుతూ తమ లక్ష్యాల కోసం వెతికారని, కొందరు ప్రముఖులను కూడ వదిలేశారని ప్రత్యక్ష సాక్షుల కథనాలలోనే బయటపడింది. తమ లక్ష్యం కాని వారు, 'కొద్ది మంది నిర్దోషులు, మాకు శత్రువులు కాని కింది స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు కూడ ప్రాణాలు కోల్పోయారు, గాయపడ్డారు. వీళ్ల మృతి పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ విచారం ప్రకటిస్తున్నది. వాళ్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది' అని ఘటనానంతర ప్రకటనలో మావోయిస్టులు పేర్కొన్నారంటే విచక్షణా రహితంగా కాల్పులు జరపడం వారి ఉద్దేశం కాదని అర్థమవుతుంది. గాయాలు తగిలిన తమకు మావోయిస్టులు నీరు, ప్రాథమిక వైద్య సహాయం అందించారని రాయపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు చెప్పారని టైమ్స్ ఆఫ్ ఇండియా రాసింది.

ఇక ఘటన తర్వాత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి వంటి ప్రభుత్వాధినేతలందరూ ఈ దాడిని ఖండించారు. 'మన ప్రజాస్వామిక పాలనలో హింసకు స్థానం లేదు. ఇటువంటి చర్యలతో దేశం భయపడదు' అని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అన్నారు. 'ఈ నేరం చేసిన వారిని వెంటాడి, శిక్ష విధించదానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది' అని ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. 'ఇది ఒకరి మీద మరొకరు ఆరోపణలు విసురుకోవడానికి, రాజకీయ వివాదానికి సమయం కాదు. ఇది అధికారపక్షం, ప్రతిపక్షం అని మాట్లాడుకునే సమయం కాదు. అందరమూ సమైక్యంగా ఈ ఎర్ర బీభత్సాన్ని ఎదిరించడానికి చేతులు కలిపి ఈ దురంతానికి తగిన జవాబు చెప్పాలి' అని ముఖ్యమంత్రి రమణ్ సింగ్ అన్నారు.

ఘటన జరిగిన వెంటనే రాజకీయ పార్టీలన్నీ స్పందించాయి. పార్లమెంటరీ రాజకీయ పార్టీలన్నిటి స్పందనా ఒకేరకంగా ఉండడం చాల సహజంగానూ, వాటి అసలు స్వభావానికి సూచికగానూ ఉంది. ఈ దాడిలో తమ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, పదిహేను మంది కార్యకర్తలు మరణించినందువల్ల కాంగ్రెస్ పార్టీ దాడిని తీవ్రంగా ఖండించడం సహజమే. ఈ దాడి పాశవికమైనదని, ప్రజాస్వామ్య విలువలపై దాడి అని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. మావోయిస్టులకు ప్రజాస్వామ్యంలో విశ్వాసం లేదని ఈ దాడి రుజువు చేసిందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేశ్ అన్నారు. మతతత్వ భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది గనుక, భావజాల పరంగా మావోయిస్టులకు బద్ధ విరోధి గనుక దాని స్పందన కూడ ఆశ్చర్యం లేదు. భాజపా అధ్యక్షుడు రాజ్ నాథ్ సింగ్, నాయకులు ఎల్ కె అద్వానీ, నరేంద్ర మోడీ నక్సలైట్లను ఏరివేయడంలో అన్ని పార్టీల మధ్య ఐక్యత కావాలని అన్నారు. ఇలా ఒకవైపు ఐక్యత గురించి మాట్లాడుతూనే రెండు పార్టీలూ పరస్పరం విమర్శలు గుప్పించుకున్నాయి. రెండు పార్టీలూ కూడ ఈ ఘటన భద్రతా వైఫల్య ఫలితమని అన్నాయి. కాకపోతే భద్రతా బాధ్యత మీదంటే మీదని వాదులాడుకున్నారు. మావోయిస్టులతో కలిసి కుట్ర చేశారని ఒకరిమీద ఒకరు ఆరోపణలు విసురుకున్నారు. భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ నడిపే పత్రిక జనసందేశ్ లో కాంగ్రెస్ అగ్రనాయకత్వానికీ, మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వానికీ సంబంధాలున్నాయనీ, రాష్ట్రప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఈ దాడి జరిగిందనీ హాస్యాస్పదమైన ఆరోపణ చేశారు.

సాల్వా జుడుం పేరిట మహేంద్ర కర్మ జరిపిన అకృత్యాల గురించి, దండకారణ్యంలో విలువైన ఖనిజ నిలువలను బహుళజాతిసంస్థలకు, కార్పొరేట్లకు అప్పగించే వ్యూహంలో భాగంగా సాగుతున్న ఆపరేషన్ గ్రీన్ హంట్ అత్యాచారాల గురించి సంపూర్ణంగా తెలిసిన పార్టీలు కూడ ఆ విషయం ప్రస్తావనే లేకుండా దాడి ఘాతుకం అని ఖండించాయి. ఉదాహరణకు దాడి జరిగిన కొన్ని గంటలలోపే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్రకమిటీ సభ్యురాలు బృందా కారత్ ఈ దాడి తీవ్రంగా గర్హనీయమని, నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడి మావోయిస్టుల హింసా, భయోత్పాత రాజకీయాలకు చిహ్నమని సిపిఐ (ఎం) పొలిట్ బ్యూరో వ్యాఖ్యానించింది. భారత కమ్యూనిస్టు పార్టీ మహేంద్ర కర్మ గురించీ, సాల్వాజుడుం హింసా రాజకీయాల గురించీ ప్రస్తావిస్తూనే, 'కాని అవి హింసకూ, బీభత్సానికీ పాల్పడదానికి మావోయిస్టులకు హక్కు ఇవ్వవు. రాజకీయ ప్రత్యర్థుల పట్ల హింసా దౌర్జన్యాలు సరైనవి కావు' అని ప్రకటించింది.

పార్లమెంటరీ కమ్యూనిస్టుల వైఖరి అలా ఉండడం ఆశ్చర్యకరం కాదు గాని తమను తాము మావోయిస్టులమనీ, నక్సల్బరీ పంథాకు చెందినవారమనీ చెప్పుకునేవారు కూడ అదే విధంగా వ్యాఖ్యానించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ ఈ ఘటనను 'ప్రజాస్వామిక ఉద్యమాల నుంచీ, రాజకీయ వ్యక్తీకరణ నుంచీ దూరమైన సైనిక చర్య' గా అభివర్ణించి. సాల్వాజుడుం అత్యాచారాలను ప్రస్తావిస్తూనే 'ప్రతీకారం పేరుతో కూడ ఈ దాడి సమర్థనీయం కాదు' అని ప్రకటించింది. కె ఎన్ రామచంద్రన్ నాయకత్వంలోని సిపిఐ (ఎంఎల్) ఈ దాడి బాల్యచేష్ట అనీ, అరాచకచర్య అనీ ఖండించి, దీని వల్ల ఆదివాసుల మీద మరింత నిర్బంధాన్ని పెంచేందుకు ప్రభుత్వానికి సాకు దొరుకుతుందని వ్యాఖ్యానించింది.

ఈ ప్రకటనలకన్న ఆశ్చర్యకరమైనది 'మార్క్సిజం – లెనినిజం – మావోయిజం – ప్రచండ మార్గం ఈ యుగపు మార్క్సిజం' అని కొద్ది సంవత్సరాల కిందనే అభివర్ణించుకున్న ప్రచండ చేసిన ప్రకటన. అది నిజానికి ప్రకటన కూడ కాదు. యునైటెడ్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్) చైర్మన్ హోదాలో ప్రచండ భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి రాసిన వ్యక్తిగత సంతాప లేఖ. భారత

జాతీయ కాంగ్రెస్ నాయకులూ కార్యకర్తలూ ఇలా మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయినందుకు తమ పార్టీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తున్నదని, మృతుల కుటుంబాలకు తానూ తన పార్టీ సానుభూతి ప్రకటిస్తున్నామనీ, కాంగ్రెస్ ఈ దాడి నుంచి తేరుకుని భారత ప్రజల సంక్షేమానికి పునరంకితమవుతుందని ఆశిస్తున్నామనీ ప్రచండ రాశారు. 'ఏ సమస్యకైనా శాంతియుత పరిష్కారం సాధించడమే ప్రజాస్వామ్యపు సౌందర్యం' అని కూడ ఆయన రాశారు.

'చత్తీస్ గడ్ సంఘటన సిపిఐ (మావోయిస్టు) పై యుద్ధంలో ఒక మలుపు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమైక్యంగా, దీర్ఘకాలిక ప్రణాళికతో మావోయిస్టులపై దాడి చేసి వారిని నిర్మూలించాలి' అని చత్తీస్ గడ్ మాజీ డిజిపి విశ్వరంజన్ రాశారు. మాజీ పోలీసు అధికారులు, ప్రభుత్వ సలహాదారులు ప్రకాశ్ సింగ్, కె పి ఎస్ గిల్ లు మహేంద్ర కర్మనూ, సల్వా జుడుం సామర్థ్యాన్నీ, నందకుమార్ పటేల్, మహేంద్ర కర్మల వీరోచిత త్యాగాన్నీ పొగుడుతూ ప్రభుత్వాలు ఇంకా ఎక్కువ కఠిన చర్యలు తీసుకుని మావోయిస్టులను రూపుమాపాలని సలహాలు ఇచ్చారు.

ప్రజల పక్షం వహించినందుకు ఎవరు నిలదీస్తారో అని భయపడుతూ, కీలక సమయాలలో పాలకులకు అనుకూల ప్రకటనలు చేసే మానవహక్కుల, పౌరహక్కుల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు కూడ ఈ దాడిని మావోయిస్టుల హత్యా రాజకీయాలుగా, భయానక దాడిగా అభివర్ణించి ఖండించారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బందీలుగా ఉన్నవారిని చంపడం ఉద్దేశపూర్వక హత్య అని, అది పౌర, అంతర్జాతీయ యుద్ధ నియమాలకు వ్యతిరేకమని పాఠాలు చెప్పారు. అసలు ఒక రాజకీయ పార్టీని ఇలా లక్ష్యంగా చేసుకోవడమే తీవ్రంగా ఆందోళనకరమైనదన్నారు. దీనివల్ల నిర్బంధం ఇంకా పెరుగుతుందని హెచ్చరిస్తూ, అలా నిర్బంధం పెరిగి తమలోకి ఎక్కువమందిని ఆకర్షించుకోవడానికే మావోయిస్టులు ఈచర్య చేసి ఉంటారని కూడ అనుమానించి, ఆ వ్యూహం మరింత హీనమైనదని అన్నారు. ఇటువంటి ప్రకటనలు చేసిన వారిలో మేధా పాట్కర్ నుంచి పియుసిఎల్ నాయకుల దాకా అనేకులున్నారు.

జస్టిస్ రాజిందర్ సచార్ వంటి ప్రజాస్వామిక ఉద్యమాల మిత్రుడు కూడ ఈ ఘటన భారీ ఉన్మాదం అనీ, ఇది ఆదివాసుల ప్రయోజనాలను కూడ దెబ్బ తీస్తుందనీ వ్యాఖ్యానించారు. 'మావోయిస్టుల రాజకీయాలు కూడ వారు ఏ రాజకీయాల మీద పోరాడుతున్నామని చెపుతున్నారో వాటంత దుర్మార్గమైనవే. శాంతి, న్యాయాల కోసం జరిగే రాజకీయ పోరాటాలలో ప్రజాస్వామిక సంప్రదాయాలు ఉండాలని కోరుకునేవాళ్లందరూ మావోయిస్టుల రాజకీయాలను నిర్ద్వంద్వంగా ఖండించాలి' అని రాశారు. మావోయిస్టుల హింస రాజ్యహింసకు ప్రతిరూపం మాత్రమేనని, రెంటి మధ్య తేడా లేదని బిశ్వజిత్ రాయ్ రాశారు. రామచంద్ర గుహ, నందిని సుందర్, సుదీప్ చక్రవర్తి, అరూప్ కుమార్ సేన్ వంటి కొద్ది మంది వ్యాఖ్యాతలు మాత్రం ఘటనను, ఆ ఘటనలో అమాయకులు మరణించడాన్ని ఖండిస్తూనే, ఈ ఘటనను మహేంద్ర కర్మ, సల్వాజుడుం చేసిన నేరాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలని రాశారు.

సల్వాజుడుం అత్యాచారాల వల్ల దంతెవాడలో తన వనవాసి చేతనా ఆశ్రమం నుంచి పారిపోయి ఢిల్లీలో తలదాచుకుంటున్న గాంధేయవాది హిమాంశు కుమార్ మహేంద్ర కర్మ నేరాల గురించి ఎక్కువ ప్రస్తావించకుండా ఆయనతో, ఆయన కుటుంబంతో తన వ్యక్తిగత పరిచయాన్ని మాత్రం చెపుతూ నివాళి వ్యాసం రాశారు. దాని మీద 'ఒక నరహంతకుడికి ఒక గాంధేయ ప్రముఖుడు శ్రద్ధాంజలి ఘటిస్తున్న వేళ' అని సమర్ ఖండన రాశారు.

ఇన్ని రకాల విభిన్నమైన, పరస్పర వ్యతిరేకమైన, గందరగోళమైన ప్రతిస్పందనలు, వ్యాఖ్యానాలు వచ్చిన నేపథ్యంలో వీటిలో కొన్నిటి గురించి అయినా వివరంగా చూడాలి.

ఈ దాడికి కొన్ని తక్షణ ఫలితాలు, కొన్ని దీర్ఘకాలిక ఫలితాలు ఉన్నాయి. కొందరి ప్రాణాలు పోవడం. కొందరు గాయపడడం. కొంత ఆస్తినష్టం, ఒక రాజకీయ పార్టీ యంత్రాంగం దెబ్బతినడం తక్షణ ఫలితాలు కాగా ఆ ప్రాంతంలో అంతకు ముందు జరిగిన ఘటనల గురించి మళ్లీ ఒకసారి చర్చ జరగడం, ఆ ప్రాంతానికి వెళ్లడానికి పార్లమెంటరీ రాజకీయ పార్టీలు ఒకటికి రెండు సార్లు ఆలోచించడం, ఆ ప్రాంతం మీద మరింత క్రూర నిర్బంధం అమలు కావడం వంటి దీర్ఘకాలిక ఫలితాలు ఉండవచ్చు. కాని తక్షణంగానైనా, దీర్ఘకాలికంగానైనా ఈ ఘటన ప్రజాస్వామ్యానికి విఘాతం అవుతుందని వ్యాఖ్యానిస్తున్నవారు అసలు ప్రజాస్వామ్యమంటే ఏమని నిర్వచిస్తున్నారో పరిశీలించాలి. దోపిడీ, పీడనలు అమలు చేసేవారికి, వాటికి గురయ్యేవారికీ ఇద్దరికీ సమానమైన ప్రజాస్వామ్య నిర్వచనం ఉండదు. ఆ ప్రాంతంలోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి, అక్కడి నుంచి ఆదివాసులను, వారికి రక్షణగా నిలిచిన మావోయిస్టులను అక్కడినుంచి తొలగించాలని ఆలోచిస్తున్నవారు, పథకాలు రచిస్తున్నవారు, సైనిక, అర్ధసైనిక బలగాలను దింపుతున్నవారు ఒక పక్కన ఉన్నారు. తరతరాలుగా అక్కడ జీవనం సాగిస్తూ, తమ జల్ జంగల్ జమీన్ మీద మరొకరి అధికారం చెల్లదని శాస్త్రీయ అవగాహన లోకి ప్రవేశిస్తూ, బీజరూపంలో ప్రజాప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అనుసరిస్తున్నవారు మరొక పక్కన ఉన్నారు. వీరిలో ఎవరిది ప్రజాస్వామ్యం? ఏ ప్రజాస్వామ్యానికి ఇప్పుడు విఘాతం కలిగింది? ఒక రాజకీయ పార్టీగా కాంగ్రెస్ కు ప్రచార అవకాశాలు, పరివర్తన్ యాత్ర చేసుకునే అవకాశాలు దక్కడమే ప్రజాస్వామ్యం అనుకునేట్టయితే, ఆ ప్రజాస్వామ్యం ఎక్కడికి దారి తీస్తుంది? ఆ ప్రాంతాన్ని కొల్లగొట్టే, ఆ ప్రాంత వాసులను నిర్వాసితులను చేసే విధానాల ప్రచారాన్ని జరగనివ్వడమే ప్రజాస్వామ్యమా?

ఇక ఈ ఘటన ఘాతుకం అనీ, దురాగతం అనీ, హింసోన్మాదం అనీ వాపోతున్నవాళ్లు గత ఇరవై సంవత్సరాలుగా మహేంద్ర కర్మ నాయకత్వంలో సాగిన అత్యాచారాల గురించి ఏమంటారు? నంద కుమార్ పటేల్ మొదట మధ్యప్రదేశ్ హోంమంత్రిగా, ఆ తర్వాత చత్తీస్ గడ్ హోంమంత్రిగా ఆదివాసుల మీద సాగించిన దౌర్జన్య కాండ గురించి ఏమంటారు? అవి దురాగతాలే కాని, వాటికి ప్రతీకారం ఇలా తీర్చుకోవడం సరికాదు అని వాదించే శాంతిప్రియులు కూడ ఉన్నారు. కాని జన జాగరణ్ అభియాన్ ను ప్రజలు తిప్పి కొట్టిన తర్వాత, ఇనుప ఖనిజపు కార్పొరేట్ల నిధులతో మహేంద్ర కర్మ ప్రారంభించిన సల్వా జుడుం ఆదివాసులలోనే ఒక భాగాన్ని చీలదీసింది. వారికి డబ్బులు, ఆయుధాలు, విచ్చలవిడి అధికారం ఇచ్చి ఆదివాసి సమాజంలో అంతర్యుద్ధానికి కారణమైంది. దాదాపు ఏడువందల గూడాలను తగులబెట్టింది. వెయ్యి మందిని చంపింది. వందలాది మంది స్త్రీలపై అత్యాచారాలు చేసింది. రెండు లక్షల మందిని నిర్వాసితులను చేసింది.

ఇన్ని నేరాలకు ఈ ఏడు సంవత్సరాలలో వ్యవస్థలోని ఏ అంగం పరిష్కారం చూపింది?

నేరస్తులకు శిక్షల సంగతి అలా ఉంచి వారిమీద కనీస విచారణ జరగలేదు. పోలీసులు, ప్రభుత్వమూ సల్వాజుడుంకు అండగా నిలబడ్డాయి. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సల్వాజుడుంను రద్దు చేయమని తీర్పు ఇస్తే, ఆ మర్నాడే రాష్ట్ర ప్రభుత్వం సల్వాజుడుం ఎస్పీవోలందరికీ కొత్త ఉద్యోగాల బ్యాడ్జీలు తగిలించింది. మహేంద్ర కర్మ ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నా, అధికార భారతీయ జనతా పార్టీ సంపూర్ణ సహకారం అందించింది. సల్వాజుడుం అక్రమాల గురించి దేశ విదేశాల పత్రికలలో, ఛానళ్లలో ఎన్నో కథనాలు వచ్చినా వ్యవస్థలోని ఏ ఒక్క అంగమూ స్పందించ లేదు. దేశవ్యాప్తంగా కనీసం డజను నిజనిర్ధారణ బృందాలు సల్వాజుడుం దురాగతాల మీద నివేదికలు ప్రచురించాయి. ఏ ఒక్క నివేదికలోని ఏ ఒక్క అంశం మీదా విచారణ జరగలేదు, నేరస్తులకు శిక్షలు పడలేదు. సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘ నివేదికే సల్వాజుడుం దుర్మార్గాల గురించి నమోదు చేసింది. స్వయంగా కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు నియమించిన దూతల మీద సల్వాజుడుం దౌర్జన్యం చేస్తే ఏ చర్యా అమలు కాలేదు. ఇంక ప్రజలకు మిగిలిన పరిష్కార మార్గం ఏమైనా ఉందా? మహేంద్ర కర్మను ఒంటరిగా దొరికించుకుని శిక్ష విధించాలని, ఏ సంబంధం లేని ఇతరులకు హాని కలిగిస్తే ఎలా అని కూడ అడగవచ్చు. ఒక నరహంతకుడికి అత్యున్నత స్థాయి జడ్ రక్షణ కవచం ఏర్పాటు చేసి, ఎన్నికలకు ముందు పార్టీ ప్రధాన ప్రచారకుడిగా మార్చి, చుట్టూ వందలాది మందిని పెట్టిన వారిని అలా చేయడం ఉచితమా అని ప్రశ్నించాలి. నాలుగైదుసార్లు ఒంటరిగా దొరికించుకుని శిక్షించడానికి ప్రయత్నాలు విఫలమైన తర్వాతనే ఈ ఘటన జరిగిందని గుర్తించాలి.

ఇక భద్రతా వైఫల్యం అనేది కేవలం సాంకేతికమైన చర్చ. ఒక బడా నేరస్తుడిని వ్యవస్థలో ఏ అంగమూ శిక్షించకుండా అచ్చోసిన ఆంబోతులా వదిలిందనేది అసలు విషయం. ఆ ఆంబోతు చుట్టూ మరిన్ని భద్రతా వలయాలు ఉండవలసింది అని వాదించడమంటే నేరస్తుడికి శిక్ష పడనక్కరలేదని వాదించడమే అవుతుంది. నేరం చేశాడో లేదో రుజువు కాకపోయినా, నేరుగా ఒక్కరిని కూడ చంపకపోయినా అఫ్జల్ గురును ఉరి తీయవలసిందే అని పెడబొబ్బలు పెట్టినవారే, వెయ్యి మందిని చంపిన రాబందును ఇంకా ఎక్కువ రక్షణ ఇచ్చి కాపాడవలసింది అని వాదిస్తున్నారంటే మన సమాజంలోని వ్యవస్థానుకూల భావజాలం ఎంత లోతుగా ఉందో అర్థమవుతుంది.

మహేంద్ర కర్మ, నందకుమార్ పటేల్ వంటి వారి మీద చర్య అవసరమే అయినప్పటికీ మిగిలినవారికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవలసిందని చేస్తున్న వాదనలలో కొంత న్యాయం ఉంది. కాని సైనిక చర్యలలో, యుద్ధంలో ఇటువంటివి అవాంఛనీయమైన, అనవసర మైన నష్టాలు తప్పవు. వాటిని సమర్థించనక్కర లేదు. తప్పనిసరిగా అవి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవలసిందే. కాని అతి స్వల్పమైన తప్పులకు కూడ భారీ మూల్యం చెల్లించవలసి వచ్చే, అతి సూక్ష్మమైన పథక రచన జరిగినా, అక్కడికక్కడ రెప్పపాటులో సమయ స్ఫూర్తితో మార్పులు చేసుకోవలసిన, క్షణాలలో జరిగిపోవలసిన సైనిక చర్యలలో ఊహించనివీ, ఆశించనివీ, ఆమోదయోగ్యం కానివీ కూడ జరుగుతాయి. వాటి గురించి పాఠాలు తీసుకుని మళ్లీ అటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడమే తప్ప, లోపరహితమైన సైనిక చర్య అనేదేదే చరిత్రలో ఇంతవరకూ లేదు, ఉండే అవకాశం లేదు.

ప్రజా ఉద్యమం పట్ల సానుభూతి తోనే, జరిగిన ఘటనను సరైన పద్ధతిలో అర్థం చేసుకుంటూనే ఇటువంటి ఘటన నిర్బంధాన్ని కొనితెచ్చుకోవడం కాదా అనీ, రాజ్యం మరింత క్రూరంగా మారుతుంది గదా అనీ కొన్ని వ్యాఖ్యలు వస్తున్నాయి. పైకి చూడడానికి ఇవి సానుకూలమైన వాదనలుగా కూడ కనబడతాయి. వీటిలో కొంత నిజం కూడ ఉంది. కాని వర్గ సమాజ వాస్తవికతను అర్థం చేసుకున్నప్పుడు ప్రజలు తిరుగుబాట్లు చేయనప్పుడు కూడ రాజ్యం నిర్బంధపూరితంగానే, క్రూరంగానే ఉంటుందని అర్థమవుతుంది. ప్రజల తిరుగుబాట్లతో రాజ్యం పిచ్చెత్తినట్టు ప్రవర్తిస్తుంది. తన అధికారానికి తగిలే దెబ్బలను సహించలేని అసహనంతో మరింతగా విరుచుకుపడుతుంది. కాని అవి చూపెట్టి రాజ్య హింసను ఎదిరించవద్దనడం, రాజ్యం మీద దాడి చేయవద్దనడం రాజ్యానికి లొంగి ఉండి, దోపిడీ పీడనలను సహించమని చెప్పడానికే దారితీస్తుంది.

నిజానికి దర్భా ఘాట్ ఘటనకు చాల ఏళ్ల ముందునుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలో పెద్దఎత్తున సైనిక, అర్ధసైనిక, పోలీసు బలగాలను దించి దమనకాండ సాగిస్తున్నాయి. ఈ ఘటనను సాకుగా చూపి మరింత ఎక్కువమంది భద్రతాబలగాల తరలింపు జరుగుతున్నది. జాతీయ భద్రతా సంస్థ విచారణ పేరుతో నేరుగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నది. పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో సమన్వయంలో మరింత పెద్దఎత్తున దాడి చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నది. నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, నాయకత్వాన్ని నిర్మూలించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని పథకాలు రచిస్తున్నది.

ఆదివాసుల మీద, విప్లవోద్యమం మీద దమనకాండకు పాలకవర్గాలు ఎంత త్వరితగతిన, ఎంత పెద్ద ఎత్తున పథకరచన చేస్తున్నాయంటే మే 25న దాడి జరిగితే, మే 28న రాయపూర్ లో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆర్ కె సింగ్ అధ్యక్షతన ఉన్నతస్థాయి పోలీసు సమావేశం జరిగింది. జూన్ 5న అంతర్గత భద్రతపై ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. జూన్ 10న అఖిలపక్ష సమావేశం జరిగింది. అంటే అన్ని పార్లమెంటరీ పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు బలగాలు ఏకమై, తమ మధ్య ముఠాతగాదాలను కూడ పక్కనపెట్టి ప్రజల మీద యుద్ధానికి సన్నాహాలు ప్రారంభించాయి. వర్గపోరాటం తీవ్రతరమవుతున్నదనడానికి, కీలకదశకు చేరుతున్నదనడానికి ఈ పాలక ఐక్యత ఒక చిహ్నం. ఒకవైపు పాలకులు తమ తమ జెండాలూ నినాదాలూ రంగులూ పక్కనపెట్టి ఇలా ఏకమవుతుంటే పాలితులు, ప్రజలు, శ్రామికులు ఆ స్థాయిలో ఐక్యత కోసం ప్రయత్నాలైనా చేస్తున్నారా అనేది ఇవాళ ముఖ్యమైన ప్రశ్న. అంతిమ పోరాటానికి సమయం దగ్గరపడుతున్న సందర్భంలో ప్రజల మధ్య విభజనలు, అభిప్రాయ భేదాలు, భిన్నాభిప్రాయాల ఛాయలు పక్కనపెట్టి సూత్రబద్ధ పీడిత ఐక్యత అవసరాన్ని గుర్తిస్తున్నారా అనేది ప్రశ్న. దర్భా ఘాట్ ఘటన ఆ ప్రశ్నను బలంగా ముందుకు తీసుకు వస్తున్నది. ఆ ఘటనను పాలకవర్గాలు తమ ఐక్యత కోసం వాడుకుంటున్నాయి. ఆ ఘటనను ప్రజలు తమ ప్రబల శక్తి ప్రదర్శనకు నిదర్శనంగా గుర్తించుకోవలసి ఉంది. ఆ శక్తిని ఇంకా బలోపేతం చేసుకోవలసి ఉంది.

(రచయిత పాత్రికేయులు) వీ

జాతీయ ఆహార భద్రతా బిల్లు

***ఆహార భద్రతా బిల్లు గురించి వేసిన కమిటీల సూచనలైనా, బిల్లు తేవడంలో పాలకుల నాన్చుడు ధోరణి ఐనా పాలకులకు లబ్ధి చేకూర్చడానికే కాని పేదరిక నిర్మూలనకు కాదంటున్నారు** డా. శ్రీనివాసరావు చొప్పర*

గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ, యుపిఎ కూటమి తన ఎన్నికల మెనిఫెస్టోలో దేశంలోని పేద ప్రజలందరికీ ఆహార భద్రతను కల్పిస్తామని వాగ్దానం చేసింది. వంద రోజుల్లోనే ఈ చట్టాన్ని తీసుకు వస్తామని నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ పార్లమెంట్ మొదటి సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించిన తన ప్రసంగంలో వెల్లడించింది. అప్పటి నుండి నేటి వరకు ఈ చట్టాన్ని తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం కమిటీల పేరుతో తన సహజ ధోరణిలో కాలహరణం చేసింది. ఇప్పుడు హడావిడి చేస్తుంది. ఆర్డినెన్స్ చేయాలా లేక పార్లమెంట్ ఆమోదంతో చట్టం చేయడమా అన్నది తేల్చుకోలేని స్థితిలో ఉంది. యుపిఎ-2 లోని ఒకటి రెండు మిత్ర పక్షాలు కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచడంతో ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకున్నట్లుగా ప్రకటించినా ప్రత్యేక సమావేశాల ద్వారానైనా పార్లమెంట్ ఆమోదంతో చట్టం తేవాలని ప్రతిపాదిస్తుంది. ఈ మొత్తం వ్యవహారమే ఆర్డినెన్స్ అయినా ఆదర బాదరా ప్రత్యేక సమావేశమైనా అందులో ఆహారం కన్నా వ్యవహారమే ప్రధానమన్నది సుస్పష్టం. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదిగా దేశంలోని పేదరికాన్ని రూపు మాపడంలో ఒక తారక మంత్రంగా వల్లిస్తున్న కేంద్రం, దేశంలో 77 శాతం పైబడిన పేదవారి ఆకలిని తీర్చడంలో తీసుకు వస్తున్న చట్టాన్ని పరిశీలిద్దాం.

ప్రతిపాదిత జాతీయ ఆహార భద్రతా బిల్లులో కేంద్రం ప్రతిపాదించిన అంశాలు స్థూలంగా ఇలా ఉన్నాయి.

- దేశంలోని గ్రామీణ ప్రాంత జనాభాలో 75 శాతం, పట్టణ ప్రాంత జనాభాలో 50 శాతం పేద ప్రజలకు రెండు విడతలుగా సబ్సిడీ రేట్లకు ఆహారాన్ని లేదా ఆహార ధాన్యాలను అదించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంటే స్థూలంగా దేశ జనాభాలో 67 శాతం ఈ బిల్లు పరిధిలోకి వస్తారని అంచనా.
- బిపిఎల్ కుటుంబంలోని ప్రతి వ్యక్తికి నెలకు ఐదు కిలోల ధాన్యాన్ని బియ్యం, గోధుమ, ముతక ధాన్యాలు(రాగులు) కిలో ఒక్కంటికి వరసగా మూడు, రెండు, ఒకటి రూపాయల చొప్పున కుటుంబానికి ఇరవై కిలోలు మించకుండా అందించాలి.
- గర్భిణీలకు, పసి బిడ్డ తల్లులకు (గర్భం ధరించిన తరువాత, శిశువు జన్మించిన ఆరు నెలల వరకు) భోజనాన్ని ఉచితంగా అందజేయడం, గర్భం దాల్చిన స్త్రీలకు ఆరు వేల రూపాయలు తగ్గకుండా విడతల వారిగా చెల్లించడం.
- ఆరు నెలలు నిండినప్పటి నుండి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడి కార్యకర్తల ద్వారా వండిన ఆహారాన్ని ఉచితంగా అందివ్వాలి. 6-14 సంవత్సరాలలోపు పిల్లలకు లేదా ఎనిమిదవ తరగతిలోపు పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా పాఠశాల పని దినాల్లో అందించాలి.
- అర్హులై ఉండి, ఎవరైతే ఆహారాన్ని పొందలేక పోతారో అటువంటి వ్యక్తులు ఆహార భద్రతా భత్యాన్ని(ఫుడ్ సెక్యురిటీ అలవెన్స్) పొందుటకు అర్హులని కేంద్రం బిల్లులో పేర్కొన్నది.

అయితే ఈ లక్ష్యాల అమలుకు అయ్యే వ్యయం మొదటి విడతకు 71837 కోట్లు, రెండవ విడత నాటికి 79931 కోట్ల రూపాయలు అంచనాతో పాటు మొదటి విడతకు 56.35 మిలియన్ టన్నులు, రెండవ విడత నాటికి 57.61 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు అంటే మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 30 శాతం సరిపోతాయని అంచనా వేశారు. కాని బిల్లు అమలుకు కావలసిన ఆర్థిక వనరుల కేటాయింపు గూర్చి స్పష్టమైన ప్రతిపాదనలు బిల్లులో లేకపోగా బిల్లు అమలు బాధ్యత ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని కేంద్రం సెలవిస్తుంది.

అందరికీ ఆహార భద్రత అన్నదానితో ప్రారంభమైన కేంద్రం ఆచరణ దగ్గరకు వచ్చే సరికి చేతులెత్తేసింది. బిల్లు పరిధిలోకి వచ్చే అర్హులను తేల్చడానికి వివిధ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి అంతులేని చర్చలు సాగించింది. జాతీయ సలహా మండలి, మంత్రుల స్థాయి సంఘం, జాతీయ నిపుణుల కమిటీలు చర్చలను సాగదీశాయి. వేసిన కమిటీలు పేదరిక స్థాయిని, అర్హుల సంఖ్యను తగ్గించి చూపడానికి పడరాని పాట్లు పడ్డాయి. పంచపాండవులు ఎంత మందని అడిగితే పంచపాండవులు మంచపు కాదులులాగా ముచ్చటగా ముగ్గురేనని రెండు వేళ్లు ఎత్తి ఒకటి చూపెట్టాడంట వెనుకటికి ఒకడు. అలా దేశంలో పేదరికపు స్థాయిని అంచనా వేయడానికి వేసిన కమిటీలు ఆయా స్థాయిలో తగ్గించుకుంటూ వచ్చి చాలా తక్కువ మందిని మాత్రమే బిల్లు పరిధిలోకి తీసు కొచ్చారు. అర్జున్‌సేన్ గుప్తా కమిటీ 77 శాతం, వాద్వా కమిటీ 70 శాతం, సక్సేనా కమిటీ 50 శాతం, టెండూల్కర్ కమిటీ 37 శాతం తేల్చగా, ప్రణాళికా సంఘం 33 శాతం పేదలున్నట్లుగా తేల్చింది. పట్టణ ప్రాంతాల్లో రోజుకు 20 రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 15 రూపాయల మొత్తాన్ని నిత్యవసర వస్తువుల కోసం ఖర్చు చేస్తే ఆ వ్యక్తిని పేదరికం నుండి తప్పించ వచ్చని ప్రణాళికా సంఘం పేర్కొన్నది. ఈ ప్రాతిపదిక ఎంతో అశాస్త్రీయమైనదని నిపుణులు, అంతర్జాతీయ వేదికలు తెలియజేస్తున్నాయి. సంక్షేమ పథకాలకు కేటాయింపులు నానాటికి తగ్గించాలనే సిద్ధాంతానికి నిబద్ధులైన పెద్ద మనుషులు ఇప్పుడు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు గనుక దారిద్ర్య గణాంకాలు పెరిగిన కొద్ది చిరాకు పెరుగుతుంది. అది ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమెరికా ఆంక్షలను దిక్కరించి సబ్సిడీలను పెంచినట్లే అవుతుంది.

పేదరికపు సంఖ్య నిర్ధారణకు ప్రస్తుత జనాభా లెక్కలను కాక గతంలోని లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. కేంద్రం ఇప్పుడు నిర్ధారించినట్లు దేశ జనాభాలో 36 శాతం బిపిఎల్ కార్డులు పొందడానికి అర్హులని నిర్ధారించింది. అయితే ఆ 36 శాతం ప్రకారం 2001 జనాభా లెక్కల ప్రకారం 6.52 కోట్ల కుటుంబాలు కాగా అదే 2010 జనాభా లెక్కల ప్రకారం 7.70 కోట్ల కుటుంబాలు వస్తాయి. కాని కేంద్రం అలా 6.52 కోట్ల కుటుంబాలనే నేటికీ పరిగణిస్తుంది. ఫలితంగా దాదాపు కోటి కుటుంబాలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నా, ఆ ప్రయోజనాలు పొందడానికి అనర్హులు అయ్యారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాల బిపిఎల్ కుటుంబాల అంచనాలను కేంద్రం విస్మరించింది. రాష్ట్ర ప్రభుత్వాల అంచనాల ప్రకారం 11.03 కోట్ల కుటుంబాలు బిపిఎల్ కుటుంబాలుగా గుర్తించి ఆ మేరకు కొన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంటే కేంద్రం మాత్రం 6.52 కోట్ల కుటుంబాలే అంటుంది. కారణం తాను ఇచ్చే సబ్సిడీ పెరుగుతుందనే స్పష్టం. రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీల వల్ల ప్రస్తుతం పది రాష్ట్రాలలో ఈ బిపిఎల్ కుటుంబాలు కిలో ఆహార ధాన్యాలను ఎక్కువగా బియ్యాన్ని ఉచితంగా, లేదా రూపాయి రెండు రూపాయలకు పొందుతున్నాయి. కేంద్రం మాత్రం కిలో బియ్యాన్ని మూడు రూపాయలకు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇది ఆహార భద్రతను పెంచినట్టా లేకా తగ్గించినట్టా?

పేదరికపు సంఖ్యను కుదించడమే కాకుండా ఆ గుర్తించిన కుటుంబాలకు ఇచ్చే సబ్సిడీ రేషన్ పరిమాణాన్ని కుదించారు. బిపిఎల్ కుటుంబానికి నెలకు 35 కిలోల వాగ్దానం కాస్తా తల ఒక్కింటికి ఐదు కిలోలు, అది నలుగురికి కుదించబడింది. కుటుంబంలో నలుగురికి మించి ఉన్నా 20 కిలోలు మాత్రమే ఇస్తారు. ప్రణాళికా సంఘం ప్రకారం ఒక మనిషి జీవించేందుకు రోజుకు కనీస స్థాయిలో 2400 క్యాలరీలు అవసరం. అది 650 గ్రాముల ఆహార పదార్థాలకు సమానం. అంటే ఒక వ్యక్తికి నెలకు కనీసంగా 15 కిలోల ఆహార ధాన్యాలు తప్పనిసరి. దాని ప్రకారం ఒక వ్యక్తి నెల వారి ఆహార ధాన్యాల అవసరంలో మూడింట రెండు వంతులు నిత్యావసరాలను బహిరంగ మార్కెట్‌లో చుక్కలనంటే ధరల మధ్య కొనుగోలు చేయవలసి ఉంటుంది. ఎన్ఎస్ఎస్ఒ తాజా నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు రోజువారి ఖర్చు 17 రూపాయలు. అదే పట్టణ నిరుపేదల రోజువారి ఖర్చు 23 రూపాయలకు మించడం లేదు. మరి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఐదు కిలోల ఆహార ధాన్యాలతో నెల గడవడం సాధ్యమేనా? సరైన పోషకారం దొరకక దేశంలో కోట్ల మంది పెద్దలు, పిల్లలు, స్త్రీలు రువాండా, సోమాలియా ప్రజలను తలపిస్తున్నారు. ఆర్థికాభివృద్ధిపై గొప్పలు చెప్పుకుంటున్న భారత్, సామాన్యుడి ఆకలిని తీర్చడంలో ఘోరంగా విఫలమైందని, సామాన్యుడి ఆకలి పరిస్థితి 1996లో ఏ విధంగా ఉందో ఇప్పుడూ అలాగే ఉందని 2012 గ్లోబల్ హంగర్ ఇండెక్స్(జిఎచ్ఐ) కుండబద్దలు కొట్టింది. ఆర్థికాభివృద్ధి, ఆకలి పోరులో ప్రగతి మధ్య అంతరం నానాటికి విస్తరిస్తోందని ఈ నివేదిక వ్యాఖ్యానించింది. ఈ విషయంలో భారత్ ఇథియోపియా కన్నా వెనుకబడి ఉందని ఆ నివేదిక తేల్చింది. ఐక్య రాజ్య సమితికి చెందిన ప్రపంచ ఆహార సంస్థ(ఎఫ్ఎఒ) అంచనాల ప్రకారం 2008-09 లోనే భారతదేశంలోని 23 కోట్ల మంది ప్రజలు ఇప్పుడు తింటే మళ్లీ ఎప్పుడు తింటామో, ఎలా తింటామో తెలియని పేదరికంలో ఉన్నారని ప్రకటించింది.

ఒక వైపు అత్యధిక ప్రజానీకం ఆకలి బాధతో అల్లాడుతుండగా మరొక వైపు ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగిందని కేంద్రం ప్రకటిస్తుంది. 2007-08లో 230.8 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి 2011-12 నాటికి 257.4 మిలియన్ టన్నులకు పెరిగిన మాట వాస్తవం. కాని అదే స్థాయిలో జనాభా పెరుగుదల, అందులోనూ వివిధ రంగాల నుండి నెట్టివేయబడుతున్న, తొలగించబడుతున్న వారి సంఖ్య పెరుగుదలను కేంద్రం గుర్తించ నిరాకరిస్తుంది. వ్యవసాయ రంగంలో రైతుల ఆత్మహత్యల లెక్కలు గుండెను పిండేయగా ఆ రంగం నుండి బలవంతంగా నెట్టివేయబడ్డవారు 2004-05, 2009-10 సంవత్సరాల మధ్య కాలంలో కోటి నలభై ఐదు లక్షల మంది ఉన్నారు. అదే కాలంలో 50 లక్షల మంది ఉత్పాదక రంగం నుండి తొలగించబడ్డారు. కొత్త ఉద్యోగాల ఊసేలేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను కల్పించడంలో విఫలమైనట్లు కాగ్ వెల్లడించింది. కనీసం 100 రోజుల పని దినాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ 2009-10లో 54 రోజులు మాత్రమే పని కల్పించగా 2010-11 సంవత్సరాలలో అది కాస్తా 43 పని దినాలకు పడిపోయింది. వారికిచ్చే కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని కాగ్ తేల్చింది. పని చేయడానికి సిద్ధంగా ఉన్నా పని కల్పించలేని నిస్సహాయత ప్రభుత్వానిది.

ఈ ఆహార బిల్లు ముసాయిదాను రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం రంగరాజన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చేసిన సిఫారస్సులు పేద ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేవు. దారిద్ర రేఖకు దిగువన ఉండే వారికి సరఫరా చేసే సబ్సిడీ ఆహార ధాన్యాలను ద్రవ్యోల్బణానికి, వినియోగదారుల ధరల సూచికే అనుగుణంగా సవరిస్తూ ఉండాలని, ఎల్లప్పుడూ ఒకే ధరకు సరఫరా చేయడం వల్ల ప్రభుత్వంపై భారం తీవ్రమవుతుందని కమిటీ సూచించింది. దీని అర్థం పేదలకు ఇచ్చే ఆహార ధాన్యాల ధరలను ఎప్పటికప్పుడు పెంచుతూ ఉండమని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులే శరణ్యం అనే సలహా ఇచ్చే వారు ఇంత కన్నా ఏమి చెప్పగలరు. అలానే దారిద్ర్య రేఖకు ఎగువన ఉండే వారికి కనీస మద్దతు ధరకు ఆహార పదార్థాలను సరఫరా చేయాలని మరో ఉచిత సలహా కూడా ఇచ్చింది. ధాన్య సేకరణ మరింత పెరిగితే బహిరంగ మార్కెట్‌కు ఆహార ధాన్యాల లభ్యత తగ్గి ధరల పెరుగుదలకు అది దారితీయగలదని కూడా రంగరాజన్ కమిటీ వాదించింది. ఇది పసలేని వాదన. ఆహార ధాన్యాల సేకరణ అంటే అధిక పంపిణీ అనే అర్థం. ఈ రెండూ కలసినప్పుడు మార్కెట్ ధరపై పడే ప్రభావం తొలగిపోతుంది. ప్రజా పంపిణీకిగాను ప్రస్తుతం పండిన పంటలో 30 శాతం మాత్రమే ప్రభుత్వం సేకరిస్తుంది. అందువల్ల ఆహార ధాన్యాల సేకరణ పెరిగినా రైతులకు నష్టమేమి లేదు.

దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ సార్వత్రిక ప్రజా పంపిణీ లక్ష్యంతో ప్రారంభమైంది. కొంత కాలం పాటు ఏదో మేర విస్తరిస్తూనే ఉండింది. దాని కొరకు బడ్జెట్ కేటాయింపులు కూడా కొంత వరకు బాగానే ఉండేది.

రాజ్యవాదమే రాజ్యాంగవాదంగా విస్తరిస్తోందా?

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే రాజ్యాంగాన్ని పక్కన పెట్టి బలపడుతున్న రాజ్యం ప్రజల మీద దమన నీతిని ఎలా అమలు చేస్తున్నదో వివరిస్తున్నారు **డా. నూకతోటి రవికుమార్**

ఇప్పుడు రాజ్యవాదమే రాజ్యాంగ వాదంగా మారిపోతున్న విచారకర సందర్భం మనముందు ఉంది. తద్వారా ప్రభుత్వాలు తన జాతి జనం మీద జరిగే చట్టబద్ధ హననానికి సాక్ష్యంగా మిగిలిపోతున్నాయి. నిజానికి ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం ఉపకరించాల్సిన రాజ్యాంగం క్రమంగా రాజ్యాంగవాదంగా, ఆ తర్వాత రాజ్యవాదం మాత్రమే మిగిలిపోయి. చట్టసభలను మల్టీనేషనల్ కంపెనీలకు దాసోహం చేయించే పరిస్థితిలోకి దిగజార్చివేశాయి. చివరకు అది కాస్తా ఇప్పుడు స్వజనం మీద యుద్ధం చేసే దశకు చేరుకున్నది. ఈ క్రమంలో అనేక జాతులు రాజ్యవాదం చేసే హననం కింద కనీస మనుగడను కోల్పోవాల్సిన విచారకర పరిస్థితులు ఇప్పుడు ఆసియా ఖండంలోని అన్ని దేశాలలో ఏర్పడ్డాయి.

ఆసియా ఖండంలోని తొమ్మిది దేశాలలోని రాజ్యాంగాలు వలసవాద ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయాయన్న సత్యం క్రమంగా నిర్ధారించ బడుతోంది. ఆయా దేశాల రాజ్యాంగ రూపకర్తలు వలసవాద ప్రభావం నుండి తప్పించుకోలేకపోయారని ఇటీవల పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. అందుకనే మళ్లీ మళ్లీ రాజ్యాంగ సవరణలతో రాజ్యాంగానికి పదును పెట్టుకోవాలని యోచిస్తున్నాయి. అయితే, ఈ క్రమంలో అంతకంతకూ అవి ప్రజలకు దూరంగా జరుగుతున్నాయి. ఆయా దేశాలలోని అధికారిక ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని ఒక స్ఫూర్తిగా కాకుండా నమ్మకంగా ప్రచారం చేసుకుంటూ ఆచరించడమే దీనికి కారణం. అయితే, దీనిని తత్వశాస్త్రం మాత్రం అంగీకరించడం లేదు. తమను న్యాయసూత్రాలతో నిబంధించే శక్తిగా రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు పేర్కొంటూనే, తాము దానిమీద ఆధారపడాల్సిన సంస్థలుగా ఉండడం తమ వల్లకాదని, రాజ్యాంగమే తమ అధికారాలకు గొడుగుపట్టేదిగా ఉండాలని యోచించి ఆచరణలో నిరూపిస్తున్నాయి. అయితే రాజ్యాంగం మాత్రం ప్రజల భద్రతకు, సంక్షేమానికి, సమ భావాల ఆచరణకు మార్గాచరణగా భావించడంలో ఆయా దేశాలలోని పాలకులు పక్కా ప్రణాళికతో వెనుకబడుతున్నారు. తమ స్విస్ ఖాతాలు పెంచుకోవడం ద్వారా రాజ్యాంగ వాదాన్ని కాస్తా రాజ్యవాదంగా మార్చేశారు.

నిజానికి రాజ్యాంగవాదం – రాజ్యాంగ నీతి అనేవి ఒకే నాణేనికి ఉన్న బొమ్మాబొరుసుల వంటివి. కానీ, రాజ్యాంగ నీతి అనేది, ఆచరణ ద్వారా రాజ్యాంగానికి మంచి పేరును తెస్తుందనే భావనను భారత రాజ్యాంగ రచనా సంఘ ఛైర్మన్‌గా డా. అంబేద్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రజలందరికీ స్వేచ్ఛాభావనను, స్వయం గౌరవాన్ని కోరుకుంటున్నది. గౌరవం అనేది అందరికీ వర్తించాలన్న సత్యమూ ఇందులో ఇమిడి ఉంది. అయితే, రాజ్యాంగ ఆచరణలో మాత్రం అది కాని దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చిన తరువాత, ప్రపంచీకరణ విధానాలు వేగవంతమై సార్వత్రిక ప్రజా పంపిణీ స్థానంలో లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. అనర్హులు కూడ ఈ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందుతున్నారనే సాకుతో అర్హుల్లో కూడా అత్యధికులను ప్రజా పంపిణీ వ్యవస్థకు వెలుపల ఉంచడమైనది. అర్హులైన పేదలలో 57 శాతం ప్రజలు ప్రజా పంపిణీ వ్యవస్థకు దూరంగా ఉన్నారని 11వ పంచవర్ష ప్రణాళికా పత్రం పేర్కొంది. ప్రస్తుత జాతీయ భద్రతా బిల్లులో కూడా వారికి చోటు కల్పించక పోవడం విషాదకరం. ఈ చట్టం సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను చట్టపరంగా కనుమరుగు చేయడం అత్యంత బాధకరం.

ఎంతో ఆర్భాటంగా చెప్పుకుంటున్న ఈ చట్టంలోని లక్ష్యాలను చేరుకోవడానికి, కావలసిన ఆర్థిక వనరుల కేటాయింపులో మాత్రం కేంద్రం పేద ప్రజలకు చెయ్యి ఇస్తుంది. బడ్జెట్ కేటాయింపులను నామమాత్రంగానే చేసింది. సబ్సిడీల భారాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే తూచా తప్పక పాటిస్తుంది. గత ఏడాది బడ్జెట్‌లో సబ్సిడీల మొత్తం 247854 కోట్లుంటే 2013–14 బడ్జెట్‌లో మాత్రం 220971 కోట్లకు కుదించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే ఆహార పదార్థాల సబ్సిడీ 90 వేల కోట్లు కేటాయించినా గతంతో పోలిస్తే అది ఐదు వేల కోట్లు మాత్రమే అధికం. జాతీయ ఆహార భద్రత పథకం కోసం కేటాయించింది. కేవలం పది వేల కోట్లు మాత్రమే. ఈ పథకానికి కావలసిన దాదాపు మూడు లక్షల కోట్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ.

దేశంలోని పేద ప్రజలందరికీ ఆహార భద్రతా చట్టాన్ని అందుబాటులోకి తీసుకురాకుండా, సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను చట్టబద్ధంగా కనుమరుగు చేసే ఏ చర్య అయినా సంపూర్ణ ఆహార భద్రతను చేకూర్చలేదు. ఆహార భద్రతతో పాటు ఉపాధిని పెంచే పటిష్టమైన విధానాలను చేపట్టకుండా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థకు ఇలాంటి పథకాల ద్వారా మెరుగులు దిద్దడమంటే శవాన్ని అలంకరించడమే అవుతుంది. పేదలను ఎల్లప్పుడూ రాజ్యం మీద ఆదారపడేట్లు చేయడమే. ఈ బిల్లు పాలక పార్టీలకు రాజకీయ లబ్ధి చేకూర్చ వచ్చునేమో కానీ, అది దేశ ప్రమాదకర పేదరికాన్ని రూపుమాపజాలదు.

(రచయిత లెక్చరర్, జవహర్ భారతి డిగ్రీ కాలేజీ, కావలి) వీ

తలకిందులవు తోంది. ఆచరణలో సార్వభౌమాధికారం పాలక పార్టీల ఆధిపత్య సంస్కృతిని ప్రజలందరిపై రుద్దడానికి ఎక్కువగా ఉపకరించింది తప్ప సమన్యాయం, సమభావం పెంపొందింపజేయడంలో ఆయా రాజకీయ పార్టీలు తమ స్వభావాన్నే రాజ్యాంగ స్వభావంగా దిగజార్చేసిన సందర్భాలు మన దేశంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. విచిత్రంగా న్యాయస్థానాలు కూడా చాలా సందర్భాలలో రాజ్యాంగ నీతిని గుర్తించడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. అనేక సందర్భాలలో ఇది నిర్ధారించబడుతోంది కూడా. వెరసి ఇప్పుడు, ఆసియా ఖండంలోని అన్ని దేశాల్లో రాజ్యాంగవాదం రాజ్యవాదంగా మారిపోతోంది. రాజ్యాంగ నీతి ఆచరణను పక్కనబెట్టి 'రాజ్యవాదం'గా మారిపోవడం ఒకెత్తయితే, దానిని ఇరుగుపొరుగు దేశాల ప్రతికూల విధానాలకు ప్రభావితం అయ్యేలా మారడం మరో కొత్త పోకడగా దారితీసింది. తద్వారా ఆసియా తన ఉపఖండంలో తానే తనకు శత్రువుగా మిగిలిపోయే విచారకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనికి సావకాశాన్ని కల్పిస్తున్నవి ఆయా రాజ్యాంగవాదాలేననడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. రాజ్యాంగాన్ని గొప్పదిగా అభివర్ణించుకుంటూ ఉండిపోవడం ఒక అంశమైతే, దానిని ఆచరణీయ మార్గంగా ఎంచుకోవడం మరో పద్ధతి. ఈ రెండింటిలో రెండవదానికి ప్రజల్లో ప్రాధాన్యం ఉంది. కానీ, విచిత్రంగా ఆయా దేశాల్లో నెలకొనిఉన్న రాజకీయపార్టీలు, అధికారం చేబుచ్చు కుంటున్న వాళ్లు మొదటిదానికి ప్రాధాన్యమిస్తూ రాజ్యాంగ వాదాన్ని పూర్తిగా రాజ్యవాదంగా దిగజార్చి రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేస్తున్నారు. తూర్పు ఆశియాలోని 9 దేశాలు రాజ్యాంగనీతిని ఆచరణ మార్గంగా స్వీకరించనందువల్లనే ఆయా దేశాలు అనేక ఉద్రికత్తలకు నెలవుగా మారాయి.

అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మాల్దీవులు, మయన్మార్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంకలలో పెచ్చరిల్లుతున్న అనేక రకాలైన ఉద్యమాలకు ఇదే కారణంగా భావించవచ్చు. అయితే, ఆయా దేశాల సంస్కృతులను గౌరవించుకుంటూనే, అణచివేతలకు వ్యతిరేకంగా ఆయా దేశాలలోని ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. నిజానికి ఆసియా దేశాలలోని ప్రజల మధ్య రాజ్యాంగవాదం కావాలనే ఉన్న వైరుధ్యాలను పెద్ద చేస్తున్నది. ఈ దేశాల సంస్కృతుల మధ్య ఉన్న వైరుధ్యాలను పెంచి పోషించడం ద్వారా కలహాలను సృష్టించి దేశాల మధ్య కలహ విస్తరణను రాజ్యాంగవాదం పోషిస్తోంది. తద్వారా తననుతాను రాజ్యవాదంగా మరింతగా పాలకుల ప్రయోజనాలను నెరవేరుస్తోంది. అయితే, ఈ సంస్కృతులన్నింటికీ మధ్య వారధిగా కళలు, సాహిత్యం నిలుస్తున్నాయి. అందుకనే ఇరుగుపొరుగు దేశాలలో స్థానిక మతోన్మాదులు దాడులు చేయడం. దానికి ప్రభుత్వాలు మౌనం వహించి వత్తాసు పలకటం. ఇంకా కొన్ని ఛాందస సంస్థలకు తోడ్పాటునందించి రచయితలు,కవులను దేశ బహిష్కారం చేయడం. ఇదంతా మతాలు, కులాలు, రాజ్యాంగవాదాల మధ్య పరస్పర సహకారంతో జరిగి పోతుండడం, దీనికి రాజ్యాంగవాదం అని పేరుపెట్టుకోవడం రాజ్యవాద కుట్రలో భాగంగానే భావించాల్సి ఉంటుంది.

తూర్పు ఆసియా దేశాలలో ఉన్న ఆర్థిక పరిస్థితులు, ప్రాంతాల మధ్య నెలకొనిఉన్న వ్యత్యాసాల కారణంగా పెచ్చరిల్లుతున్న ఒత్తిడులు కొంత తగ్గించడానికి చర్యలు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరడం లేదు. అదే క్రమంలో ప్రపంచీకరణ పరిణామాలు ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులను అనిశ్చితికి గురి చేస్తున్నాయి. అయితే, ప్రాంతాల మధ్య, సంస్కృతుల మధ్య సయోధ్య కుదిర్చి సంయమనం కల్పించడానికి ఆయ దేశాల ఆర్థిక పరిస్థితులు చేస్తున్న కృషి కనిష్టమేనని చెప్పాలి. స్థానిక, అస్తిత్వ ఉద్యమాలు, స్వయం గౌరవం కోసం పెచ్చరిల్లుతున్న ఆందోళనలు ఇప్పుడు ఆసియాలోని అన్ని దేశాలనూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనికి అనుగుణంగా రాజకీయ ఎజెండాలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. ఎజెండాకు అనుగుణంగా రాజ్యాంగ సవరణల కోసం కోరుతున్నాయి. ఈ తీగలాగుడు వ్యవహారం బ్యాలెట్ డబ్బా వరకే విస్తరిస్తోంది. ఆ తర్వాత కనిపించడం లేదు. నిజానికి ఇలాంటి వాతావరణాన్ని సృష్టిస్తున్నవి వలసవాద భావజాలాలే. ఎక్కడికక్కడ, స్వయం గౌరవం కోసం, స్వేచ్ఛ సమానత్వం కోసం పెచ్చరిల్లుతున్న ఉద్యమాలను అణచి వేయడం తప్ప పరిష్కార మార్గాలు ఆలోచించే ధోరణికి వలసవాదం కృషి చేయడంలేదు, సరికదా, అణచివేతకే అధికశాతం మొగ్గుచూపు తోంది.

ఇటు ఇండియాలో కానీ, అటు సిలోన్‌లో కానీ, ముసురుతున్న మతవాదం నుంచి ప్రజల్ని విముక్తి చేసేలా ఆయా దేశాల్లో రూపు దిద్దుకున్న రాజ్యాంగవాదం ఆచరణవంతమైన మార్గాలను సూచించలేక పోవడానికి కారణం అది రాజ్యవాదంగా మారిపోవడమే. రాజ్యాంగ లక్ష్యాలు, ప్రజల ఆకాంక్షలను నీరుగార్చిన అనేక మతాలు, సంఘటలను మనం భారతదేశంలో చవిచూస్తూనే ఉన్నాం. చివరికి ప్రభుత్వాలు పౌరుల ప్రాథమిక హక్కులను సైతం నిరాకరించే దశకు చేరుకున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితులు ప్రస్తుతం మన దేశంలో పుష్కలంగా దాపురించాయి. భారత రాజ్యాంగ వాదం రాజ్యవాదంగా మారిపోయి ప్రభుత్వాలకు అసాధారణ అధికారాలు కట్టబెట్టేవిధంగా తయారయ్యింది. పౌరుల ప్రాథమిక హక్కులను సైతం నిరాటంకంగా హరించే విధంగా ప్రభుత్వాలు తయారు కావడం విస్తుగొలిపే అంశం. 1960 ప్రాంతం నుండే తూర్పు ఆసియాలోని అన్ని దేశాలలో రాజ్యాంగవాదం రాజ్యవాదంగా వేగంగా రూపాంతరం చెందడం ప్రారంభమయింది. రాజ్యాంగనీతి ఆచరణలో దశలవారీగా తుంగలో తొక్కడం కూడా ఈ కాలంలోనే ప్రారంభమయింది. ఇప్పటిదాకా, ఐదు దశాబ్దాల పాటు ఇదే ధోరణి కొనసాగుతుండడం వల్లనే ప్రస్తుతం మన దేశంలో తీవ్ర అనిశ్చిత పరిస్థితులు నెలకొనివున్నాయి.

నిజానికి భారతదేశంలో 'రాజ్యాంగ సవరణలు' అనే అంశం తెరమీదికి వచ్చినప్పుడల్లా 'రాజ్యాంగ వాదపు వైఫల్యమే కనిపిస్తుందాలి. రాజ్యాంగవాదం అభివృద్ధి చెందినప్పుడల్లా పాలక రాజకీయ పార్టీలకు లబ్ధి చేకూరుతోంది తప్ప రాజ్యాంగ ఆకాంక్షలు నెరవేరే ప్రజాకాంక్షలకు న్యాయం జరుగుతున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించవు. ఈ క్రమంలోంచి చూసినప్పుడు, శ్రీలంకలో జరుగుతున్న మానవ హక్కుల హననం రాజ్యాంగవాదం పేరుతో రాజ్యవాదంగా సృష్టిస్తున్న అమానవీయ హింసాకాండగా తేటతెల్లమవుతోంది. పౌరులపై ప్రభుత్వమే యుద్ధం చేసేందుకు ముందుకు రావడం, దానికి రాజ్యాంగవాదం వత్తాసు పలకటం వర్ధిల్లుతోంది. ఇది అత్యంత విచారకర అంశం. అందుకనే

తమిళనాడులో లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం, భారతదేశంలో సిపిఐ మావోయిస్టు సంస్థలు నిషేధిత సంస్థలు అయ్యాయి. నిజానికి శ్రీలంకలో కానీ, భారతదేశంలో కానీ, రాజ్యాంగ రచనా సమయంలో ప్రాంతాల వారీ ప్రజల మనోభీష్టాలకు అనుగుణంగా అప్పటి పాలకులు ప్రవర్తించలేదు. ఒక వేళ ప్రవర్తించినా, ఆది ఆచరణలో రుజువు కాలేదు. శ్రీలంకలో తమిళుల కనీస అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరించిన రాజ్యాంగం చివరికి రాజ్యవాదంగా మారిపోయిన నేపథ్యంలోనే అక్కడ పసిపిల్లలను సైతం తుపాకులతో కాల్చి చంపేస్తున్నారు. శ్రీలంకలో స్వజనమే శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సిన హీన, దీనమైన పరిస్థితులు ఉన్నాయి. సరిగ్గా ఇదే క్రమం ఇప్పుడు తూర్పు ఆసియా దేశాలన్నింటిలోనూ విస్తరిస్తోంది.

భారతదేశం విషయానికి వస్తే, వలసపాలనా కాలం నుండే బ్రిటన్ కంపెనీలకు అంటకాగిన శక్తులు, ఆధిపత్య శక్తులు, స్వాతంత్ర్యం తర్వాత మళ్లీ అధికారపు పంచల్లో చేరాయి. తద్వారా అవి రాజ్యాంగాన్ని సైతం ప్రభావితం చేశాయి. ఇది పౌరుల కనీస భద్రతకు గ్యారంటీ లేని పరిస్థితులను కల్పిస్తోంది. నిజానికి తూర్పు ఆసియాలోని అనేక దేశాలలోని రాజ్యాంగాలు ప్రజలకు కల్పించిన ఎన్నో ఆశలను నెరవేర్చలేకపోవడమే కాదు, చివరికి రాజ్యాంగ ఆశయాలను ప్రజలకు కేవలం రాజ్యాంగ భ్రమల కింద దిగజార్చేశారు.మన దేశంలో అయితే రాజ్యాంగ ఆచరణను నీరుగార్చిన పాలకులు రాజ్యాంగ క్రియాశీలతను నిర్రపుచ్చడం ద్వారా మత, కుల ఉన్మాదాలకు ఊతగా నిలిచారు. దేశాన్ని మతోన్మాద, కులోన్మాద దాడులకు ఎరగా వేశారు. చివరికి ప్రజలు తమ ప్రాథమిక హక్కులను సైతం కోరకుండా 'ఎమర్జెన్సీ' చట్టాలను తెచ్చుకుని సొంత జనం మీదే యుద్ధం చేస్తున్నారు. తమకు ఓట్లేసి చట్టసభలకు పంపిన జనాల మీదే గుర్రాలను నడిపిస్తున్నారు. హక్కుల కోసం ఉద్యమించే ప్రజల మీద పోలీసులు, సైన్యం తుపాకీ గుండ్ల వర్షం కురిపిస్తూ దేశంలోనే అంతర్గత యుద్ధాన్ని నడుపుతోంది ఎవరి కోసమో మనం గ్రహించాలి. చివరికి ఈ హింసను చట్టబద్ధం చేస్తుండడం ఎవరి ప్రయోజనాల కోసమన్నది కూడా తెలుసుకోవాలి. 1960 ప్రాంతాల నుండి ఆసియాలోని ఏ దేశాల పరిస్థితులను అవలోకించినా ఈ సత్యం బోధపడుతోంది. గడచిన ఐదు దశాబ్దాల కాలంలో ఈ ధోరణి మరింతగా ఊడలు దిగి విస్తరిస్తుండడం రాజ్యాంగం మాస్క్‌తో రాజ్యవాదం చేసే ఎంఎన్‌సి విన్యాసాలుగా మనం తెలుసుకోవాలి.

రాజ్యాంగ సవరణలకు పార్లమెంటును ఉపయోగించుకుంటూ రాజ్యాంగ వాదంను రాజ్యవాదంగా పాలకులు దిగజార్చేశారు. పెట్టుబడిదారుల కనుసన్నల్లో పాలకులు కట్టుదిట్టంగా పనిచేస్తూ స్విస్‌బ్యాంకుల ఖాతాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా జరుగుతున్న తతంగమే ఇదంతా. చివరికి రాజ్యాంగ ఆచరణలో క్రియాశీల పాత్ర నిర్వహించాల్సిన కోర్టులను సైతం రాజ్యాంగం కల్పించిన హక్కులను నిలువరించేందుకు ఉపయోగించుకోవడం విస్తుగొలిపే అంశం.

శ్రీలంకలో తమిళ పౌరుల చైతన్యాన్ని చట్టబద్ధంగా అణచివేస్తున్నదీ ఈ రాజ్యాంగవాదమే. అక్కడి ప్రభుత్వాన్ని విమర్శించే ఏ విభాగమయినా తర్వాత కొద్దిరోజుల్లో రాజ్యాంగవాద దుశ్చర్యలకు బలికావాల్సిందే అన్నట్టుగా అక్కడి పాలకులు రాజ్యాంగాన్ని రాజ్యవాదంగా మార్చేశారు.

ఇటీవల కాలంలో చాలా దేశాలలో పౌరుల సామాజిక చేతనని అణచివేసేందుకు రాజ్యాంగవాదం అండగా నిలబడటమే అత్యంత విచారకమైన అంశం. ప్రజల్లో అంతకంతకూ పెరుగుతున్న ప్రశ్నించే తత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించాలన్న సంకల్పం తప్ప మరొకటి లేనట్టుగా రాజ్యాంగవాదాన్ని జనం ప్రాణాలమీద నడిపిస్తున్నారు.

మరీ ముఖ్యంగా తూర్పు ఆసియా దేశాలలో అనువర్తించబడుతున్న రాజ్యాంగవాద చట్టాలు అన్యాయాలకు, హింసా వాతావరణ వ్యాప్తికి తోడ్పాటునిస్తుండే స్వభావాన్ని విస్తరింపజేయటాన్ని మనం గుర్తించవచ్చు. ఇది మరింత ప్రమాదకరమైన అంశం. భారతదేశం, చైనా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాలలో సర్వసాధారణంగా పెరిగిపోతున్న ఈ వాతావరణం వెనుక ఉన్నది పెట్టుబడిదారీ వాదమేనని స్పష్టంగా నిర్ధారణ అవుతోంది. వలసవాద ధోరణులు ఇంకా ఈ దేశాలలో అంతకంతకూ పెరిగిపోతూ, పాలకులు ఈ దేశాల పాలిట సైతాన్‌లయ్యారు. దానికి ఇప్పుడు మరో రకంగా 'గ్లోబల్ ఎకానమీ'అనే పేరు తగిలిస్తున్నారు. ఈ దుర్మార్గ ఆధునిక వలసవాదం కనుసన్నల్లో ప్రభుత్వాలను ప్రయాణింప జేస్తున్నాయి. మనం వలసవాదం నుంచి నయా వలసవాదం వైపు వేస్తున్న అడుగుల్లో అన్నిచోట్లా సామాన్య పేదజనాల శవాలే అగుపిస్తాయి. భూస్వామ్య విధానపు కాలిగిట్టల కింద పడి గిలగిలా కొట్టుకుంటున్న సందర్భంలోంచి ఆధునిక వలసవాదం మార్కెట్‌కు వెన్నెముక అయిన పెట్టుబడిదారులు ఎన్నికల ప్రక్రియను తమ చేతుల్లోకి తీసుకుని చట్టసభలను తమ అదుపాజ్ఞల్లో ఉంచుకుని 'రాజ్యాంగవాద'పు కనీస బాధ్యతల నిర్వహణకు సైతం కాలడ్డంపెడుతున్న విచిత్రకర పరిస్థితి ఇవాళ ప్రపంచంలో తాండవిస్తున్నది. విచిత్రంగా అనేక దేశాల్లోని సామాజిక – సాంస్కృతిక – జాతీయవాద ఉద్యమాలన్నీ ఆధునిక వలసవాదం సృష్టిస్తున్న పెనువిలయంలో నామరూపాల్లేకుండా కొట్టుకు పోతుండడాన్ని మనమంతా గుడ్లప్పగించి చూడాల్సిన విపత్కర పరిస్థితి వర్తమానంలో ఉంది.

బలిసిన వ్యాపారవేత్తలు – పారిశ్రామిక దిగ్గజాలు – స్వార్థంలో పునీతమయ్యే కొత్త మధ్యతరగతి – పెట్టుబడి స్వభావంతో ఎదిగొచ్చిన కొత్తతరం ఐఏఎస్ అధికారులు, వీళ్లందరి మధ్య సమన్వయం కుదిర్చే 'కన్సెస్ట్' ప్రొఫెషనలిస్టులు – జాతీయనాయకులు – వాళ్ల స్పాన్సర్డ్ ఉద్యమాల మధ్య రాజ్యాంగవాదం పూర్తిగా రాజ్యవాదంగానే తయారయ్యింది. వీళ్లందరి మధ్య నిరాటంకంగా, సజావుగా జరిగే వ్యాపారానికి కాపలాకాసే సంస్థగా పార్లమెంటును వినియోగించుకోవడం ఈ దశాబ్దపు నూతన పరిణామం. దీనిని ఆచరించే క్రమంలో ఎవరూ కనీసంగా అడ్డగించకుండా ఉండేందుకు పోలీసు, మిలటరీ వ్యవస్థను వినియోగించుకుంటున్నారు.

ఇప్పుడు ఆసియాలోని అన్ని దేశాల ప్రజలు వీటన్నింటి మధ్య నలిగిపోతూ ఊపిరుండగానే స్వయంగా మరణాన్ని ఆహ్వానించాల్సిన విషాదకర పరిస్థితిలోకి నెట్టివేయబడుతున్నారు. రాజ్యాంగవాదం చివరికి తననుతాను కోల్పోయి, తన సృష్టికర్తల ఆశయాల ఛాయగా కూడా మిగిలే పరిస్థితుల్లో లేదు. రాజ్యాంగవాదం తనను భయపెట్టే తన నీడకింద రక్షణలేని వివస్త్రగా కూలబడుతోంది.

అయితే, నిర్ణయాలు జరిగేది చట్టసభల్లోనే అయినా, వలసవాద మాధ్యమం ఎంతగా గందరగోళం సృష్టించినా, తమ నొసటిని అస్తవ్యస్తం

చేస్తున్న భ్రాతలెవరో కొన్నిచోట్ల ప్రజలు తెలుసుకుంటున్నారు. అందుకే మొత్తంగా ఇప్పుడు తూర్పు ఆసియా దేశాల్లో ప్రజలు ఉద్యమాల గమ్యాన్ని, గమనాన్ని తెలుసుకుంటున్నారు. సామాన్య ప్రజలు అసాధారణ విప్లవ పోరాటంలో మగ్నం కావడానికి చూయిస్తున్న ఉత్సాహాన్ని పులకాంకిత కళ్లతో వీక్షించేందుకు మధ్యతరగతి మేధావులకు ఆచరణలో సాధ్యపడడం లేదు. సరికదా, ప్రాథమిక హక్కులకు నిరంతరం భంగపాటు తప్పడం లేదు.

2007లో నేపాల్‌లో అక్కడి ప్రజలు ప్రభుత్వం రాజ్యాంగాన్ని సంస్కరించాలనే నిర్ణయాన్ని వెలువరించడమే కాక, తద్వారా రాజ్యాంగాన్ని పునర్నిర్మించే ప్రక్రియను కూడా ప్రారంభించాలని సూచించారు. తద్వారా నూతన నేపాల్ అస్తిత్వాన్ని ఆవిష్కరించాలని వారు ఆశించారు. అయితే, అస్తిత్వ గుర్తింపు, మనుగడ అనేది ఆయా చైతన్య భావాల మీద ఆధారపడిఉంటుందన్న నిజాన్ని వాళ్లు గ్రహించలేకపోయారు.

ఇక భూటాన్ దేశ ఐదవ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యాల్ వాంగ్‌ఛుక్ హయాంలో, 2008జులైలో రాతపూర్వ రాజ్యాంగాన్ని ఆమోదించారు. అయితే, అక్కడ మెజారిటీ ప్రజలు రాజకీయ సంస్కరణలు కోరుకుంటూనే ఉన్నారు. ఇలా రాజ్యాంగానికీ, రాజకీయాలకు పొసగని వాతావరణం అక్కడ పుష్కలంగా కనిపిస్తోంది. అక్కడి అధికార మతం బౌద్ధం. రాజ్యాంగాన్ని రాసేటప్పుడు ప్రజల సంక్షేమం – సమానత్వం – సమాన అభివృద్ధి అనే ఆశయాలు లక్ష్యంగా ఉండాలే తప్ప మెజారిటీ మత భావనలు రాజ్యాంగంలోకి చొప్పించబడకూడదనే భావనలు ఇప్పుడా దేశంలో మెజారిటీ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. విచిత్రంగా ఇప్పుడు వాళ్లు భారత రాజ్యాంగాన్ని అనుసరించాలనే ఆలోచనలో కూడా ఉన్నట్టుగా తెలుస్తున్నది.

శ్రీలంకలో అన్ని మతాలకు సమాన ప్రాతినిధ్యమనే భావన ఉండేది. కానీ, జాతుల మధ్య సమన్వయాన్ని అక్కడి రాజ్యాంగం సాధించ లేకపోయింది. అదే క్రమంలో భారత రాజ్యాంగంలోని 'లౌకిక విధానం' ప్రపంచంలో గొప్పగా కీర్తించబడుతున్నప్పటికీ అది ఆచరణలో మత ఉన్మాదానికి, న్యాయస్థానాల రక్షణ లభించేలా చూడటమే దాని అనేక వైఫల్యాలకు కారణంగా కనిపిస్తోంది.

సమాజంలోని ప్రతి తెగ, జాతి, సమూహం, మనిషి హక్కులకు భద్రతను కలిగించే, పారదర్శకతను కలిగివుండే రాజ్యాంగాల అవసరం ఇప్పుడు అత్యంతావశ్యకం. ప్రజలందరి మనోభావాలను గుర్తించి గౌరవించగలిగేది, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అసమానతలను నిక్కచ్చిగా నిర్మూలించగలిగేది, అంతర్జాతీయ మానవ హక్కుల దృక్పథం ఆచరణలో ప్రతిఫలించే రాజ్యాంగాలు ఈ కాలపు అవసరాలు. ఇవే ఆయా దేశాలలోని మైనార్టీల హక్కులకు మరింత రక్షణ కల్పించే చొరవను, చురుకుతనాన్ని, తెగువను ప్రదర్శించగలిగేవి. ఆయా దేశాలలోని విభిన్న సమాజాల్లో తలెత్తుతున్న వివిధ రకాల ఉద్యమాలను గుర్తించి, వాటి డిమాండ్‌లకు అనుగుణమైన సవరణలు, మార్పులు, సమీక్షలు చేసుకునేందుకు రాజ్యాంగవాదం సంసిద్ధం కావాలి. అవకాశవాద రాజకీయ బేహారుల అవసరాలు తీర్చే అమ్మకపు సరుకుగా రాజ్యాంగవాదం కుదించుకుపోకూడదు. మత స్వేచ్ఛ మితిమీరి ఉన్మాదంగా మారని ఆశయం ఆచరించపడాలి.

ఇండియాలో నెహ్రూ నుండి రాజీవ్ దాకా, పాకిస్తాన్‌లో జనరల్ అయూబ్‌ఖాన్ నుండి జియావుల్ హుక్ దాకా, మెజారిటీ మతానుకూల సవరణలతో రాజ్యాంగవాదాన్ని మరింతగా కఠినతరం చేయడం వల్లే ఈ దేశ వాసులకు తర్వాత కాలంలో బతికే మార్గమే లేని శాపంలా మారిపోయింది. ఆ తర్వాత అక్కడ బెనజీర్‌భుట్టో – ఇక్కడ పి.వి. నరసింహారావులు సంకీర్ణ రాజకీయాల త్రాసులో తమ అధికారాన్ని కాపాడుకోవడానికి మెజార్టీ ప్రజల మతానుకూల చట్టాలను ప్రజలందరిపై బలవంతంగా రుద్దారు. అప్పట్లో వాళ్లు తమకుర్చీని పదిలం చేసుకోడానికి చేసిన చేష్టలే ఇప్పుడు ఈ రెండు సమాజాలను అప్పటి పరిణామాలు ఇప్పుడు మరింతగా పతనావస్థలోకి నెట్టేశాయి. హిందూ సక్సెషన్ (సవరణ) చట్టం–2005 తర్వాత కాలపు దుందుడుకు పరిణామాలకు మరింతగా తోడ్పాటునిచ్చింది.

అటు పాకిస్తాన్, ఇటు ఇండియాలలో మత స్వేచ్ఛ అనేది మెజారిటీ మతస్థులపై అరాచకాలు చేయడానికి ఉపయోగకరంగా మారింది. ఆధునిక వలసవాద సమాజంలో భావప్రకటన స్వేచ్ఛను సైతం కంట్రోల్ చేసే విధంగా రాజ్యాంగవాదం ప్రస్తుత రాజ్యవాదంగా విస్తరించింది. తద్వారా పాలకులకు అనుకూలమైన విధానంగా రాజ్యాంగవాదం మారిపోయింది. విచిత్రమేమంటే అప్పుడెప్పుడో స్వాతంత్ర పోరాట సమయంలో, ఎమర్జెన్సీ రోజుల్లో అమలు అయ్యిన144సెక్షన్‌ను ఇప్పుడు ప్రతి సందర్భంలోనూ జిల్లా స్థాయిలోకి కూడా దిగజార్చేసి వలసవాద చట్టాలను స్వాతంత్రం తర్వాత 65ఏళ్ల తర్వాత కూడా నిరాటంకంగా వర్తింపజేయడం ఏ ప్రయోజనాల కోసమో మనం తెలుసుకోవాలి. చిన్నిచిన్న అనిశ్చిత పరిస్థితులను సైతం పరిష్కరించలేక అన్ని సందర్భాల్లో 144 సెక్షన్‌ను విధించి కుదేలయ్యే రాజకీయ నేతలు సామాన్య జనాల బతికే హక్కును సైతం సహజంగా హరించివేయాలనుకోవడాన్ని ప్రజలు తెలుసుకోవాలి. రాజ్యవాదానికే రాజ్యాంగవాద న్యాయసూత్రాలు గొడుగు పడుతుండడం ఎందుచేతనో మనం వితర్కించుకోవాలి. రాజ్యాంగవాదం రాజ్యవాదంగా మారిపోయిన పరిస్థితులు ఆసియా, ఆఫ్రికాలలో ప్రజాకాంక్షలు గుర్తించలేక, న్యాయస్థానాలను జడత్వం ఆవరిస్తున్నది. ఈ పరిస్థితులను ప్రజలు, విజ్ఞులు,యువతరం తెలుసుకోవాలి. రాజ్యాంగవాద జడత్వాన్ని ప్రశ్నించాలి. రాజ్యాంగవాదం పేరుతో రాజ్యవాదం చేస్తున్న నిరాటంక హింసను నిరసిస్తూ ఉద్యమించాలి. అప్పుడే వలసవాదం నుండి, విస్తరిస్తున్న సామ్రాజ్యవాదం నుండి కొద్దిగానైనా ప్రజల్ని, మనల్ని మనంగా కాపాడుకోగలుగుతాం.

(రచయిత లెక్చరర్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

ఇటీవల పోస్టల్ శాఖ అన్ని మనీ ఆర్డర్‌లను టెలిగ్రాఫిక్ మనీ ఆర్డర్‌లుగా పంపుతున్నది. మీరు ఎం.ఒ. చేసినప్పుడు కింద కూపన్‌లో రాసిన ఉత్తరం, సమాచారం ఈ టెలిగ్రాఫిక్ ఎం.ఒ.లో మాకు చేరదు. కనుక ఎం.ఒ.లు చేసేవారందరూ విడిగా ఒక పోస్ట్‌కార్డు రాయడం గానీ, ఫోన్ చేసి చెప్పడం గానీ చేయాలి. అలాగే, బ్యాంక్ అకౌంట్‌లోకి నగదు బదిలీ చేసినప్పుడు అది ఎందుకో వివరాలు వీక్షణం కార్యాలయానికి ఫోను ద్వారా గాని, కార్డు ద్వారా గాని తెలపాలి. – సం.

హిందూ తీవ్రవాదమే అసలైన ముప్పు

***దేశంలో అంతర్గత తీవ్రవాదం, మైనారిటీ తీవ్రవాద ముప్పు పొంచి ఉందంటున్న ప్రధాని, ఎన్నో దశాబ్దాలుగా పెచ్చరిల్లుతున్న హిందూ తీవ్రవాదాన్ని విస్మరిస్తున్నారని అంటున్నారు* ఎం.కె. కుమార్**

జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ చింతన్ శిబిరంలో కాషాయ తీవ్రవాదం గురించి చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. గాంధీవర్ధంతి సందర్భంగా ప్రాధాన్యతను కూడా సంతరించుకున్నాయి. దేశ అంతర్గత భద్రతకు హిందుత్వ తీవ్రవాదం పెనుసవాలుగా నిలిచిందనే అవగాహనను గత కొన్నాళ్లగా కాంగ్రెస్ ప్రస్తావిస్తూ వస్తోంది.

జనవరిలోనే మజ్లిస్ నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ మతభావాలు రెచ్చగొట్టేలా మాట్లాడటాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని అరెస్టుచేసింది. సంక్రాంతి నాడు శ్రీశైలంలో స్వామి కమలానంద భారతిని ఒవైసీ తరహా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడని అరెస్టుచేయడంతో, హిందుమతంపై దాడిగా హిందుత్వవాదులు దాన్ని చిత్రీకరించారు. వీటన్నిటకీ ఉత్ప్రేరకంగా పనిచేసిన అంశం ఒకటుంది. హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్‌ను ఆనుకుని వెలిసిన భాగ్యలక్ష్మి ఆలయ అంశంపై చెలరేగిన వివాదాలు ఇంకా కొనసాగుతూనే వున్నాయి. ది హిందూ పత్రిక ప్రచురించిన ఫోటోలతో అసలు వ్యవహారం బయటపడింది. 50 ఏళ్ల క్రితం భాగ్యలక్ష్మి ఆలయం అక్కడ లేదనేది తెలిసిన తర్వాత హిందుత్వ శక్తులు గమ్మున్నాయి. మరో అయోధ్య తరహా వివాదంచేయాలని, దానిద్వారా అధికారం పొందాలనే కుటిలయత్నాలకు ప్రయత్నించిన హిందుత్వ శక్తులు తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయాయి.

మహారాష్ట్రలోని భోకర్ వద్ద విశ్వహిందు పరిషత్ నాయకుడు ప్రవీణ్ తొగాడియా వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. అస్సాంలోని నెల్లి మారణహోమంలో మరణించిన 3,000 మందిలోను, బీహార్ భాగల్పూర్ మత ఘర్షణల్లోను, మొరదాబాద్, మీరట్, గుజరాత్‌ల్లో జరిగిన మతహింసలోను ఒక్క హిందువు లేరని, అందరూ ముస్లీంలేనని ప్రసంగించాడు. ఈ మారణహోమాల వెనుక హిందూమతోన్మాద శక్తులు వున్నాయని అతనే ఒప్పుకున్నాడు. ఇలాగే మాట్లాడే అశోక్‌సింఘాల్, ఆదిత్యనాగ్ యోగి, ఉమాభారతి, నరేంద్రమోడి, సాధ్విరితంభర, వరుణ్‌గాంధీ వంటివారిని ఈ లౌకికరాజ్యం అరెస్టులు చెయ్యదు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని గురించి పదే పదే మాట్లాడుతున్న హిందుత్వ శక్తులు, ముస్లింజనాభాలో ఒకవ్యక్తి తీవ్రవాదానికి పాల్పడితే మొత్తం ముస్లిం జాతికి నేరాన్ని అంటగట్టే పనిని దశాబ్దాలుగా ప్రణాళికాబద్దంగా అమలు పరుస్తున్నాయి. ఉన్మాదం మెజారిటీకి, మైనారిటీకి రెండింటికి అంటుకుని ఉంది. మెజారిటీగా హిందువులు ఉన్న భారతదేశంలో, వారిని అడ్డుపెట్టుకుని హిందూత్వశక్తులు కుతిలయత్నాలు చేస్తున్నాయి. భారతదేశాన్ని హిందూదేశంగా చేయాలనే కుట్ర దీనివెనకఉంది. సెప్టెంబర్ 8, 2006 నాటి మాలెగావ్, అక్టోబర్ 11, 2007నాటి అజ్మీర్‌లోని దర్గా, మే 18, 2007 న హైదరాబాద్ లోని మక్కామసీదు పేలుళ్ల సంఘటనలలో హిందుత్వ శక్తులకు సంభందాలున్నాయని కేంద్రం భావించి జాతీయ దర్యాప్తు సంస్థచే 2010లో విచారణకు ఆదేశించింది. ఫిబ్రవరీ 18, 2007 న అర్ధరాత్రి డిల్లీ–లాహోర్ సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలుపై జరిగిన దాడిలో 68 మంది ప్రజలు చనిపోయారు. ఈ దాడిలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఉందని కేంద్ర నిఘా వర్గాలు పేర్కొన్నాయి.

2008లో జాతీయ సమగ్రతా మండలి సమావేశంలో వామపక్షాలు హిందుత్వ తీవ్రవాద అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. 2003లో మహారాష్ట్రలోని పర్బని, జల్నా, జల్‌గావ్ జిల్లాల్లో, 2005లో ఉత్తర ప్రదేశ్‌లోని మౌజిల్లాలో, 2006లో నాందేడ్‌లో, 2008 తిరునల్వేలిలోని తెన్‌కాశిలో, 2008 ఆగస్టున కాన్పూర్‌లో జరిగిన వివిధ బాంబు దాడులలో ఆర్ఎస్ఎస్ మరియు బజరంగదళ్ పాత్ర నిరూపితమయ్యింది. గాంధీని, గాడ్సే హత్యచేసిన సందర్భంలో 1948, ఫిబ్రవరి 4లో అప్పటి హోంమంత్రి సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్ పై నిషేధాన్ని విధించారు. తీవ్రవాదానికి మతం రంగు పులమకూడదు. దేశ సమగ్రత, సమైక్యతలకు భంగం కల్గించే తీవ్రవాదాన్ని ఉపేక్షించకూడదు. భారతీయ సమాజంలో లౌకికతత్వం అంతర్లీనంగా ఉండటంవల్ల, మతాల మధ్య సామరస్యం సాధ్యమవుతోంది. భారతదేశంలో హిందుత్వ తీవ్రవాదం వల్లే ఇస్లామిక్ తీవ్రవాదం ఉద్భవించిందనే వాదన కూడా ఉంది. సావర్కర్ మొదటగా ఇస్లామిక్, హిందూ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. రాజకీయాన్ని హైందవీకరించి, హిందూవులను సైనికీకరించాలని 1935లోనే నాసిక్‌లో హిందూత్వ తీవ్రవాదానికి శిక్షణను ఇప్పించాడు.

హిందుత్వ తీవ్రవాది నాథూరాంగాడ్సే జనవరి 30, 1948న బిర్లామందిరంలో గాంధీజీ ప్రార్థనకు వెళుతుండగా గాంధీ గుండెలమీద, కడుపులోకి తూటాలను పేల్చాడు. 1934 నుండి 1948 మధ్యకాలంలో గాంధీజీపై 6 సార్లు హత్యాప్రయత్నం జరగ్గా, గాడ్సే పేరుతోపాటు సావర్కార్ పేరు కూడా ఈ కేసులలో ప్రస్తావించబడింది. ఇది హిందుత్వ ఉన్మాద కుట్రలో బాగంగా జరిగిందని కేంద్ర నిఘా సంస్థలు పేర్కొన్నాయి. హిందూ మతోన్మాద సంస్థలు గాందీజీపై కక్షకట్టి, గాంధీపై వ్యతిరేక భావాలను ప్రజల్లో ప్రచారానికి పెట్టింది. ముస్లింకు ప్రత్యేక దేశం, కాశ్మీర్‌పై తగునిర్ణయం, ముస్లింలను బుజ్జగించడం వంటి అంశాల విషయంలో గాంధీని దోషినిచేసే ప్రయత్నం చేసింది. గాడ్సే వారసత్వం ఇంకా కొనసాగుతూనేఉంది. ఈ ఉన్మాదం హిందువులందరికి ఆపాదించకూడదు. హిందూ మతోన్మాదం పట్ల ఉదారవాద వైఖరిని రాజ్యం అవలంబిస్తోంది.

హిందుత్వ ఉగ్రవాదానికి పునాదిని నయాఉదారవాద రాజ్యవ్యవస్థే కల్పిస్తుంది. ప్రజలను మతపరంగా విడదీసి, వారి మధ్య వైషమ్యాలను పెంచేవిధంగా ఉదారవాదం పరిపాలనను నిర్వహిస్తుంది. వర్ధమాన దేశాల్లోని బలహీనవర్గాల జీవనస్థితిగతులు నానాటికి దిగజారుతూ ఉన్నప్పటికి, వారిని రాజ్యానికి వ్యతిరేకంగా సంఘటితమయ్యే అవకాశాన్ని రాజ్యం బలహీనపరిచి, గుర్తింపు రాజకీయాలను ప్రోత్సహించి, కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతుంది. సామాజిక, ఆర్థిక వెనుకబాటుకు మతమే ప్రధానకారణమని ఉదారవాదం ఉద్బోదిస్తుంది. భారతీయత, భారతజాతి వంటి భావాలను హిందుత్వ భావజాలంలోనే అర్థం చేసుకునే విధంగా ప్రజలను పరిమితం చేస్తుంది. భగత్‌సింగ్, అల్లురిసీతారామరాజుకు

హిందూత్వ శక్తులు పూజలు చేయడం, భరతమాత చిత్రపటాన్ని రూపొందించి ఊరేగింపు చేయటం వంటివి ఈ కోవలోకే వస్తాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమైన, స్వాతంత్ర్య పోరాటంలోని భారతీయత భావనను క్రమేపి సామ్రాజ్యవాద అనుకూల నినాదంగా మార్చివేశారు.

హిందూ మతోన్మాదశక్తులు ఏకజాతీయ భావనను, యూరప్ ఫాసిస్టుల నుంచి దిగుమతి చేసుకున్నాయి. ఆధునిక జాతియతను మతపరంగా నిర్మించేక్రమాన్ని గోల్వాల్కర్, సావర్కర్‌లు మొదలుపెట్టారు. హిందూస్థాన్‌లో హిందూమతం, హిందూ సంస్కృతి, హిందీభాష కొనసాగాలని వీరు భావిస్తారు. ప్రొటెస్టంట్ మతాన్ని జర్మనీ, ఇంగ్లాండ్, స్వీడన్ అనుసరిస్తాయి. క్యాథలిక్ మతాన్ని ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ అనుసరిస్తాయి. వారి దేశాల్లో మైనారిటీ మతస్తులపై ఇప్పటికీ దాడులు జరుగుతూనే వున్నాయి. ఈ ఫాసిస్టు దోరణుల వల్ల ఆరు మిలియన్ల మంది యూదులు చంపివేయ బడ్డారు. భౌగోళికం, జాతి, మతం, సంస్కృతి, భాష అనే ఏకత్వాలను ఆర్ఎస్ఎస్ ప్రభోదిస్తుంది. సంస్కృతం మాతృభాషని, అన్ని భారతీయ భాషలు దీన్నుండే పుట్టాయనే అసత్య ప్రచారాన్ని చేశారు. స్థానిక భాష అయిన ఉర్దూని, విదేశీభాషను చేశారు. హిందూత్వ నమూనాను గుజరాత్‌లో అమలు చేస్తున్నారు. 2500 మంది మైనార్టీలను చంపివేశారు. 3500 కోట్ల రూపాయల ఆస్తిని కాల్చివేసి, 700 మసీదులను గుజరాత్‌లో కూల్చివేశారు. అయినా మోడీని భారత భావిప్రధానిగా మనం కీర్తిస్తున్నాం. లౌకికవాదాన్ని ఆర్ఎస్ఎస్ సహించ లేదు. పలుభాషలు, మతాలు, సంస్కృతులు ఉన్నా బహుళత్వ జాతి భావనను మతోన్మాదం ప్రమాదంలో పడవేసింది. గతాన్ని తమకణు గుణంగా ఉత్పత్తి చేసుకోవడం, ద్రావిడ వారసత్వాన్ని తిరస్కరిస్తూ మొహంజదారో, హరప్పాలను ఆర్యీకరించడం ఉధృతంగా జరుగుతోంది.

నయా ఉదారవాదానికి, ద్రవ్య పెట్టుబడికి మధ్యఉన్న సంబంధం ఆయా దేశాలలోని మెజారిటీ మతాన్ని ఫాసిజం వైపు మరలిస్తున్నాయి. ప్రపంచీకరణలో భాగంగా అమెరికా సామ్రాజ్యవాదాన్ని అనుసరించడం వల్ల దేశంలో లౌకిక వాదం ఆధునిక పోకడలను అలవర్చుకుని మెజారిటీ మతోన్మాదాన్ని బలహీనపరుస్తుందని అభిప్రాయపడుతున్నాం. దానికి విరుద్ధంగా మనదేశంలో జరుగుతోంది. జాతీయతను వదులుకుంటే తిరిగి వలస దేశంగా మారవలసివస్తుందని మెతకైన జాతీయరాజ్య విధానాన్ని అనుసరిస్తున్నాం. ఈ రాజ్యం మతోన్మాదానికి మద్దతు పలుకుతూ వారి మార్గానికి అడ్డురాకుండా ఉంటోంది.

మనదేశంలో 4,635 జాతుల సముదాయాలు వున్నాయి. ప్రతిజాతికి ప్రత్యేక వారసత్వ లక్షణాలు, భాష, సంప్రదాయాలు వున్నాయి. వీటిమధ్య పరస్పర సంభందాన్ని, పరస్పర ఆధారితస్థితిని కొనసాగిస్తూ, ప్రతి సంస్కృతి స్వతంత్రను గౌరవించాలి. భారతదేశంలో 325 భాషలు, 25 లిపులు వున్నాయి. ఈ భిన్నత్వాన్ని కొనసాగనీయకుండా ఫాసిస్టు ధోరణులను హిందుత్వశక్తులు అనుసరిస్తున్నాయి. రాజ్యవ్యవస్థ అనిశ్చితి స్థితికి నెట్టబడే ధోరణులు ఈ కాలంలో ఎక్కువవడానికి నయా ఉదారవాదం తనువంతు పాత్రను పోషిస్తోంది. నాగరికతకు పెద్ద స్థాయిలో సామూహిక మతిమరుపు ఉన్నది. ఇదే రాజ్యాన్ని అన్ని అవలక్షణాలతో గౌరవిస్తుంటుంది. అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బిజెపి మరోమారు హిందూత్వ అజెండాను ప్రయోగిస్తోంది. మతవిభజన తనకు అత్యంత అవసరం. మతతత్వం, ఛాందసవాదంతో కలిస్తే జరిగే విపరీతాలను మనం చూస్తూనే వున్నాం. తీవ్ర కుదుపులకు లోనవుతున్న దేశ లౌకికత్వాన్ని కాపాడే ప్రయత్నం హిందు-ముస్లీం సోదరులిరువురు చేయాలి.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

సమాచార హక్కు - రాజకీయ పక్షాలు

చట్టాలు కేవలం సామాన్య ప్రజల కోసమే తప్ప తమకు వర్తించకూడదనుకునే రాజకీయ పార్టీలు తమ ఆస్తుల, విరాళాల వివరాలు సమాచార హక్కు చట్టం కిందకి తేవడాన్ని వ్యతిరేకిస్తున్న తీరును వివరిస్తున్నారు **ఎ. రాజేంద్రబాబు**

తన కొక నీతి, ప్రపంచానికొక నీతి అన్న ద్వంద్వ ప్రమాణాలు మన వ్యవస్థలో వేళ్లునుకొని ఉన్నాయి. ఈ విషయాన్ని హాస్యం మేళవించి మన ఊర్లల్లో ఒక కథ చెపుతారు. ఒక అయ్యవారు వీధి రచ్చబండ దగ్గర ఉపన్యాసం ఇస్తూ ఉల్లిపాయలు ఎందుకు తినకూడదో (నిజానికి ఉల్లి ఆరోగ్యకరం) సోదాహరణంగా వివరించాడట. గుమ్మం చాటు నుంచి ఆ ఉపన్యాసం విన్న ఆయన ఇల్లాలు, ఇంటికొచ్చి ఉల్లిపాయ లేకుండా వంటవండితే భోజనం చేస్తూ ఆ అయ్యగారు 'ఓసి పిచ్చిదానా చెప్పే నీతులన్నీ పామరుల కోసమేనే! శుబ్బరంగా ఉల్లి వేసి కూరలు వండు. నీతులు చెప్పేది మన కోసం కాదు' అని హితోపదేశం చేశాట్ట. అట్లా ఉంది మన రాజకీయ పార్టీల వ్యవహారం. రాజకీయ పక్షాలు సమాచార హక్కు చట్టం కిందికి వస్తాయని కేంద్ర సమాచార కమిషన్ జూన్ నెల మొదటి వారంలో ఓ మంచి తీర్పు ఇచ్చింది. ప్రభుత్వ సమాచారం తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును చట్టబద్ధం చేసి భారత ప్రజాస్వామ్యంలో విప్లవాత్మక మార్పు తెచ్చినట్టు చంకలు గుద్దుకున్న రాజకీయ పక్షాలన్ని ఆ తీర్పుతో గొంతులో పచ్చి వెలక్కాయ ఇరుకొన్నట్టు కొట్టు మిట్టాడుతున్నాయి.

ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థకు చెందిన ఉద్యమకారులు సుభాష్ చంద్ర అగర్వాల్, అనిల్ బైర్వాల్ రాజకీయ పార్టీలను కూడ సమాచార హక్కు చట్టం పరిధిలోకి వచ్చేలా ఆదేశించమని కోరుతూ సమాచార కమిషన్ ముందు దావా వేశారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలకు కేంద్ర ప్రభుత్వం నుండి సాలీనా రు. 255 కోట్ల మేరకు రాయితీలు, మినహాయింపుల రూపంలో ఆర్థిక సహాయం అందుతుందని వారు పిటిషన్లో పేర్కొన్నారు. జాతీయ పార్టీలకు ఢిల్లీ నగరంలో రు. 2556.02 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అవన్ని కేంద్ర ప్రభుత్వం వాటికి ఉచితంగా కేటాయించినవే. ఎన్నికల సమయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ఆకాశవాణి, దూరదర్శన్‌లో గంటల తరబడి ఉచిత సమయాన్ని పొందుతాయి. పన్నుల మినహాయింపులయితే వందల కోట్ల రూపాయలలో ఉన్నాయి. ప్రభుత్వం నుండి ఎన్నో సౌకర్యాలు పొందుతున్నాయి. కాబట్టి రాజకీయ పక్షాలను కూడా ప్రభుత్వ సంస్థలతో సమానంగా పరిగణించి సమాచార హక్కు చట్టం పరిధిలోకి తేవాలని పిటిషర్లు వాదించారు.

ఈ తీర్పు రావడానికి దారి తీసిన పరిణామాలు కొంత ఆసక్తికరంగా ప్రారంభమయ్యాయి. దేశంలో నల్ల ధనాన్ని వెలికి తీసే అంశాన్ని ఎన్నికల్లో ప్రధాన సమస్యగా తీసుకొని పోరాడుతామని ప్రకటించిన భారతీయ జనతా పార్టీ, తన ఆస్తులు, సంపదను బయట పెట్టాలని ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ సమాచార హక్కు చట్టం కింద అర్జీ పెట్టింది. ఆ దరఖాస్తును భాజపా నిర్ద్వంధంగా తోసిపుచ్చగా, ఆ సంస్థ కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, సిపిఐ, ఎన్‌సిపి, బిఎస్‌పి పార్టీలు కేంద్రం నుండి వివిధ రూపాలలో పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం పొందుతున్నాయి. కాబట్టి, వాటిని ప్రభుత్వ సంస్థలతో సమానంగా సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకు రావాలని కేంద్ర సమాచార కమిషన్ ముందు పిటిషన్ వేసింది. తమవి ప్రభుత్వ సంస్థలు కాదు. కాబట్టి తమ ఆర్థిక వనరుల మూలాలు బహిర్గత పరచాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నుండి అమితంగా లాభం పొందుతున్న ఈ పార్టీలు తమ ప్రతివాదనను వినిపించాయి.

'ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు పారదర్శకత ఉండడం అవసరం అని సుభాషితాలు చెప్పి, అన్ని ముఖ్యమైన ప్రభుత్వాంగాలను నియంత్రించే రాజకీయ పార్టీలు, తమకు మాత్రం పారదర్శకత అవసరం లేదని భావించడం వింతగా ఉంది' అని తన తీర్పులో కమిషన్ వ్యాఖ్యానించింది. ఈ ఆరు ప్రతివాద రాజకీయ పార్టీలు తమకు స్వచ్ఛంద విరాళాలు ఎన్ని లభించాయో, దాతల పేర్లు వారి చిరునామాలతో సహా వెల్లడి చేయాల్సిందేనని తమ తీర్పులో ఉటంకించారు.

మొదట ఈ తీర్పును ఆహ్వానించిన బిజెపి ఆ తర్వాత నాలుక కరుచుకుంది. 'తీర్పు అస్పష్టంగా ఉంది. కేంద్ర సమాచార కమిషన్ పాత్ర ఏమిటి, ఎన్నికల కమిషన్ విధులేమిటో ముందు తేల్చండి. రాజకీయ పార్టీలు పారదర్శకంగా ఉండాలని, అవి ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయంలో మాకు పేచీ లేదు. ఎన్నికల వ్యవస్థ సూచించే మార్గదర్శక సూత్రాలను మేము అనుసరిస్తూనే ఉన్నాం. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వాలి' అని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి నిర్మలా సీతారామన్ అభిప్రాయం వ్యక్త పరిచారు. సిపిఎం మొహ మాటం ఏమీ లేకుండా తీర్పును తోసి పుచ్చింది. 'ఈ తీర్పును మేం ఆమోదించలేం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల పాత్రపై సమాచార కమిషన్‌కు చాలా అపోహలు ఉన్నట్లున్నాయి' అని సిపిఎం తీర్మానించింది.

తీర్పు గురించి మాట్లాడుతూ విదేశాంగ శాఖ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ 'శాసనం విశృంఖలంగా ప్రవర్తించడాన్ని అనుమతించ కూడదు' అని అన్నాడు. దేశ ప్రయోజనాలు కాపాడవలసిన రాజకీయ పార్టీలకు ప్రజల నుండి దాచుకునే రహస్యాలు ఉండకూడదని తీర్పునిస్తే అది విశృంఖలత్వం ఎలా అవుతుందో ఖుర్షీద్ గారికే అర్థం కావాలి.

'రాజకీయ పక్షాలు బజారులో ఉండే దుకాణాల లాంటివి కావు. ఈ తీర్పు సమర్థనీయం కాదు' అని జనతా దళ్ అధ్యక్షుడు శరద్ యాదవ్ వ్యాఖ్యానించారు. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ రంగంలో న్యాయవర్తనను కాపాడడం' కోసం ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి ఒక విధాన రూప కల్పన చేయాలని స్థూలంగా పార్టీలన్నీ ఒక అభిప్రాయానికొచ్చాయి.

'ప్రజల భాగస్వామ్యంతో కూడినదే నిజమైన ప్రజాస్వామ్యం' అని 'ప్రభుత్వ పని తీరును తెలుసుకునే అద్భుతమైన అధికారం సమాచార హక్కు చట్టం ప్రజల కిచ్చిందని' ఇంత వరకు రాజకీయ పక్షాలు చెప్పిన వన్నీ వట్టి నేతి బీరకాయ కబుర్లని ఈ పార్టీలన్నీ చెప్పకనే చెప్పాయి. తమకు ఏఏ కార్పొరేటు సంస్థ నుంచి ఎంత మొత్తం ముట్టిందో సమాచార

నిర్బంధంలో అసెంబ్లీ

***ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు, తమ ఆకాంక్షను వెలిబుచ్చడానికి వచ్చిన తెలంగాణ ప్రజలను అణచివేయడం అప్రజాస్వామికమంటున్నారు* కె. ప్రభాకర్**

ఆకలైన బిడ్డ అరవడం ఎంత సహజమో, ఆకాంక్షల్ని వెలిబుచ్చడానికి ప్రజలు ఆందోళనలకు పూనుకోవడం అంతే సహజం. ప్రజలు ఈ గడ్డమీద పుట్టినందుకు, ఆరు దశాబ్దాలుగా తాము అనుభవిస్తున్న వివక్ష, దోపిడి అణిచివేత అన్యాయాలకు వ్యతిరేకంగా మాట్లాడడం, పోట్లాడడం కొత్తేమి కాదు.

ప్రజల ఆర్తనాధాలను వినడానికి అట్లాంటి ప్రజాస్వామిక ప్రభుత్వాలకు ఓ అరుదైన అవకాశం. ప్రజల పోరాటాల్ని అర్థం చేసుకోవడానికి, కాని ఇవాళ నిత్యం ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, స్వేచ్ఛ స్వాతంత్ర్యాల గూర్చి అభివృద్ధి పథకాల గురించి పాలకులు ఏకరువు పెడుతున్నారు . అదే కోవలో అవి ప్రజలకు అందుబాటులోకి రానప్పుడు ప్రభుత్వాలను నిలదీసి అడిగే స్వేచ్ఛ, హక్కుంటుందని గుర్తించలేక పోవడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలివ్వడమే తప్ప మరోటి కాదు.

ఆ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు నుండే తెలంగాణ ఓ ప్రత్యేక సర్వ స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ప్రాంతమని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా 'ఆంధ్ర'ప్రదేశ్‌లో విలీనం చేయడాన్ని వ్యతిరేకించడం, పోరాడడం, వివక్ష దోపిడీలకు వ్యతిరేకంగా నెత్తుటి తర్పణ చేసే వరకు కొనసాగుతూనే ఉన్నది.

అట్లాంటి నేపథ్యంలో నుండే సాగుతున్న పోరాటం ఈ ప్రాంత వనరులు, నిధులు, నదులు, కొలువులు, చదువులు, వైద్యం, బొగ్గు, గనులు తదితర విద్యుత్, వ్యవసాయ రంగాల్లో కొనసాగుతున్న పాలకుల వివక్ష దోపిడికి వ్యతిరేకంగా నిరంతరాయంగా అలుపెరుగని పోరాటం చేస్తున్న ప్రాంతం తెలంగాణ.

1969లో ఇక్కడి ప్రాంత బిడ్డల ఉద్యోగాలు ఇక్కడి వాళ్లకే చెందాలని ఇక్కడి బొగ్గు ఇక్కడే విద్యుత్ ఉత్పాదన, ఇక్కడి పరిశ్రమలకే తోడ్పడాలని ఈ ప్రాంత భూముల్ని, గనుల్ని, నీళ్లను కొల్లగొట్టడం, తరలించడం ఆపివేయాలని నిరంతరం ఈ ప్రాంత ప్రజలు అనేక రూపాల్లో పోరాడుతూనే ఉన్నారు.

అట్లాంటి ప్రజా చైతన్యంతో ఇక్కడి వివక్ష దోపిడీలకు వ్యతిరేకంగా

చట్టం ద్వారా ప్రజలు తెలుసుకొనే అవకాశం ఉంటుందనే కదా వాటి భయం? కార్పొరేటు కంపెనీల నుంచే కాదు విదేశీ శక్తుల నుండి కూడా విరాళాలు రావచ్చు. వాటితో లాభం పొందిన వాళ్లు వాళ్లకు వ్యతిరేకంగా చట్టాలు ఎలా చేస్తారు? అన్న ప్రశ్న ప్రజల మెదళ్లలో ఉదయించక మానదు కదా! ఈ తీర్పు అమలయితే రాజకీయ పార్టీలు ఎన్నికలలో అభ్యర్థులను ఎలా ఎంపిక చేస్తున్నాయి. టికెట్ల కేటాయింపులో ఏ విధానాన్ని అవలంభిస్తు న్నాయి అన్న విషయాలు కూడా గోప్యంగా ఉంచడానికి వీలుండదు.

'మా పార్టీ మా ఇష్టం. మేం అన్ని విషయాలు ప్రజలకెందుకు చెప్పాలి' అని రాజకీయ పార్టీలు ఇప్పుడెలా భావిస్తున్నాయో సమాచార హక్కు చట్టం వచ్చిన కొత్తలో ప్రభుత్వ సిబ్బంది అలానే ఫీలయ్యారు. తమ వ్యక్తిగత పని పద్ధతులలోకి ఒక దురాక్రమణలాగా అభిప్రాయపడింది అధికార గణం. వలస తత్వాన్ని వంటపట్టించుకున్న భారత ఉద్యోగస్వామ్యం గోప్యతను ఇష్టపడుతుంది. వ్యవస్థ కంటే, చట్టం కంటే గొప్ప అనుకునే మనస్తత్వానికి సుప్రీంకోర్టు న్యాయ మూర్తులేం అతీతులు కారన్నది కూడా ఈ సందర్భంలోనే బయట పడ్డది. సమాచార హక్కు చట్టంలోని నిబంధనల ప్రకారం ఒక దరఖాస్తును పరిష్కారించాల్సిందిగా కేంద్ర సమాచార కమిషన్ సూచనను సాక్షాత్తు సుప్రీంకోర్టే కింది కోర్టులో సవాలు చేసిన సంఘటన మన కళ్ల ముందుంది. ఆ తర్వాత సుప్రీంకోర్టు కొంత తగ్గి న్యాయమూర్తుల ఆస్తి వివరాలను బహిరంగ పరచాలని నిర్ణయించింది.

ఈ తీర్పుతో పరిస్థితి ఆశాజనకంగా మారుతుందా అన్నది మిలియన్ డాలర్ల విలువ చేసే ప్రశ్న. తీర్పు అమలు కాకుండా ఉండడానికి యంత్రాంగం సవాలక్ష అడ్డంకులు సృష్టిస్తుంది. సమాచార హక్కు చట్టం ఎలా పనిచేస్తుందో పరీక్షించడానికి గతంలో రాజ్యసభ సభ్యుడు మైసూరారెడ్డి 26 రాష్ట్రాల సమాచార కమిషనర్లకు ఒక సమాచారం కోసం అప్లికేషన్ పెట్టుకున్నాడట. అందులో 17 రాష్ట్రాలు ఆ దరఖాస్తును పట్టించుకోనే లేదట. మిలిగిన 9 రాష్ట్రాలు ఆ దరఖాస్తు చేరినట్టు అయితే సరి పోయిన సిబ్బంది, ఆర్థిక వనరులు లేక సమాచారం ఇవ్వలేక పోతున్నందుకు విచారం వ్యక్తం చేశాయట. ఆ మిగిలిన ఒక్క రాష్ట్రం, మహారాష్ట్ర, సరైన సమాచారం సరైన పద్ధతిలో అందజేసింది. పదవి విరమణ అయిన బ్యూరోక్రాట్లకు, పునరావాస కేంద్రాలుగా సమాచార కమిషన్ కార్యాలయాలు మిగిలి పోవడం, సమాచార హక్కు చట్టం సరిగ్గా అమలు కాకపోవడానికి ముఖ్య కారణంగా భావించవచ్చు. అసలు పదవి విరమణ అయిన అధికారిని, సమాచార కమిషన్‌గా నియమించరాదన్న నిబంధనను చట్టంలో పొందు పరచాలి. అలాగే ఏ అధికారిని తన స్వంత రాష్ట్రంలో సమాచార కమిషనర్‌గా నియమించడాన్ని నిషేధించాలి.

ఈ తీర్పు వెంటనే అమలు కాకుండా ఏకపక్షంగా నిలుపుదల చేసే ప్రయత్నానికి రాజకీయ పార్టీలు ఒడిగట్టవచ్చునన్న అనుమానంతో పిటిషనర్లు ఢిల్లీ కోర్టులో కేవియట్ దాఖల్ చేశారు. కాబట్టి వెంటనే స్టే వచ్చే అవకాశం లేదు. అయితే ప్రజల ముందు పలుచనయిపోతామన్న భయంతో రాజకీయ పక్షాలు కోర్టులో ఈ తీర్పును వ్యతిరేకించక పోవచ్చు. ప్రభుత్వం ద్వారానే ఈ తీర్పును అటకెక్కించే ప్రయత్నం జరిగే ఆస్కారం ఉంది. అలాంటి నీచపు పద్ధతులకు పాల్పడకుండా ప్రజాస్వామ్య ప్రియులు, ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలి. రేపు రానున్న ఎన్నికల్లో ప్రతి పార్టీని వాటి ఆదాయం ఎంత, విరాళాలు ఎక్కడ నుంచి వస్తున్నాయి వారు ఎవరి ప్రయోజనాలు కాపాడుతారో స్పష్టంగా ప్రకటించమని ప్రశ్నించాలి.

(రచయిత రిటైర్డ్ ఇంగ్లిష్ అధ్యాపకులు) వీ

ప్రజలు గొంతెత్తినప్పుడల్లా అఖిల పక్షాలు, అష్ట, షట్సూత్ర పథకాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు, ఆరోందల పది జి.ఒలు, గిర్‌గ్లాని కమిటీలు వేసి నీరుగార్చడం, తమ దోపిడి విధానాలను కొనసాగించడం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది.

ఈ ప్రాంత బిడ్డలకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పిడికిలెత్తిన విద్యార్థి వీరుల్ని 1969లో 369 మందిని, పొట్టన పెట్టుకున్న నెత్తుటి జ్ఞాపకం ఇవాల్టికీ అసెంబ్లీ ఎదుటి అమరుల స్థూపం నలు దిక్కులా దిగిన తుపాకి గుండ్ల చిత్రం కెలుకుతూనే ఉంది.

ఆనాటి నుండి నేటి దాకా కొనసాగిన, కొనసాగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అంతిమ పరిష్కారం 'ఆంధ్ర' వలస పాలన, దానికి ఊతంగా కొనసాగుతున్న సామ్రాజ్యవాద బహుళజాతి బంధం. ప్రపంచ బ్యాంకు సరళీకరణ విధానాలకు, విద్యారంగం మొదలు, వ్యవసాయం, వైద్య, విద్యుత్ గ్రామీణ ఉపాధి తదితర రంగాలన్ని ఛిద్రమైపోయి ప్రజల బతుకు భారమైంది.

ఇక్కడి బొగ్గు ఇక్కడి వెలుగులకే ఉపయోగపడాలని, ఈ ప్రాంతం గుండా కృష్ణా , గోదావరి జలాలు ఇక్కడి నోళ్లను, నార్లను తడపాలని, ఇక్కడి భూముల్ని సెజ్‌ల పేరిట, ఎమ్మార్, బయ్యారం గనుల దోపిడికి గురి కావద్దని నిత్యం కొట్లాడుతున్నది.

అయినా సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల వల్ల బొందలగడ్డగా మారిపోయింది. హైదరాబాద్ చుట్టంతా ఐదు జిల్లాల, 35 మండలాల, 800 గ్రామాల గ్రేటర్ హైదరాబాద్ పేరిట నుజ్జైపోయినా, పోలెపల్లి సెజ్‌లు, అరవిందో కంపెనీలకు బయ్యారం గనుల్ని రక్షణ స్టీల్స్‌కు కట్టబెట్టే కుతంత్రం కొనసాగింది.

'విశాఖ ఉక్కు ఆంధ్ర హక్కైనట్లే, బయ్యారం ఉక్కు తెలంగాణ ఆదివాసుల హక్కు' అంటే సహించని సర్కార్ ఈ ప్రాంత ప్రజల్ని వంచిస్తున్నది. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షని నిర్లక్ష్యం చేస్తూ ఏం చేసుకుంటారో చేసుకోండి రూపాయి ఇచ్చేది లేదని ప్రకటిస్తున్నది. ఐదారు దశాబ్దాలుగా, ఇక్కడి వాళ్లకు ఇంగ్లీష్ రాదన్న సాకుతో, ముల్కి రూల్స్‌ను మాయం చేసి నాలుగేళ్ల చదువుతో, స్థానికులుగా మారిన స్థానికేతరులు, రాష్ట్ర సచివాలయం నుండి, గ్రామ సచివాలయం దాకా అన్యాయంగా, అప్పనంగా రాష్ట్రపతి ఉత్తర్వులను తుంగలో తొక్కి, తెలంగాణ బిడ్డలకు అన్యాయం చేసి ఇక్కడి కొలువులు కొల్లగొట్టారని 'గిర్‌గ్లాని' నివేదిక ఇచ్చినా, ఆరోందల పది జి.ఒ వచ్చి, సిల్వర్‌జూబ్లి గడిచినా అమలుకు నోచుకోక పోవడం చూస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్ స్పష్టంగా ఇవ్వాళ అది ఆంధ్ర ప్రాంత అధికారుల, రాజకీయ నాయకుల నియామక కేంద్రంగా మారిపోయిందని రుజువైంది. నిరంతరంగా సాగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అక్రమాలకు అంతిమ పరిష్కారం 'ప్రత్యేక తెలంగాణ' సాధన తప్ప మరొకటి కాదని ఆ స్వప్నం కోసం వందలాది మంది బిడ్డలు తమ ప్రాణాల్ని బలిపెట్టడం నిరంతరంగా కొనసాగుతూనే ఉంది.

ఏకాభిప్రాయం పేరిట అన్ని రాజకీయ పార్టీల మెజారిటి అభిప్రాయం మేరకే, అలుపెరగని పోరాటాలతో వెల్లువెత్తిన తెలంగాణ ప్రజల ఆకాంక్షకు, ప్రజాస్వామిక ఆందోళనకు వెరసిన కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నం అని ప్రకటించింది.

ఆ ప్రకటన ఆచరణ రూపం దాల్చిఉంటే ఇవ్వాళ తెలంగాణ సమాజం ఇంత కలత చెంది కదన రంగానికి కాలు దువ్వేది కాదు. ఆ ప్రకటనకు ముందు సమ్మతి తెలిపిన రాజకీయ పార్టీలు, తమ స్వార్థ పూరిత ఓటు రాజకీయాల కోసం తిరకాసు పెట్టకపోతే అన్నదమ్ముల్లా, ఆత్మీయుల్లా కలిసి ఉండే సంస్కృతికి విఘాతం కలిగి ఉండక పోయేది.

మళ్లీ శ్రీకృష్ణ కమిటీ పేర, కాలయాపనతో 8వ అధ్యాయం రహస్య కుట్రలతో తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను అణగదొక్కే ఓ మోసపూరిత విధానం వల్ల ఇవాళ అసెంబ్లీ తనకు తాను నిర్బంధంలో చిక్కుకున్నది. నిషేధాజ్ఞల్లో కొనసాగుతున్నది. ప్రజాకాంక్షను గుర్తించి పరిష్కరించాల్సిన 'అసెంబ్లీ' ఇవ్వాళ, ఆ ఆకాంక్షల కోసం ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి పూనుకున్న తెలంగాణ ఉద్యమకారుల్ని నిర్భందిస్తు బైండోవర్లు, ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం.

ప్రజలెదుర్కొంటున్న అనేకనేక సమస్యల్ని చర్చించడం ద్వారా పరిష్కార వేదికగా ప్రజల మన్ననలను పొందాల్సిన 'అసెంబ్లీ', అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్న పలు పార్టీల నాయకులు, శాంతి యుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చినా అనుమతివ్వడానికి నిరాకరించడం పూర్తి అప్రజాస్వామికం.

ఛలో అసెంబ్లీకి అనుమతివ్వడం వల్ల ఏదో విధ్వంసం జరుగుతుందని ప్రభుత్వమే ఉద్యమకారుల్ని రెచ్చగొట్టే విధంగా అరెస్టులు, నిర్బంధాలతో గొంతు నొక్కే ప్రయత్నం కంటే, గతంలో జరిగిన, సాగరహారం, మిలియన్ మార్చ్, ఛలో సంసద్‌లలో అనుమతి ఇచ్చినా ఇవ్వక పోయినా, జరిగిన సంఘటనల్ని పరిశీలిస్తే, ప్రజాస్వామ్య బద్ధంగా అనుమతివ్వడం వల్ల ఎలాంటి విధ్వంసకర సంఘటనలు జరగలేదు. అనుమతివ్వడానికి నిరాకరించిన 'మిలియన్ మార్చ్' సందర్భంలో ఉద్యమకారుల్ని రెచ్చగొట్టినట్లు ప్రవర్తించడం వల్లే 'ట్యాంక్ బండ్'పై విగ్రహాల కూల్చివేత జరిగిందన్నది వాస్తవం.కనుక ఏదో ఒక సాకుతో ఇప్పుడైతే 'మావోయిస్టులు' మద్దతు పలికారన్న సాకుతో, ఉద్యమకారులు ఛలో అసెంబ్లీకి తుపాకులు, బాంబులతో వస్తారన్నంత భయానక వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించి వేలాది మంది పోలీసు బలగాలతో అసెంబ్లీని నిర్బంధించుకోవడం, నిషేధాజ్ఞలతో హైదరాబాద్, మొత్తం తెలంగాణ కొనసాగడం తీవ్రంగా ఆలోచించాల్సిన అంశం.

మావోయిస్టులు 1969 నుండి ప్రత్యేక తెలంగాణ పోరాటానికి మద్దతిస్తున్నారు. కాని ఏనాడు వాళ్ల తుపాకులతో ఈ పోరాటాన్ని ప్రజల ఆకాంక్షల్ని హైజాక్ చేయాలని చూడలేదు. కనుక ఏవేవో సాకులతో ఉద్యమాలను అణచడం సాధ్యం కాదని, అసెంబ్లీని అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయాల్లో నిర్బంధించకుండా, ప్రజల ఆకాంక్షల్ని చర్చించి, నెరవేర్చే ఓ ప్రజాస్వామిక వైఖరిని ప్రదర్శించడం ఇవాల్టి అవసరం.

అందుకోసమే మొన్నటి ఛలో ఢిల్లీ సంసద్ యాత్రలో కాని ఈ దశాబ్ద కాలంగా సాగుతున్న పోరాటంలో ఎక్కడ హింసాపూరిత సంఘటనలు చోటు చేసుకోకుండా, సాగుతున్న ప్రజా పోరాటంగా తెలంగాణ పోరాటాన్ని అర్థం చేసుకోవాలి.

కేంద్రం డిసెంబర్ 9న ప్రకటించిన ప్రకటనను, పార్టీల వైఖరి వల్ల అమలుగాక వేయికి పైగా బిడ్డల ఆత్మహత్యలకు కారణమైన పాలకులు అందుకు పరిష్కారం సమస్యను దాటవేయడం కాదు. ప్రజలు కోరుకుంటున్నట్లు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తప్ప మరో మార్గం లేదని గుర్తించాలి.

నిర్బంధాల ద్వారా, నిషేధాల ద్వారా, అరెస్టులు బైండోవర్లతో ప్రజాకాంక్షను అణిచి ఉంచలేరని గుర్తించి, అసెంబ్లీ చర్చించి అనుమతివ్వడంతో పాటు, అసెంబ్లీలో తీర్మానం చేయడం, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం కేంద్రంపై ఒత్తిడి చేయడం మినహా మరో మార్గం లేదు. అందుకోసం హామీ ఇచ్చిన ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చడం కోసం విజ్ఞత గల పార్టీలు, నాయకులు ప్రయత్నించాలి. అందుకోసం ప్రజలు, ఉద్యోగ ఉపాధ్యాయ, విద్యార్థి ఉద్యమకారులు అసెంబ్లీలో ఒత్తిడి పెంచడానికి సంఘటితంగా ముందుకు సాగాలి.

ఛలో అసెంబ్లీని విజయవంతం స్ఫూర్తిగా తీసుకొని పోరాటాల ద్వారా తెలంగాణను సాధించుకోవాలి.

(రచయిత కన్వీనర్, తెలంగాణ టీచర్స్ ఫోరం) వీ

మతాల మత్తు - దళారీ మేధావులు

***ఏ మతమైనా శ్రమదోపిడీ నేపథ్యంలోనే పుట్టిందనీ, ప్రజలు చైతన్యవంతులు కాకుండా అణచిపెట్టడానికే ఆధిపత్య వర్గాలు మతాలను పెంచిపోషిస్తున్నాయనీ అంటున్నారు* వీర బ్రహ్మాచారి**

'మతం మత్తు మందు' అన్నారు మార్క్స్. ఈ మత్తు మందు ఒక మోతాదులో మనిషిని అవసరానికి మించి ఎక్కువగా నిద్రపుచ్చి సత్యం చూడకుండా, వినకుండా, మొత్తంగా తెలుసుకోకుండా చేస్తోంది. మోతాదు మించితే ఉన్మాదిని చేస్తోంది. ఈ ఉన్మాదం సాటి మనిషి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మీద, ఆంతరంగికాల, ప్రైవసీ మీద, అభిప్రాయాల మీద, విశ్వాసాల మీద దాడి చేస్తోంది. మోతాదులో ఉన్న, మించిన ఈ రెండు స్థితులూ మానవజాతి పురోగమనానికి అవరోధాలే. అందుకే గురజాడ 'మతములన్నియు మాసిపోవును / మానవత్వము నిలిచి వెలుగును / ఎల్లలోకము లొక్కటయి ఇల / విశ్వ మానవడవ తరించును' అని ఆశించారు, ఆకాంక్షించారు.

ఇటీవల ఒక కార్యక్రమంలో ఒక మేధావి హిందూ మతంలోని పీడితులకు 'ప్రపంచంలో నాలుగు పెద్ద మతాలున్నవి. అవి హిందూ, ఇస్లాం, క్రిస్టియన్, బౌద్ధాలు. హిందూ మతం తప్ప మిగిలిన మూడింటిలో ఒకదాన్ని ఎన్నుకోండి' అని సందేశమిచ్చారు. అంతటి గంభీర విషయం మీద ప్రశ్నలు, చర్చ కొనసాగలేదు. భారతదేశంతో పాటు ప్రపంచమంతా వివిధ మతోన్మాదాలు పేట్రేగిపోతున్న సందర్భంలో ఆ సామాజిక శాస్త్రవేత్త ఎత్తిపారేయమన్న తుంట, ఎత్తుకోమన్న మూడు మొద్దుల గురించి పునరాలోకనమే ఈ వ్యాసం ఉద్దేశం.

ఎత్తి పారేయమన్న తుంట సంగతి మన కళ్లముందు అత్యంత సమీపంలో ఉన్నదే అయినా, మరొకసారి ఇటీవలి తాజా సంఘటనలను ఉదహరించుకుందాం. దీనికి ముందు మరొక విషయం! మతం ఏదయినా దేవుడు, పుణ్యం – స్వర్గం, పాపం – నరకం, దేవుడో అతని సహాయకుడో రాసే పాపపుణ్యాల (కర్మల) చిట్టా, పునర్జన్మ, మోక్షం నిర్వాణం వంటి భావవాద పునాదుల మీదే ఏర్పడ్డవి.

మొన్నకు మొన్న హిందూ 'తుంట'కి పునాది మీదే నిర్మించిన ఒక రాజకీయ పార్టీ ఫైర్ బ్రాండ్ ఈ దేశంలో మైనారిటీలను హిందువులు మాత్రమే రక్షించగలరని సెలవిచ్చిరి. ఎంత సంతోషం! ఇంతకీ వాళ్లకు రక్షణ కరువైంది ఏ అదృశ్య శక్తుల వల్లనో! భారత మాతను ఎవరు శరణు వేడితే తత్ తరుణోపాయమును సూచించిరో! గుజరాత్‌లో, కశ్మీర్‌లలో ముస్లిం మైనారిటీలు, ఒడిషాలో క్రిస్టియన్ ఫాదర్ కుటుంబ సమేతంగా ఎవరి ఊచకోతలకు బలయ్యారో, ఎవరి సజీవ దహనాలకు గురయ్యారో!

ఇదే తుంటకు చెందిన రెండు వేళ్లు (పాయలు) శైవులు, వైష్ణవులు పేరిట తన్నుకు చచ్చిన చరిత్ర మనకు తెలుసు. రాజ్య విస్తరణాకాంక్షతో నరుక్కున్న సంఘటనలకు చరిత్రలో కొదువే లేదు. అందరూ దేవుడి పూజ చేసి ప్రత్యర్థి సంహారానికి బయల్దేరే వారే! ఇక మొద్దుల సంగతి..

ఇస్లాం

బంగ్లాదేశ్‌లో హిఫాజత్ – ఎ – ఇస్లామీ, జమాతె ఇస్లామీ రాడికల్ ఇస్లామ్ ఆర్గనైజేషన్ వంటి అనేక పేర్లతో ఉన్న మెజారిటీ మతోన్మాద సంస్థలు అల్ప సంఖ్యాక మతానికి చెందిన వాళ్ల మీద; పాకిస్తాన్‌లో ఆ మతంలోని శాఖలే అయిన షియాలు, సున్నీల మీద; అఫ్ఘనిస్తాన్‌లో ఇస్లాం ధర్మాన్ని సరిగ్గా పాటించడం లేదన్న కారణంగా స్త్రీల మీద తాలిబన్ మతోన్మాదులు, వాళ్లే బమియాన్ చారిత్రాత్మక బుద్ధ విగ్రహాల విధ్వంసానికి పాల్పడ్డారు. సిరియా, ఇరాన్, ఇరాక్, సుడాన్‌లలో లెక్కకు మించిన వివిధ పేర్లు గల మతోన్మాద గ్రూపులలో కొందరు అధికార పాలకవర్గాల కొమ్ముకాసేవాళ్లు, మరికొందరు ప్రత్యర్థి ప్రతిపక్షాల సంస్థల, వ్యక్తుల కొమ్ముకాసేవాళ్లు. అఫ్ఘనిస్తాన్‌లో ప్రపంచ పెత్తందారు, పోలీసు అమెరికా చేత ప్రోత్సహింపబడి, పోషింపబడి రష్యాకు వ్యతిరేకంగా అప్పటి సోషలిస్టు బీజాలు మొలకెత్తకుండా సామ్రాజ్యవాద పెట్టుబడిదార్ల కొమ్ముకాసి యుద్ధానికి పాల్పడ్డారు. సిరియాలో అసద్ పాలకపక్ష, ప్రతిపక్ష ముస్లిం గ్రూపుల మధ్య జరిగిన అధికార కుమ్ములాటలో శత్రు సైన్యాలనే గాక, ఆత్మాహుతి దాడులు, బాంబు దాడులతో అమాయక పౌరులు, స్త్రీలు, పిల్లలను హత్య చేయడం, గృహదహనాలు, అత్యాచారాలకు పాల్పడడం వంటి పనులు చేస్తున్న వాళ్లు ఇస్లాం పేరు మీదే. తాజాగా మొన్నకు మొన్న స్వతంత్ర ఒమర్ అల్ ఫరూక్ బ్రిగేడ్'గా పిలుచుకునే ఒక మిలిటెంట్ గ్రూప్ కమాండర్ సక్కర్ అధికార అసద్ సైనిక దళానికి చెందిన సైనికుడిని చంపి గుండెను కొరుకుతున్న దృశ్యం 'దేవుడి మీద ప్రమాణం చేసి మీ (అసద్ వర్గ) గుండెను, కాలేయాన్ని తింటాను' అంటున్న వీడియో దృశ్యం హ్యూమన్ రైట్స్ వాచ్‌కు సైతం దిగ్భ్రాంతికి, కలవరానికి గురిచేసింది. ఇది అచ్చం కురుక్షేత్రంలో భీమసేనుడు దుశ్శాసనుని వధించిన తీరుతో పోలి లేదు? ఆ భీమసేనుడు కూడా ఇటువంటి పనిని శ్రీకృష్ణ పరమాత్ముడి సమక్షంలోనే చేశాడు.

బౌద్ధం

బుద్ధుడు భౌతికవాది అని కొందరు అంటున్నప్పటికీ దేవుడు లేదా పరమాత్మ లేదని విస్పష్టంగా చెప్పలేదు. జీవహింస తగదు అన్నాడు. అతని పేర వెలసిన బౌద్ధ దమ్మావలంబీకులు శ్రీలంకలో తమిళుల అంతు తేల్చినాక ఇప్పుడు ముస్లింల మీద ద్వేషం, ప్రతీకారం మొదలైనవి. లంక రాజధాని నగరంలో ఫ్యాషన్ బగ్ వద్ద, ముస్లిం వ్యాపార, వాణిజ్య వర్గాల మీద, వాళ్ల సంస్థల మీద కొనసాగుతున్న దాడులు, అదీ భారత 'తుంట' ఆర్‌ఎస్‌ఎస్‌ను పోలిన బిబిఎస్ (బోధు బాలసేన) అనే బౌద్ధ

మత పరిరక్షణ సంస్థ పేరున, ముస్లిం స్త్రీల పరదా (బురఖా) పద్ధతి మీద, 'హలాల్' లేబుల్ మాంస విక్రయాల మీద కొనసాగుతున్న నిరసనలు, నిషేధించాలన్న డిమాండ్లు పది శాతంగా ఉన్న మైనారిటీ ముస్లింలను అభద్రతా భావానికి గురి చేస్తున్నవి. బిబిఎస్ చేత నడుపబడే 'బుద్ధిస్ట్ లీడర్‌షిప్ అకాడమీ'ని, తమిళులను ఊచకోత కోసిన, పిల్లలను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చించిన శుద్ధ బుద్ధ మతావలంబీకుడు శ్రీలంక అధినేత రాజపక్షే ప్రారంభించారు. బిబిఎస్ నేత వితంగె బిబిఎస్ పూర్తిగా అరాజకీయమైన సంస్థ అని సెలవిచ్చారు. ఇదొక తెలివి. నిజానికి రాజకీయం కోసమే మతం. మత రాజకీయం పురివేసుకొని ఉంటాయి.

ఇక మయన్మార్‌లో ఇటీవల రాజధాని నెపిడ్యాకు 130 కి.మీ. దూరంలో ఉన్న మేక్టిలాలో బౌద్ధ బిక్షువులు అధికార సైనిక బలగాల మద్దతుతో మైనారిటీ ముస్లిం గ్రామాల మీద జరిపిన దాడి, గృహ దహనాలు వాటి ధూమ వాసనలు, స్త్రీల, పిల్లల అర్తనాదాలు, రోదన దృశ్యాలు మననింకా వీడనే లేదు. ఈ మారణహోమంలో నలభై మంది మరణించగా, సుమారు తొమ్మిది వేల మంది నిరాశ్రయులయ్యారు.

క్రిస్టియానిటీ

'పాపుల పాపాన్ని తన రక్తంతో కడిగాడ'ని, ఒక చెంప కొడితే మరొక చెంప చూపమన్న జీసస్ మతావలంబీకులు చరిత్రలో కాథలిక్కులు, ప్రొటెస్టెంట్ల పేరున నరుక్కున్నారు. దశాబ్దాల క్రితం వరకు సంపద మదాంధత, కావరంతో ఖండాంతర ప్రయాణాలు చేసి వలసలు స్థాపించి, స్థానిక ఆదివాసి మూలవాసులను చెరబట్టి, ఎదురు తిరిగిన వాళ్లను వధించి, లొంగిన వాళ్లను బానిసలుగా చేసుకొని ఆ ప్రాంతపు ప్రకృతి వనరులను కొల్లగొట్టి మార్కెట్ చేసి ఆకాశ హర్మ్యాలను, అందమైన నగరాలను నిర్మించుకొని కులికిన వాళ్లు. వాళ్లే మళ్లీ మిషనరీలుగా అవతరించి కొల్లగొట్టిన వలసలలోనికే దీన జనులకు విద్య వైద్యం పేరుతో చేతిలో బైబిల్‌తో మదర్‌లుగా, ఫాదర్‌లుగా అవతరించారు.

వీళ్ల ఆధునిక కుట్రపూరిత మంత్ర తంత్రాంగాల కుళ్లును 'దళారీ పశ్చాత్తాపం' పుస్తకం ఇదివరకే మన కళ్ల ముందుంచుంది. తాజాగా కొనసాగిస్తున్న ఉదంతాలు కొన్ని 20వ శతాబ్దంలో రష్యాలో నెలకొన్న సోషలిజం విస్తరణను అడ్డుకునే యంత్రాంగంలో అల్‌ఖైదా, తాలిబన్ మతోన్మాద సంస్థలను పెంచి పోషించారు. పెద్ద చేశారు. సదరు ఉన్మాదులు స్వామి 'కార్యం' నెరవేర్చే క్రమంలో మనిషి రక్తాన్ని మరిగారు గనుక, పరిపూర్తయినాక 'స్వామి' కార్యానికే తెగబడితే ఉగ్రవాదులుగా ముద్రవేసి ఉగ్రవాద నిర్మూలన పేరు మీద మానవ రహిత విమానాల దాడులు కొనసాగించి స్త్రీల, శిశువుల, అమాయకుల ప్రాణాలు హరిస్తారు. అఫ్ఘన్ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్‌కు రహస్యంగా డబ్బు సంచులను, సూట్‌కేసులను ఇస్తూ అక్కడే తిష్టవేసి, అపుడపుడు 'తమకు వ్యతిరేకంగా మాట్లాడే నాటకాలాడిస్తారు. అదే ఉగ్రవాదం మీద దాడి నిర్మూలన పేరుతో పాకిస్తాన్ మాజీ సైనిక నియంత ముషర్రాఫ్‌తో మానవ రహిత విమానాల దాడికి రహస్య ఒప్పందం చేసుకుంటారు. అదీ భారత్‌పై దాడికి శిక్షణనిచ్చే స్థావరాలకు హాని జరుగకుండా జాగ్రత్తపడే షరతుతో.

ఇరాక్ గురించి తెలిసిందే. సద్దాం వద్ద రసాయనిక ఆయుధా లున్నవని దాడిచేసి బంధించి, చంపి 'అరెరే! ఔనా! అవేం లేవా!' అని నాలుక్కరుచుకుంటారు. ముందు చెప్పిన సిరియా పాలక ప్రభుత్వ వ్యతిరేక దళాలకు ఆయుధాలు, ఆహారం సరఫరా చేస్తూ వాళ్లు చేసే మారణహోమానికి పుల్లలందిస్తూ శాంతి వచనాలు వల్లెవేస్తారు. మన భారత్ వంటి మాజీ వలసలకు స్వాతంత్ర్యం 'ప్రసాదించి' దిష్టిబొమ్మ లేదా దళారీ ప్రభుత్వాలను స్థాపించి గ్లోబలైజేషన్ పేరున మల్టీ నేషనల్ కంపెనీలను దించి అభివృద్ధి పేరుతో సహజ వనరులను కొల్లగొట్టే ఎత్తుగడలు వేస్తారు. ఎదురు తిరిగిన స్థానిక మూలవాసుల మీద యుద్ధానికి, నిర్మూలనకు దళారీ పాలకులనుపయోగించుకుంటారు. ఈ చిట్టా ఇప్పుడు ఒడవదు.

చివరగా తెలుసుకోవలసిందేమిటంటే అది ఏ మతమయినా పుట్టిందే శ్రమదోపిడీని కొనసాగించే ఒక సాంస్కృతిక సాధనంగా నిజానికి ప్రవక్త గాని, జీసస్ గాని, బుద్ధుడు గాని ఆ మతాలను కొత్తగా స్థాపించలేదు. వాళ్లకు ముందే మతాలు, దేవుడు ఉన్నవి. వాటి పేరున ఆధిపత్య శక్తులు చేసే అన్యాయాలు, అమానుషత్వాన్ని, వాటిని భరిస్తున్న ప్రజల అమాయకత్వాన్ని చూడలేక ఆ భావవాద చట్రంలోనే సంస్కరణ బోధనలు, విధానాలు సూచించి, రూపొందించారు. ప్రజలు చైతన్యం కావడం ఇష్టంలేని ఆధిపత్య పాలకవర్గాలు వాళ్లను తరిమారు. ఒంటరి వాళ్లను చేశారు. చిత్రహింసల పాల్జేసి చంపారు. ప్రజలలో వాళ్లకున్న ఆరాధన భావం ఆ కారణంగా వాళ్ల తరఫున తిరుగుబాటును అణచి పెట్టడానికి వాళ్లను దేవుళ్లను, దేవదూతలను చేశారు. వాళ్ల సంస్కరణల సారాన్ని వాళ్ల పేరున మతం చేశారు. అయితే వాళ్లకెవ్వరికీ ఉత్పత్తి శ్రమ, ఉత్పత్తి సాధనాలు, శ్రమ సంబంధాలు, అదనపు శ్రమ, మిగులు వంటి విషయాల ఆలోచన లేదు. నిస్సందేహంగా మానవతా వాదులే. వాళ్ల పరిమితి అది. మార్క్స్ మాత్రమే కుట్రను పసిగట్టారు. అందుకే 'మతం మత్తు మందు' అన్నారు.

ఈ దేశంలోని సెక్యులరిస్టులకు, కమ్యూనిస్టులకు మానవతా వాదులకు అన్య మతాల ఉన్మాదం కనిపించదేం? వాటిని ఖండించరేం అని భారత మతోన్మాదులు అంటుంటారు. ఒక దేశంలోని మెజారిటీ మతానికి, పుట్టుక రీత్యా, చెందినందు వల్ల ఆ మెజారిటీ మతోన్మాదాన్నే ఖండించడం తెగడడం ఒక సంస్కారం. బంగ్లాలో తస్లీమా నస్రీన్, పాకిస్తాన్‌లో సల్మాన్‌రష్దీ, భారత్‌లో పూలే, అంబేద్కర్, విప్లవ కమ్యూనిస్టు హేతువాదులు పాటిస్తున్నదే సంస్కారం. అంతమాత్రాన ఇతర మతాల ఉన్మాదాన్ని సమర్థిస్తున్నట్లు కాదు. అదొక విలువ. అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం వేరే మినహాయింపు.

(రచయిత రిటైర్డ్ ఉపాధ్యాయులు) వీ

రచయితలకు సూచన : తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 23వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.

సంక్షేమ పథకాలు - పేదరిక నిర్మూలన

***ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజల ప్రయోజనాలకన్నా పాలక పార్టీలకే ఉపయోగపడుతున్నాయనీ, అవి కేవలం ఓట్లు రాల్చుకోవడానికి మాత్రమే చేపడుతున్నారని అంటున్నారు* సిరిసనగండ్ల సాహితి, సూత్రపు అనిల్**

ప్రజల సంక్షేమం కోసమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలకో పథకాన్ని ప్రవేశపెడుతున్నాయి. పాత పథకాలకు పేర్లు మార్చి కొద్దిపాటి చేర్పులు, మార్పులతో కొత్త పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నాయి. తమ దోపిడీని నిరంతరాయంగా కొనసాగించడానికి, ప్రజల దృష్టిని తాత్కాలిక అవసరాల మీదే నిలిపేందుకు అనేక వ్యూహాలు రుపొందిస్తున్నాయి. ప్రభుత్వాలు ఏవైనా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా పథకాల పేర్లు మారుతున్నాయే తప్పా అమలులో మాత్రం తేడాలు ఉండడం లేదు. సబ్సిడీలను ఒక చేత్తో ఇచ్చినట్లే ఇచ్చి వివిధ పన్నులు, చార్జీల రూపంలో మరో చేత్తో అంతకంటే పదుల రెట్లలో డబ్బును ప్రభుత్వాలు లాగేస్తున్నాయి. ఈ పథకాల అమలులోనూ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కొరవడింది. అనేక పథకాలను పేరు కోసం మొక్కుబడిగా ప్రారంభించి చేతులు దులిపేసుకుంటున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాల వివరాలు ఇలా ఉన్నాయి.

ఆరోగ్యశ్రీ పథకం

పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించేందుకు 2007లో వైఎస్‌రాజశేఖర రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించారు. తెల్లరేషన్ కార్డులున్న ప్రజలంతా ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అర్హులే. తాజాగా ఈ పథకాన్ని ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో 347 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. 938 రకాల వ్యాధులకు చికిత్స చేసే అవకాశముంది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి 3500 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్ర బడ్జెట్‌లో ఈ ఖర్చు 3.5 శాతమే. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వాలు ఖర్చు చేసే విషయంలో 175 దేశాలను పరిశీలించగా మనదేశం 171వ స్థానంలో ఉంది. స్థూల జాతీయోత్పత్తిలో 1.2 శాతం మాత్రమే ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఖర్చు పెడుతోంది. ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో కనీస వైద్య సేవలు అందని జనాభా 5 కోట్ల 63 లక్షలని తేలింది. అంటే రాష్ట్ర జనాభాలో 66 శాతం జనాభాకు ఎలాంటి వైద్యం అందడం లేదనే విషయం స్పష్టమవుతోంది.

ఆరోగ్యశ్రీ కార్డులో గుండె జబ్బులు, కేన్సర్, మూత్రపిండాల వ్యాధులవంటి వాటికి చికిత్స అందుతోంది. కానీ రాష్ట్రంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న డెంగీ, మలేరియా, అతిసారం, విషజ్వరాలు, క్షయ, ఎయిడ్స్ వంటి వ్యాధులు ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడం పేదలకు శాపంగా మారింది. దీంతో ఖరీదైన వైద్యం పొందలేక వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అంతేగాక ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో కాసులు కురిపించే ఆపరేషన్లకే ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు గర్భ సంచి తొలగించే ఆపరేషన్లు అవసరం లేకున్నా చేస్తున్నారు. లాభసాటి కాదనుకున్నప్పుడు ఆపరేషన్లు చేయడం లేదు. ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించడం కోసం మార్గదర్శకాలను రుపొందించాలని కోరుతూ 2010లో 15 మందితో ప్రణాళికా సంఘం కమిటీ వేసింది. ఈ కమిటీ రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ పథకం అమలును అధ్యయనం చేసింది. ఈ పథకం వల్ల ప్రభుత్వ ఆస్పత్రులకు నిధుల కొరత ఎదురైందని, ప్రాథమిక వైద్యం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించింది. అంతేగాక ఇటీవల ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రులకు కూడా చికిత్స ఖర్చులు విడుదల చేయడం లేదు. ఫలితంగా కొన్ని ఆస్పత్రుల్లో ముందు డబ్బు చెల్లిస్తేగానీ వైద్యం అందించడం లేదు. ప్రభుత్వానికి నిజంగా పేదల ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ ఆస్పత్రులను పటిష్టం చేయాలి. కొత్త ఆస్పత్రులను నెలకొల్పాలి. బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా కేటాయింపులు చేయాలి. కానీ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రులను బలహీనం చేస్తూ కార్పొరేట్ ఆస్పత్రులను ప్రోత్సహించడం దీర్ఘకాలికంగా వ్యతిరేక ఫలితాలను ఇస్తుంది.

ఇందిరమ్మ ఇల్లు

ప్రజలకు ఇల్లు తప్పనిసరి ఆవాసం. తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 46 లక్షల కుటుంబాలకు సొంత ఇళ్లు లేవు. ఇందులో 32.2 లక్షల కుటుంబాలు పక్కా ఇళ్లు లేకపోవడంతో గుడిసెల్లో, గుడారాల్లో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఉండడానికి ఇళ్లు లేని నిరుపేదలకు ఆ సమస్యను తీర్చేందుకు 2006 మే 7న రంగారెడ్డి జిల్లా బోడంపహాడ్ గ్రామంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ పూర్తి అర్థంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 'ఇందిరా ఆవాస్ యోజన' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏటా 2 లక్షల 75 వేల ఇళ్లను మంజూరు చేయాల్సి ఉంటుంది. ఈ పథకం కింద ఇచ్చే నిధులను రాష్ట్రానికి ఇస్తే ఇంకా తక్కువ ధరకే ఇళ్లు నిర్మిస్తామని అప్పట్లో కేంద్రానికి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని నిధులను కలిపి ప్రారంభించిన పథకమే ఇందిరమ్మ. ఒక్కో ఇంటికి బిసిలు, ఇతరులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి మూడు దశల్లో రు.39,000 ఇస్తోంది. ఎస్‌సి, ఎస్‌టిలకు రు.50,000 మంజూరు చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చే సిమెంట్ బస్తాలకు అయ్యే ఖర్చును కూడా ఇందులోనే చూపిస్తుంది. ఈ మొత్తానికి తోడు ఐకెపి పొదుపు సంఘాల సభ్యురాలై ఉంటే బ్యాంకు లింకేజీ రుణం మరో రు.20,000 మంజూరు చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు మేస్త్రీ, కూలీ ఖర్చులకే సరిపోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే 30 బస్తాల సిమెంట్ ఇంటి ప్లాస్టరింగ్ తప్ప దేనికి పని చేయడం లేదు. ప్రభుత్వం ఎంతో కొంత డబ్బులు

ఇస్తుందనే భరోసాతో ఇంటి నిర్మాణం మొదలు పెట్టిన పేదలు దానిని పూర్తి చేయడానికి లక్ష నుంచి లక్షా 50 వేలు అప్పు చేయాల్సి వస్తోంది. ఐరన్, ఇతర భవన నిర్మాణ సామాగ్రి ధరలు ఆకాశన్నంటుతుండడంతో ఖర్చు మరింత పెరిగిపోతోంది.

పథకం అమలు విషయానికొస్తే మూడు దశల్లో వచ్చే బిల్లుకు బిల్లులో 10 నుంచి 20 శాతం చొప్పున హౌసింగ్ ఎఈలకు, స్థానిక దళాలరులకు ఇవ్వాల్సి వస్తోంది. అందరి వాటాలు పోను లబ్ధిదారుడికి రు. 20 వేలు కూడా చేతికి రావడం లేదు. ఇల్లు కట్టుకున్నవారికి చాలా మంది లబ్ధిదారులకు బిల్లులు మంజూరు కాకపోగా నిర్మించని వారి పేర్ల మీద స్థానిక నాయకులు డ్రా చేస్తున్నారు. ఒక్కో మండలంలో కోట్లాది రూపాయల కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో అధికార పార్టీతోపాటు ప్రతిపక్ష టిడిపి నాయకులు ఉండడం గమనార్హం. బిల్లుల కాజేసింది స్థానిక నాయకులైతే తమ పేర్ల మీద ఇల్లు వచ్చిన విషయం కూడా తెలియని వారికి రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద నోటీసులు అందుతున్నాయి. రోశయ్య హయాం వరకు ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు మంజూరైనప్పటికీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక బిల్లులు మంజూరును నిలిపేశారు. కొత్త ఇళ్ల మంజూరు ఆగిపోయింది. బిల్లులు వస్తాయని అప్పులు చేసి ఇల్లు కట్టుకున్న పేదలకు తీరా బిల్లులు రాకపోవడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. పేదల కోసం ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం 2007లో రాజీవ్ స్వగృహ పథకాన్ని మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని 94 మున్సిపాలిటీల్లో, 85,961 ఇళ్లను అపార్ట్‌మెంట్ల తరహాలో నిర్మిస్తామని ప్రకటించింది. ఇళ్లు పొందడం కోసం 1.74 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుదారుడు మూడు నుంచి ఐదు వేల రుపాయలు డిపాజిట్‌గా చెల్లించారు. ఈ పథకం మధ్యతరగతి ప్రజల ప్రయోజనం కోసమని ప్రభుత్వం ప్రచారం చేసుకున్నప్పటికీ ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారులకే ఎక్కువగా ఉపయోగపడింది.

రాజీవ్ యువకిరణాలు

కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠమెక్కాక గతంలో అమలులో ఉన్న అనేక పథకాల పేర్లు మార్చారు. తనదైన ముద్ర వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే రాజీవ్ యువ కిరణాలు, రాజీవ్ ఉద్యోగ కిరణాలు లాంటి పథకాలను ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు పథకాల మీదున్న వైఎస్ ముద్రను చెరిపి వేయడానికి నానా తంటాలు పడుతున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ 2011 ఆగస్టు 21న విశాఖపట్నంలో సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. 2014 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని 15 లక్షల మంది యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం లక్ష్యమని ఆయన ప్రకటించారు. 2011 డిసెంబర్ కల్లా లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని కూడా ప్రకటించారు. 2012 బడ్జెట్‌లో ఈ పథకానికి 777 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ప్రకటనతో సుమారు 20 లక్షల మంది నిరుద్యోగులు రాజీవ్ యువ కిరణాలు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు కాంట్రాక్ట్ కుదుర్చుకున్న కంప్యూటర్ సెంటర్ల నిర్వాహకులు కోట్లాది రూపాయల నిధులు ప్రభుత్వం నుంచి పొందారు. గతంలో రాజశేఖర రెడ్డి ప్రభుత్వ హయాంలో రాజీవ్ ఉద్యోగశ్రీ కింద శిక్షణ పొందిన వారి పేర్లనే చూపించి రాజీవ్ యువ కిరణాలు పథకంలో కూడా శిక్షణ ఇచ్చినట్లు కోట్లాది రుపాయల నిధులు స్వాహా చేశారు.

ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలు ఎక్కువగా వాచ్‌మెన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, హోటళ్లలో సర్వర్లు, ట్యాలీ అండ్ అకౌంటింగ్, మల్టీమీడియా తదితర అంశాలకు సంబంధించినవి కావడం గమనించాల్సిన విషయం. రాజీవ్ యువ కిరణాల కింద తాత్కాలిక ఉద్యోగాలు పొందిన వారికి ఐదు, ఆరు వేల జీతం మాత్రమే ఇస్తుండడంతో మధ్యలోనే మానేసి ఇంటి బాట పడుతున్నారు. ఈ ఉద్యోగాల్లో శ్రమ దోపిడీ విపరీతంగా ఉంటోంది. ఈ ఉద్యోగాలు స్వగ్రామాలకు దూరంగా పట్టణాల్లో, నగరాల్లో ఇస్తుండడంతో వారు అక్కడ ఉండడానికి గది అద్దెలు, ఇతర ఖర్చులకే జీతం సరిపోతోంది. దీంతో ఉన్న ఊళ్లో కూలీ చేసుకోవడం నయమని ఇంటికొచ్చేస్తున్నారు. ఇలా వదిలేసిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారిని నియమించి వారిని కూడా ప్రభుత్వం తాము ఉపాధి కల్పించిన సంఖ్యలో కలుపుకుంటోంది. రెండేళ్లలో ప్రభుత్వం రాజీవ్ యువ కిరణాల పథకంలో మూడు లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు సాక్షాత్తు ముఖ్యమంత్రే ఇటీవల పలు సభల్లో ప్రకటించారు. ఈ ఉద్యోగాలన్ని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన నియమించినవే. నిజానికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం వివిధ బహుళజాతి కంపెనీలకు, ప్రైవేట్ కంపెనీలకు తక్కువ జీతంతో పని చేసే యువకులను సరఫరా చేసే దళారీగా పని చేసింది. ఇందులో ఎంపికైన వారికి కార్మిక చట్టాలను, కనీస వేతనాలను అమలు చేయలేదు. ఉద్యోగ భద్రత ఊసే లేదు.

బియ్యం.. రేషన్‌షాపులో రూపాయికి కిలో.. మార్కెట్‌లో రు.40

వైఎస్ హయాంలో రెండు రుపాయలకు కిలో బియ్యం పథకం అమలు చేస్తే కిరణ్‌కుమార్‌రెడ్డి దాని స్థానంలో రుపాయికి కిలో బియ్యం పథకం తీసుకొచ్చారు. హైదరాబాద్ ఖైరాతాబాద్‌లోని గణేష్‌చౌక్ వద్ద 2011, నవంబర్ 1న సిఎం కిరణ్ లాంఛనంగా ప్రారంభించారు. తెల్లరేషన్‌కార్డు దారులకు ఒక్కొక్కరికి నెలకు నాలుగు కిలోల చొప్పున ఇస్తున్నారు. రేషన్‌షాపులో ఇచ్చే ఈ బియ్యం కుటుంబ సభ్యులకు వారం రోజులు కూడా రావడం లేదు. ఇవి దొడ్డు బియ్యం కావడంతో తినడానికి కూడా ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రేషన్‌షాపులో రుపాయికి కిలో బియ్యం ఇస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో ధరలను అదుపు చేయలేకపోతోంది, బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధర ప్రస్తుతం రు.40 నుంచి 50 వరకు పలుకుతోంది. మిగతా నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారుతోంది.

ఇందిర జలప్రభ

ఎస్.సి, ఎస్.టిలకు చెందిన 10 లక్షల ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2011, అక్టోబర్ 2న ఈ పథకాన్ని ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం జంగాలపల్లిలో సిఎం ప్రారంభించారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న ఆరు లక్షల కుటుంబాలను పైకి తీసుకురావడమే ఈ పథకం ప్రధానోద్దేశం. ఇందులో భాగంగా ఎస్‌సి, ఎస్‌టిల భూముల్లో బోర్లు వేసేందుకు, బావులు తవ్వేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. అలాగే సకాలంలో బకాయిలు చెల్లించిన రైతులకు కూడా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఇస్తామని ప్రకటించింది. ఈ పథకాన్ని కూడా ఇందిర జలప్రభతో పాటే ముఖ్యమంత్రి జంగాలపల్లిలో ప్రారంభించారు. ఈ పథకం కింద 95 లక్షల మంది రైతులు లబ్ధిపొందనున్నారు. ఈ పథకం కోసం సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తుంది.

పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు

పొదుపు స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం అందించడానికి 'స్త్రీ నిధి' పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకానికి 1.400 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఏడాదిలో మహిళా సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా 10 వేల కోట్ల రుపాయల రుణాలు అందించనున్నారు. అలాగే మండల కేంద్రాల్లో 1097 స్త్రీ శక్తి భవనాలు నిర్మించనున్నారు. ఈ పథకం కింద 1.3 కోట్ల మంది పొదుపు సంఘాల మహిళలు లబ్ధిపొందనున్నారు. అయితే ఇది వరకు పావలా వడ్డీ రుణాలను సక్రమంగా అమలు చేయని ప్రభుత్వం, వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించడం ఆశ్చర్యకరంగా ఉంది. బ్యాంకులకు ఇది వరకు పావలా వడ్డీ రుణం తీసుకున్న మహిళలు చెల్లిస్తే మిగతా ముప్పావులా వడ్డీ ప్రభుత్వం చెల్లించాల్సి ఉండేది. అయితే ప్రభుత్వం తన వాటా వడ్డీని బ్యాంకులకు చెల్లించకపోవడంతో మొత్తం వడ్డీని బ్యాంకర్లు మహిళల నుంచే వసూలు చేశారు. తాజాగా ఇచ్చే రుణాలకు కూడా ప్రభుత్వం వడ్డీ చెల్లించకపోతే అది కూడా మళ్లీ మహిళల మీదే పడే అవకాశం ఉంది.

అభాసుపాలైన అమ్మహస్తం

ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రచార ఆర్భాటం శృతి మించుతోంది. రేషన్‌షాపుల్లో తక్కువ ధరలకే చక్కెర, చింతపండు, పసుపు, కారం, కందిపప్పుతో సహా తొమ్మిది రకాల సరుకులు ఇస్తామంటూ 'అమ్మ హస్తం' పథకం ప్రారంభించారు. వాటిని కిలో, అరకిలో ప్యాకెట్లు చేసి, వాటి మీద ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి బొమ్మలు వేసి విక్రయిస్తున్నారు. వీటిని తీసుకెళ్లేందుకు ఇవే ఫొటోలతో ప్రత్యేకంగా బ్యాగులు ముద్రించి ఇస్తున్నారు. అయితే ఈ వస్తువుల ధర మార్కెట్ ధరతో సమానంగా ఉండడం, నాణ్యత లోపించడం, తూకంలో తేడాలు ఉండడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఈ పథకం ప్రారంభంలోనే అభాసుపాలైంది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సరిపడా సరుకులు అందించలేకపోయారు. నెలనెలా ఈ సరుకులన్ని కార్డుదారులు తీసుకుంటారో లేదో తెలియని స్థితిలో వీటికి వేలాది రుపాయలు అప్పుగా తీసుకొచ్చి డిడిలు చెల్లించడం రేషన్ డీలర్లకు కూడా తలకు మించిన భారంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో ధరలను నియంత్రించలేని ప్రభుత్వం ఇలా చౌక ధరల పథకాలను ప్రవేశపెట్టడం చౌకబారుగా ఉంటుంది.

ఇందిరమ్మ పచ్చతోరణం

సిఎం కిరణ్ ప్రారంభించిన మరో పథకం 'ఇందిరమ్మ పచ్చతోరణం'. భూములు లేని ఎస్‌సి, ఎస్‌టిలను గుర్తించి వారితో రోడ్లు, చెరువు, కాల్వ గట్ల వెంట పండ్ల మొక్కలు నాటిస్తారు. ఒక్కో కుటుంబానికి 200 మొక్కలు ఇవ్వనున్నారు. వీటిని పెంచేందుకు నెలకు రు.3000 కూలీగా చెల్లించనున్నారు. ఇవి పెరిగాక చెట్లను పెంచినవారి పేరు మీదే పట్టా చేయనున్నారు. పండ్ల మీద ఆదాయం కూడా వారికే చెందుతుంది. రు.200 కోట్లు ఖర్చు చేస్తున్న ఈ పథకానికి తొలుత లక్ష మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పాత పథకానికి కొత్త పేరు 'బంగారు తల్లి'

రాష్ట్రంలో ఆడశిశువుల సంఖ్య ఏడాదికేడాది తగ్గుతుండడంతో, ఆ సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'బంగారు తల్లి' పథకాన్ని ప్రవేశపెట్టింది. వాస్తవానికి ఈ తరహా పథకాన్ని వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 'లఖ్‌పతి' పేరుతో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందే బాలిక పేరిట ప్రభుత్వం రు.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తుంది. ఈ పథకానికి 2011లోనే నిధులు నిలిపివేసిన ప్రభుత్వం తాజాగా 2013, మే 1న 'బంగారు తల్లి' అమలులోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా మే 1 తర్వాత పుట్టిన ఆడపిల్లలే లబ్ధిపొందనున్నారు. పుట్టినప్పటి నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే వరకు ఈ పథకం వారికి వర్తించనుంది. వీరికి బిడ్ పేరిట గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. ఆడపిల్ల పుట్టగానే ఆమె తల్లికి రు.2500, ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు ఏడాది రు.1500, పాఠశాలలో చేరినప్పుడు రు.1000, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఏడాదికి రు.2,000, ఆరు నుంచి ఎనిమిది వరకు రు. 2500, 9, 10 తరగతులకు రు.3000, ఇంటర్‌లో ఏటా రు.3500, డిగ్రీలో రు.4000 ఇవ్వనున్నారు. అంతేగాక డిగ్రీ పూర్తి చేసిన అమ్మాయికి ఉన్నత చదువుల కోసం రు. లక్ష, అలా కాకుండా ఇంటర్‌తోనే చదువు మానేసిన వారికి రు.50,000 ఆర్థిక సాయం ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ పథకం తెల్లరేషన్‌కార్డు ఉన్న వారందరికీ వర్తిస్తుంది. తొలుత ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారికి మాత్రమే ఈ పథకం వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ విమర్శలు రావడంతో వెనక్కి తీసుకుంది. అలాగే తప్పనిసరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించి ఉండాలనే నిబంధనను ఏజెన్సీ గిరిజనుల విషయంలో సడలించింది. ప్రారంభమైన నెలన్నరకే జూన్ 19న ఈ పథకం అసెంబ్లీలో చట్టబద్ధత పొందడం విశేషం.


ముగింపు

ఇవేగాక పేరు బయటికి రాకుండా, ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లుగా మిగిలిపోయిన పథకాలు అనేకం ఉన్నాయి. అమలు చేయాల్సిన అధికారులకు కూడా తెలియని పథకాలు అనేకం కాగితాలకే పరిమితమయ్యాయి. కొన్ని పథకాలకు నిధులు విడుదల కాక, మరికొన్ని పథకాలను అధికారులు పట్టించుకోక ప్రచారంలోకి రావడం లేదు. అయితే ఈ సంక్షేమ పథకాలను స్థూలంగా చూస్తే ఇవన్నీ పేదరిక నిర్మూలనకు పైపూతలు మాత్రమే. ఈ పథకాలను క్షేత్రస్థాయిలో అమలులోకి వచ్చేసరికి దళారులే అధికంగా లాభపడుతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు పర్సంటేజీలు పోనూ లబ్ధిదారుడికి చివరికి కొసరే మిగులుతోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అధికారం వెలగబెట్టిన ప్రభుత్వాలు ఏవీ కూడా పేదరికానికి కారణమైన మౌలిక సమస్యలను పట్టించుకోలేదు. భూ సమస్యను పరిష్కరించలేదు. ఉపాధి అవకాశాలను కల్పించడంలో విఫలమయ్యాయి. ఇలాంటి సంక్షేమ పథకాలపై ఉన్న శ్రద్ధ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గానీ, ఉపాధినిచ్చే పరిశ్రమలను నెలకొల్పడంలో లేదు. పాలకవర్గంలో ఉన్న వారు ప్రజలకు చిల్లర పైసలు ఎరగా వేసి కోట్లాది రుపాయలు కొల్లగొడుతున్నారు. తమ దోపిడీ ప్రజలకు కనిపించకుండా, వారు పట్టించుకోకుండా సంక్షేమ పథకాలను సాధనంగా వాడుకుంటున్నారు. వారి అవినీతికి ఈ పథకాలు ముసుగుగా పనిచేస్తున్నాయి. సంక్షేమ పథకాలతో పేదరికాన్ని నిర్మూలిస్తామని ప్రభుత్వాలు ప్రకటించడం ప్రజలను మోసగించడమే.

(రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్: హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు) వీ

వర్ధమాన కవి వనపట్ల 'హొల్లెడ'

- గుడిపల్లి నిరంజన్



హొల్లెడ - దీర్ఘ కవిత - వనపట్ల సుబ్బయ్య - 72 పేజీలు, 1/8 డెమీ, రు.30, ప్రతులకు: వనపట్ల సుబ్బయ్య,18-37, సంజయ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ - 509 209, తెలంగాణ రాష్ట్రం

'**నా** కళ్లు అసహ్యించుకుంటున్న
కుళ్లును తొలగించకుండా నా కళ్లనే పెరికేస్తారా'

అని చెరబండ రాజు ఆవేశంతో వ్యవస్థను ప్రశ్నించారు. భారతీయ ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఎంత గుడ్డివంటే ప్రతి ప్రజాస్వామ్య పోరాటం తీవ్రతరమై, హింస రూపం దాల్చితే తప్ప, ఆ పోరాటాన్ని గుర్తించడానికి ఇష్టపడవు. తెలంగాణ ప్రజలు స్వరాష్ట్రం కోసం గత 56 సంవత్సరాలుగా తమ ఆకాంక్షను అనేక శాంతియుత పోరాటాల ద్వారా అనేక ఉద్యమాల ద్వారా వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ప్రపంచంలోనే ఒక అద్భుతమైన, అపురూపమైన, అనిర్వచనీయమైన పోరాటం 'సకల జనుల సమ్మె' 42 రోజులు జరిగిన సమ్మెను వనపట్ల సుబ్బయ్య ఒక్కొక్క రోజు జరిగిన ఉద్యమ రూపాన్ని ఒడిసిపట్టి, అక్షర రూపం ఇస్తే 'హొల్లెడ' దీర్ఘకావ్యంగా రూపం దాల్చింది.

పాలమూరు జిల్లానే వనపట్లను తయారు చేసి సాహిత్య రంగంలో నిలిపింది. ఈ కవి బతుకు తెరువు కోసం కలాన్ని పట్టుకోలేదు. సామాజిక న్యాయానికి దూరంగా, ఆవల విసిరి వేయబడిన ప్రజల చైతన్యం కోసం కలం, మంగలి కత్తి రెండూ పట్టుకున్నాడు.

తెలంగాణ చరిత్రంతా వీరత్వంతోనే మాట్లాడుతోంది. కలవరిస్తోంది. పలువరిస్తోంది. ఎంతో మంది జనసంద్రమై తెలంగాణ నినాదాలతో యుద్ధ కచ్చేరిలు చేస్తుంటారు. మాదిగలు, మాలలు, చిందోళ్లు, మంగలి, గొల్ల కురుమలు, వడ్డెరలు, బోయలు, విద్యార్థులు, ఉద్యోగులు, కమ్మర్లు, బుడ బుక్కలు, కావలికార్లు ఒకరేంటి, సమస్త వృత్తులు, సమస్త కులాలు సమ్మెలో పాల్గొన్న తీరు మన కళ్ల ముందు పెట్టాడు ఈ కవి. హొల్లెడకు సబ్బండ వర్ణాల పిడికిళ్ల బలం ఉందని దానిని చూసిన వాళ్లకు, చదివిన వాళ్లకు అనిపిస్తుంది. తన కళ్ల ముందు జరుగుతున్న సమ్మెలో తన మంగలి కులస్తులను అశిపెలను భుజాన వేయించి, తానూ వేసుకొని సమైక్య పాలనకు వ్యతిరేకంగా రోడ్లపైన గడ్డాలు, క్షౌవురాలు చేసిన నిరసనతోనే 'హొల్లెడ' ఇలా ప్రారంభమైంది.

ఎడం చేతిలో అశిపె/కుడిచేతిలో బ్యానరు/తెలంగాణ ద్రోహులకు/ క్షవరం చేయబడదు/సకల జనుల సమ్మెలో మంగళ్లు.

దోపిడిని సుబ్బయ్య ఓ పట్టాన సహించడు. అత్యంత తిరస్కృతంగా తన భావాన్ని ప్రకటిస్తాడు. జంకు, సంకోచం అసలు తనకు కలుగనే కలుగవు. మాదిగల సంఘీ భావాన్ని చాలా శక్తివంతంగా ప్రకటించాడు.

దళారుల చర్మాలు వలిచి/అమరవీరుల పాదాలకు/చెప్పులు కుడ్తాం/ పెద్ద మ్యాతర్ల/చరిత్ర మీద మట్టి కప్పితే/చెప్పు దెబ్బలు తప్పవంటున్న మాదిగలు.

హొల్లెడలో యావత్ తెలంగాణ జీవన చిత్రం, సమస్త తెలంగాణ కళా రూపాలు, వృత్తి కళా రూపాలు, వారి పనిముట్లు కూడా చోటు సంపాదించాయి. మాదిగల ఆరె, రంపె, గూటం, గౌడ్ల మోకులు, గొల్ల కురువల డోలు, బోయల విల్లంబులు, చాకలి సాకిరేవు, విశ్వకర్మల సమ్మెట, మంగలి కత్తి ఇవన్నీ కూడా సమ్మెను, పలకరించిన తీరు అద్భుతంగా చెప్పాడు. సమ్మెలో ఎన్ని పిడికిళ్లు పొడుచుకొచ్చాయో, ఎన్ని కంఠాలు గళమెత్తాయో, ఎంత సాంస్కృతిక వైవిధ్యాన్ని పొందినాయో, ఎంత మంది గాయకులు తమ తమ ఉద్యమ గీతాలతో ఉద్యమించారో సుబ్బయ్య ఇవన్ని కూడ చాలా సహజంగా వ్యక్తీకరించాడు. ప్రతి నినాదాన్ని పలకరించాడు. ప్రతి కంఠాన్ని పట్టుకున్నాడు. ప్రతి పిడికిలిని తన కలం మునివేళ్లతో ముద్దాడాడు.

హొల్లెడ చదువుతుంటే నాటకం చూసినట్లు మన హృదయంలో అనేక రసానుభూతులు కలుగుతాయి. నాటకంలో ఒక పాత్ర తరువాత మరొక పాత్ర కథను ప్రేక్షకులకు పూస గుచ్చినట్టు అభినయించడం జరుగుతుందో, సమ్మెలో సబ్బండ కులాలు కుల పనిముట్లతో, నృత్యాలతో వచ్చిన తీరును కరెక్టుగా పట్టుకుని ఒక దృశ్య కావ్యంగా, ఒక డాక్యుమెంటరీ చిత్రంగా నిలిపినాడు.

అలలు ఆగిపోవద్దు/బందగీ ఆలోచనలవ్వాలి/ గమనం ఆగిపోవద్దు/ గ్రహణాల్ని ఛేదించాలి/ఆశయాలు వాలిపోవద్దు/తొలి పొద్దులై పొడవాలి ...అని విద్యార్థులను మేలుకొలుపుతూ ఆత్మహత్యలు అంతిమ పరిష్కారం కాదని, వారిని బందగీ, కొమురయ్య చాకలి ఐలమ్మలను ఆదర్శంగా తీసుకుని పోరాడమని సూచిస్తాడు. అదే విధంగా ఎన్ని అవంతరాలొచ్చినా ఉద్యమ లక్ష్యం చేరుకున్నంత వరకు ఆపొద్దని, ఆగి పోవద్దని సూచిస్తూ...

'తుఫానొచ్చిన తూటాలు కురిసినా/ఈదులు తాళ్ళు గీసినట్లె/అసెంబ్లీ మీద జెండా ఎగురేస్తం/అడ్డొచ్చే జలగల తిత్తులు/తీస్తామంటున్న మోకులు' అని ప్రకటించాడు.

తెలంగాణలో సమైక్య నీడలో ఏ ఊర్లు చూసిన వలసే. ఏ కుటుంబాన్ని కదిపిన దు:ఖమే. ఏ పల్లె తల్లిని పలకరిచ్చినా శోకమే. ప్రతి మనిషి నిత్యం తనతో పాటు దుఃఖాన్ని మోసుకొని తిరుగుతుంటాడు. ఇక్కడి చెరువుల్లో నీళ్లు లేక తూమ్‌లు అలుగు ఎల్లడం లేదు కాని దుఃఖం మాత్రం అలుగెల్లుతోందని చాలా ఆర్ద్రంగా ప్రకటిస్తాడీ కవి.

వికలాంగులను పట్టించుకునేదెవరు?

వికలాంగుల సమస్యల్ని పరిష్కరించకుండా, వారిని అన్ని రంగాల్లో నిర్లక్ష్యం చేస్తూ, వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వమే వారిని పట్టించుకోకుండా వదిలేసిందని అంటున్నారు **బిళ్ల మహేందర్**

దేశం స్వాతంత్ర్యం పొందిన నాటి నుండి నేటి వరకు వికలాంగులు సమాజంలో, కుటుంబంలో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఆనాడు డా. బి.ఆర్. అంబేద్కర్ ఎస్సి, ఎస్టిలతో పాటు భవిష్యత్తులో ఇంకా అణగారిన వర్గాలెవరైనా సమాజంలో అట్టడుగున ఉండే వారికి అన్ని రంగాలలో సమాన అవకాశాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, రాజ్యాంగ బద్ధంగా కల్పించాలనే సూచనను నేటి పాలకులు పట్టించుకోకపోవడంతో వికలాంగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్రంలో వికలాంగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వీరి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వీరికి రు. 500 ఫించను ఇచ్చి చేతులు దులుపుకుంటుంది. కానీ వీరికి కల్పించాల్సిన మౌలిక సౌకర్యాలపై ఏ మాత్రం శ్రద్ధ పెట్టడంలేదు. చట్ట ప్రకారం అమలు కావల్సిన జి.ఒ.లు కూడ అమలు కావడం లేదు.

వికలాంగుల పోరాటాల ఫలితంగా ప్రభుత్వం వికలాంగులకు రు. 200 పెన్షన్ నుండి వైకల్య శాతాన్ని బట్టి రు.500, రు.600, రు.700లకు పెంచుతూ ప్రకటన చేసింది. కాని అమలు విషయంలో పెన్షన్ రు.600, రు.700 అటకెక్కగా, అర్హులైన రు. 500 పెన్షన్‌దారులకు కూడ సదరన్ క్యాంపుల పేరుతో అనర్హత వేటు వేసి లక్షలాది మంది వికలాంగుల పెన్షన్‌లను రద్దు చేసింది. ప్రస్తుతం పెరిగిన ధరలకు వికలాంగులు సామాన్య జీవితాన్ని గడపడానికి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రు. 500 ఏ మూలకు సరిపోదు. అంతేకాకుండా వికలాంగులు అందరితో సమానంగా జీవించడానికి వారి ఆర్థిక సామాజిక భద్రత ఆయా ప్రభుత్వాలు కల్పించాలని మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 చెపుతుంది. కాబట్టి ప్రభుత్వం పెన్షన్ రు.500 నుండి రు.1500ల వరకు పెంచినట్లయితే వారి జీవితాలకు సరైన భరోసా లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఇప్పటికీ జిల్లాల వ్యాప్తంగా అనేక వికలాంగుల బ్యాక్‌లాగ్ రిజర్వుడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని శాఖలు, సంస్థల్లో ఖాళీగా ఉన్న అన్ని రిజర్వుడ్ ఉద్యోగాలను అర్హులైన వికలాంగులతో భర్తీ చేయాలి. అదేవిధంగా ఎస్.సి, ఎస్.టి. అభ్యర్థుల మాదిరిగా ఉపాధ్యాయ నియామకాలల్లో వికలాంగులైన అభ్యర్థులకు బి.ఎడ్, టి.టి.సి. అర్హత నిబంధనలను సడలించి ఆయా ఉద్యోగాలకు రెండు సంవత్సరాలకు శిక్షణ పూర్తి చేయాలనే నిబంధనతో అనుమతించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గల వికలాంగుల హాస్టల్ పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. ఇప్పటికీ చాలా హాస్టళ్లలో రక్షిత మంచినీటి సరఫరా, మరుగు దొడ్లు, డ్రైనేజి, దోమ తెరలు, దుప్పట్లు తదితర సౌకర్యాలు అందుబాటులో లేకుండా పోవడం వల్ల హాస్టల్లో గడుపుతున్న వికలాంగ విద్యార్థులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతూ, అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా బాలికల హాస్టల్ పరిస్థితులు మరీ అధ్వాన్నంగా కొనసాగుతున్నాయి. వీరికి సరైన రక్షణ లేకపోవడం వల్ల విద్యార్థినిలు ప్రతి రోజు భయంతో గడపవలసిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. దీనికి తోడు హాస్టల్ వార్డెన్లు, సిబ్బందిల నిర్లక్ష్యంతో విధులను నిర్వహించడం వల్ల రాత్రి సమయాల్లో వికలాంగులైన బాలికలు విపరీతమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాబట్టి అధికారులు వారికి తగు రక్షణలు కల్పించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను మందలించి హాస్టళ్లలో వివిధ సౌకర్యాలను, అవసరమైన సిబ్బందిని పెంచినట్లయితే వికలాంగుల విద్యార్థులకు కొంత మేలు చేకూరుతుంది.

అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న మహిళలపైనే నేడు అనేక అత్యాచారాలు, అవమానాలు జరుగుతున్న రోజులివి. ఇక వికలాంగ మహిళల పరిస్థితి వేరే చెప్పనవసరం లేదు. మహిళా వికలాంగులపై జరుగుతున్న అత్యాచార, అవమానాలు నిరోధించడానికి చట్టం తేవాలని చెపుతున్నా ఇంతవరకు అలాంటి ప్రయత్నం చేయడం లేదు. కాబట్టి దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి వికలాంగుల అత్యాచార అవమాన నిరోధక చట్టాన్ని చేయాలి. దీంతో పాటుగా సాధారణ మహిళలకు

'చుక్కలు లేని ఆకాశం/బిడ్డలు లేని ఊర్లు/అలుగెల్లిన దుఃఖం' భారతదేశంలో హక్కుల కోసం చాలా పోరాటాలు జరిగాయి. ఆయా పోరాటాలలో ఒక కులమో, ఒక మతమో, ఒక వర్గమో చేసి ఉన్నాయి. బహుశా అన్ని జాతులు పాల్గొన్నది ఒక స్వాతంత్ర్య పోరాటమేనేమో. ఆ తరువాత అన్ని కులాల వారు, మతాల వారు, వర్గాల వారు కలిసి పోరాటం చేస్తున్నది ఒక తెలంగాణ పోరాటమే.

"సకల జనుల సమ్మె/సర్వ జనుల సమ్మె/ సమ్మె మీద సమ్మె/ తెగదెంపులు జరిగేదాక/తెలంగాణ వచ్చేదాక/ తెలంగాణ వచ్చేదాక/ ఎడతెగని సమ్మె" అని ప్రకటిస్తాడు. తెలంగాణ స్వరాష్ట్రం మాత్రమే సమస్యకు పరిష్కారం అని బలంగా చెప్పాడు. సుబ్బయ్య మంగలి వృత్తిని, సాహిత్యాన్ని తన కంటే ఎక్కువగా ప్రేమిస్తాడు. పగలు క్షౌరాలు, రాత్రి సాహిత్యం పనిగా విభజించుకుని బతుకుతున్న మనిషి. పెట్టుబడిదారులు ఉన్నంత కాలం దోపిడీ ఉంటుంది. దోపిడీ ఉన్నంత కాలం కార్మికులు, సామాన్యులు పీడనకు గురవుతూనే ఉంటారు. పీడన ఉన్నన్ని రోజులు సమ్మెలు ఉంటూనే ఉంటాయి. సమ్మెలు ఉన్నన్ని రోజులు 'హాల్డెడ' జీవిస్తూనే ఉంటుంది.

పెట్టుబడిదారీ సమాజం అంతంతోనే 'హాల్డెడ' కనుమరుగవుతుంది. చివరగా జీవితం, సాహిత్యం ఒక్కటేనని భావించే ఈ వర్ధమాన కవిని అందరూ అభినందించాల్సి ఉంది. వీ

(రచయిత ఉపాధ్యాయులు)

ఇచ్చే ప్రసూతి ఖర్చుల కన్నా వికలాంగుల మహిళ ప్రసూతి ఖర్చులను పెంచాలి. అదే విధంగా వికలాంగుల మహిళలకు రిజర్వేషన్లలో ప్రథమ ప్రాధాన్యతను కల్పించినట్లయితే వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసినట్లు అవుతుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి, వికలాంగుల మహిళ అభివృద్ధికి పాటు పడాలి.

జి.ఒ.ఎం.ఎస్. 1095 ప్రకారం ప్రభుత్వ భూమి పంపిణీ చేస్తే, ప్రభుత్వ భూమి మిగిలి ఉన్నట్లయితే ముందుగా వికలాంగులకే ఇవ్వాలని చెపుతుంది. కాని ఆ విధంగా జరగడం లేదు. అర్హులైన వికలాంగులకు అసైన్డ్ భూమి ఇవ్వాలని గతంలోనే సునితా లక్ష్మారెడ్డి ఏర్పాటు చేసిన కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏనాడో భూపంపిణీ పథకాన్ని మరచిపోయింది. గత వార్షిక బడ్జెట్‌లో వికలాంగుల నిధుల విషయంలో తీవ్ర అన్యాయం జరిగింది. వికలాంగుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామని గొప్పలు చెప్పే ఈ ప్రభుత్వం వారి సంక్షేమ పథకాల కోసం మాత్రం బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకపోవడం శోచనీయం. రోజు రోజుకు మారుతున్న పరిస్థితులను చూస్తే వికలాంగుల సంక్షేమాన్ని అభివృద్ధి చేయవలసిన ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులో కూడ వికలాంగులను చిన్న చూపు చూసి అవమానానికి గురి చేస్తున్నాయి. 'వికలాంగుల చట్టం 1995' ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖల నుండి మూడు శాతం నిధులు వికలాంగుల సంక్షేమానికి ఖర్చు చేయాలని చెపుతున్నప్పటికీ నేటికి వివిధ సంక్షేమ శాఖల వారు మూడు శాతం నిధులను కూడా వికలాంగులకు ఖర్చు చేయలేక పోవడం సిగ్గుచేటుగా మారింది. కాబట్టి ప్రభుత్వం వచ్చే వార్షిక బడ్జెట్‌లోనైనా వికలాంగుల జనాభా ప్రాతిపదికన వికలాంగులకు సరైన బడ్జెట్‌ను కేటాయించి ఆ నిధులను ప్రత్యేక మంత్రిత్వ శాఖ ద్వారా ఖర్చు చేయాలి. అదే విధంగా ఎస్.సి, ఎస్.టి. సబ్‌ప్లాన్ మాదిరిగా వికలాంగులకు కూడ ప్రత్యేకంగా సబ్ ప్లాన్‌ను అమలు చేసినట్లయితే వికలాంగుల జీవితాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది.

అంధులు, బధిరులు, అంగ వికలురులతో పాటుగా కుష్ఠు వ్యాధిగ్రస్తులు, మరుగుజ్జులు, మానసిన వైకల్యం ఉన్న తదితరులను రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కేటగిరిలో చేర్చడం జరిగింది. దీని వల్ల వికలాంగుల సంఖ్య రాష్ట్రంలో గణనీయంగా పెరిగింది. కాబట్టి ప్రభుత్వం వీరికిచ్చే మూడు శాతం రిజర్వేషన్ ఏ మాత్రం సరిపోవడం లేదు. కాబట్టి వికలాంగుల రిజర్వేషన్‌లను వారి జనాభా ప్రాతిపదికగా మూడు శాతం నుండి ఏడు శాతం వరకు పెంచినప్పుడే ఆయా కేటగిరిల వికలాంగులు లబ్ధి పొందే అవకాశం ఏర్పడుతుంది. అర్హులైన ప్రతి వికలాంగుడికి ప్రభుత్వం తప్పకుండా ఉచిత గృహ వసతి, ఉచిత విద్యుత్తు, ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించాలి. వీటితో పాటు ప్రభుత్వ పూచికత్తుతో వికలాంగులకు ఒక లక్ష రూపాయల నుండి 10 లక్షల రూపాయల వరకు రుణ సదుపాయాన్ని కల్పించినట్లయితే వారి జీవితాలకు ఆధారం లభించినట్లు అవుతుంది. కావున ప్రభుత్వం ఆ సదుపాయాన్ని అర్హులైన ప్రతి వికలాంగుడికి కల్పించాలి.

ఎన్నో అవమానాలు, అవహేళనల మధ్య వికలాంగులు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలకు పోటీ పడుతుంటే వారికి పోటీగా కొంత మంది చదువుకున్న ప్రబుద్ధులు లేని వైకల్యాలను సృష్టించుకొని నకిలీ వికలాంగుల ధృవీకరణ పత్రాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉద్యోగాలను సంపాదించుకొని నిరుద్యోగ వికలాంగుల పొట్టను కొడుతున్నారు. వరంగల్, మెదక్, కరీంనగర్, అనంతపురం తదితర జిల్లాల్లో నకిలీ వికలాంగుల ధృవీకరణ పత్రాల ద్వారా సకలాంగులు వివిధ డి.ఎస్.సి.లలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం వల్ల నిరుద్యోగ వికలాంగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. ఈ విషయాలపై ప్రభుత్వ అధికారులు చూసీ-చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో నిరుద్యోగ వికలాంగులు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించుకోక ఆత్మహత్యలే శరణ్యంగా భావిస్తున్నారు. కాబట్టి ఈ నకిలీ వికలాంగుల ధృవీకరణ పత్రాల వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని అర్హులైన నిరుద్యోగ వికలాంగులకు న్యాయం చేకూరే విధంగా ప్రయత్నించాలి. ఇది ఇలా ఉండగా ఆర్థిక సంస్కరణ, ఖజానాపై భారం అనే సాకుతో ప్రభుత్వం 2002 అనంతరం ప్రభుత్వ సర్వీసుల్లోని ఉద్యోగులకు పెన్షన్‌ను రద్దు చేయడం జరిగింది. ఇది వికలాంగ ఉద్యోగులకు తీరని శాపంగా మారుతున్నది. దీని వల్ల ఉద్యోగ విరమణ అనంతరం వికలాంగ ఉద్యోగులు సాఫీగా జీవితాన్ని కొనసాగించడం చాలా కష్టం. కాబట్టి వికలాంగులకు జీవిత కాలం పెన్షన్ వచ్చే ఏర్పాటు ప్రభుత్వం కల్పించాలి. దీంతో పాటుగా కుటుంబ పరిస్థితులు, రవాణా పరిస్థితుల దృష్ట్యా వికలాంగ ఉద్యోగుల కోరిక మేరకు బదిలీ సౌకర్యాలన్ని కల్పించాలి. అదే విధంగా ఇతర రాష్ట్రాల మాదిరిగా వికలాంగ ఉద్యోగులకు ఇస్తున్న ప్రత్యేక అలవెన్స్‌ను తొమ్మిది వేల నుంచి పదిహేను వందల వరకు పెంచాలి.

అన్ని వర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కుల సంఘ నాయకులు ఆయా వర్గాల సంక్షేమం కొరకు ముందుండి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడానికి ముందు బడ్జెట్‌లో రావలసిన నిధులను గురించి చర్చించి ప్రభుత్వంతో పోరాడడం జరుగుతున్నది. కాని అన్ని వర్గాలలో ఉండే వికలాంగుల గురించి మాత్రం మాట్లాడే నాయకుడు లేకపోవడం వికలాంగుల దౌర్భాగ్యంగా పరిగణించవచ్చు. దీనంతటికి కారణం వికలాంగులకు చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడమేనని స్పష్టంగా చెప్పవచ్చు. చట్ట సభల్లో వికలాంగులకు రిజర్వేషన్‌లు కల్పించనట్లయితే వారికి రావలసిన నిధులు, తదితర సమస్యల పరిష్కారం కోసం చట్ట సభల్లో గొంతెత్తే అవకాశం లభిస్తుంది. కాబట్టి వికలాంగులకు ప్రభుత్వం తప్పనిసరిగా పంచాయితీ నుండి పార్లమెంటు వరకు ఏడు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించినట్టయితే వికలాంగులు తమ సమస్యలను త్వరగా పరిష్కంచుకోడానికి వీలు అవుతుంది.

వికలాంగుల సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోవడం వల్ల వికలాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లెక్కవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అనేక రకాలైన వైకల్యాలతో వికలాంగులు బాధపడుతున్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరీ వల్ల సమస్యల పరిష్కార మార్గాల కోసం పోరాటమే శరణ్యమంటూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుండి రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలలో వికలాంగులు నిరాహార దీక్షలు చేపడుతున్నారు. అయినప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు వారి సమస్యల పట్ల స్పందించక పోవడం వికలాంగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపును, నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తున్నది. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, మేధావులు వికలాంగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ మద్దతిస్తున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రర్తించడం చాల సిగ్గుచేటు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా వికలాంగుల సమస్యల పట్ల తక్షణమే స్పందించి వారి జీవితాలకు సరైన భద్రతను కల్పించాలి.

(రచయిత జిల్లా ప్రధాన కార్యదర్శి,
వికలాంగుల ఉపాధ్యాయ సంఘం, వరంగల్) వీ

ప్రజల సొమ్ముతో ప్రజలపైనే నిఘా

***ప్రజల ఓట్లతో ఎన్నికై, ప్రజల శ్రమను, వనరులను దోచుకుంటూ తమ అధికారాన్ని నిలుపుకోవడం కోసం పాలకులు, ప్రజలపైనే నిఘా చేస్తున్నారంటున్నారు* లోకసంచారి**

ఎడ్వర్డ్ స్నోడెన్. అతను ఇంటర్ కూడ చదవలేదు. అయినా ఒక కంప్యూటర్ ఇంజనీర్‌గా ఏటా రెండు లక్షల డాలర్ల సంపాదనతో అతి సుఖవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. అమెరికాలో అతి కొద్ది మంది, అంటే ఒక్క శాతం లోపు ప్రజలు మాత్రమే ఆ స్థాయి సంపాదన కలిగి ఉంటారు. పైగా తాను పనిచేస్తున్నది అమెరికాలో ఆ దేశ ప్రెసిడెంట్ కన్నా పవర్‌ఫుల్ సంస్థ అయిన నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీలో(ఎన్ఎస్ఎ). ఇక్కడ తను కాంట్రాక్టు మీద పని చేస్తున్నా, బూజ్ అల్లెన్ అండ్ హ్యామిల్టన్ అనే డిఫెన్స్ కాంట్రాక్టు దిగ్గజం తన మాతృ సంస్థ. ఇది ఎంత పవర్‌ఫుల్ కంపెనీ అంటే అవసరమైతే అమెరికా ప్రెసిడెంట్‌ను మార్చగల, హతమార్చగల (కెన్నడీ వలె) స్థాయి కలిగిన అతి కొద్ది మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కంపెనీలలో ఒకటి. (ప్రజా భద్రత, దేశ రక్షణ, నిఘా పేరు మీద ఏటా లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టుల రూపేణా కొట్టేస్తూ తమ దేశమే కాదు మొత్తం ప్రపంచ ప్రజల భద్రతకు, ప్రపంచ శాంతికి ప్రమాదంగా మారిన అనుత్పాదక మిలటరీ, ఆయుధ, నిఘా విభాగ సంస్థలను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ సంస్థలని విమర్శనాత్మకంగా పిలుస్తారు).అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.కి సబర్బన్ ఏరియాలో మేరీల్యాండ్, వర్జీనియా రాష్ట్రాల పరిధిలో ఉండే ప్రాంతాలు, ప్రధానంగా బెల్ట్‌వేకు (మన ఔటర్ రింగ్ రోడ్డు లాంటిది), పొటోమ్యాక్ నది ఇరువైపుల ఉండే ప్రాంతాల్లో ఈ డిఫెన్స్ కాంట్రాక్టు కంపెనీల హెడ్ క్వార్టర్లు ఉంటాయి. ఈ ప్రాంతంలో నేను పని చేశాను కాబట్టి మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కంపెనీల గురించి కొంచెం ఎక్కువగా తెలుసుకునే అవకాశం నాకు కలిగింది. వీటిలో విదేశీయులకు ఉద్యోగాలు ఇవ్వరు. కొన్ని ముఖ్యమైనవి కాని ఉద్యోగాలకు గ్రీన్‌కార్డు ఉన్న వారికి అవకాశం ఉంది. మిగతా ఉద్యోగాలకన్నింటికి అమెరికా పౌరసత్వం తప్పని సరి. ఈ కంపెనీలలో ఉద్యోగం దొరకాలంటే సెక్యూరిటీ క్లియరెన్స్ అనేదే అతి పెద్ద అర్హత. సెక్యూరిటీ క్లియరెన్స్ పలు స్థాయిలలో ఉంటుంది. సెక్యూరిటీ గార్డులు, క్లీనింగ్ చేసే వారు, ఇలాంటి ఉద్యోగాలకు లెవెల్-వన్ సెక్యూరిటీ క్లియరెన్స్ ఇస్తే, ఉద్యోగం ప్రాముఖ్యత, రహస్యత ప్రకారం లెవెల్-టెన్ ఆపై స్థాయి క్లియరెన్స్ కూడా ఉంటుంది. సెక్యూరిటీ క్లియరెన్స్ లభించాలంటే ఆ వ్యక్తి పదిహేను సంవత్సరాల వయసు నుండి ఏయే ప్రాంతాల్లో నివసించాడో ఆయా ప్రాంతాలలో పోలీసు క్లియరెన్స్ తీసుకుంటారు. తను పని చేసిన కంపెనీల అన్నింటిలో అతని ప్రవర్తన ఎలా ఉందో తెలుసుకుంటారు. బ్యాంకులు, క్రెడిట్ కార్డుల కంపెనీల నుండి తన ఆర్థిక లావాదేవీల చరిత్ర, క్రెడిట్ హిస్టరీ, ఇంటర్నెట్ బ్రౌజింగ్ హిస్టరీ లాంటివి తీసుకొని పరిశీలిస్తారు. ఇదంతా సరిగా ఉంటే రక్షణశాఖ వారు ఆ దరఖాస్తును పరిశీలించి తమ పరిశోధనానంతరం లెవెల్-వన్ క్లియరెన్స్ ఇస్తారు. నేరుగా రక్షణ శాఖకు పని చేసినా లేదా రక్షణ శాఖతో పని చేసే ప్రైవేట్ కంపెనీలో పని చేసినా సెక్యూరిటీ క్లియరెన్స్ ఒకటే. ఎందుకంటే అమెరికాలో ప్రైవేట్ కంపెనీల బాధ్యత ఎక్కడ ముగుస్తుంది, ప్రభుత్వ బాధ్యత ఎక్కడ మొదలవుతుంది అనేది ఎవరికీ అర్థం కాదు. అక్కడ ప్రైవేట్ కంపెనీలే ప్రభుత్వం. ప్రభుత్వమే ప్రైవేట్. సైనికులతో సహా అన్ని రక్షణశాఖ కార్యాలయాలలో, సిఐఎ, ఎన్ఎస్ఏలలో పని చేసే ఉద్యోగులలో మెజారిటీ ప్రైవేట్ కంపెనీలలో పనిచేసే ఉద్యోగులే. ఎవరి మీద నిఘా చేయాలి, ఏ దేశాల మీద యుద్ధం చేయాలి, ఏ దేశ నాయకులను హతమార్చాలి లాంటి నిర్ణయాలు తీసుకోవడంలో, అమలు చేయడంలో అమెరికా ప్రభుత్వం పాత్ర ఎంతుంటుందో ప్రైవేట్ కంపెనీల పాత్ర అంతకంటే ఎక్కువే ఉంటుంది. రక్షణ శాఖ సిఐఎ, ఎన్ఎస్ఏలతో పని చేసే చిన్న స్థాయి కాంట్రాక్టు కంపెనీల నుండి మొదలుకొని అతి పెద్ద సంస్థల వరకు వాటిలో రాజకీయ నాయకుల భాగస్వామ్యం, మాజీ రక్షణశాఖ అధికారుల, అలాగే అమెరికాకు చెందిన అత్యంత ధనవంతుల భాగస్వామ్యంతో నడుస్తున్నవే. లెవల్-ఫోర్ నుండి సెక్యూరిటీ క్లియరెన్స్ లభించడం చాలా కష్టం. దానికి రక్షణ శాఖ, సిఐఎ, ఎన్ఎస్ఏలలో చాలా కాలంగా పని చేసిన అనుభవం ఉండాలి. ప్రైవేట్ డిఫెన్స్ కాంట్రాక్టు కంపెనీలకు పని చేస్తున్నా, లెవెల్-ఫోర్ సెక్యూరిటీ క్లియరెన్స్ ఉన్నట్లయితే ఉద్యోగంకు ఢోకా లేదు. దాదాపు 70 సంవత్సరాల వయసు వరకు మంచి జీతంతో ఉద్యోగం గ్యారంటీ. సెక్యూరిటీ క్లియరెన్స్ లెవెల్ పెరిగినా కొలది జీతం కూడ పెరుగుతూ ఉంటుంది. అయితే, నాణానికి రెండవ వైపు కోణం ఏంటంటే ఈ ఉద్యోగాలు చేసేవారికి స్వేచ్ఛ ఉండదు. వారి జీవితంపై చాలా నిఘా ఉంటుంది. మనస్సాక్షిని చంపుకొని పని చేయాలి. ఎందుకంటే ఈ టాప్ సీక్రెట్ కార్యకలాపాలన్నీ రాజ్యాంగ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక పనులే కాబట్టి. అందుకే, ఈ ఉద్యోగాలు చేసే వారు ఆరోగ్యంగా ఉండరు. నూరేళ్లు బతుకరు. 29 సంవత్సరాల ఎడ్వర్డ్ స్నోడెన్‌కు ఇంకా 40 సంవత్సరాల వరకు ఉద్యోగ భద్రత, కనీసం లెవెల్-సెవెన్ క్లియరెన్స్ కలిగి, ఎంతో సుఖవంతమైన జీవితం ఉన్నప్పటికీ, తాను ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక రహస్య కార్యకలాపాల ఉద్యోగం చేస్తున్నానని మథన పడుతూ, మనస్సాక్షిని చంపుకొని పని చేయలేక, తన తర్వాత తరాలైనా ఒక స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల సమాజంలో బతుకాలనే కాంక్షతో, తాను ఏ రహస్య కార్యకలాపాల ప్రాజెక్టుపై పని చేస్తున్నాడో దాని గురించి అమెరికా ప్రజలకే కాకుండా ప్రపంచ ప్రజలకు కూడ తెలుపడానికి నిర్ణయించుకున్నాడు. ఈ రహస్యాలు బయట పెడ్తే అమెరికా ప్రభుత్వం

తనను అరెస్టు చేసి, జీవితాంతం జైల్లో వేయవచ్చుని లేదా చంపవచ్చుని, జన్మలో మాతృభూమి అయిన అమెరికా చూడలేనని, తన ప్రియురాలు, మిత్రులు, తల్లిదండ్రులు అందరితో సంబంధాలు తెగిపోతాయని ఆయనకు తెలుసు. అయినప్పటికీ తన జీవితం ముఖ్యం కాదని, ప్రపంచ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ముఖ్యమని హంకాంగ్‌లో తలదాచుకొని అమెరికా సామ్రాజ్యవాదుల రహస్య కార్యకలాపాల చీకటి కోణాలలో ఒకటైన 'ప్రిజమ్'ను బయట పెట్టాడు. స్నోడెన్ చెప్పిన దాని ప్రకారం అమెరికా ప్రభుత్వం ప్రపంచ ప్రజల అందరి ఈమెయిల్లపై, సెల్‌ఫోన్లపై, ఫేస్‌బుక్, గూగుల్, యూట్యూబ్, యాహూ లాంటి వెబ్ సైట్లను వాడే వారిపై నిఘా చేస్తూ కొన్ని సంవత్సరాల నుండి ఆ డేటాను అంతా దాచి పెట్టి తమ నిఘా ప్రాజెక్టులకు వాడుకుంటుందని తన వెంబడి తెచ్చిన ఆధారాలతో సహ బయట పెట్టాడు. తన వద్ద ఇంకా చాలా ఆధారాలున్నాయని, వాటిని తర్వాత బయట పెడుతానని చెప్పాడు. దాంట్లో భాగంగానే అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు జి-20 దేశాల అధిపతులు లండన్‌లో కాన్ఫరెన్స్ జరిపినపుడు వివిధ దేశాల అధిపతులపై నిఘా పెట్టారని ఈ మధ్యే బయట పెట్టాడు. దేశాధినేతలు వాడే టెలిఫోన్లు, ఈమెయిల్ కమ్యూనికేషన్ హైసెక్యూరిటీ హట్‌లైన్ల ద్వారా జరుగుతుంది. వాటిపై నిఘా పెట్టాలంటే అంతకంటే ఎక్కువ స్థాయి నైపుణ్యం, టెక్నాలజీ ఉండాలి. అయితే అమెరికాకు ఒక అనుకూలత ఉంది. కంప్యూటర్, టెలి కమ్యూనికేషన్ రంగాలకు చెందిన కంపెనీలలో మెజారిటీ అమెరికా కంపెనీలే కాబట్టి ప్రపంచ దేశాలు ఆ కంపెనీల టెక్నాలజీని వాడక తప్పదు. వాడినప్పుడు నిఘాకు గురికాక తప్పదు.

ప్రభుత్వాలు ఈమెయిల్, టెలిఫోన్ స్నూపింగ్(నిఘా పెట్టడం) చేస్తాయనే సత్యం చాలా పాతదే. కాకపోతే కొందరినే టార్గెట్ చేసి నిఘా పెడ్తారని అనుకునే వారు. స్నోడెన్ పుణ్యమాని తెలిసిందేమంటే ప్రపంచంలో సెల్‌ఫోన్, ఇంటర్నెట్, టెలిఫోన్, శాటిలైట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరిపై నిఘా ఉండడమే కాదు ఆ డేటా అంతా అమెరికా నిఘా అవసరాల కొరకు దాచిపెడ్తున్నారు. ఒక అంచనా ప్రకారం ఎన్ఎస్ఎ సూపర్ కంప్యూటర్లు పది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. వాటిలో రెండు వందల ట్రిలియన్ల డివిడిలలో (ఒక డివిడిలో 4.5 జి.బి.ల డేటా పడ్తుంది) పట్టేంత డేటా స్టోర్ చేయొచ్చట. అంటే అమెరికా వద్ద నిఘా చేయడానికి కావలసిన టెక్నాలజీ పరిమితులు ఏమీ లేవు. ఎందుకంటే టెక్నాలజీ తయారు చేస్తున్నదే వారి కంపెనీలు. ఇదంతా ఎలా ఉంటుందంటే, ఒక ఎలుకను పట్టకోవాలంటే ఎలుక ఎక్కడుందని వెతకనవసరం లేదు. అక్కడక్కడ బోనులు పెట్టి వాటిలో ఏదైనా ఆహారాన్ని ఎరగా పెడ్తే, ఎప్పుడో ఒకప్పుడు ఎలుక వస్తుంది. ఆహారాన్ని తింటుంది. బోనులో ఇరుక్కుపోతుంది. ఇంటర్నెట్, సెల్‌ఫోనుల ద్వారా నిఘా చాలా సులభమని ప్రభుత్వాలకు ముందు నుండే తెలుసు. అందుకే మారుమూల పల్లెలకు కూడ ఈ రెండు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఉదాహరణకు సెల్‌ఫోన్లు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన తొలినాళ్లలో తెలంగాణ ప్రాంతంలో సెల్‌ఫోన్ టవర్లకు పర్మిషన్ ఇవ్వలేదు. ఎందుకంటే, నక్సలైట్లు వాడుతారని చెప్పారు. తర్వాత క్రమంలో నక్సలైట్లను సెల్‌ఫోన్లు వాడుకోనిస్తే వారిని పట్టుకోవడం సులభవుతుందని సిఐఎ ఇచ్చిన సలహా, శిక్షణతో నక్సల్స్ ఉండే ప్రాంతాల్లో కూడ సెల్‌ఫోన్ టవర్లు పెట్టారు. ప్రభుత్వం ఊహించినట్లుగానే నక్సలైట్లు సెల్‌ఫోన్లు వాడారు. దాంతో సెల్‌ఫోన్ ట్యాపింగ్ ద్వారా మాటలు విని కాని, జి.పి.ఎస్. టెక్నాలజీ ద్వారా వారు ఎక్కడ ఉన్నారో తెలుసుకొని కాని ఎందరో నక్సలైట్ నాయకులను పట్టుకోవడం, చంపడం జరిగింది. జూన్ నెల తాజా సమాచారం ప్రకారం సిఐఎ పెట్టుబడితో ఎదిగిన గూగుల్ సంస్థ ఇంకా ఇంటర్నెట్ చేరని మారుమూల ప్రాంతాలు, అటవీ ప్రాంతాలలో ఉండే వారు కూడ ఇంటర్నెట్(అది కూడా ఉచితంగా) చూసే సదుపాయం కల్పించడానికి బెలూన్లను వదలబోతున్నారట. ఇది ఎలుక, బోను కథే. దీని వెనుక పెద్ద పథకం ఉంది. ఈ రోజు అమెరికా సామ్రాజ్యవాదాన్ని, వివిధ దేశాల్లో రాజ్యమేలుతున్న వారి దళారీలను కూల్చడానికి సాయుధంగా పోరాడుతున్నది దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలలోని మారుమూల కొండలను, అటవీ ప్రాంతాలను స్థావరాలుగా చేసుకొన్న కమ్యూనిస్టు, కమ్యూనిస్టేతర గెరిల్లా సంస్థలు. అమెరికా తన ఆధిపత్యానికి 'క్లియర్ అండ్ ప్రెజెంట్ డేంజర్' వీరేనని గ్రహించింది. (ఎందుకంటే సాయుధం కాని ఏ సంస్థనైనా, సముదాయాన్నైనా అణచడం, లొంగదీసుకోవడం అత్యంత సులభం) గెరిల్లా సంస్థలను మరీ ముఖ్యంగా వాటి నాయకత్వాన్ని లేకుండా నిర్మూలిస్తే ప్రజలకు మార్గదర్శకం చేయడానికి ఎవరూ ఉండరని, దాంతో ప్రజలను అణచడం సులభమవుతుందని, తద్వారా సామ్రాజ్యవాదానికి తిరుగు ఉండదని నిర్ణయించుకుంది. దాంట్లో భాగంగా టెక్నాలజీని విరివిగా ముందుకు తెస్తున్నారు. బెలూన్లతో ఇంటర్నెట్ ఇవ్వడం కూడా దాంట్లో భాగమే. మారుమూల అడవుల్లో కూడా ఉచితంగా ఇంటర్నెట్ చూసుకోవచ్చునని గెరిల్లా సంస్థలకు చెందిన వారు ఇంటర్నెట్ చూడడం మొదలు పెడితే, దాంతో జి.పి.ఎస్. టెక్నాలజీకి లింక్ అయిన గూగుల్ కంప్యూటర్ ఆ గెరిల్లాల కచ్చితమైన ప్రదేశాన్ని ప్రభుత్వ బలగాలకు తెలుపుతుంది. దాంతో ఆ బలగాలు మానవ రహిత యుద్ధ విమానాల ద్వారా బాంబులు వేసి వారిని చంపవచ్చు. ఒకవేళ ప్రజలు చనిపోతే వారు కూడ 'టెర్రరిస్టు'లే అనవచ్చు. మరీ తప్పదనుకుంటే 'సారి' అనే మాట వదలవచ్చు. సామ్రాజ్యవాద వ్యతిరేక గెరిల్లా సంస్థలను చూసే కాదు, అమెరికా తన ప్రజలను చూసి కూడా భయపడ్తున్నది. కొన్ని దశాబ్దాలుగా కుట్ర పూరితంగా అమెరికా ప్రజలలో హింసా ప్రవృత్తిని సినిమాలు, వీడియో గేముల ద్వారా దింపిన పాలక వర్గాల వైపే ప్రజలు తుపాకులు ఎక్కు పెట్టడానికి తయారవుతున్నారు. మీరు యూట్యూబ్‌లో 'మిలీషియా ఇన్ అమెరికా' అని వెతికితే పుట్టలు పుట్టలుగా వీడియోలు దొరుకుతాయి. రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న, ధనిక వర్గానికి బానిసగా మారిన ప్రభుత్వాన్ని సాయుధంగా కూల్చాలనే లక్ష్యంతో అమెరికాలో మిలిషియా సంస్థలు(వీటికి కమ్యూనిస్టు భావజాలంతో సంబంధం లేదు) వెలిశాయి. వారు గెరిల్లా ట్రైనింగ్ తీసుకునే వీడియోలు కూడా ఉన్నాయి. అమెరికన్ యువత చావడానికి, చంపడానికి ఒక్క క్షణం ఆలోచించడం లేదు. అదే అమెరికా పాలక వర్గానికి చమటలు పుట్టిస్తున్నది. ఎందుకంటే అమెరికాలో గౌరవంగా బతకడానికి కావలసిన ఉద్యోగాలు ఏవీ తయారు కావడం లేదు. మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు చైనా, మలేషియా లాంటి దేశాలకు వెళ్లిపోయాయి. కనీసం సర్వీసు రంగమైనా ఉద్యోగాలు కల్పిస్తుందనుకుంటే అత్యంత కంప్యూటరైజేషన్ జరిపి దాంట్లో ఉద్యోగాలు లేకుండా చేశారు. ఇక మిగిలింది కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ లాంటి

టెక్నాలజీ రంగాలు. వాటికి ఉన్నత చదువులు ఉండాలి. ప్రైవేట్ మయమయిన ఉన్నత విద్యా రంగంలో ఏటా వేల డాలర్లను ఫీజుల రూపంలో కట్టే స్తోమత లేక ఇంకా వివిధ కారణాల వలన 90 శాతం అమెరికా యువత ఇంటర్ స్థాయిలోనే చదువులు ఆపేస్తున్నారు. దాంతో వీరికి టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు దొరకడం లేదు. వీటిని ఇండియా లాంటి దేశాల నుండి వచ్చిన వారు చేస్తున్నారు. అమెరికన్ యువతలో మెజారిటీ అండర్-ఎంప్లాయిమెంట్‌కు గురవుతున్నారు. (అంటే తరుచుగా నిరుద్యోగం ఏర్పడడం, ఉద్యోగాలన్నీ టెంపరరీ ఉద్యోగాలు, వాటికి గంట లెక్కన తక్కువ పేమెంటు ఇవ్వడం వలన ప్రతి రోజు కనీసం రెండు నుండి మూడు ఉద్యోగాలు చేస్తే తప్ప మామూలు జీవితం గడపలేని పరిస్థితి). ఇలాంటి డిస్టోపియన్ (ఎటు చూసినా నిరుత్సాహంగా, భయం కొలిపేదిగా ఉండడం) పరిస్థితులున్నాయి. దాంతో యువతలో కోపం, కసి నివురుగప్పిన నిప్పులా ఉంది. అందుకే అమెరికా ప్రభుత్వం అమెరికా ప్రజల మీద నిఘా చేయడం లేదని పచ్చి అబద్ధాలు చెప్తున్నప్పటికీ (ప్రభుత్వాలు నిజం చెప్తేనే ఆశ్చర్య పోవాలి) వారిపై కూడ నిఘా ఉంది.

అమెరికా ప్రభుత్వం తమ దేశ ప్రజలపై నిఘా చేస్తున్నదని స్నోడెన్ కన్నా ముందే ఎందరో బయట పెట్టారు. కాకపోతే స్నోడెన్ ఇన్‌సైడర్ (సిస్టంలో ఒక భాగమైనవాడు) కాబట్టి ఆధారాలతో చూపాడు. అందుకే, అంతకు ముందు చెప్పిన వారిని 'కన్స్పిరసి థియరిస్ట్'లని (కుట్ర జరుగుతున్నదని చెప్పేవారిని విమర్శనాత్మకంగా ఇలా పిలుస్తారు) ముద్ర వేసి పెద్దగా పట్టించుకోలేదు.

మార్క్సిస్టు భావజాలానికి సంబంధం లేని బిల్డెర్‌బెర్గ్, ఇల్యుమినాటి, జియోనిస్టు వ్యతిరేక ప్రచారకర్తలు, జైట్‌గైస్టు మూవ్‌మెంట్ వారు, అలెక్స్ జోన్స్, ఇరాన్‌కు చెందిన ఆంగ్ల ఛానల్ 'ప్రెస్ టివి', రష్యాకు చెందిన ఆంగ్ల ఛానల్ రష్యా టుడేకి చెందిన మ్యాక్స్ కైజర్, ఇంకా ఎందరో అమెరికా ప్రభుత్వం ప్రపంచ ప్రజల మీద చేస్తున్న నిఘా గురించి బయట పెట్టారు. అయితే స్నోడెన్ మాత్రమే 'స్నోబాల్ ఎఫెక్ట్' ఇవ్వగలిగాడు. ఫేస్‌బుక్, గూగుల్ సంస్థలు తాము అమెరికన్ నిఘా సంస్థలకు తమ కంప్యూటర్లకు డైరెక్ట్ యాక్సెస్(అనుమతి) ఇవ్వలేదని అంటున్నా అది అబద్ధం. ఎందుకంటే ఫేస్‌బుక్, గూగుల్ కంపెనీల ద్వారా భవిష్యత్‌లో ప్రజలపై నిఘా వేయవచ్చని గ్రహించిన సిఐఎ (ఇది అమెరికా ప్రభుత్వ గుఢాచార సంస్థ) ఈ కంపెనీలు అనామక స్థాయిలో ఉన్నప్పుడే వాటిలో మిలియన్ల కొలది డాలర్లను పెట్టుబడిగా పెట్టి ఆ సంస్థలను ప్రపంచ ప్రఖ్యాతికి తెచ్చింది. ప్రజలపై నిఘాకు పనికి వచ్చే రకరకాల టెక్నాలజీలను అభివృద్ధి చేసిన ఔత్సాహికులకు మిలియన్ల కొలది డాలర్లను పెట్టుబడిగా పెట్టి అవి విజయవంతం కావడానికి అన్ని రకాలుగా సహాయపడడానికి ప్రజల సొమ్మునే పెట్టుబడిగా సిఐఎ ఒక సంస్థను స్థాపించింది. దాని పేరు ఇన్-క్యూ-టెల్. (వారికి వెబ్‌సైట్ కూడ ఉంది). ఫేస్‌బుక్, గూగుల్ లాంటి ఎన్నో సంస్థలను అభివృద్ధి చేసింది ఈ సంస్థే. మీరు నేరస్తుల వలె మీ వేలి ముద్రలను, ఫోటోలను, రెటీనా స్కాన్‌ను అడ్రసులతో సహా ఆధార్ కార్డు కొరకు ఇచ్చారా? అయితే, వెల్‌కం టు సిఐఎ డేటాబేస్. ఆధార్ కార్డు కొరకు ప్రజలు బలవంతంగా సమాచారాన్ని ఇచ్చేట్టు భారత ప్రభుత్వం పరిస్థితులు కల్పించినప్పటికీ, ఈ ఆధార్ కార్డు సంస్థ ఒక ప్రైవేట్ సంస్థ. దాని ప్రస్తుత అధిపతి (మాజీ ఇన్ఫోసిస్ అధిపతి కూడా) అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆధ్వర్యంలో నడుస్తున్న బిల్డెర్‌బెర్గ్ గ్రూప్‌లో ఒక సభ్యుడైన నందన్ నీలేకని. 120 కోట్ల భారత ప్రజల వ్యక్తిగత వివరాలను కలెక్ట్ చేసి, తన ఇష్టం వచ్చినట్లుగా వాడుకోవడానికి 'ప్రజాస్వామ్య' భారత ప్రభుత్వం ఒక ప్రైవేట్ కంపెనీకి అధికారం ఇచ్చింది. ఈ కంపెనీలో సిఐఎకు చెందిన ఇన్-క్యూ- టెల్ పెట్టుబడులున్నాయి. ఈ మధ్యే భారత ప్రభుత్వం ఆధార్ డేటాబేస్‌లో ఉన్న ప్రజల వ్యక్తిగత వివరాలను ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకోవడానికి ఆ కంపెనీకి అనుమతి ఇచ్చింది. ప్రపంచ ప్రజలందరిపై నిఘా పెట్టి రికార్డు చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదులు, 120 కోట్ల ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్న సామ్రాజ్యవాదుల భారత దళారీలు, అసలు ఈ డేటాను ఎన్ని రకాలుగా వాడుకోవచ్చు, ఇది ఎలా రాజ్యాంగ వ్యతిరేకం, ప్రజాస్వామ్య వ్యతిరేకం, ఏ రాజకీయాలకు సంబంధం లేని మామూలు ప్రజలకు కూడా ఇది ఎలా ప్రమాదకరం లాంటి అంశాలపై ప్రత్యేక వ్యాసం రాయవలసి ఉంటుంది.

'రెవెల్యూషన్ విల్ నాట్ బి టెలెవైజ్డ్' అనే ఒక నానుడి ఉంది. అంటే పాలక వర్గాల చేతుల్లో ఉన్న మీడియా ప్రజలు చేసే విప్లవాన్ని ప్రసారం చేయదు అని దీనర్థం. అలాగే, పాలక వర్గాల చేతుల్లో ఉన్న ఇంటర్నెట్‌లో విప్లవం జరుగదు. విప్లవం ప్రజల గుండెల్లో పుట్టి వీధుల్లో జరుగుతుంది. గత తరాల వలె ఇప్పటి యువతకు ఎదురు చూస్తూ కూర్చునే ఓపిక లేదు. కేవలం కొద్ది మంది భోగ భాగ్యాల కొరకు 95 శాతం పైగా ప్రజలను అన్ని రకాలుగా దోచుకుంటూ, అణిచి వేస్తూ, ప్రజాధనంతోనే ప్రజలందరిపై నిఘా పెట్టి శాశ్వతంగా తమ దోపిడిని కొనసాగించుతామనే ఊహా లోకంలో, మూర్ఖుల స్వర్గంలో బతుకుతున్నాయి దోపిడి పాలక వర్గాలు. వారు విసిరే ఎంగిలి మెతుకులకు ఆశపడి, తమ వ్యక్తిగత సుఖాల కొరకు వారి వద్ద పని చేస్తూ రాజ్యాంగ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక పనులకు చదువుకున్న వారిలోని ఒక వర్గం పాల్పడుతున్నది. ఎడ్వర్డ్ స్నోడెన్ కూడ అలా పని చేసిన వాడే. తను చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులకు ఇతర ప్రజలు బలి అవుతున్నట్టే, ఇతర రంగాలలో తనలా ఉద్యోగాలు చేసేవారు చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులకు తాను కూడా బలి అవుతున్నాను కదా అని ఆలోచించాడు. దోపిడిదారుల ఎంగిలి మెతుకులకు ఆశపడి ఇలా మనల్ని మనమే ఒకరిని ఒకరు మోసం చేసుకోవడం చేస్తే రానున్న రోజుల్లో ఈ ప్రపంచం మనుషులు బతకలేనంత భయంకరంగా తయారవుతుందని గ్రహించి దోపిడిదారులకు చెందిన, తనకు తెలిసిన రహస్యాన్ని బయట పెట్టాడు. అలా చేయకపోతే పాలక వర్గాల ఎంగిలి మెతుకులతో భోగాలను అనుభవించి అనామకంగా ప్రపంచ వ్యాప్తంగా చనిపోతున్న హీనుల వలె అతనూ చనిపోయి చరిత్ర హీనుడయ్యేవాడు. కాని ఎడ్వర్డ్ స్నోడెన్ కేవలం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రేమికుడుగా తను చేసిన ఈ సాహసం, అతన్ని చరిత్రలో నిలిపింది. వేయి సంవత్సరాల తర్వాత కూడా చరిత్ర గుర్తుంచుకునేట్టుగా ఎదిగాడు. భారతదేశంలో కాని, విదేశాల్లో కాని ఇలాంటి ఎన్నో రహస్య, అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక పనులల్లో ఎందరో భారతీయులు పని చేస్తున్నారు. అలాంటి వారు స్నోడెన్‌ను ఆదర్శంగా తీసుకొని దోపిడి పాలక వర్గాల రహస్యాలను బట్ట బయలు చేయాలి. కనీసంగా, అలాంటి ఉద్యోగాలను వదిలి వేయాలి. ప్రతి ఒక్క రంగంలో అన్యాయాన్ని, అవినీతి, అక్రమాలని, దోపిడీని తారా స్థాయిలో అమలు పరుస్తున్న

సామ్రాజ్యవాదులు, వివిధ దేశాలలోని వారి దళారీలు ఇప్పటికే ఈ ప్రపంచాన్ని సర్వనాశనం చేశారు. తాజాగా ఉత్తరాఖండ్ వరదల్లో వేలాది ప్రజలు చనిపోవడం దీనికి తిరుగులేని ఉదాహరణ. భవిష్యత్తు తరాల సంగతి అటుంచండి. ఇంకా ముప్పై సంవత్సరాలు ఈ దోపిడి పాలక వర్గాలు అధికారంలో ఉంటే మానవాళికి, భూమికి జరుగుబోయే నష్టం ఊహించలేనిది. ఇలాంటి ప్రమాదకర ప్రపంచంలోనికా మనం పిల్లల్ని కని వదిలేదని ప్రతి ఒక్కరు ఆలోచించాలి. ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపించే దోపిడి పాలక వర్గాల రాజ్యం నిజానికి ఎంతో బలహీనమైంది. ప్రజలు తిరగబడక పోవడమే వారి బలం. తిరగబడకపోతే చావు తప్పదనే పరిస్థితులు అన్ని దిక్కుల నుండి పాలక వర్గాలే కల్పిస్తున్నారు. ఎంతో పవర్‌ఫుల్‌గా కనబడే పాలక వర్గాలు, ఒకవేళ ప్రజలు తిరగబడితే తమ ఆస్తులను, ప్రాణాలను, తమ దోపిడీ రాజ్యాన్ని కాపాడడానికి వారు నమ్ముకున్నది కనీసం తమను, తమ కుటుంబ సభ్యులను కూడా కాదు. వారు బతుకు దెరువు కొరకు సాయుధ బలగాలలో పని చేస్తున్న అట్టడుగు వర్గాల వారిని, నిఘా టెక్నాలజీని నమ్ముకున్నారు. అమెరికా సామ్రాజ్యవాదులకు, వారి దళారీలకు ప్రజలు వియత్నాం రుచి చూపించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసులకు జీవన్మరణ సమస్య ఏర్పడింది. అందుకే వారు తిరగబడుతున్నారు. భారతదేశంలో పట్టణ ప్రాంతాల్లో, మహా నగరాల్లో నివసించే ప్రజలకు రెండు నుండి మూడు దశాబ్దాల లోపలే జీవన్మరణ సమస్య రాబోతున్నది. అప్పుడు యువత చంపడానికి, చావడానికి ఒక్కక్షణం ఆలోచించదు. అప్పుడు దోపిడి పాలక వర్గాల శక్తిపై, టెక్నాలజీపై అపార నమ్మకంతో, వారి ఎంగిలి మెతుకులు ఏరుక తినే వారందరు పాలక వర్గాలతో సహ ప్రజాగ్రహంలో మసికాక తప్పదు. తమ ఉద్యోగులపైనే కాకుండా కోట్లాది ప్రజలపై నిఘా పెడ్తున్న సంస్థ నుండే నిఘా కంటపడకుండా స్నోడెన్ తప్పించుకొని ఆ అప్రజాస్వామిక సంస్థ చీకటి రహస్యాలు బయటపెట్టడంతోనే సామ్రాజ్యవాదుల బలహీనత బట్టబయలైంది.

వ్యాసం ముగిస్తామనుకుంటున్న తరుణంలో (జూన్ 21 నాడు) పత్రికలు భారత ప్రజలకు ఒక శుభవార్తను అందించాయి. భారత ప్రజలపై అమెరికా నిఘా మాత్రమే కాదు, భారత ప్రభుత్వం కూడా నిఘా చేస్తున్నదని బయటపడింది. 'సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టం'గా పిలువబడే భారత ప్రభుత్వ నిఘా ప్రాజెక్టును దేశ ప్రజలను ప్రేమించే ఎవరో ఇన్‌సైడర్ మీడియాకు ఆధారాలతో సహా లీక్ చేశారు. భారత దేశంలోని ప్రతి ఒక్క సెల్‌ఫోన్, లాండ్ లైనులపై, ఎస్ఎమ్ఎస్‌లపై, ఇంటర్నెట్ వాడే ప్రతి వారిపై ఈ నిఘా ఉంది. ఇమెయిల్‌లపై ఎలాగూ నిఘా ఉంది. అయితే, భవిష్యత్తులో పంపడం కొరకు డ్రాఫ్ట్ ఫోల్డర్‌లో సేవ్ చేసి పెట్టిన ఇమెయిల్‌పై కూడా నిఘా ఉందట. అలాగే ఇంటర్నెట్ ద్వారా ఫోన్‌లు, ఫ్యాక్స్‌లు చేయడం, లాండ్‌లైన్ ద్వారా ఫ్యాక్స్ చేయడంపై కూడా నిఘా ఉంది. ఛాటింగ్, ఇన్‌స్టాంట్ మెసేజింగ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లపై కూడా నిఘా ఉంది. శుభం. ఒక పర్‌ఫెక్ట్ 'ప్రజాస్వామ్య' కాన్‌సెంట్రేషన్ క్యాంప్‌గా మారిన భారతదేశంలో పుట్టినందుకు గర్వంగా ఉంది. ఈ పకడ్బందీ నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఇంజినీర్ల ఫోన్లపై, కంప్యూటర్లపై కూడా ఈ నిఘా వర్తిస్తుంది. అలాగే, పాలకవర్గాల దోపిడీ, అణిచివేతలను క్షేత్ర స్థాయిలో అమలుపరుస్తున్న ఉద్యోగుల, సాయుధ బలగాల, పోలీసుల వ్యక్తిగత ఫోన్లపై, కంప్యూటర్లపై కూడా ఈ నిఘా వ్యవస్థ ఆటోమెటిక్‌గా 24 గంటలు నిఘా చేస్తున్నది. ఎలాంటి దుర్భర పరిస్థితులలో ఉన్నా పాలకులకు వ్యతిరేకంగా కనీసం మాట్లాడే ధైర్యం కూడా లేని లక్షలాది చైతన్యరహిత మానవ శరీరాలపై కూడా ఈ నిఘా ఉంది. వెరసి, పాలకవర్గాల పట్ల అపార విధేయత ప్రదర్శించినప్పటికీ, కలలో కూడా పాలక వర్గాలను విమర్శించే ధైర్యం లేకున్నప్పటికీ మీ మీద నిఘా తప్పదు. పాలకవర్గాల కుటుంబాలను మినహాయించి, దేశంలోని ప్రతి ఒక్కరు పాలక వర్గాల దృష్టిలో భవిష్యత్ 'టెర్రరిస్టే'. అనుమానపు మొగుడి పాత్రను అత్యున్నత స్థాయిలో అమలుపరుస్తున్న పాలక వర్గాలు, మానవ నాగరికత కనీవినీ ఎరుగనంత వినాశకర వ్యవస్థలోకి మనల్ని తీసుకెళ్లనున్నారు. దేశ రక్షణ, ప్రజా భద్రత అనే అందమైన మాటలను అడ్డుగా పెట్టి అత్యంత అమానుష వ్యవస్థను 'స్లో పాయిజన్'లా ఏర్పడకుండా అమలుపరుస్తున్న దోపిడీ పాలకవర్గాల పాలనలో జీవచ్ఛవాల్లా బతికే కన్నా, ఈ అనుమానపు మొగుడిని అంతం చేసి, తన పిల్లలను తానే అనుమానించని, భవిష్యత్ 'టెర్రరిస్టులు'గా చూడని నిజమైన నూతన ప్రజాస్వామ్యాన్ని, సమసమాజాన్ని స్థాపించుకొందాం. మంచి లక్షణాలు గల నూతన మానవ నాగరికతను మన సంతానానికి ఇద్దాం.

చివరగా, నిఘా వ్యవస్థకు దొరకకుండా ఇంటర్నెట్ చూడాలనుకునే వారు 'టోర్ ప్రాజెక్ట్', 'టెయిల్స్' అనే సాఫ్ట్‌వేర్‌లు వాడాలి. ఇమెయిల్ పంపడానికి 'ప్రెటీ గుడ్ ప్రైవసీ' అనే సాఫ్ట్‌వేర్ వాడాలి. ఇలా వాడేవారు, ఎట్టి పరిస్థితులలో ఇన్‌స్టాంట్ మెసేజింగ్, ఛాటింగ్ సైట్లు వాడకూడదు. ఫేస్‌బుక్ లాంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పాల్గొన కూడదు.

ఇకపోతే, rootcausesearch.wordpress.com అనే వెబ్‌సైట్ లింక్‌లో ఈ కింది అంశాలపై చాలా ఆసక్తికరమైన సెలెక్టెడ్ విడియోలు ఉన్నాయి. అయితే ఇవి ఇంగ్లిష్ భాషలో ఉన్నాయి. అమెరికా సామ్రాజ్యవాదులు చంద్రమండలంపై కాలు మోపామన్నది బూటకమని చెప్పిన అమెరికన్ల విడియోలున్నాయి. బిన్ లాడెన్‌ను చంపామని అమెరికన్లు చెప్పినది బూటకమని చూపే వీడియోలున్నాయి. సెప్టెంబర్ 11, 2001 నాడు అమెరికాలో 'టెర్రరిస్ట్ దాడులు'గా పిలువబడుతున్ననవి అమెరికా ప్రభుత్వం చేసిన పనేనని చెప్పే (స్వయంగా వారి మిలిటరీ జనరల్, ఎఫ్‌బిఐ మాజీ చీఫ్ మాట్లాడిన) విడియోలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలే 'టెర్రరిస్ట్ దాడుల' పేరు మీద విధ్వంసం సృష్టిస్తున్నాయని చెప్పే విడియోలున్నాయి. ఇంకా రకరకాల అంశాలపై ఎంతో ఆసక్తికరమయిన విడియోలున్నాయి. అయితే, ఇవి ఏవి కూడా మార్క్సిస్ట్ భావజాలంతో తీయనప్పటికీ, మార్క్సిస్ట్‌లకు కూడా చాలా ఉపయుక్తమైన విడియోలు. వీటిలో ఉన్న అంశాలను మార్క్సిస్ట్‌లు తమ సిద్ధాంతాన్ని బలపరుచుకోవడానికి వాడుకోవచ్చు. ఈ వీడియోలలో ఉన్న అన్ని అభిప్రాయాలను గుడ్డిగా నమ్మనవసరం లేదు. ఎవర్ని గుడ్డిగా నమ్మినా ప్రమాదమే. లోతుగా, మూలాల్లోకి వెళ్లి రహస్యాలను, సత్యాన్ని ఛేదిద్దాం. గుడ్డిగా కాకుండా, మన మెదళ్లలోకి కుట్రపూరితంగా ఎక్కించబడ్డ ముందస్తు అభిప్రాయాల ద్వారా కాకుండా, విస్తృత అధ్యయనం, పరిశోధనల ద్వారా ఈ వ్యవస్థ వికృత నిజ స్వరూపాన్ని తెలుసుకొని, ఒక నూతన మానవ సమాజాన్ని, సమసమాజాన్ని నిర్మించుకుందాం.

(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

కార్మికవర్గ పార్టీ, ఆర్థికవాదం, రివిజనిజం

రష్యా విప్లవోద్యమ క్రమంలో జరిగిన చారిత్రక పరిణామాలను, భిన్న దృక్పథాల మధ్య చర్చలను వివరిస్తున్నారు

కె. నరేంద్రమోహన్

ఇప్పటి కుర్రకారుకి తెలియక పోవచ్చుగాని సుమారు 25 సంవత్సరాల క్రితం వరకు రష్యా నుండి వచ్చే చాల రాజకీయ సాహిత్యం లో, రష్యన్ విప్లవోద్యమం లెనిన్ నాయకత్వం దొరకగానే తిరుగులేని సిద్ధాంతం, ఆచరణలతో సూటిగా సాగిపోయిందనే భావం కల్పించి లెనిన్‌ను పురాణ పురుషునిగా చిత్రించేది. వాస్తవానికి రష్యన్ విప్లవం అడుగడుగునా సంక్షోభం, సిద్ధాంత, రాజకీయ ఘర్షణ, చీలికలు, ఆటుపోట్ల నడుమ ముందుకు సాగింది. విప్లవ పార్టీ నిర్మాణం ఇందుకు ఏ రకంగాను మినహాయింపు కాదు. చిన్న చిన్న రహస్య గ్రూపుల నుండి ఒక బలమైన పార్టీగా ఎదిగే క్రమంలో కార్యకర్తల నడుమ జరిగిన సంఘర్షణ రేఖామాత్రంగా పరిచయం చేసే ప్రయత్నం ఇది.

నరోద్నిజం నుండి ప్లెఖనోవ్ నాయకత్వంలో ఏర్పడిన చిన్న మార్క్సిస్ట్ సంస్థ కృషి వల్ల రష్యాలోకి రహస్యంగా అందిన మార్క్సిస్ట్ రచనల ప్రభావంతో పలు ప్రాంతాలలో మార్క్సిస్ట్ అధ్యయన, ప్రచార గ్రూపులు ఏర్పడ్డాయి. 1880-90ల నడుమ బల్గేరియాకు చెందిన బ్లగొఎవ్ నాయకత్వంలో రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఏర్పడింది, కజాన్లో ఫెదోసేఎవ్ నాయకత్వంలో ముఖ్యంగా విద్యార్థులు ఒక సంస్థ ప్రారంభించారు. (ఈ సంస్థ సభ్యుడే లెనిన్ - అసలు పేరు వ్లాదిమిర్ ఉల్యనోవ్). శ్రామిక వర్గ విముక్తి పోరాట సంస్థలు (లీగ్స్ ఆఫ్ స్ట్రగుల్ ఫర్ ది ఇమానిసిపేషన్ ఆఫ్ ది వర్కింగ్ క్లాస్) అనే పేరుతో ఈ సంస్థలు పనిచేసేవి. రాత్రి పాఠశాలల రూపంలో, సెన్సార్ల, విద్య ఇన్స్పెక్టర్ల కన్నుగప్పి, ఇవి చదువుతో బాటు మార్క్సిస్ట్ సిద్ధాంతం, చరిత్ర, సైన్స్ పాఠాలు చిన్న, చిన్న కార్మిక బృందాలకు నేర్పించేవి.

1890 నాటికి ఈ పని విధాన పరిమితులను నాయకులు గుర్తించ గలిగారు. 1891-92 మధ్య పెద్ద ఎత్తున కరువు, కలరా, విష జ్వరాలతో దాదాపు నాలుగు కోట్ల మంది చనిపోయారు. ఓల్గా ప్రాంతంలో గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేసి రైతులు పని కోసం పట్టణాలకు తరలారు. ఈ పరిస్థితి ప్రభుత్వ, అధికారుల దివాళాకోరుతనం, అసమర్థత, అవినీతిని బట్టబయలు చేసింది. ఈ సందర్భంలో కార్మికుల్లో ఆందోళన (ఆజిటేషన్) కార్యక్రమం అవసరమైంది. అంటే కొద్ది మందిలో ప్రచారం (ప్రాపగాండా) నుండి విశాల సమూహాల్లో ఆందోళనకు పరిణామం జరగాలి.

అదే సందర్భంలో క్రెమర్, మార్తోవ్ అనే కార్యకర్తలు ఆందోళన గురించి 'ఆన్ ఆజిటేషన్ లేక విల్నా పత్రం' అనబడే తమ రచనను విడుదల చేశారు. ప్రచారం, ఆందోళన గురించి శాస్త్రీయ సిద్ధాంతీకరణ ఈ సమయంలో ప్లెఖనోవ్ జరిపాడు. కొద్దిమందికి విస్తృతమైన భావాలు అందజేయడం ప్రచారం, కాగా విశాల జనరాశికి పరిమిత భావాలు అందజేయడం ఆందోళన (ఉదాహరణకు విప్లవ సందర్భంలో బోల్షివిక్‌లు ఇచ్చిన సోవియెట్లకు సర్వాధికారాలు, భూమి, ఆహారం, శాంతి నినాదాలు). విల్నా పత్రంలో రచయితలు కార్మిక విముక్తి కార్మికులే సాధించాలంటే సోషల్ డెమోక్రాట్లు (తర్వాత యూరోపులో సంస్కరణ వాదానికి నాయకత్వం వహించి జర్మన్ విప్లవానికి ద్రోహం చేసిన పార్టీకి ఈ పేరు మిగిలింది) కార్మికుల తక్షణ పోరాటాలకు నాయకత్వం వహించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని, కార్మికుల తక్షణ పోరాటాలు అంతిమంగా వారిని సోషల్ డెమోక్రాట్లు చైతన్యవంతంగా ఎంచుకున్న లక్ష్యాల వైపు నడుపుతాయని వాదించారు.

ఆర్థిక ఆందోళనకి, రాజకీయ పోరాటానికి నడుమ సంబంధం క్రెమర్ మాటల్లో 'కార్మికుల ఉద్యమం ఎంత విశాలమైనప్పటికీ, రాజకీయ పోరాటం జరపనంతవరకు విజయవంతం కాదు. రాజ్యాధికారం సాధించడం కార్మికవర్గ రాజకీయ పోరాటానికి గీటురాయి. కాబట్టి కార్మికుల తక్షణ అవసరాల మీద నిరంతరం ఆందోళన చేయడం సోషల్ డెమొక్రాట్ల కర్తవ్యం. ఈ డిమాండ్ల మీద జరిగే పోరాటాల వల్ల కార్మికులకు తమ ప్రయోజనాలు రక్షించుకోవడంలో శిక్షణ లభించి, సంఘటిత పడవలసిన అవసరాన్ని గుర్తిస్తారు. అంతిమంగా వారు తమ అతి ప్రధానమైన సమస్య పరిష్కారం వైపు కదులుతారు'. (ఆలన్ వుడ్స్, ది రోడ్ టు రెవల్యూషన్, పేజీ 97, ఆకార్ ప్రచురణ)

రహస్య కార్యక్రమాలు నడుపుతూ, నాయకత్వ శ్రేణులు తరచుగా అరెస్ట్‌లకు, జైలు శిక్షలకు గురవుతున్న తరుణంలో ఆందోళన అంటే అనుభవం లేని నాయకత్వం, కార్యకర్తల చేతిలో ఉద్యమం పెట్టడం అనే భయం కొందరు కార్మికులలో ఉండగా, అలా భావించడం పూర్తిగా తప్పు కాదని లీగల్ మార్క్సిస్ట్, ఆర్థికవాదాలు రుజువు చేశాయి.

నరోద్నిజంతో పోరాడుతున్న సమయంలో ప్లెఖనోవ్‌కు రష్యాలోని విశ్వవిద్యాలయాల మేధావులలో కొంత సానుభూతి ఏర్పడింది. నరోద్నిక్ కార్యక్రమాలను అదుపులో పెట్టాలని భావించే మధ్యతరగతి శ్రేణుల ప్రయోజనం వల్ల కొందరు ధనికులు దీనికి వత్తాసు పలికారు. రష్యాలోని లీగల్ పత్రికలలో కేవలం చరిత్ర, సామాజిక శాస్త్రాల చర్చగా కుదించ బడ్డ మార్క్సిస్ట్ రచనలు వీరి సహాయంతో వెలువడేవి. మార్క్సిస్ట్ తత్వశాస్త్ర, ఆర్థిక, రాజకీయ పదజాలం మృదువైన మారుపేర్లతో రాసిన వ్యాసాలు ఈ పత్రికలు ప్రచురించేవి, లేదా పుస్తక రూపంలో వీరి సహాయంతో వచ్చేవి. ప్లెఖనోవ్ రాసిన చరిత్ర పట్ల అద్వైత (మోనిస్ట్) దృక్పథం (డెవలప్‌మెంట్ ఆఫ్ ది మోనిస్ట్ వ్యూ ఆఫ్ హిస్టరీ) ఇలా వచ్చిన రచనే.

దీని అసలు పేరు చారిత్రక భౌతికవాద దృక్పథం అని ఉండాలి. (వ్యాపార పత్రికలలో రాసే మార్క్సిస్ట్ రచయితలకు ఇప్పటికీ ఈ పాట్లు తప్పవు).

విప్లవాలకు విశ్వవిద్యాలయాల మేధావులు, ధనిక మధ్యతరగతి శ్రేణుల సహకారం అవసరమైన ఈ పరిస్థితిలో పి.బి. స్త్రువ్, బుల్గాకోవ్, టుగాన్ బరనోవ్స్కి వంటి ఆర్థికవేత్తలు, మేధావులు వర్గ పోరాటానికి దూరమైనా అకాడమిక్ మార్క్సిజానికి తెరలేపారు. నరోద్నిజంపై విజయం సాధించిన మార్క్సిస్ట్ సిద్ధాంతంలో వారికి రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి జరుగుతుందనే వాదన నచ్చింది. దీనిని బహుముఖంగా (గతితార్కికంగా) చూడకుండా కుదించి, కార్మిక వర్గం బూర్జువా వర్గ ఉదారవాదులను వెన్నంటి ఉండాలని లీగల్ మార్క్సిస్టులు వాదించారు.

వారి ప్రతిపాదన – సామ్యవాదానికి అవసరమైన వస్తుగత పరిస్థితి వెనుకబడిన, అర్ధ ఫ్యూడల్ రష్యాలో లేదు. జారిస్ట్ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం అంటే బూర్జువా ప్రజాస్వామ్యం కొరకు పోరాటం. కాబట్టి, కార్మికవర్గం సాధ్యంగాని పగటికలలు వదిలేసి బూర్జువా ఉదారవాదులకు సహకరించి కొత్త సమాజాన్ని నిర్మించాలి.

ఇక్కడ కనిపించేది విప్లవం పట్ల రెండు పరస్పర విరుద్ధమైన వైఖరులు. సంస్కరణా లేక మౌలిక మార్పా? అన్య వర్గాలతో రాజీయా లేక స్వతంత్ర కార్మిక వర్గ విధానమా? అగ్రగామి వర్గమైన కార్మిక వర్గం ఇతర వర్గాల వెన్నంటి పోయి విప్లవాన్ని సాధించలేదు. అలాగే కార్మిక వర్గ సిద్ధాంతం ఇతర వర్గ సిద్ధాంతాలతో రాజీ పడకూడదు.

వీరికి జవాబుగా లెనిన్ కార్మికవర్గ స్వతంత్ర పాత్రను ఇలా సిద్ధాంతీకరించాడు. 'యూరోప్ నుండి తూర్పు వెళ్లినకొద్దీ, రాజకీయ రంగంలో బూర్జువావర్గం మరింత బలహీనంగా, పిరికిగా, సంకుచితంగా మనకు కనబడుతుంది. అలాగే కార్మిక వర్గం మోయవలసిన రాజకీయ, సాంస్కృతిక భారం మరింత పెరుగుతుంది. రష్యన్ కార్మిక వర్గం తన భుజస్కంధాల పైన రాజకీయ స్వేచ్ఛను సాధించే భారాన్ని కూడా మోయవలసి ఉంది. ఇది కార్మికవర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని – మనిషిని మనిషి దోపిడీ చేయని వ్యవస్థను – సాధించే మార్గంలో మొదటి అడుగు మాత్రమే. (ది రోడ్ టు రెవల్యూషన్, పేజీ 89)

వీరిలో స్త్రువ్ కొంతకాలం విప్లవం వైపు మొగ్గి, మొదటి విప్లవ పార్టీ మహాసభ మానిఫెస్టో రాశాడు. పశ్చిమ దేశాల కార్మికులు అనుభవిస్తున్న భావ ప్రకటనా, పౌర హక్కులు రష్యన్ కార్మికులకు లేనప్పటికీ, అది తన స్వశక్తితో ఆ హక్కులు సాధించాలి అని రాసిన వాడే చివరికి ఉదారవాదులతో కలసి విప్లవ వ్యతిరేకిగా మారాడు.

మరోవైపు ప్రధానంగా విద్యార్థులు ఉన్న యూనియన్ ఆఫ్ రష్యన్ సోషల్ డెమొక్రాట్స్ నుండి ఆర్థికవాదం (ఎకనమిజం) అని పిలవబడే దాడి ఎదురైంది. తక్తరేవ్ అనే వైద్య విద్యార్థి దీనికి నాయకత్వం వహించాడు. ప్రవాసంలో ఉన్న ప్లెఖనోవ్ సంస్థ పంపే పత్రిక పంపిణీ, నిధుల సేకరణ, ప్రింటింగ్ నిర్వహణ వంటి రహస్య కార్యక్రమాలు ఈ యూనియన్ నిర్వహించేది.

లీగల్ మార్క్సిస్టులు వర్గ పోరాటాన్ని, గతితర్కాన్ని తిరస్కరిస్తే, ఆర్థిక వాదులు కార్యవాద దృక్పథం (ప్రాక్టికల్ ఔట్‌లుక్) పేరుతో కార్మికులకు సిద్ధాంతంతో పని లేదని వాదించారు. లెనిన్, మార్తోవ్ రహస్య తరగతుల్లో శిక్షణ పొందిన సీనియర్ కార్మికులు మొత్తం అరెస్ట్ అవ్వడంతో, కొత్త శ్రేణుల్లో వీరి ప్రభావం పడింది. ప్లెఖనోవ్‌తో వ్యక్తిగత స్పర్థగా మొదలై, నిధులకు సంబంధించిన లెక్కల వివాదంగా ముదిరిన ఆర్థికవాదం చివరికి ఒక స్పష్టమైన వైఖరిగా రాబోచ్య మ్యసల్ అనే పత్రికలో బయట పడింది. కార్మికులకు ఆర్థిక పోరాటమే ప్రధానం. రాజకీయ లక్ష్యం మాటున ఉద్యమం ఆర్థిక పునాది మరుగుపడింది. ఆర్థిక హోదా, పెట్టుబడితో రోజువారీ ప్రయోజనాలకై పోరాటం, వాటి కోసం సమ్మెలు మాత్రమే కార్మిక వర్గ లక్ష్యాలు – అని వారు వాదించారు.

దీని సారాంశం – కార్మికులకు రాజకీయాలతో పని లేదు. అంటే విప్లవ పార్టీ అవసరం లేదు. పార్టీని రాజకీయ చైతన్యంలేని వెనుకబడిన కార్మిక శ్రేణులలో కలిపివేయాలి. లెనిన్, మర్తోవ్‌లు పెరోల్ మీద విడుదలై నప్పుడు వారిని కలసిన తక్తరేవ్, కార్మిక సంఘంలో సభ్యులందరికీ పార్టీ సభ్యత్వం ఇవ్వాలని ప్రతిపాదించాడు. దీనికి బదులుగా లెనిన్ కార్మికులను పార్టీ సభ్యులుగా తీసుకోవాలని, కాని పార్టీకి (కార్మిక వర్గ అగ్రగామి శ్రేణి), కార్మిక సంఘానికి (విశాల వర్గ సంఘం) నడుమ విభజన ఉండాలని, రహస్య జీవితం గడుపుతున్న పార్టీకి ఇది మరీ ముఖ్యం అని వాదించాడు.

కొంత సద్దుమణిగిన వివాదం, జర్మనీలోని బెర్న్‌స్టీన్ ప్రభావం తోడై, ఇ.డి. కుస్కోవా రాసిన ది క్రెడో అనే రహస్య డాక్యుమెంట్ బయటికి పొక్కడంతో, తిరిగి రాజుకుంది. సైబీరియాలో శిక్ష అనుభవిస్తున్న లెనిన్, తదితరులకు అందిన ఈ డాక్యుమెంట్ ఇలా ప్రకటించింది: '... స్వతంత్ర పార్టీ వాదన అనేది మన సమాజంలోకి విదేశీ భావాలు జొప్పించడమే. రష్యన్ మార్క్సిస్టుల ముందు ఉన్నది ఒక్కటే దారి, కార్మికుల ఆర్థిక పోరాటాల్లో భాగస్వామ్యం, ఉదారవాద ప్రతిపక్ష కార్యక్రమాల్లో పాల్గొనడం'. (లెనిన్ రచన, ఏ ప్రొటెస్ట్ బై రష్యన్ సోషల్ డెమొక్రాట్స్, మార్క్సిస్ట్స్ డాట్ ఆర్గ్, లెనిన్ ఆర్కైవ్ నుండి)

ప్రపంచ వ్యాప్తంగా – సామ్రాజ్యవాద సమాజాల్లో కొంత బలంగా, ఇండియా వంటి దేశాల్లో బలహీనంగా ఉండే – ఉదారవాదానికి ఉన్న ఒక లక్షణం ఇక్కడ కనిపిస్తుంది. రాజ్య వ్యవస్థ, యంత్రాంగం గురించి మౌనం వహించడం, లేదా రాజ్యానికి వర్గ లక్షణం లేదనే భ్రమ కలిగించడం. కార్మిక పోరాటాలు కేవలం కార్మికుల, పెట్టుబడిదార్ల ప్రైవేటు వ్యవహారం అన్నట్లు చిత్రించడం దీని లక్షణం. ఆర్థికవాదుల భ్రమలు జార్ రాజ్య యంత్రాంగం మీద పనిచేసిన దాఖలాలు మాత్రం లేవు. వరుసగా సమ్మెల మీద పోలీసులు, సైన్యం దాడులు చేసి నాయకత్వ శ్రేణులను అరెస్ట్‌ల రూపంలో తొలిగించే ప్రయత్నం మాత్రం అది మానుకోలేదు. కార్మికులు కేవలం ఆర్థిక డిమాండ్ల కోసం పోరాడాలన్న ఆర్థికవాదులు, రాజకీయ ఉద్యమాన్ని ఉదారవాదులకు వదిలేసి వారికి తోకలుగా మారారు. కుస్కోవా స్వయంగా రష్యన్ పెట్టుబడిదార్ల ప్రధాన పార్టీ అయిన కాడెట్లతో కలసిపోయింది. విప్లవ మార్క్సిజం శ్రామికుల లోని అత్యంత చైతన్యవంతమైన, మిలిటెంట్ నాయకత్వ శ్రేణికి ప్రాతినిధ్యం వహిస్తే, ఆర్థిక వాదం దానికి పూర్తిగా విరుద్ధమైన పాత్రకు ప్రాతినిధ్యం వహించింది.

ఇలా వెనుకబడిన రష్యాలో అవకాశవాదంతో పోరాటం నడుస్తుండగా, యూరప్‌లో, ప్రధానంగా జర్మనీలో, మార్క్సిస్ట్ మౌలిక సూత్రాలను తిరిగి రచించాలనే (రివిజన్) వాదన మొదలైంది. కమ్యూనిస్ట్

మానిఫెస్టో 50వ వార్షికోత్సవ సందర్భంగా, ప్రముఖ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త కార్ల్ కాట్స్కీ సంపాదకత్వంలో నడుస్తున్న డై న్యూ జెఇట్ పత్రికలో వచ్చిన వ్యాసం దీనికి నాంది పలికింది. జర్మన్ సోషల్ డెమొక్రాట్ పార్టీ నాయకుడు ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ ఈ వ్యాసంతో మార్క్సిజాన్ని తిరిగి రాసే (రివిజనిజం) తన కార్యక్రమం మొదలుపెట్టాడు.

పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రీకరణ మార్క్స్ భావించిన దానికంటే నిదానంగా జరుగుతున్నది. పెట్టుబడిదారీ విధానాన్ని నియంత్రించి సంక్షోభాల తీవ్రత తగ్గించవచ్చు. (తర్వాత కాలంలో కీన్స్ విధానాలు).

కార్మికవర్గం కేవలం తన తక్షణ అవసరాల కోసమే ఉద్యమిస్తుంది. (బెర్న్‌స్టీన్ రచనలు మార్క్సిస్ట్స్ డాట్ ఆర్గ్ వెబ్‌సైట్‌లో చదవొచ్చు).

ఇదంతా గత వంద సంవత్సరాలుగా అవకాశవాదాన్ని, సంస్కరణ వాదాన్ని సమర్థించుకోవడానికి, 'భావ స్వాతంత్ర్యం', 'సృజనాత్మక మార్క్సిజం' లాంటి పేర్లతో వామపక్ష ఉద్యమాల్లోకి ప్రవేశిస్తూనే ఉన్నాయి. ఇక్కడ సమస్య భావ ప్రకటన, సృజనాత్మకత కాదు. మార్క్సిజాన్ని, మత గురువుల ప్రవచనాల లాగా స్వీకరించాలనో, విమర్శకు, విశ్లేషణకు అతీతంగా భావించాలనో కాదు. వాస్తవానికి కార్మికవర్గ దృక్పథం అంటే దేన్నైనా శాస్త్రీయంగా, అంటే బహుముఖంగా, చలనంలో భాగంగా పరిశీలించి, ఆచరణ అనే పరీక్షకు గురిచేసి స్వీకరించడమే. ఫ్యూడల్ సమాజాన్ని అంతంచేసి తన అధికారాన్ని స్థాపించడమనే పరిమిత లక్ష్యానికి అవసరమైన తాత్విక, నైతిక, సామాజిక, కళాత్మక ప్రాతిపదిక కోసం బూర్జువా వర్గం జరిపిన పోరాటం యూరోప్‌లో రినైసాన్స్ రూపం తీసుకుంటే, వర్గ సమాజాన్ని అంతం చేయడానికి అవసరమైన కృషి మానవ విజ్ఞానాన్ని వీలైనంత అభివృద్ధి చేస్తేగాని సాధ్యంకాదు.

అలాగని రివిజనిజం శూన్యంలో నుండి ఊడిపడలేదు. దానికి కచ్చితంగా వస్తుగత పునాది ఉంది – మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు (పెట్టుబడిదారీ విధానంలో సామ్రాజ్యవాద యుద్ధాలు జరగవని కూడా బెర్న్‌స్టీన్ రాశాడు) జర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద దేశాల్లో కార్మికవర్గంలో ఒక దొంతరకు కొంత ఆదాయాలు పెరిగాయి. ఈ పునాది మీద ఆధారపడి సోషల్ డెమొక్రాటిక్ పార్టీలో, కార్మిక సంఘాల్లో, మున్సిపల్, పార్లమెంట్ సభల్లో పదవులు సంపాదించుకున్న ఉద్యోగ, పార్లమెంట్ సభ్యుల దొంతర ఏర్పడింది. వీరికి సామ్యవాదం, సిద్ధాంతం అనేవి కొంత మేధో కాలక్షేపంలా తప్ప తక్షణ పోరాట కర్తవ్యాలుగా కనపడలేదు. ఆర్థిక డిమాండ్ల కొరకు, సంస్కరణల కొరకు ఆందోళన చేసి, విప్లవమనేది ఎప్పుడో సుదూర భవిష్యత్తులో ఉన్న విషయంగా, లేక సంస్కరణల ద్వారా సామ్యవాదం సాధించొచ్చు అని చిత్రించి వీరు తాము అనుభవిస్తున్న సౌకర్యాలు, హోదాలకు ప్రమాదం లేకుండా చూసుకున్నారు.

వీరు కొంత వివరంగా, బహుముఖంగా పరిశీలిస్తే రష్యా, పోలాండ్, లేదా ఐర్లాండ్, ఆసియా వలస దేశాల్లో పెట్టుబడి ప్రవేశాన్ని, అక్కడ నగ్నంగా జరుగుతున్న దోపిడిని, పెట్టుబడిదారీ విధానంలో మార్కెట్లు, వనరుల కోసం జరిగే పీకలు కోసే పోటీని, దాని వల్ల రాజీ (శాంతి) అనేది కేవలం తిరిగి పోటీకి (దేశాల స్థాయిలో యుద్ధం) విరామం మాత్రమేనని గుర్తించేవారు, కాని ఆ శాస్త్రీయ దృష్టి వారి – పెద్ద పెట్టుబడిదార్లకు కార్మికులకు నడుమ ఏర్పడిన దళారీ దొంతర – ప్రయోజనాలకు సరిపడదు. సంస్కరణల కోసం పోరాడే విప్లవకారులకి, సంస్కరణవాదులకి ఉన్న తేడా; సంస్కరణలు చేసుకుంటూ పోతే మౌలిక మార్పుకి దారి తీస్తుందన్న అపోహ కల్గించడమే సంస్కరణవాదం. సంస్కరణలు మౌలిక మార్పు కోసం చేసే పోరాటంలో కొద్దిపాటి విజయాలుగా పరిగణించడం విప్లవ సిద్ధాంతం.

బెర్న్‌స్టీన్ తొలి రచన వెలువడగానే ప్లెఖనోవ్, కాట్‌స్కీని ఆ వ్యాసాన్ని ఖండించమని కోరాడు. కొంత కాలం తాత్సారం చేసిన కాట్‌స్కీ, కర్ర విరగకుండా పాము చావకుండా ఓ ప్రకటన చేశాడు. '... అందరినీ పునరాలోచింపజేసిన బెర్న్‌స్టీన్‌కు మనం ధన్యవాదాలు తెలపాలి' అని ముగించాడు. దీనిపై స్పందించిన ప్లెఖనోవ్ 'మనం ఎందుకు ధన్యవాదాలు తెలపాలి?' అనే బహిరంగ లేఖ రాసి 'బెర్న్‌స్టీన్ సోషల్ డెమొక్రసీని పాతిపెడతాడా, లేక సోషల్ డెమొక్రసీ బెర్న్‌స్టీన్‌ను పాతి పెడుతుందా?' అని ప్రశ్నించాడు. యూరప్‌లో మార్క్సిజానికి ప్రముఖ సిద్ధాంతకర్తగా గుర్తింపు ఉండి, ఇలా మెతక వైఖరి వహించిన కాట్‌స్కీ కూడా అదే రివిజనిస్ట్ బాట పట్టాడు. (చూ. లెనిన్ రచన ది ప్రొలిటేరియన్ రెవల్యూషన్ అండ్ ది రెనగేడ్ కాట్‌స్కీ, ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో లేదా మార్క్సిస్ట్ ఇంటర్నెట్ ఆర్కైవ్)

అప్పటివరకు స్పష్టమైన సిద్ధాంతం లేని ఆర్థికవాదులకు, ప్రవాసంలో ఉన్న వారి ప్రతినిధులకు బెర్న్‌స్టీన్ రచనలలో పెద్ద మద్దతు లభించింది. జర్మనీ వంటి దేశాల పరిస్థితి లేని రష్యాలోని సంస్కరణవాదులు ఇలా జర్మన్, బ్రిటిష్ సంస్కరణవాదుల నుండి స్వీకరించిన సిద్ధాంతాలు రష్యాలోని బలహీనమైన సెక్షన్లు – విద్యార్థులు, బూర్జువా మేధావులు – రూపంలో కార్మిక వర్గంలోకి ప్రవేశించాయి. వీటి ప్రభావం ఒక ఐక్య పార్టీ, సిద్ధాంత పటిమ గల రాజకీయ పత్రిక అవసరాన్ని తెలియజేశాయి. లెనిన్ ఇస్క్రా పత్రిక స్థాపనతోనే ఒక ఐక్య పార్టీ అయిన రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ (ఆర్ఎస్‌డిఎల్‌పి) సాధ్యమైంది.

మార్చ్ 1898లో మిన్స్క్ పట్టణంలో రుమ్యాన్త్సేవ్ అనే రైల్వే కార్మికుని ఇంట్లో మొదటి పార్టీ మహాసభ జరిగింది.

మాస్కో, కీవ్, పీటర్స్‌బర్గ్, ఎత్కరినస్లోవ్, కార్మిక పత్రిక (రాబోచాయ గెజెటా), యూదు సోషల్ డెమొక్రటిక్ బండ్ నుండి వచ్చిన తొమ్మిది మంది ప్రతినిధులు, ఇంట్లో పండుగ పేరుతో రహస్య సమావేశం జరిపి పార్టీని స్థాపించారు. జైలు నుండి పార్టీ ముసాయిదా కార్యక్రమాన్ని లెనిన్ రహస్యంగా పంపాడు. కాని మహాసభ జరిగిన నెలలోపే ప్రతినిధులలో ఐదుగురు అరెస్ట్ అవడంతో ఆ ప్రయత్నం మూలబడింది. జార్ పాలనలో రష్యాలో జరిగిన మొదటి, చివరి మహాసభ అదే. రష్యాలో పార్టీ స్థాపన సాధ్యం అని మాత్రం అది నిరూపించింది. నిర్బంధం వల్ల, జార్ ప్రభుత్వం ఉన్నంతకాలం పార్టీ మహాసభలు రష్యా బయట జరపవలసి వచ్చింది.

రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ చరిత్ర ఒక చిన్న వ్యాసంలో రాయడం సాధ్యం కాదు. లెనిన్ సాధించిన అతి పెద్ద విజయం రష్యాలో విప్లవాన్ని సాధించగల పార్టీని నిర్మించి సారథ్యం వహించడం. వివరంగా తెలుసు కోదలచిన వారు జినోవీవ్, ట్రాట్‌స్కీ, ఇ.ఎచ్. కార్, అలన్ వుడ్స్ రచనలు చదవగలరు. వీటిలో కొన్ని ఇంటర్నెట్‌లో దొరుకుతాయి.

(రచయిత సామాజిక కార్యకర్త, ఆస్ట్రేలియా) వీ

చిల్లర వర్తకంలోకి ఎఫ్‌డిఐలు

భారతదేశంలోని చిల్లర వర్తకాన్ని బలహీనం చేసి మార్కెట్‌పై ఆధిపత్యం సాధించడమే ఎఫ్‌డిఐల అసలు లక్ష్యమని అంటున్నారు **ప్రొ. జి. శ్రీనివాసరావు, ఇడంపాక విజయ్**

పెట్టుబడి నియమం లాభాపేక్ష. లాభాలు ఎక్కడ ఉంటాయో అక్కడికి నిరంతరాయంగా ప్రవహించడం పెట్టుబడి సహజ లక్షణం. విదేశీ పెట్టుబడి అంటే ఒక దేశంలోని కంపెనీ లేదా సంస్థ మరో దేశంలో పెట్టుబడి పెట్టడం. సాధారణంగా ఏ దేశంలోకి అయినా పెట్టుబడి రెండు రూపాల్లో వస్తుంది. పోర్టు ఫోలియో పెట్టుబడులు లేదా విదేశీ పరోక్ష పెట్టుబడులు కాగా మరొకటి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ). పోర్టు ఫోలియో పెట్టుబడులు నేరుగా కాకుండా మార్కెట్లో షేర్లు, బాండ్లు కొనుగోలు చేయటం ద్వారా పెడతారు. విదేశీ పెట్టుబడిదార్లు లేదా సంస్థలు ఏర్పాటు చేసుకునే ప్రాజెక్టులలోనూ, భాగస్వామ్య కంపెనీలలోనూ పెట్టే పెట్టుబడులే ఎఫ్‌డిఐలు. రిటైల్ ఎఫ్‌డిఐలలో సింగిల్ బ్రాండ్, మల్టీ బ్రాండ్ క్యాష్ అండ్ క్యారీ అని వివిధ విభాగాలు ఉన్నాయి. నూతన ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అనుమతి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2007లోనూ, 2011లోనూ, ఈ అంశంపై కొంత చర్చ జరిగింది. 2012 నాటికి అమెరికా తదితర పశ్చిమదేశాలలో ఆర్థిక, రాజకీయ రంగాలలో చోటు చేసుకున్న పరిణామాలు ఈ విషయంలో భారతదేశ పాలకవర్గంపై మరింత వత్తిడిని పెంచారు..

అమెరికా లాంటి పశ్చిమదేశాలు ఆర్థిక సంక్షోభంతో అతలాకుతలమవుతున్నాయి. స్థానిక మార్కెట్లు మాంద్యంలో కూరుకపోయి, వ్యాపారాలు దెబ్బతిన్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో (జిడిపి) వృద్ధి రేటు అంతంత మాత్రంగానే ఉన్నది. నిరుద్యోగ సమస్య మరింత అధికమైంది. 2012 చిల్లర వర్తకంలో విశ్వాసక్తి పేరిట 'డెలాయిట్' రూపొందించిన నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 250 అగ్రశ్రేణి చిల్లర వ్యాపార సంస్థలన్నీ కలిపి 2010 సంవత్సరంలో చేసిన వ్యాపారం 3.94 లక్షల కోట్ల డాలర్లు. వాటిలో మొదటి 10 ప్రధాన చిల్లర వ్యాపార సంస్థలు చేసిన వ్యాపారం 1.16 కోట్ల డాలర్లు అంటే వీటి వాటా 29.42 శాతం చిల్లర వ్యాపారంలో సింహభాగం అమెరికాదే. 250 అగ్రశేణి భారీ రిటైల్ సంస్థల్లో 81 అమెరికాకు చెందినవే. మొత్తం 250 కంపెనీల వ్యాపారంలో వాటి వాటా 1.64 లక్షల కోట్ల డాలర్లు అంటే 41.65 శాతం. మొదటి 10 ప్రధాన సంస్థల్లో 5 అమెరికావి. మొత్తం 10 కంపెనీల వ్యాపారంలో వాటి వాటా 61.46 శాతం ఈ రకంగా బలోపేతంగా ఉన్న అభివృద్ధి చెందిన దేశాల వ్యాపార సముదాయం ముఖ్యంగా అమెరికా వ్యాపార సముదాయం తమ వ్యాపార విస్తరణకు సరియైన విఫణి భారతదేశమేనని బలంగా నమ్మడం. ఈ నేపథ్యంలోనే అక్కడ వ్యాపార, వాణిజ్య సముదాయం విదేశాలలో పెట్టుబడులు పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి ఈ ప్రయత్నంలో భాగమే భారతదేశ చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల ప్రవేశానికి మూలం. ఈ పూర్వ రంగం నుండే విదేశీ బడా రిటైల్ కంపెనీలు దేశంలో ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టే 17 రకాల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. వీటి విలువ 31 లక్షల డాలర్లు. మల్టీ బ్రాండ్ రిటైల్ రంగంలో 51 శాతం, సింగిల్ బ్రాండ్‌లో 100 శాతం, ఏవియేషన్‌లో 49 శాతం, పవర్ ఎక్స్ఛేంజ్‌లో 49 శాతం, విమానయాన రంగంలో 49 శాతం, బ్రాడ్ కాస్టింగ్ సేవల్లో 49 నుంచి 74 శాతం పెట్టుబడులు పెట్టుకోవడానికి అనుమతినిస్తూ 2012 సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మల్టీ బ్రాండ్ రిటైల్ రంగంలో పెట్టుబడులకు కొన్ని నామమాత్రపు షరతులను విధించింది. 10 లక్షల జనాభా ఉన్న ప్రాంతాలలో స్టోర్ల ఏర్పాట్లకు, 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి విధిగా ఉండాలని, ఎఫ్‌డిఐలలో 50 శాతం పెట్టుబడి బ్యాక్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (గోడౌన్, శీతల గిడ్డంగుల కోసం) పెట్టాలనే షరతులను విధించింది. విదేశీ కంపెనీలు స్థానిక ఉత్పత్తులను 30 శాతం విధిగా కొనుగోలు చేయాలన్న నిబంధనను కూడా విధించింది.

మన దేశంలో రిటైల్ రంగం విస్తరించడానికి కారణాలు లేకపోలేదు. 2005 ఫిబ్రవరి 12న 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' వెల్లడించిన సర్వే వివరాల ప్రకారం 'మనదేశంలో అతి స్వల్పకాలంలో రిటైల్ రంగం ఇంతగా పెరగడానికి ప్రధాన కారణం వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం. వస్తు ఉత్పత్తి రంగంలో స్తబ్దత నెలకొనడం. ఫలితంగా ఉన్న ఉపాధి అవకాశాలు కుదించుకుపోయాయి. నూతన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. ప్రజల ఆదాయాలు పడిపోయి, కొనుగోలు సామర్థ్యం సన్నగిల్లింది. దీనితో కోట్లాది మంది నిరుద్యోగ భారతీయులు అనివార్యంగా కొద్దిపాటి పెట్టుబడులతో చిల్లర దుకాణాలు తెరవడమే ఏకైక ప్రత్యమ్నాయ మార్గంగా భావించడమే'. చిల్లర వ్యాపార రంగం భారతీయులకు ఎంతో ముఖ్యమైనది. విలువైనది కూడా. ప్రభుత్వ గణాంక వివరాలే ఇందుకు నిదర్శనం. 2007-08 నాటికి దేశ శ్రామిక శక్తిలో 7.2 శాతం ఈ రంగంలో ఉన్నారు. వీరంతా అవిద్యావంతులే. ఇది ప్రధానంగా అసంఘటిత రంగంగా కొనసాగుతోంది. సుమారు నాలుగు కోట్ల మందికి పైగా ఉపాధి పొందుతున్నారని భారత ప్రభుత్వం చర్చాపత్రం వెల్లడించింది. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్నది ఈ రంగమే. ఎందుకంటే ప్రపంచంలోనే చైనా తర్వాత విస్తృత కొనుగోలు సామర్థ్యం, విశాలమైన మార్కెట్‌కు నిలయం భారతదేశం. ప్రధానంగా చిల్లర వర్తకంలో ప్రపంచంలోకెల్లా అత్యధిక షాపింగ్‌మాల్ సాంద్రత ఉన్నది కూడా మన

దేశంలోనే. ప్రతి వెయ్యి మందికి 11 షాపుల వంతున ఉన్నాయి. 90 శాతం వర్తకం ఈ రంగంలోనే సాగుతోంది. స్థూల జాతీయోత్పత్తిలో 10 నుంచి 14 శాతం వాటాను కలిగిఉంది. ప్రస్తుతం రిటైల్ రంగంలో 30 లక్షల కోట్లకు పైగానే వర్తకం జరుగుతోంది. 2014 నాటికి ఈ రంగంలో రు. 45 లక్షల కోట్లకు వ్యాపారం పెరుగవచ్చునని ఆర్థిక నిపుణుల అంచనా. ఈ రంగంలో ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న వారే గాక సుమారు మరో 20 కోట్ల మంది దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

నగరాల్లో సేవారంగంలో 36 శాతం మంది ప్రత్యక్షంగా చిల్లర వ్యాపారంలోనే ఉపాధి పొందుతున్నారు. అంటే మొత్తం 4 కోట్ల 40 లక్షల మందిలో 2 కోట్ల 60 లక్షల మంది నగరాలలోనూ, 1.80 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాలలోనూ ఉపాధి పొందుతున్నారు. 'అసోంచామ్' లెక్కల ప్రకారం దేశంలో ఒక కోటి యాభై లక్షల చిల్లర దుకాణాలుండగా నాల్గుకోట్ల 40 లక్షల కుటుంబాలు, ప్రత్యక్షంగా, మరో 7.50 కోట్ల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ రంగంలో వ్యాపారం మరో ఆరేళ్లలో రు. 69 లక్షల కోట్లకు విస్తరించవచ్చునని అంచనా వేసింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 9,31,759 కుటుంబాలు కిరాణా వ్యాపారంపై ఆధారపడి బతుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 7,80,377 దుకాణాలు, పట్టణ ప్రాంతాలలో 2,67,496 దుకాణాలున్నాయి. జి.డి.పిలో 14శాతం వాటా కలిగి, మొత్తం ఉపాధిలో 8శాతం మందికి ఆధారంగా ఉన్న ఈ రంగాన్ని విదేశీ బహుళజాతి సంస్థలకు అప్పగించే ప్రక్రియలో పాలకులు బిజీగా ఉన్నారు.

ఇంతటి ప్రాధాన్యత కలిగిన రంగాన్ని బహుముఖ ప్రయోజనాలంటూ బహుళజాతి సంస్థలకు అప్పగించటం దేశ ప్రయోజనాల, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా హానికరం. అయితే దేశ పాలకులు కొంత మంది ఆర్థిక నిపుణులు, మేధావులు ఎఫ్.డి.లు రావడం పట్ల సానుకూల వాదనలను ముందుకు తెస్తున్నారు. బహుముఖ లాభాలుంటాయని దేశ ప్రజలకు నివేదిస్తున్నారు. అదే సమయంలో ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవేశం వల్ల ప్రజల జీవితాలు చిన్నాభిన్నమయ్యే విషయాన్ని విస్మరిస్తున్నారు. వాల్‌మార్ట్, కెర్రిఫాల్, మెట్రో, టెస్కో వంటి బహుళజాతి సంస్థలు చిల్లర వర్తకంలో అడుగుపెట్టిన ప్రతిచోట చిరు వ్యాపారులు దివాల తీసిన విషయాన్ని మరుగు పరుస్తున్నారు. అమెరికా, ఐరోపా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో చిరువ్యాపారులు ఈ భారీ సంస్థల మూలంగా దెబ్బతిన్న వాస్తవాన్ని చూడనిరాకరిస్తున్నారు. ఆగ్నేయ, ఆసియా దేశాలు సూపర్ మార్కెట్ విస్తరణపై గట్టి ఆంక్షలు విధిస్తున్న చేదు నిజాన్ని పూర్వపక్షం చేస్తున్నారు.

చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవేశాన్ని సమర్థిస్తూ ముందుకొచ్చిన వాదనల సారాంశం స్థూలంగా స్థానికంగా చిల్లర వర్తకానికి ఎలాంటి నష్టం ఉండదనీ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విస్తృత స్థాయిలో పెరగుతాయని, రైతుల వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు కారుచౌకగా నాణ్యమైన వస్తువులు లభిస్తాయన్నదే. ఇది ఎంత మాత్రం వాస్తవం కాదు. పెట్టుబడి సహజ ఆర్థిక నియమం, బహుళజాతి సంస్థల చర్యల వల్ల అంతర్జాతీయంగా ఉన్న అనుభవాల పట్ల అవగాహన ఉన్నవారెవరైనా ఈ చేదు నిజాన్ని గ్రహిస్తారు. అంతర్జాతీయ అనుభవాలను పరిశీలిస్తే 2006లో షికాగో లోని ఆస్టిన్ ప్రాంతంలో చిల్లర వర్తకంలో వాల్‌మార్ట్ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టింది. ఫలితంగా 2008 నాటికి ఆ ప్రాంతంలో ఉన్న మొత్తం 306 చిన్న దుకాణాలలో 82 మూతపడ్డాయి. వాల్‌మార్ట్ చుట్టు పక్కల దుకాణాల మూసివేత రేటు 35 నుంచి 60 శాతం వరకు ఉందని 'ది ఎకనామిక్ డెవలప్‌మెంట్ క్వార్టర్లీ' అధ్యయనంలో వెల్లడయ్యింది. ఇక ప్రతి వాల్‌మార్ట్ స్టోర్‌కు ఒకటిన్నర కిలో మీటర్ల పరిధిలో ఉన్న మందుల దుకాణాలు 20 శాతం, ఫర్నీచర్ దుఖాణాలు 15 శాతం, ఆటవస్తువుల దుకాణాలు 25 శాతం మూతపడ్డాయన్న విషయం ఈ అధ్యయనంలో వెల్లడయ్యింది. వాల్‌మార్ట్ లాంటి బహుళజాతి సంస్థల దాష్టీకాల వల్ల చిల్లర దుకాణాల సంఖ్య 17 శాతం, డెన్మార్క్‌లో పదేళ్లలోనే 3వ వంతు దుకాణాలు మూతపడ్డాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విస్తృతమైతాయన్న వాదన నిజంకాదు. ఇది అమెరికాలో జరిపిన అనేక అధ్యయనాలలో వెల్లడయ్యింది. న్యూయార్క్ సిటీ పబ్లిక్ అడ్వకేట్ 2010 జనవరిలో రూపొందించిన 'వాల్‌మార్ట్ అడుగుజాడ' నివేదికలో వాల్‌మార్ట్ లాంటి సంస్థలు సృష్టించే ప్రతి ఒక్క ఉద్యోగానికి మూడు స్థానిక ఉద్యోగాలను హతమారుస్తుందని ప్రకటించింది. వాల్‌మార్ట్, టెస్కో వంటి అమెరికన్ భారీ రిటైల్ సంస్థలు భారతదేశంలోకి వస్తే అది ఒక ఉద్యోగం సృష్టిస్తే 17 ఉద్యోగాలు పోతాయని జర్మనీకి చెందిన మెట్రో క్యాష్ అండ్ క్యారీ కంపెనీ ప్రకటించింది.

ఎఫ్‌డిఐ విధానం వల్ల కార్పొరేట్ కంపెనీల చేతిలో రైతులు బందీగా మారుతారు. భూముల్లో ఏ పంటలు పండించాలో, ఎటువంటి సేద్యపు విధానాలు అవలంబించాలో, ఉత్పత్తులు ఎక్కడ, ఎవరికి విక్రయించాలో అన్ని అంశాలను కార్పొరేట్ సంస్థలే నిర్ణయిస్తాయి. ఇప్పటికే విత్తన రంగంలోకి విదేశీ కంపెనీల ప్రవేశం వలన రైతులకు సకాలంలో సరసమైన ధరలకు విత్తనాలు అందే పరిస్థితి లేదు. వీటి ప్రమేయం వలన వ్యవసాయ రంగంలో ఆహార ధాన్యాల ఉత్పత్తికన్నా ఎగుమతి ప్రధానమైన వాణిజ్య పంటలు పండించాల్సి రావడం వల్ల అహార భద్రతకు ముప్పువాటిల్లుతోంది. ఇటీవలి కాలంలో ప్రపంచ అహార సంస్థ రూపొందించిన నివేదికలో ఆసియా దేశాల రైతులు తమ వ్యవసాయోత్పత్తులను సూపర్ మార్కెట్లకు సరఫరా చేయటంలో పెద్ద ఎత్తున సమస్యలను ఎదుర్కొంటున్నారని, నాణ్యతా ప్రమాణాల సాకుతో రైతులు పండించిన పంటను కొనడానికి కంపెనీలు నిరాకరించడం వల్ల ధరలు పడిపోయి రైతులు దివాలా తిస్తున్నారని పేర్కొన్నది. ఉన్నత తరగతుల వారికి అవసరమయ్యే ఉత్పత్తుల కోసం వనరులను అధికంగా ఉపయోగించడం వల్ల సాధారణ వినియోగ వస్తువులకు కొరత ఏర్పడుతుంది. విదేశీ రిటైల్ వ్యాపారులు తొలుత చౌకగా వస్తువులను విక్రయిస్తారు. క్రమంగా ప్రజాబాహుళ్యానికి అత్యవసరమైన వినియోగ వస్తువుల ఉత్పత్తిని తగ్గించి కృత్రిమ కొరతను సృష్టిస్తారు. తద్వారా సాధారణ వినియోగ వస్తువుల ధరల పెరుగుదలకు అవసరమైన భౌతిక వాతావరణాన్ని సృష్టిస్తారు. నిజానికి తొలుత నామమాత్రపు వేతనాలు, తక్కువ ధర కలిగిన ముడిపదార్థాల ద్వారా వస్తూత్పత్తి, పోటీదారులు దివాలతీసేదాకా జాగ్రత్తపడి గుత్తాధిపత్యం ఖరారయ్యాక ఊహాతీత లాభార్జనకు తెగబడటం బహుళజాతి సంస్థల వ్యూహం. అంతేకాదు భారీ రిటైల్ సంస్థలు విదేశాల నుంచి భారీ స్థాయిలో సరుకులను దిగుమతి చేసుకుంటే స్థానిక వ్యవసాయ, వస్తు ఉత్పత్తులు, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి.

ఎఫ్‌డిఐల వల్ల తొలుత లాభాలు కనిపించినా క్రమంగా అది

ప్రయోజనాలు	వాస్తవాలు
1. మల్టీ బ్రాండ్‌లోకీ విదేశీ ప్రభుత్వ పెట్టుబడులు రావడం వలన మూడు, నాలుగేండ్లలో 40 లక్షల ఉద్యోగాలు లభిస్తాయి. సరుకుల రవాణా వంటి రంగాలలో మరో 50 లక్షల ఉద్యోగాలు పెరుగుతాయనీ అంచనా.	1. రిటైల్ రంగంలోకి ఎఫ్.డి.ఐల ప్రవేశ వలన బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యం ఏర్పడి మార్కెట్ పూర్తిగా వారి చెప్పుచేతుల్లోకి వెళ్తుంది. ఫలితంగా రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతాయి. సామాజన్య ప్రజలు తమ అవసరాల కోసం కొనుగోలు చేసే వస్తువుల ధరలు పెరుగుతాయి.
2. సంస్థల మధ్య పోటీ వలన వినియోగదారులకు, తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు/సరుకులు లభిస్తాయి.	2. రైతుల బహుళజాతి సంస్థల దయ, దక్షిణ్యాలపై ఆధారపడి పరిస్థితి వస్తుంది. బహుళజాతి సంస్థల నిర్దేశిత ధరలకే రైతులు తమ వ్యవసాయ ఉద్పత్తులను విక్రయించాలి.
3. రైతులకు తమ ఉత్పత్తులకు అధిక ధరలు లభిస్తాయి.	3. ఆర్థికంగా పరిపుష్టత కలిగిన బహుళజాతి సంస్థల మధ్యనెలకొనే పోటీలో స్థానిక సంస్థలు అంటే రిటైల్, చిల్లర దుకాణాలు మూతపడతాయి.
4. గోదాములు, శీతల గిడ్డంగులు, రవాణా సౌకర్యాల వంటి ఆధునిక మౌలిక వసతులు పెరుగుతాయి.	4. లాభాపేక్షయే ప్రాథమిక నియమంగా పెట్టుకున్న బహుళజాతి సంస్థలు మౌలిక సదుపాయాల పట్లకన్నా రైతులను దోచుకోవడానికే ఎక్కువ ఆసక్తిని చూపుతాయి.
5. భారతదేశ యువతకు అధిక వేతనాలలో కూడిన ఉద్యోగాలు లభిస్తాయి.	5. ఎఫ్.డి.ఐ.ల ఫలితంగా స్వల్ప స్థాయిలో ఉద్యోగాలు లభించినా చిల్లర వర్తకం, దాని అనుబంధ ప్రక్రియలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారుతారు.
6. విదేశీ సంస్థలలో పోటీ ఫలితంగా భారతీయ సంస్థల నాణ్యత పెరిగి అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతాయి.	
7. రిటైల్ వర్తకానికీ, చిల్లర వ్యాపారస్తులకు ఎఫ్.డి.ఐలు అడ్డుకాదు. ఎలాంటి నష్టం కూడా ఉండదు. కనుక వర్తమాన అంతర్జాతీయ సమాజ పరిస్థితితుల రీత్యా దేశ భవిష్యత్ అవసరాల కోసం ఎఫ్.డి.ఐలు అవసరం.	

సాంప్రదాయక వ్యవస్థను ధ్వంసం చేస్తుంది. స్థానిక మార్కెట్లపైనా వ్యవసాయోత్పత్తులపైనా క్రయ, విక్రయాలు ధరలపైనా గుత్తాధిపత్యం ఏర్పరుచుకుంటాయి. ఉన్న ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమేకాక నిరుద్యోగం, ఉపాధి రహిత సమస్యలను విస్తృతపరిచి మరింత జఠిలం చేస్తుంది. బహుళజాతి సంస్థలైన వాల్‌మార్ట్, మెట్రో, టెస్కో వంటి సంస్థలకు ప్రజాసంక్షేమం పట్టదు. స్థానిక వర్తక అభివృద్ధి విస్తరణ గిట్టదు. తమ వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల విస్తరణ, నిర్వహణకోసం పలు రకాల అవాంఛనీయ అనైతిక చర్యలకు పాల్పడుతాయి. స్థానిక వర్తక వ్యాపారులను విధ్వంసం చేసి, గుత్తాధిపత్యం సాధించడమే వాటి ప్రాథమిక లక్ష్యం. అందుకే వాటికి మానవీయ హృదయం, నైతిక విలువలు ఉండవు. దేనికైనా బరితెగించి ప్రయోజనాల్ని పదిలపరుచు కుంటాయి. ఇవి భారత ఆర్థిక వ్యవస్థను, స్థూలంగా ప్రజాజీవనాన్నే విధ్వంసం చేస్తాయి. వీటిలో అత్యంత ప్రమాదకారీ మల్టీ బ్రాండ్‌లో పెట్టుబడులు పెట్టడం. చిల్లర వర్తకంలోని వివిధ విభాగాల్లోకీ 51 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనుమతించాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమైన చర్య. 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ' విధాన స్ఫూర్తికి భిన్నమైంది. విధానపరమైన ఏ విషయానికైనా ప్రజా ప్రయోజనమే పరమార్థంగా ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ఈ విషయాన్ని స్పష్టీకరిస్తోంది. అంటే విధానపరమైన నిర్ణయానికి విశాల ప్రజా ప్రయోజనాలు ప్రమాణికం, గీటురాయి కూడా. చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అనుమతి విధానపరమైనది. దేశ ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు, ప్రజాసంక్షేమంతో అవినాభావ సంబంధం కలిగిన అంశం. అందువలన మనదేశ చిల్లర వర్తకంలోకి ఎఫ్‌డిఐల ప్రవేశం అత్యంత ప్రమాదకరం.

(రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్.ఆర్.ఎం అధ్యాపకుడు, పరిశోధక విద్యార్థి,) వీ

రాబోయే సంచికలలో...

- **వ్యవస్థీకృతమైన అవినీతి - వై. రామచంద్రం**
- **చైనా ప్రధాని భారత పర్యటన - ఫలితాలు - జి. సత్యనారాయణ రెడ్డి**
- **కులం గురించి - యు. హెచ్. ప్రీతమ్**
- **నేటి అనంతపురం - కె. నాగేశ్వరచారి**
- **అమెరికన్ విలేఖరితో కార్ల్ మార్క్స్ ముఖాముఖీ**

భ్రూణహత్యలు - కారణాలు

సమాజంలో మహిళలపై సాగుతున్న దౌర్జన్యాలలో, వివక్షలో భాగంగానే భ్రూణ హత్యలు జరుగుతున్నాయని అంటున్నారు **దావ మాధవి, నలిగంటి రజిత**

ప్రతి ఏడాది మార్చ్ 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటాం. కాని మహిళల పరిస్థితి, ప్రత్యేకించి ఆడపిల్లల జీవన పరిస్థితులు రోజు రోజుకూ దిగజారుతున్నాయి. మేము ఆకాశంలో సగం అంటూ మహిళలు ఓవైపు ఆకాశంలో దూసుకెళ్తూంటే, సమాజంలో స్త్రీల పట్ల ఉన్న చిన్నచూపు, వివక్ష ఆడశిశువుల హత్యలకూ, ఆత్మహత్యలకూ ప్రేరేపిస్తున్నాయి. ఆడపిల్లలను పెంచడం, పక్క ఇంటి చెట్టుకి నీళ్లు పోయడం లాంటిదన్న సామెత ఆధునిక యుగంలో కూడా కొనసాగుతోంది. భారతీయ సామాజిక వ్యవస్థ అనాదిగా పితృస్వామ్య వ్యవస్థ. పితృస్వామ్య వ్యవస్థలో కొడుకును కుటుంబ రక్షకుడిగా, వంశాన్ని నిలిపేవాడిగా, కర్మకాండలు జరిపేవాడిగా, ఆస్తికి వారసుడిగా భావిస్తారు. కొడుకులను సంపదగానూ, ఆడపిల్లలను భారంగానూ భావిస్తారు. ఆడపిల్లలంటే పెళ్లి, కట్నం రూపంలో ఆర్థిక భారమవుతుందని, బయట వారి నుండి కాపాడవలసిన బాధ్యత కూడా ఉంటుంది. కొడుకుల పట్ల కోరికను, ఆడపిల్లల పట్ల వ్యతిరేకతను కలిగిస్తున్నాయి.

మగపిల్లవాడు పుడితే ఇంట్లో సంబరాలు, పండగలు. అదే ఆడపిల్ల పుడితే స్మశాన నిశ్శబ్దం అలుముకుంటోంది. ఆడపిల్ల తర్వాత ఆడపిల్ల పుడితే తల్లి హోదా కూడా పడిపోతూ ఉంటుంది. కొడుకు పుడితేనే ఆమె తిరిగి తన హోదాను పొందగలుగుతుంది. ఆడపిల్ల పుడితే తల్లిపట్ల ఇంట్లో వాళ్లు వ్యవహరించే విధానంలో కూడా తేడా ఉంటుంది. ఆమెతో ఎక్కువ పని చేయిస్తారు. పోషకాహారం ఇవ్వకపోవడం, కొందరికి శిక్షగా ఇంటి నుండి తరిమేసి అనాథగా చేస్తారు. ఆడపిల్ల పుట్టడానికి జన్యుపరంగా కారణమయిన తండ్రి పరిస్థితిలో ఎటువంటి మార్పు ఉండదు. సమాజంలో అతను సానుభూతికి అర్హుడవుతాడు. ఈ విధంగా అన్ని వైపుల నుండి ఆడపిల్ల మృత్యువుని కోరుకునే వారే. కొడుకు మాత్రమే వంశం పేరు నిలబెట్టగలడని నిరూపించడానికి ధర్మశాస్త్రాలను ఎడాపెడా ఉపయోగిస్తూ ఉంటారు. జననం, మరణం, వివాహం, పండగలలో వంటి సందర్భాలలో ముసలి వాళ్లయినా, పిల్లలయినా మగవాళ్లకి ఎంతో ప్రాధాన్యతనిస్తుంటారు.

ఆడపిల్లల భ్రూణహత్య, అంటే వివిధ పద్ధతుల ద్వారా లింగ నిర్ధారణ చేసుకొని ఆడపిల్లని తెలియగానే పిండ దశలోనే నిర్మూలించడం. ఆడపిల్ల అయితే భ్రూణహత్యకు పాల్పడడం నేడు దేశవ్యాప్తంగా సాధారణ విషయంగా మారింది. నేడు గర్భస్థ ఆడశిశు హత్యలుగా పేర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువగా బతుకుతారు. జన్యుపరంగా ఆడపిల్లలు బలంగా ఉండడమే దీనికి కారణం. దీనికి విరుద్ధంగా భారత దేశంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు స్త్రీల సంఖ్య తగ్గిపోతోంది. ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితికి చెందిన గణాంకాల కార్యాలయం జనాభా విభాగం నిర్వచించిన అధ్యయనం వెల్లడిచింది. అనేక దేశాలలో పురుషులకంటే స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉంది. సగటున ప్రతి వెయ్యి మంది పురుషులకి 1050 మంది స్త్రీలు ఉంటారు. కానీ భారతదేశ జనాభాలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 930 మాత్రమే స్త్రీలు ఉన్నారు. గర్భం నుంచి చనిపోయే వరకు స్త్రీలపై చూపుతున్న హింసాయుత వివక్షకు పిల్లల్లో ఆడవాళ్ల నిష్పత్తి పడిపోవడం ప్రధాన నిదర్శనం. ఆడపిల్లల నిష్పత్తి అన్నింటికంటే భారతదేశంలో తక్కువగా ఉంది.

వివిధ దేశాలలో ప్రతి వందమంది పురుషులకు మహిళల సంఖ్య

క్ర.సం.	ప్రాంతం	స్త్రీల సంఖ్య/ శాతం
1.	యూరప్, ఉత్తర అమెరికా	105
2.	లాటిన్ అమెరికా	100
3.	కరీబియన్ దీవులు	103
4.	సబ్ సహారా ఆఫ్రికా	102
5.	ఆగ్నేయాసియా	100
6.	మధ్య ఆసియా	104
7.	దక్షిణ ఆసియా	95
8.	భారత దేశం	93

మూలం: ప్రపంచ మహిళలు-ధోరణులు-గణాంకాలు, ఐక్యరాజ్యసమితి, న్యూయార్క్

పై పట్టికను గమనించినట్లయితే మిగతా దేశాల కంటే భారత దేశంలోనే మహిళల సంఖ్య తక్కువగా ఉన్నట్లు మనం గమనించవచ్చు. కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలో ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతూ వస్తోంది. 1991లో ప్రతి వెయ్యిమంది మగపిల్లలకి 927 ఆడపిల్లలు ఉండగా 2001లో ఇది 933కి తగ్గిందని 2001 జనాభా వివరాలు వెల్లడించాయి. దీనికి ముఖ్య కారణం ఆడపిల్ల అని తెలియగానే వివిధ రాష్ట్రాల్లో భ్రూణహత్యలకు పాల్పడడం. ఏమాత్రం నైతికతలు లేని క్లినిక్కులలోను, కౌన్సిలింగ్ కేంద్రాల పేరుతో నడిపే కేంద్రాలలోనూ ఈ లింగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటున్నాయి. ఇటువంటి క్లినిక్‌లను, కేంద్రాలను వివిధ పేర్లతో నగరాలలో, పట్టణాలలో నిర్వహిస్తున్నారు. బలమైన పితృస్వామ్య భావజాలం, చిన్న కుటుంబ సిద్ధాంతం కారణంగా ధనిక, మధ్య, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఈ పద్ధతులను అవలంబిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని పేద కుటుంబాలలో పితృస్వామ్యానికి పేదరికం తోడు కావడంతో ఆడశిశువులు హత్యలకు గురవుతున్నారు.

భారత దేశం 2001 గణాంకాల ప్రకారం 0–6 సంవత్సరాల పిల్లల వివరాలు	
శిశువులు, పిల్లలు, అందరు	15.8 కోట్లు
మగశిశువులు, పిల్లలు	8.5 కోట్లు
ఆడ శిశువులు, పిల్లలు	7.6 కోట్లు
మాయమయిన ఆడ శిశువులు, పిల్లలు	60 లక్షలు
పిల్లల్లో మగ, ఆడ నిష్పత్తి	1000 : 927

భారత దేశంలో ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోయి భ్రూణహత్యలకు పాల్పడడానికి అనేక కారణాలు ఉన్నాయి.

సంస్కృతి సమాజాల ఆమోదం ఉంది

పితృస్వామ్య వ్యవస్థలో మగపిల్లవాడిని వంశ గౌరవానికి ప్రతీకగా భావించడం ప్రధాన కారణం. ఆడపిల్ల పుడితే కట్నం ఇవ్వాలనే భావన నేటికి సమాజంలో ఉన్న మాట వాస్తవమే. అంతేకాక ఆడపిల్లలు చదువుకోవడానికి, ఉద్యోగాలు చేయడానికి అవకాశాలు చాలా తక్కువ అనే భావన. మగపిల్లవాడు అయితే తమను వృద్ధ్యాప్యంలో పోషిస్తాడని అదే ఆడపిల్ల అయితే అత్తవారింటికి వెళ్తుందని ఒక అభిప్రాయం అనాదిగా సమాజంలో కొనసాగుతోంది. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల సంరక్షణ ఎన్నో రకాలుగా తల్లిదండ్రులకు సవాలు కావడంతో కూడా భ్రూణ హత్యల పరంపర పెరిగిపోతోంది. బయటకు వెళ్లిన ఆడపిల్ల ఇంటికి తిరిగి వచ్చే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన అగత్యం ఏర్పడుతోంది. ఆడపిల్లల శారీరక రక్షణ బాధ్యత కూడా నేటి సమాజంలో సవాలుగా మారుతోంది. మూఢ నమ్మకాలు కూడా ఆడపిల్లల పట్ల ఉరితాళ్లు అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకి మధురైలోని 'మధురైతిని కల్లార్' అనే జాతివాళ్లు ఆడపిల్లను చంపితే తరువాత మగపిల్లవాడు పుడతాడని నమ్ముతారు. పంజాబ్‌లోని కొన్ని కులాల వాళ్లు ఆడపిల్ల పుట్టిన తరువాత రాత్రి చెట్టు కింద వదలి పెడతారు. మరునాడు వచ్చి నక్కలు, కుక్కలు ఆడపిల్లను ఎటు ఈడ్చుకెళ్లాయో చూస్తారు. ఇంటివైపుకి ఈడ్చుకెళ్లినట్లయితే అది దుశ్శకునం మళ్లీ ఆడపిల్ల పుడుతుంది. వేరే వైపుకి ఈడ్చుకెళ్లితే ఈసారి మగపిల్లవాడు పుడతాడని నమ్ముతారు.

ప్రపంచీకరణ, జనాభా విధానాలు

ఆర్థిక సంస్కరణలు చేపట్టిన పది సంవత్సరాలలో ప్రజారోగ్యం, విద్య వంటి ప్రభుత్వ ఖర్చు గణనీయంగా తగ్గిపోయింది. ఆహారం, వ్యవసాయం, విద్యుత్, నీటి విడుదల వంటి రంగాలలో సబ్సిడీలకు కోత విధించారు. అంతర్జాతీయ సామ్రాజ్యవాద మార్కెట్ ఆటుపోట్లకు ఎటువంటి అడ్డంకులు లేకుండా ఆర్థిక రంగంలో స్వేచ్ఛను కల్పించారు. కనీస మనుగడ, ఉపాధి, అభివృద్ధి వంటి అన్ని బాధ్యతలను రాజ్యం వదులుకుంది. ఇది ప్రజల జీవితాల్లోనూ పెను ప్రమాదాన్ని సృష్టించింది. మగపిల్లలను కోరుకుని ఆడపిల్లలను చంపివేసే ధోరణికి భౌతికంగా కాక, సిద్ధాంత రీత్యా కూడా సంస్కరణలు ప్రేరణనిచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు శాస్త్ర, సాంకేతిక రంగాలలో అనేక మార్పులు వచ్చినా స్త్రీ అణచివేత ధోరణి కొనసాగి అనేక కారణాల వల్ల ప్రతి దశాబ్దానికి లింగ నిష్పత్తి తగ్గిపోతూ వస్తోంది.

భారత దేశంలో లింగ నిష్పత్తి 1901 – 2001

గణాంక సంవత్సరం	లింగ నిష్పత్తి (ప్రతి వెయ్యి మంది పురుషులకు స్త్రీల సంఖ్య)
1901	972
1911	964
1921	955
1931	950
1941	945
1951	946
1961	941
1971	930
1981	934
1991	927
2001	933
2011	940

పట్టికను గమనించినట్లయితే స్వాతంత్ర్యం రాక మునుపు 1901లో ప్రతి 1000 మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉండేవారు. గడిచిన పది దశాబ్దాలలో లింగ నిష్పత్తి 2001 నాటికి ప్రతి 1000 మంది పురుషులకు 933 మంది స్త్రీలకు పడిపోతే 2011 నాటికి 1000కి 940 మందికి పెరుగుదల కనిపిస్తుంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరిగినప్పుడు స్త్రీల అభివృద్ధి కూడా ఒక భాగంగానే అభివృద్ధి చెందాలి కాని అది జరగలేదు. మౌలిక హక్కులు అందుబాటులోకి రావాలన్నా, అభివృద్ధి ఫలాలు అందరికి అందాలన్నా జనాభా స్థిరీకరణ సాధించడం అవసరం. స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణకు శ్రీకారం చుట్టింది. ఇది తరువాత జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమంగా ఏర్పడింది. మొదట ఈ విధానం కింద ముగ్గురు శిశువులకు ప్రాధాన్యత ఇవ్వబడింది. క్రమంగా 'ఇద్దరు ముద్దు ముగ్గురు వద్దు' అనే స్థాయికి చేరుకుంది. చిన్న కుటుంబాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అంటే కుటుంబానికి ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలి. ఈ సమయంలో కొడుకుల ప్రాధాన్యత పెరిగి దేశంలో ఆడపిల్లల హత్యలకు దారితీశాయి. దంపతులు ఒక్కరితో సరిపెట్టుకోవాలంటే మగపిల్లవాడై ఉండాలి. ఇద్దరైతే ఒక కొడుకు, ఒక కూతురు లేదా ఇద్దరు కొడుకులు కావాలి. అంతేకాని సాధారణంగా ఇద్దరు కూతుళ్లతో సరిపెట్టుకోలేం.

మహిళల విలువ దిగజారిపోవడం

కుటుంబానికి, సమాజానికి మహిళలు దోహదపడుతున్న విధానాన్ని గుర్తించకపోగా పితృస్వామ్య సమాజంలో వినిమయత్వం చోటు చేసుకుంది. ఎవరు ఎంత కట్నం తెస్తారని లెక్కలు ఎక్కువై పేదరికం వల్ల తల్లిదండ్రులు ఆడ శిశువు పుడితే కట్నం రూపంలో ఎంతో కొంత ముట్ట చెప్పాలని, వరకట్న చావులకి భయపడి పురిట్లోనే చంపేసిన కథలెన్నో ఉన్నాయి. వరకట్న నిరోధక చట్టం వచ్చినా అమలులో మాత్రం నేటికీ శూన్యమే. వరకట్న దురాచారం సమాజంలో పేద, ధనిక అనే వ్యత్యాసం లేకుండా అన్నివర్గాలకు అంటువ్యాధిలా వ్యాపించింది. గత

మూడు దశాబ్దాలుగా వరకట్న వేధింపులు, చావులు పెరుగుతూ ఉన్నాయి. ఒకప్పుడు వందల్లో ఉన్న వీటి సంఖ్య నేడు వేలకు పెరిగింది.

ఆడపిల్లలకు ఆస్తిలో సమాన వాటా

ఆస్తి చట్టాలలో వచ్చిన మార్పులు పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన వాటా ఉందని పేర్కొంటున్నాయి. ఈ చట్టాలు స్త్రీల జీవితాలకు భద్రతను ఇవ్వకపోగా మృత్యుకుహరంలోకి నెడుతున్నాయి. పెళ్లి సమయంలో కానీ, తరువాతగానీ అల్లుడు ఆస్తిలో వాటా ఆడిగేందుకు అవకాశం ఉంది. అంతేగాక భూమిగానీ, వ్యాపారంగానీ కొడుకులకు ఇవ్వడం ద్వారా వారు జీవిత కాలం తమను పోషిస్తారనే భద్రత భావన సమాజంలో ప్రతి తల్లిదండ్రులకు ఉంటుంది. అదే ఆస్తి కూతురికి ఇస్తే తమ అత్తవారింటికి వెళ్లడం వల్ల పరాయి సొత్తుగా మారుతుందని భావిస్తారు. అభద్రతా భావానికి లోనయి అల్లుడు ఎప్పటికి కొడుకు కాలేడని భావిస్తారు. ఆడపిల్లలు వద్దనుకొని భ్రూణహత్యలకు పాల్పడటానికి ఇది ఒక కారణమే.

సమాజంలో మహిళలపై జరుగుతున్న అనేక రకాల హింసలు

పురిటినొప్పులతో మొదలై కాటికి చేరే వరకు మహిళ జీవితం హింసతో కూడుకొని ఉంటోంది. నాటి నుండి నేటి వరకు సమాజంలో మహిళలు ద్వితీయ స్థాయిలో ఉన్నారు. సమాజ నానుడి ప్రకారం పురుషుడు ఎక్కడైనా, ఎలాగైనా జీవించగలడు. అదే మహిళకు భద్రత అవసరం. పుట్టినప్పుడు తల్లిదండ్రులపైన, వివాహానంతరం భర్తపై, వృద్ధాప్యంలో కొడుకుపై ఆధారపడవలసి వస్తుంది. ఈ క్రమంలో మహిళల శారీరక భద్రత అనేది సమాజంలో ఒక ముఖ్య అంశం. బయటకు వెళ్లిన ఆడపిల్ల ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేవరకు తల్లిదండ్రులకు గుండెల్లో గుబులే. సంవత్సరం వయస్సు నుంచి పండు ముసలి వరకు అత్యాచారానికి గురవుతున్నారు. ఎప్పుడైనా, ఎక్కడైనా లైంగిక దాడులకు గురికావచ్చు, ప్రేమ పేరుతో యాసిడ్ దాడులకు బలికావచ్చు. భద్రత విషయంలో ఇంకా ప్రశ్నార్థకంగానే ఉందని చెప్పవచ్చు. ఇలాంటి అభద్రతా భావంతో బతికే బదులు మగపిల్లవాడు కావాలనుకుని భ్రూణహత్యలకు పాల్పడిన సంఘటనలు దేశంలో కోకొల్లలు.

దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయ అనే విద్యార్థినిపై జరిగిన మానవ మృగాల అఘాయిత్యం ఫలితంగా వారం పాటు మృత్యువుతో పోరాడి మరణించింది. ఇలాంటివి రోజుకు కొన్ని వందల సంఖ్యలో దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి.

ఆడ శిశువులను గర్భస్త దశలోనే నిర్మూలించడం

ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి రావడం ఫలితంగా అనర్హులు ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ ఉండడం వలన గర్భస్త పిండ నిర్ధారణ సులభం అవుతోంది. ఆడశిశువులను గర్భస్త దశలోనే నిర్మూలించుకోవడానికి ఒక విధంగా పేదరికం కారణమయితే, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల వల్ల గర్భం దాల్చడం ఇంకో కారణం. ప్రేమ పేరుతో లైంగికంగా మోసపోయిన యువతులు, ఆడపిల్ల అంటే అత్తింటి వారు చులకనగా చూస్తారేమో అనే భావన. చివరకు కారణం ఏదైనా జరిగేది మాత్రం ఆడపిల్లల భ్రూణ హత్యలనేవి మాత్రం జగమెరిగిన వాస్తవం. గతంలో ఆడపిల్ల పుట్టగానే చంపెయ్యటానికి ఎన్నో మొరటు పద్ధతులు అవలంబించేవారు. అందులో వడ్లగింజ వేసి చంపడం ఒకటి. వైద్యరంగం అభివృద్ధి చెందాక గర్భంలో ఉండగానే ఆడపిండాలను బయటకు పేల్చిపారేసే సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ధనికులు ఆధునిక పద్ధతులు ఉపయోగిస్తుండగా, అల్ట్రాసోనోగ్రఫి అనే వైద్య విధానం చిన్న చిన్న పట్టణాలు, పల్లెల్లో సాధారణ ప్రజలకి అందుబాలోకి వచ్చేసింది. ఈ విధంగా జరిగిన భ్రూణహత్యలు ఎన్నో ఉన్నాయి. దేశంలో, రాష్ట్రాల్లోను, వైద్యులకు కూడా కొంత వరకు లాభసాటి వ్యాపారంగా మారింది.

భారత దేశ సాంప్రదాయంలో స్త్రీలను శక్తి స్వరూపిణులుగా కూడా పూజించడం జరుగుతుంది. అయినా నేటికీ స్త్రీల పట్ల చిన్నచూపు, విముఖత. వారు సమాజంలో ద్వితీయ శ్రేణి పౌరులే. ఆఖరికి ఆడపిల్ల వద్దు అనుకుంటున్న పురుషునికి జన్మనిచ్చిన ఓ తల్లి కూడా ఆడదే. అయినా కూడా సమాజంలో స్త్రీకి దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు. భ్రూణ హత్యలు ఆగడం లేదు.

భ్రూణహత్యల నివారణ

1) దయాగ్నస్టిక్, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి వైద్య పద్ధతులను కఠినతర్వం చేయాలి. భ్రూణ హత్యలకు పాల్పడిన వైద్యులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రుల గుర్తింపును రద్దు చేయాలి.
2) సమాజంలో ఆడపిల్లల పట్ల అవగాహన పెంపొందించాలి. రాజ్యం, ప్రభుత్వం ఆడపిల్లల భద్రతకు, విద్యా, ఆరోగ్య విషయంలో, వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవడానికి అన్ని విధాలుగా ముందుకు రావాలి.
3) భ్రూణ హత్యల నివారణకు ప్రభుత్వం చేసిన చట్టాలు అమలు చేస్తే తప్ప వాటంతట అవే ఎటువంటి మార్పులు తీసుకురావు. అలా కాని పక్షంలో చట్టాలు, ఇంకా చట్టాలు, వాటికి సవరణలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి అసలు సమస్య పరిష్కారం కాకపోగా, లా విద్యార్థులు చదువుకోవడానికి మాత్రమే పనికి వస్తాయి. ఇవి కొంత మందికి వృత్తిగా మారవచ్చు (వైద్యులు). లాయర్లు వాదించడానికి కొన్ని అంశాలు జరగవచ్చు. న్యాయం చేస్తామని పాలక పక్షాలు ఫోజులు కొట్టడానికి ఉపయోగపడవచ్చు.
4) చట్టాలలోని లొసుగులు, వాటిని అమలు చేయాలనే చిత్తశుద్ధి లేకపోవడం, నేరస్తులతో కుమ్మక్కు కావడం వంటివి అసలు ప్రయోజనాన్ని నీరుగారుస్తాయి.

కాబట్టి ఏది ఏమైనా మహిళలపై హింసకు వ్యతిరేకంగా సాగే సుదీర్ఘ పోరాటంలో ప్రతి ఒక్క ఆయుధాన్ని ఉపయోగించుకోక తప్పదు. సానుకూలమైన చట్టాలు ఉంటేనే మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఏవిధంగానైనా వీటిని అమలు చేసేలా చూడడానికి చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యం. దేశాభివృద్ధికి తోడ్పడడంలో మహిళలకు భాగస్వామ్యం ఉంటే ఆ దేశం పురోగమిస్తుంది. కాబట్టి భ్రూణహత్యల నివారణ ఎంతో ఆవశ్యకతను కలిగి ఉన్న ప్రస్తుత అనివార్య అంశం.

(రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర పరిశోధక విద్యార్థిని, అర్థశాస్త్ర పరిశోధక విద్యార్థిని) వీ

'శ్రమ శక్తి' ఉపయోగపు విలువ గురించి

***జీతాల శ్రామికులకూ పెట్టుబడిదారులకూ ఉండే సంబంధం అమ్మే - కొనే సంబంధం అనడంలో మార్క్స్ పొరపాటు పడ్డాడని అంటున్నారు* రంగనాయకమ్మ**

(గత సంచిక తరువాయి)

'శ్రమ శక్తి విలువ' విషయం

'శ్రమ శక్తి విలువ' గురించి మార్క్స్ చెప్పిన మాటలు చాలా వివరాలతో జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. మొదట మార్క్స్ మాటలు:

- 'సమాన విలువకూ, సమాన విలువకూ మారకం జరిగింది. పెట్టుబడిదారుడు, తను కొన్న ప్రతి సరుకుకీ – దూదికీ, కదురుకీ, శ్రమ శక్తికీ – దాని పూర్తి విలువని చెల్లించాడు' ('విశాలాంధ్ర' వారి అనువాదం, పే. 177).

ఒక పెట్టుబడిదారుడు ఏ ఉత్పత్తి సాధనాన్ని కొనాలన్నా, ఇతర పెట్టుబడిదారుల నించి కొనాలి. ఆ వస్తువులకు పూర్తి విలువలు చెల్లించవలిసిందే. (కానీ, ఉత్పత్తి సాధనాల కోసం పెట్టే డబ్బు కూడా పెట్టుబడిదారుడి స్వంత శ్రమతో వచ్చే డబ్బు కాదు. పాత ఉత్పత్తి సాధనాల మీద పెట్టిన డబ్బు, దోపిడీ డబ్బే. ఆ ఉత్పత్తి సాధనాలు ఖర్చయిన ప్రతీ సారీ ఆ డబ్బే వెనక్కి వచ్చేస్తూ ఉంటుంది. కొత్త ఉత్పత్తి సాధనాలు, కొత్త అదనపు విలువ ద్వారా పెరుగుతూ ఉంటాయి. పాతా – కొత్తా ఉత్పత్తి సాధనాల ఏ డబ్బూ, పెట్టుబడిదారుడి స్వంత శ్రమ కాదు.)

దూదికీ, కదురుకీ, పూర్తి విలువలు చెల్లించినట్టుగానే పెట్టుబడి దారుడు, శ్రామికుడి శ్రమ శక్తికి కూడా పూర్తి విలువ చెల్లిస్తాడని మార్క్స్ చెపుతున్నాడు. 'శ్రామికుడి అవసరాలన్నీ తీర్చేదే శ్రమ శక్తి విలువ' అనుకుంటే, పెట్టుబడిదారుడు అలాంటి జీతం ఇవ్వడం ఎన్నడూ జరగదని మార్క్స్‌కి తెలియదని కాదు. అయినా, పెట్టుబడిదారుడు పూర్తి శ్రమ శక్తి విలువని (మంచి జీతం) ఇస్తాడని మార్క్స్ ఎందుకు చెపుతున్నాడంటే, శ్రామికుడి 'శ్రమ విలువ' 2 భాగాలుగా ఉంటుందని రుజువు చెయ్యడానికి. పని దినం అంతా జరిగే శ్రమ, ఎంత ఎక్కువ విలువని ఉత్పత్తి చేస్తుందంటే, అందులో నించి శ్రామికుడికి 'పూర్తి శ్రమ శక్తి విలువ'ని ఇచ్చినా, ఆ పైన అదనపు విలువ కూడా ఉంటుందని చూపించగలం. పెట్టుబడిదారుడు, మంచి జీతం ఇవ్వకపోతే, అప్పుడు అదనపు విలువ భాగం ఇంకా పెరుగుతుంది. పెట్టుబడిదారుడు ఎంత పెద్ద జీతం ఇచ్చినా, ఆ జీతం మీదే 'లాభం' పేరుతో అదనాన్ని కలిపి ధరని నిర్ణయిస్తాడు. అలా కలిపిన మొత్తం విలువ అంతా సరుకు ద్వారా రావడానికి కారణం, పెట్టుబడిదారుడు లాభాన్ని కలపడం వల్ల కాదు. అది పైకి కనపడే కారణం. అసలు కారణం సరుకు తయారీలో, శ్రమ శక్తి విలువనీ – అదనాన్నీ కూడా ఇచ్చేటంత ఎక్కువ శ్రమ శ్రామికుడి ద్వారా జరిగి ఉండడమే. అందుకే, శ్రమ విలువలో నించి శ్రమ శక్తి విలువని తగినంత తీసినా, ఇంకా అదనపు విలువ మిగిలి, అది పెట్టుబడిదారుడికి అందుతుంది.

తర్వాత విషయం: 'శ్రమ శక్తి విలువ'కి సరైన హద్దు ఏమిటి? 'శ్రమ విలువ'ని లెక్క కట్టినట్టుగా, 'శ్రమ శక్తి విలువ'ని లెక్క కట్టడం కుదురుతుందా? ఏ సరుకు విషయంలో అయినా, శ్రమ విలువని లెక్క కట్టడం చాలా తేలిక. సరుకుని అమ్మితే 10 డబ్బు వచ్చిందనుకుందాం. ఆ సరుకుకి అంత విలువ ఉండడం వల్లే అంత డబ్బు వచ్చిందని అర్థం. ఆ సరుకు కోసం ఖర్చయిన ఉత్పత్తి సాధనాల విలువని 3 అనుకుందాం. 10లో నించి 3ని తీసేస్తే, మిగిలిన 7 ఆ సరుకుని తయారుచేసిన మనిషి (మనుషుల) శ్రమ విలువ. ఈ రకంగా, ఒక సరుకుకి డబ్బుతో మారకం జరిగిన తర్వాత, ఆ సరుకుని తయారుచేసిన మనిషి శ్రమ విలువని కచ్చితంగా తెలుసుకోవచ్చు.

అయితే, 'శ్రమ శక్తి విలువ'ని తెలుసుకోవడం ఎలాగ? దానికి హద్దు ఏమిటి? – ఒక సరుకుని చేసినది స్వతంత్ర ఉత్పత్తిదారుడు అయితే, అతని శ్రమ విలువనంతా అతనే వాడుకుంటాడు. అది తక్కువైతే తక్కువనే వాడతాడు; ఎక్కువైతే ఎక్కువనే వాడతాడు. అది అతని వాడకానికే. అంటే, 'శ్రమ శక్తి విలువ'కి సహజమైన హద్దు, 'శ్రమ విలువే'. ఆ రెండూ ఒకటే. అసలు, స్వతంత్ర ఉత్పత్తిదారుల ద్వారా, అవసరాల్ని మించినంత అత్యధికంగా శ్రమ జరగదు. అవసరాల్ని బట్టే అది జరుగుతుంది. ఎంత ఎక్కువ శ్రమ చేసుకున్నా, దాని ద్వారా చిన్న ఆస్తిని కూడబెట్టుకున్నా, అది అంతా అవసరాల లెక్కలోకే చేరుతుంది. 'శ్రమ శక్తి విలువ'కి హద్దు ఏమిటి? – అనే ప్రశ్న అక్కడ రాదు. యజమాని లేని చోట, శ్రమ విలువే, శ్రమ శక్తి విలువ. రెంటికీ తేడా ఉండదు. శ్రమ శక్తి విలువకి వేరే లెక్క ఉండదు.

కానీ ఈ సహజత్వం, జీతాల శ్రామికుల విషయంలో నడవదు. ఒక శ్రామికుడి శ్రమ విలువ 7అనుకుందాం. అందులో నించి ఎంతో కొంత భాగమే అతనికి 'శ్రమ శక్తి విలువ'గా (జీతంగా) అందాలంటే, అది ఎంత ఉండాలి? దాని హద్దు ఏమిటి? – ఇక్కడే జీతాల లెక్కలు. ఈ జీతాల లెక్కలు లేకుండా, అతని శ్రమ విలువ 7 అంతా అతనికే అందితే, అదే అక్కడ శ్రమ శక్తి విలువ అవదా?

కానీ, ఇక్కడ ఇంకో విషయం. ఒక శ్రామికుడు, యజమాని ఆజ్ఞల కింద శ్రమ చేస్తూ, రోజూ 20 విలువని ఉత్పత్తి చేస్తాడనుకుందాం. అందులో నించి 8 వరకూ అతనికి అందితే, అతని అవసరాలన్నీ తీరుతూ సౌఖ్యంగానే ఉండగలడనుకుందాం. అలాంటప్పుడు, అతని శ్రమ విలువ అయిన 20 అంతా అతనికి అందినా దాన్ని అతను వాడలేడు. అందులో ఉన్న 8 విలువతో తప్ప, మిగతా 12 విలువతో అతనికి అవసరం ఉండదు. అంటే, దీని అర్థం ఏమిటి? ఆ మనిషికే యజమాని లేకపోతే, తన కోసం 8 వరకే పనిచేసి తర్వాత పని మానెయ్యొచ్చు. పని దినం పొడవు తగ్గిపోతుంది. యజమాని ఉండడం వల్ల ఏం జరుతుందంటే, తనకు అవసరం లేనంత అత్యధికమైన పని చెయ్యవలసి వస్తుంది. ఆ పని విలువ అయిన 20లో నించే, తన కోసం 8, యజమాని కోసం 12. లేదా, ఆ 20లో నించి శ్రామికుడికి జీతంగా 4 మాత్రమే అందితే, యజమానికి మిగిలేది 16.

శ్రామికుల గురించి మాట్లాడేటప్పుడు 'ఎవరి శ్రమ విలువ వాళ్లకే అందాలి' అనేది, ఆ సందర్భానికి తగిన న్యాయమైన సూత్రమే. కానీ, యజమానీ శ్రామిక సంబంధంలో పని దినం ఎన్ని గంటలతో ఉంటుందో, ఆ సంబంధం లేనప్పుడు కూడా పని దినం అలాగే ఉండనక్కరలేదు. రోజుకి 15 గంటలు పనిచేస్తూ, ఉత్పత్తిని పిచ్చిగా పెంచుకుని, దాన్నంతా వెర్రిగా వాడుకోనక్కరలేదు. వెర్రిగా వాడుకోవడం అంటే, భోజనాల బల్లని సాదా చెక్కతో చేసుకోవడం గాక బంగారంతో చేసుకుంటే, అది వెర్రి శ్రమా, వెర్రి ఉత్పత్తీ, వెర్రి వాడకమూ! అన్నీ కలిసి ఉన్మాద స్థితి!

ఎంత ఎక్కువగా అయినా శ్రమ చేసే శక్తి మన శరీరాలకు ఉంది కదా అని, సాదా ఉత్పత్తుల్ని వాడుకోవడాన్ని 100 రెట్ల విలువైన వస్తువుల వాడకంగా మార్చుకుంటే, దాని కోసం ప్రకృతిలో వనరులన్నీ ధ్వంసమై ఉన్మాద స్థితి, మృత్యు శయ్యని కూడా ఎక్కిస్తుంది.

చివరికి, 'శ్రమ శక్తి విలువ'కి సహజమైన హద్దు ఎలా ఉంటుందని తేలింది? శ్రమ శక్తి విలువ హద్దు, శ్రమ విలువని దాటిపోకుండా ఉండాలి గానీ, శ్రమ విలువలో ఒక భాగంగా, శ్రమ విలువ కన్నా తక్కువగా, ఉండడం కాదు. శ్రమ విలువే, శ్రమ శక్తి విలువ.

కానీ, పెట్టుబడిదారుడు నిర్ణయించే 'జీతం' అనేది, అలా ఎప్పుడూ ఉండదు. అది, శ్రమ విలువలో నించి అల్ప భాగమే. అందుకే ఆ పేరుని మనం కూడా 'జీతం' అనవచ్చు గానీ, ఆ తక్కువ విలువనే మనం 'శ్రమ శక్తి విలువ' అనడం ఎందుకు?

ఒక సరుకుకి డబ్బుతో మారకం జరిగిందంటే, అది 'సమాన విలువల మారకమే' అనేది, విలువ సూత్రం. జీతాన్నే సరైన శ్రమ శక్తి విలువ అనుకుంటే, ఒక రోజు శ్రమ శక్తికి 2 జీతం (కూలి) వచ్చిందంటే, ఆ శ్రమ శక్తికి నిజంగా ఉన్న విలువ అంతే అనీ, దాని విలువ 2 కాబట్టే దానికి అంతే డబ్బు వచ్చిందనీ, దానికి అంత కన్నా ఎక్కువ విలువ ఉండదనీ, ఆ జీతాన్ని తీసుకునే శ్రామికుడు కూడా ఒప్పుకోవలసి వస్తుంది.

'శ్రమ శక్తి'ని, 'సరుకు' అనడం పొరపాటు అయినట్టే; జీతాన్ని, శ్రమ శక్తి విలువ అనడం కూడా ఒక రకంగా పొరపాటే. జీతం, శ్రామికుడి అవసరాల్ని తీర్చే శ్రమ శక్తి విలువ కాదు. అలాంటప్పుడు జీతానికి, శ్రమ శక్తి విలువ అని పేరు పెట్టడం, కొన్ని విషయాల్ని చర్చించడం కోసం మాత్రమే జరగాలి. అంతేగానీ, జీతం అనేది, నిజంగా శ్రమ శక్తి విలువ కాదు. దానికి, అంత మంచి పేరు పెడితే, దాన్ని (జీతాన్ని) చాలా గౌరవించడమే అవుతుంది. 'జీతం' అనేది, దోపిడీ సంబంధమూ, దోపిడీ పేరూ. దానికి హేతుబద్ధమైన ఇంకో పేరు పెట్టాలంటే, జీతాన్ని జీతమే అనాలి. మార్క్స్‌కి జీతం పట్ల చాలా వ్యతిరేకత. శ్రామిక వర్గం తన జెండా మీద 'జీతం' అనే పేరు తీసివెయ్యాలంటాడు.

'శ్రమ శక్తి'కి ఉండే 'ఉపయోగపు విలువ'ని మళ్లీ ఒకసారి గుర్తు చేసుకోవాలి. – శ్రమ శక్తి, తన విలువ కన్నా (తను ఎంత ఖర్చు వల్ల నిలబడిందో, ఆ విలువ కన్నా), ఎక్కువ విలువ గల శ్రమ చెయ్యగలదు – అని. అంటే, శ్రమ శక్తి తన విలువ కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యగలదు. 2 పోషణలో తయారైన శ్రమ శక్తి, 7 వరకే కాదు, 10 వరకూ, 18 వరకూ కూడా చెయ్యగలదు. అది అలా చేసి తీరాలని కాదు. అవసరమైన పరిస్థితుల్లో అది అలా చెయ్యగలదు – అని.

శ్రామికుడికి, పెట్టుబడిదారుడితో ఉండే సంబంధం (ఏ యజమానితో ఉండే సంబంధం అయినా), తన శ్రమ శక్తిని అతి తక్కువ విలువతో (జీతంతో) నిలబెట్టుకుంటూ, పని స్థలంలో అతి ఎక్కువ విలువ ఉత్పత్తి చెయ్యవలసిన సంబంధమే. అందుకే, శ్రమ శక్తి, ఆ సంబంధంలో అలాగే చేస్తుంది.

శ్రమ శక్తిని పెట్టుబడిదారుడు కొంటే, శ్రమ శక్తి వల్ల ఎంత ఎక్కువ శ్రమ జరిగినా, ఆ శ్రమ ఎంత ఎక్కువ విలువగా మారినా, ఆ శ్రమకి ఎంత డబ్బు వచ్చినా, ఆ విషయాలతో ఆ సరుకుని అమ్మేసిన శ్రామికుడికి ఏం సంబంధం? పెట్టుబడిదారుడు అదనపు విలువని తీసుకుంటాడనీ, 'శ్రమ దోపిడీ' చేస్తాడనీ, ఎలా అనగలడు శ్రామికుడు? పెట్టుబడిదారుడితో ఎలా వాదించగలడు? శ్రామికుడి కన్నా, పెట్టుబడిదారుడే శ్రామికుడితో ధీమాగా వాదించగలడు.

వాళ్ల వాదనలు ఎలా సాగుతాయో చూడండి!

'చూడు అబ్బాయ్! నువ్వు మొన్న మీ యూనియన్ మీటింగ్‌లో ఏవేవేవిటో చాలా మాట్లాడావట! 'పెట్టుబడిదారుడు మన అదనపు విలువనంతా లాగుతాడు, మనల్ని దోస్తాడు' అని ఏదేదో చెప్పావట! అది నిజమో కాదో నీ నోటితోనే చెప్పు!'

'అంతా నిజమే. నేను అలాగే మాట్లాడాను.'

'అదంతా నువ్వు నమ్మే మాట్లాడావా? నా వల్ల జరిగే శ్రమ దోపిడీ ఏమిటో చెప్పు!'

'ఆ సంగతి మా శ్రామికుల్లో ప్రతి ఒక్కరికీ తెలుసు. నమ్మకుండా ఎలా మాట్లాడతాను? నువ్వు ఇచ్చే జీతం కన్నా, నేను చేసే శ్రమే ఎక్కువ. దానితో నువ్వు వంద రూపాయలు సంపాదిస్తావు. కానీ నాకు జీతంగా ఐదో పదో ఇస్తావు. మిగిలిందంతా నీకు! అది శ్రమ దోపిడీ కాదా?'

'చూడూ, నేను మార్క్స్‌ని చదివాను. నువ్వు కూడా చదివావా అసలు?'

'క్షుణ్ణంగా చదివాను. అంతా మార్క్స్ నించే నేర్చుకున్నాను.'

'మన సంబంధం ఏమిటి?'

'యజమానీ శ్రామిక సంబంధం. నువ్వు యజమానివీ, నేను శ్రామికుణ్ణీ.'

'కాదు, మనది సమానుల సంబంధం. అమ్మే–కొనే సంబంధం. నువ్వు అమ్మేవాడివీ, నేను కొనేవాడినీ.'

'మనం సమానులం అయితే, నువ్వు యజమానివీ, నేను పనివాడినీ, ఎందుకు అయ్యాము?'

'అయినా సమానులమే. అసలు నువ్వు ఏం సరుకు అమ్ముతున్నావో నీకు తెలుసా?'

'నువ్వు కొనేదేమిటో నీకు తెలిస్తే, నేను అమ్మేదేమిటో నాకు తెలీదా? నా 'శ్రమ శక్తి'ని అమ్ముతున్నాను.'

'బాగా చెప్పావు. నీ సరుకు విలువని నేను ఇచ్చేస్తున్నానా, ఎగ్గొడుతున్నానా?'

'ఎగ్గొట్టాలనే ఉంటుంది నీకు. కానీ ఎగ్గొడితే మర్నాడు పని వాడు దొరకడు కాబట్టి ఎగ్గొట్టకుండానే ఇస్తావులే.'

'నీ కివ్వాల్సింది ఎగ్గొట్టనని ఒప్పుకున్నావు, అది చాలు నాకు. నువ్వు అమ్మే సరుకు పేరు మళ్లీ చెప్పు!'

'వంద సార్లు చెపుతా. అది నా శ్రమ శక్తి. నా శ్రమ శక్తి.'

'దానికి విలువ ఉంటుందా? ఎంత?'

'ఇస్తున్నావుగా జీతం? అదే.'

'ఏం, 'జీతం' అంటే నిస్సారంగా ఉందా నీకు? జీతాన్ని మార్క్స్, 'శ్రమ శక్తి విలువ' అన్నాడు, చదివావా?'

'ఏ మాట ఏ సందర్భంలో అన్నాడో దాన్ని బట్టి ఉంటుంది అది. నువ్వు ఇచ్చేది శ్రమ శక్తి విలువే అయినా దాని పైన అదనపు విలువ ఉండి తీరుతుందని చూపించడానికే ఆ మాట అన్నాడు. నువ్విచ్చే జీతం శ్రామికుణ్ణి సేద తీరుస్తుందని మార్క్స్ అన్నాడని చెప్పకు!'

'గురువుని గొప్పగా గౌరవిస్తున్నావు. నేనిచ్చే జీతాన్ని అంత కన్నా తగ్గించి ఇస్తే ఒప్పుకుంటావా?'

'ఎందుకు ఒప్పుకోవాలి? నేను చేసే పనిని తగ్గించి చేస్తే నువ్వు ఒప్పుకుంటావా? ఏ సరుకుకైనా దాని విలువ దానికి ఉంటుంది. అది ఎంత అయితే అంతా ఇవ్వాలి.'

'అంటే, నేను ఇచ్చే జీతం, నీ శ్రమ శక్తి విలువే అని ఒప్పుకుంటావు. నీ సరుకు విలువని నీకు ఇచ్చేస్తున్నాను. తెలిసిందా?'

'సరేలే, బాగానే వాదిస్తున్నావు, చెప్పు! ఏమిటి ఇప్పుడు?'

'రాత్రి మార్క్సు పుస్తకం తిరగేశాను. నువ్వు యూనియన్ లీడరవి కదా? నీకో సంగతి చెప్పాలని పిలి పించాను. మన సంబంధాన్ని యజమానీ శ్రామిక సంబంధం అంటావెందుకు? నువ్వు అమ్ముతున్నావు, నేను కొంటున్నాను. మన సంబంధం అమ్మే-కొనే సమానుల సంబంధం. అది తెలుసుకో ముందు.'

'కాదు, నేను అమ్మేదీ, నువ్వు కొనేదీ, నా శ్రమ శక్తి వరకే. నేను నా మొత్తం శ్రమనంతా నీకు అమ్మడం లేదు. నా మొత్తం శ్రమలో నించే నువ్వు నా అదనపు విలువని లాగుతున్నావు. నా శ్రమ శక్తికే ఎంతో కొంత చెల్లిస్తున్నావు గానీ, నా శ్రమకంతటికీ చెల్లిస్తున్నావా? ఇలాంటి సంబంధం సమానుల సంబంధం ఎలా అవుతుంది?'

'సరే, నేను మళ్లీ నా మొదటి ప్రశ్నే అడుగుతాను. నువ్వు అమ్మే సరుకు ఏమిటి?'

'నేనూ నా మొదటి జవాబే చెపుతాను. నేను అమ్మే సరుకు నా 'శ్రమ శక్తి'.'

'దాని విలువ చెల్లిస్తున్నానా?'

'చెల్లిస్తున్నావులే. చెల్లించకుండానే సరుకుని అమ్ముకునే పిచ్చివాడినా నేను?'

'నువ్వేం పిచ్చివాడివి? చాలా తెలివైనవాడివే. అందుకే నిన్ను పిల్చాను. సరే, నువ్వు అమ్మే శ్రమ శక్తికి 'ఉపయోగపు విలువ' ఏమిటో చెప్పు! 'మారకం విలువ'ని కాదు, 'ఉపయోగపు విలువ'ని చెప్పు?'

'అన్ని విలువలూ తెలుసే నీకు! నా శ్రమ శక్తితోనే నేను బోలెడు గంటలు పనిచేస్తాను. నువ్వు ఇచ్చే జీతం విలువ కన్నా నా శ్రమ విలువే ఎంతో ఎక్కువ. ఏ శ్రామికుడి శ్రమ శక్తి అయినా, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చేస్తుంది.'

'తక్కువ విలువ, ఎక్కువ విలువని ఎలా ఇవ్వగలుగుతుందంటావు?'

' 'తక్కువ విలువ' అని నేను అనేది, నువ్వు ఇచ్చే జీతం గురించి. 'జీతం' అంటే, కొన్ని పోషణ ఉత్పత్తులు. ఆ ఉత్పత్తులే వచ్చి పని స్థలంలో పనిచెయ్యవు. శ్రామికుడు వచ్చి ఎక్కువ గంటలు పనిచేస్తాడు. పోషణకు శ్రామికుడు వాడే విలువ కన్నా అతను ఇచ్చే విలువ ఎక్కువగా ఉంటుంది. అందుకే నువ్వు అదనపు విలువని లాగ గలుగుతావు.'

'నా పెట్టుబడి మీద లాభం వేసుకుంటాను కాబట్టి, పెట్టుబడికి లాభం వస్తుంది. దాన్ని 'అదనపు విలువ' అంటావెందుకు?'

"లాభాలు వేసుకునే' నీ పని ప్రతీ పెట్టుబడిదారుడూ చేస్తాడు. నువ్వు అమ్మే సరుకు ఎలాంటిదో, నువ్వు కొనే ఉత్పత్తి సాధనాలూ అలాంటివే. లాభంతో కలిసిందే సరుకుకి 'అసలు విలువ'. అది ఏర్పడేది నువ్వు లాభం వేసుకోవడం వల్ల కాదు. మా శ్రమ, అంత జరిగి ఉండడం వల్ల!'

'అబ్బా, చాలా గట్టిగా చదివావు మార్క్సుని. శ్రమ శక్తికి ఉండే ఉపయోగపు విలువ, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చేస్తుంది – అంటావు. అంతేనా? ఆ మాట మళ్లీ చెప్పు!'

'అంతే, పూర్తిగా అంతే. నువ్వూ బాగానే చదివినట్టున్నావు మార్క్సుని. 'అదనపు విలువ' ఎక్కడా కనపడలేదా?'

'కనపడింది. అదే చెప్తా. నీ అంత బాగా కాదు గానీ, నేనూ చదివాను బాగానే. అయితే ఒక్కటి చెప్పు! నువ్వు ఒక చొక్కా కొనుక్కున్నావు. దాని ఉపయోగపు విలువ నీదా, చొక్కాని అమ్మినవాడిదా? ఆ చొక్కాని నువ్వు తొడుక్కుంటావా, అమ్మినవాడు తొడుక్కుంటాడా?'

'నేను కొన్న వస్తువుని నేను వాడతానా, అమ్మినవాడు వాడతాడా? ఎందుకీ పరీక్షలు?'

'భలే చెప్పావు. మరి, 'శ్రమ శక్తి' సంగతి ఏమిటి? దాన్ని నువ్వు అమ్మావు. నేను కొన్నాను. నేను కొన్న సరుకు ఇచ్చే ఉపయోగం, నాది అవుతుందా, నీది అవుతుందా?'

'..............................'

'తొందర లేదులే, కంగారు పడకు. ఆలోచించి చెప్పు! ఏ సరుకుని అయినా కొన్న వాళ్లు వాడుకుంటారా, అమ్మిన వాళ్లు వాడుకుంటారా? శ్రమ శక్తి ద్వారా ఎక్కువ విలువ నాకు దొరికితే, అందులో నా తప్పేముంటుంది?'

'..............................'

'తొందర లేదులే, ఆలోచించి చెప్పు!'

'లేదు, ఆలోచించేదేం లేదు. ఎవరైనా కొన్నవి, నిర్జీవ వస్తువులు అయితే, ఆ వస్తువుల ఉపయోగాలన్నీ కొన్న వాళ్లవే. కానీ శ్రమ శక్తి అనేది ఒక 'వస్తువా'? ఇది ఒక మానవదేహంలో విషయం. వస్తువూ, మనిషీ, ఒకటి కాదు.'

'అలాగైతే, మానవ దేహాన్ని 'సరుకు' అని ఎందుకు అన్నావు?'

"సరుకు' అన్నది దేహాన్ని కాదు, శ్రమ చేసే శక్తిని.'

'ఆ శక్తి, దేహంలో గాక ఎక్కడ ఉంటుంది? పోషణ జరగాల్సింది దేహానికి కాదా? దేహంతో సంబంధం లేకుండా శక్తినే విడిగా పోషిస్తావా?'

'.............................'

'ఆలోచించు, నిదానంగా.'

'.........................'

' 'సరుకు' అంటే వస్తువే కాదు; 'అమ్మకం' దేని మీద జరిగినా అది సరుకే. మార్క్సునేం చదివావు? బండి తోలడం, చదువు చెప్పడం, వస్తువులు కాకపోయినా, అవి సరుకులవుతాయా లేదా? ఆవుల్నీ గేదెల్నీ అమ్మితే అవీ సరుకులే. అలాగే శ్రమ శక్తి, 'సరుకు' ఎందుకు అవదు? దాన్ని నువ్వు నాకు అమ్మావు, నేను కొన్నాను. దాని విలువని చెల్లించేశాను. నేను కొన్న సరుకు ఉపయోగపు విలువ నాదే. దాని వల్ల ఎంత ఎక్కువ విలువ దొరికినా అది నాదే. ఇదంతా మార్క్సు చెప్పలేదా? చూడూ, ఇక నించీ నువ్వు ఎప్పుడూ 'శ్రమ దోపిడీ' అనే మాట ఎత్తకు! మీ యూనియన్‌లో అలాంటి అజ్ఞానపు ఉపన్యాసాలివ్వకు! ఈ సంగతి చెప్పాలనే నిన్ను పిలిపించాను. తొందరేం లేదు, బాగా ఆలోచించుకో!'

'లేదు, లేదు, ఇంకా ఆలోచించేదేమీ లేదు. ఒక్క క్షణం కూడా ఆలోచించేది లేదు. నా ఆలోచన ముగిసింది. 'శ్రమ శక్తి' అనేది, 'సరుకు' కాదు. అది అలా కనపడుతుంది, అంతే. దాన్ని నేను అమ్ముతున్నాననీ, నువ్వు కొంటున్నావనీ, ఇన్నాళ్లూ అలా అనుకున్నాను. అమ్మే-కొనే వాళ్లు సమానులు. మనం అమ్మే-కొనే వాళ్లం అయితే, సమానులుగా ఉన్నామా? లేమని తెలుసు. అయినా, నేను అమ్ముతున్నాననీ, నువ్వు కొంటున్నావనీ, ఆ భ్రమల్లోనే ఉన్నాను. అది పెద్ద పొరపాటు. నీ వల్ల జరిగేది శ్రమ దోపిడీ కాదని నువ్వు వాదించడానికి నా పొరపాటు నీకు ఎంత సాయపడిందో, నీకు ఎంత ధైర్యం ఇచ్చిందో, నాకు ఇప్పుడు తెలుస్తోంది. నా శ్రమ శక్తిని నువ్వు కొంటున్నావా? ఏం పెట్టి?'

'ఏం పెట్టా? నా డబ్బు పెట్టి.'

'నీ డబ్బు పెట్టా? డబ్బు నీదా? ఏ శ్రమ చేసి డబ్బు సంపాదిస్తున్నావు? నా శ్రమని అమ్మి, నా డబ్బులో నించి ఒక్క పైసా నాకు పడేస్తావు. మిగతా

డబ్బు రాసి నీ పరం! ఇప్పటికైనా కళ్లు తెరిచాను. నా శ్రమ శక్తిని కొంటున్నానని విర్రవీగకు! అది సరుకు కాదు.'

'నీ గురువేం చెప్పాడు? గురువు మాట నీకు లెక్క లేదా?'

'లెక్క ఉంది, చాలా లెక్క ఉంది. గురువు పొరపాటుని గురువు ముందు పెట్టేటంత వివేకం ఉంది నాకు.'

'నువ్వు నీ మాట మార్చుకుంటే, నీ గురువు కూడా తన సిద్ధాంతం మార్చుకుంటాడా?'

'సిద్ధాంతం ఎందుకు మార్చాలి? ఎక్కడైనా ఒక ఆలోచనలో పొరపాటు జరిగితే దాన్నే మార్చాలి. పొరపాటు జరిగితే, మార్క్స్ ఎందుకు మార్చుకోడు? తప్పకుండా మార్చుకుంటాడు? ఎంత తెలివిలో అయినా పొరపాట్లు జరగవచ్చు.'

'అంటే, మార్క్స్ కూడా పొరపాటు చేశాడంటావా?'

'అనక తప్పదు. శ్రమ దోపిడీయే లేదని దోపిడీదారుడు విర్రవీగుతోంటే నోరెత్తలేని స్థితిలో శ్రామికుడు పడిపోయాడంటే కారణం, నా గురువు పొరపాటే.'

'నీ గురువు చేసిన తప్పు ఇది కాదు; అసలైన తప్పు, కార్మిక వర్గ నియంతృత్వం బోధన. అసలు మార్చాల్సింది అదీ.'

'కార్మిక వర్గ నియంతృత్వం నూటికి వెయ్యి పాళ్లు ఉత్తమ సూత్రం. ఆ సూత్రమే లేకపోతే, ఈ పెట్టుబడి బందిఖానా నించి ఎలా విముక్తి మాకు? నీ ఉత్పత్తి సాధనాల కుప్పని మార్క్స్ ఏమన్నాడో తెలుసా? 'డెడ్ లేబర్' అన్నాడు. చచ్చిన శ్రమ, సజీవ శ్రమ మీద అథార్టీ చేస్తోందన్నాడు. నీ ఆస్తుల మత్తుతో కొండల్నీ కోనల్నీ అడవుల్నీ సముద్రాల్నీ, మొత్తం భూఖండాన్నంతా ఆక్రమించి ఉన్నావు. కార్మిక వర్గ నియంతృత్వమే మా ఆయుధంగా లేకపోతే, నీ కబంధ హస్తాల నించి భూఖండాన్ని విడిపించేదెలాగ? మీ సోమరి దండుని మా సరసన యంత్రాల ముందు నిలబట్టేదెలాగ? మా రక్షణ కవచం మా నియంతృత్వమే.'

'ఎందుకంత ఆవేశపడిపోతున్నావు? నీతో ఎంత సహనంగా మాట్లాడుతున్నానో గ్రహించలేవా? నేను ఎంత కష్టపడి ఈ కంపెనీని నడుపుతున్నానో నువ్వు చూడడంలేదా? ఇంత పెట్టుబడి పెట్టి....'

'ఈ మాట శ్రామికుల ముందెప్పుడూ అనకు. నవ్వులపాలవుతావు. నీ పెట్టుబడి రహస్యాలు మాకు తెలియనివి కావు. నీ పాత పెట్టుబడి అంతా వెనకటి శ్రామిక తరాల అదనపు విలువ. ఏటా పెరిగే కొత్త పెట్టుబడి, ఈ నాటి శ్రామిక వర్గం నించి ఏటా లాగే అదనపు విలువ. రోజంతా తాగుడూ తిరుగుడూ తప్ప ఇక్కడి పుల్ల తీసి అక్కడ పెట్టే పని చెయ్యని నీకు స్వంత డబ్బా? స్వంత ఆస్తా? పెట్టుబడి నీదా?'

'అయ్యయ్యో, ఎందుకంత ఆవేశపడి పోతావోయ్? నిన్నసలు ఎందుకు పిలిచానో తెలుసా? మార్క్స్ చేసిన అసలు పొరపాటు శ్రమ శక్తిని సరుకు అనడం కాదు! శాంతంగా ఆలోచించు! 'శ్రమ దోపిడీ, శ్రమ దోపిడీ' అనడమే పెద్ద పొరపాటు. కావాలంటే, జీతాలు పెంచమని అడగాలి గానీ, ...'

'జీతాలు పెంచితే, నీ అదనపు విలువ తగ్గుతుంది. మంచం పడతావు.'

'ఇదుగో చూడూ, మై డియర్ బోయ్! నువ్వంటే నాకు చాలా ఇష్టం! ఐ లవ్ యూ వెరీ మచ్!'

'ఏమిటిది! ఇంత అవమానం నాకు! నేనేం తప్పు చేశాను?'

'మై బోయ్! నా మాట విను! మార్క్స్ చేసింది పొరపాటు కాదు. ఆయన తెలివైనవాడు. శ్రమ శక్తి, సరుకే. దాన్ని నువ్వు అమ్మావు, నేను కొన్నాను. దాని ఉపయోగం నాదే! అది అర్థం చేసుకో! యూనియన్‌లో అదే బోధించు!'

'మార్క్స్, 'శ్రమ దోపిడీ' సంగతి కూడా చెప్పాడే. యూనియన్‌లో అదెప్పుడు చెప్పాలి?'

'వొద్దు, అది పెద్ద తప్పు. దాన్ని వదిలెయ్యి! శ్రమ శక్తి ఉపయోగం అంతా దాన్ని కొన్నవాడిదే అని మార్క్సే చెప్పాడా లేదా? యూనియన్‌లో అదే బోధించు! నెమ్మదిగా ఆలోచించు, తొందరపడకు.'

'ఒక ఉద్యమకారుడు ఎంత చిన్న పొరపాటు చేసినా అది శత్రువుకే ఉపయోగపడుతుందని ఇప్పుడే నాకు బాగా అర్థమైంది. నా శ్రమని దోచే మనిషి, నాతో ఇంత ధైర్యంగా ఎందుకు మాట్లాడగలుగుతున్నాడు? నా తప్పు వల్ల!'

'కాదు, నీది తప్పు కాదు. చీటికీ మాటికీ నీ శ్రమ దగ్గిరికి వెళ్లకు. నీ శ్రమ శక్తి గురించే మాట్లాడు. దాన్ని నువ్వు అమ్మావా లేదా? అమ్మావు. దాన్ని నేను కొన్నానా లేదా? కొన్నాను. మరి దాని ఉపయోగపు విలువ నాదే అవుతుంది గానీ, నీది అవుతుందా? అది ఆలోచించవేం?'

'నా ఆలోచన ఎప్పుడో ముగిసిందని చెప్పేశాను. రోజూ మన మధ్య జరిగే విషయాలు, అమ్మ దాలూ – కొనడాలూ కావు. నాకు స్వతంత్రంగా బతికే అవకాశం లేక, గతి లేక, నీ దగ్గిరికి వచ్చాను. మార్క్స్ ఏమన్నాడు? 'ఉంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల విధానం అయినా ఉండాలి, లేకపోతే సోషలిజం అయినా ఉండాలి' అన్నాడు గానీ, ఆయన లక్ష్యం సోషలిజమే. ఆ రెంటిలోనూ శ్రమ దోపిడీ ఉండదని అలా అన్నాడు. కానీ, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా ఎవరి సరుకుని వాళ్లు అమ్ముకోవాలి. వాళ్ల మధ్య కూడా పోటీలూ, ద్వేషాలూ, అన్నీ సాగుతాయి. మనుషులు ఆ పరిస్థితుల్లో బతకడం నాకు ఇష్టం లేదు. సోషలిజమే నా లక్ష్యం. అది కమ్యూనిజంగా ఎదుగుతుంది. దాని కోసం పని చేస్తూ బతకాలి నేను. నువ్వు శ్రామికులకు ఇచ్చే జీతాల్ని ఎంత పెంచినా, నీ లాభాన్ని వదులుకునేంతగా పెంచుతావా? నీ జీతాలతో బతికేవాళ్లు ఎలా బతుకుతున్నారో ఎప్పుడైనా చూశావా? ఎవరికైనా నాలుగు గదుల ఇల్లు ఉందా? పరిశుభ్రమైన తిండీ నీళ్లూ ఉన్నాయా? పిల్లలకి చదువులు ఉన్నాయా? వృద్ధులకైనా విశ్రాంతులు ఉన్నాయా? మీ జీవితాలకీ మా జీవితాలకీ పోలిక ఉందా అసలు?'

'..........................'

'శ్రమ దోపిడీ లేదంటావు; యజమానీ శ్రామికులు సమానులంటావు. సరిగా ఆలోచించు! తొందర లేదు.'

'..........................'

'నీకు చెప్పి మాకేం ప్రయోజనం? మేం చేసుకోవలిసింది, మేం చేసుకోవాలి. 'శ్రమ శక్తి' ఇచ్చే విలువ, మాకు అందే జీతం విలువా, ప్లస్ అదనపు విలువా. ఆ విలువ అంతా మాదే. అది మా డబ్బే. నీకూ మాకూ మారకం అనేది ఒక నాటకం. మా విలువలో నీకు ఏ మాత్రమూ అందకపోతే, శ్రమ శక్తి ఉపయోగపు విలువ అంతా మాకు అందినట్టే. అది ఇప్పుడు కాదు, ఎప్పటికో జరుగుతుంది భవిష్యత్తులో. సోషలిజంలో.'

'చూడూ, మై బోయ్! నువ్వు చాలా తెలివైనవాడివి, చురుకైనవాడివి. కష్టపడి పని చేస్తావు. ఐదేళ్ల నించీ ఇక్కడ పని చేస్తున్నావు. మీ పని వాళ్లందరితో సమ్మెలు కూడా చేయించావు. అయినా నేను నిన్ను పనిలోనించి తీసెయ్యలేదు. నీ మీద నాకు చాలా గురి ఉంది. నువ్వు నాతో కలిస్తే ఈ కంపెనీని పదింతలు పెంచగలం. నిన్ను నీ సెక్షన్‌కి మేనేజర్ని చేస్తాను. నీ జీతం పది రెట్లు పెంచుతాను. నీ కుటుంబం వెంటనే మంచి అపార్టుమెంట్‌కి మారే ఏర్పాటు చేస్తాను. నీ భవిష్యత్తు నువ్వు చూసుకోక ఎందుకు అనవసరంగా సోషలిజం అంటావు? కమ్యూనిజం అంటావు? నీ లాంటి వాళ్లందరూ ఎన్నెన్నో త్యాగాలు చేస్తారు, సర్వ నాశనం అవుతారు. లెనిన్‌ని మీరంతా గొప్ప లీడర్ అంటారు. అక్కడైనా ఆ సోషలిజం నిలబడిందా? ఎంతో తెలివైనవాడివి, అంత పిచ్చిలో ఎందుకు ఉంటావు?

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన-17

భూమికీ, మనిషికీ సంబంధాన్ని నిర్దేశించే రెవెన్యూ పాలన ప్రారంభం, పూర్వాపరాల చరిత్రను వివరిస్తున్నారు

ఎస్. సరళా వందనం

(గత సంచిక తరువాయి...)

మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర రాష్ట్ర భాగంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1949 సెప్టెంబర్ 17 నుంచి జమిందారీ రద్దు చట్టం, ఎస్టేట్ భూముల(రద్దు, రైత్వారీకి మార్పు) చట్టాలు అమల్లోకి వచ్చినట్టుగానే, 1948 సెప్టెంబర్ 13న నిజాంను ఓడించిన దరిమిలా హైదరాబాదు దక్కన్ భూభాగాన్ని భారతదేశంతో కలిపిన తరువాత, హైదరాబాద్ రాష్ట్ర భూభాగంలో ఉన్న జాగీర్దారుల పరిపాలనా వ్యవస్థను 1949 సెప్టెంబర్ 14న రద్దు చేశారు. జాగీర్దారుల రద్దు చట్టంలో పాటు లక్షల ఎకరాలలో సాగు చేసుకుంటున్న కౌటుదారులకు భూమి దక్కడానికిగాను 'కౌలుదారులు, వ్యవసాయ భూపరిమితి చట్టం' 1950 జూన్ 10 నుంచి అమలులోకి వచ్చింది. నిజాం స్వంత ఖర్చుల కోసం ఉంచుకున్న సర్ఫ్-ఇ-ఖాస్ భూములను 1949 ఫిబ్రవరి 5న స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ చట్టాలు రావడానికి వెనుక గల కారణాలకు శతాబ్దాల తరబడి ప్రజలు రాచరిక వ్యవస్థ ద్వారా పడుతున్న శ్రమలు, వాటిని తొలగించడానికి ప్రజామోదం పొందిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు రావడానికి గల నేపథ్యం ఇలా ఉంది.

హైదరాబాద్ రాష్ట్రంలో సాగులో ఉన్న భూమి సుమారు ఐదు కోట్ల మూప్పై లక్షల ఎకరాలుగా ఉంది. ఇందులో జాగీర్దార్లు 1922 సంవత్సరానికి 1167 మంది ఉంటే 1949 నాటికి వీరు 1500కు పెరిగారు. వీరి ఆధీనంలోని భూమి 6535 గ్రామాల్లో పూర్తి విస్తీర్ణంలో 40000 చదరపు మైళ్లకు వ్యాపించి ఉండి, సుమారు ఒక కోటి యాభై లక్షల ఎకరాలు వీరి స్వంత పరిపాలన కింద ఉంది. దివాని/ఖల్సా/ రైత్వారీ భూముల ద్వారా ప్రభుత్వానికి ప్రత్యక్ష పన్నుగా, భూమి శిస్తు రూపంలో, ఇతర రూపంలో అందేవి సుమారుగా మూడు కోట్ల ఎకరాలు ఉంటే అందులో స్థానికంగా లేని భూస్వాముల (ఆబ్‌సెంటీ లాండ్ లార్డ్స్)కు 1891లో ఒక లక్ష ఎకరాలు. 1875 నుంచి చేస్తున్న క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ ద్వారా 1921 సంవత్సరానికిగాను వీరి హక్కుల కింద ఉన్న భూమి 7.6 లక్షలకు పెరిగింది. ఇవి కాకుండా సర్ఫ్-ఇ-ఖాస్ భూములు 5682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1374 గ్రామాల్లో ఉన్నాయి. పై మూడు రకాల భూములతో పాటుగా సంస్థానాల ఆధీనంలోని 497 గ్రామాలు 5030 చదరపు మైళ్ల విస్తీర్ణం వ్యాపించి ఉన్నాయి. పై నాలుగు రకాల భూములలో హైదరాబాద్ రాష్ట్రం మొత్తం ఇనాందారుల సంఖ్య 82000 ఉండగా, ఇందులో 52000 మంది దివాని ప్రాంతంలో, 26000 మంది జాగీర్దార్ల ఆధీనంలోని భూమిలో ఇతర ప్రాంతాలలో ఉన్నారు. ఈ ఇనాందారుల ఆధీనంలో సుమారు 8 లక్షల ఎకరాల భూమి ఉంది. ఈ భూములను ఎక్కువగా జాగీర్దార్ల వద్ద, రాజాల వద్ద, దేశ్‌ముఖ్‌ల వద్ద, ప్రభుత్వ ఉన్నత అధికారుల వద్ద, దేవాలయాలలో, దర్గాలలో సేవలందించే వారి వారి జీవనానికి ఇచ్చినవే ఎక్కువగా ఉన్నాయి. ఇలా భూకేంద్రీకరణ, భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, అప్పటి రాచరిక ప్రభుత్వాల వేధింపులలోనే రైతు ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాలు జరిగి సామాన్య ప్రజల మేలు కోసం, ప్రభుత్వం ఈ చట్టాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూభాగంలో కౌలుదారీ చట్టాలు

వ్యవసాయ సంస్కరణల కమిటీ సూచనలు, సిఫారసులననుసరించి హైదరాబాద్ రాష్ట్ర కౌలు, వ్యవసాయ భూపరిమితి చట్టం 1950 జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా కౌలుదారులకు రక్షణ, కౌలు పరిమాణ నిర్ణయం, యాజమాన్య హక్కులు పొందే అవకాశం వచ్చింది. ఈ చట్ట పరిధి నుంచి వివిధ ఛారిటబుల్, మత సంబంధమైన ఇనాం భూములకు మినహాయింపు నిచ్చారు. ఈ చట్టంలోని ముఖ్యాంశాలు.

- 1342 ఫసలీ (1933 సంవత్సరం) నుంచి 1352 ఫసలీ(1943 సంవత్సరం) మధ్యకాలంలో ఆరు సంవత్సరాలకు తక్కువ కాకుండా భూములను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న వారిని, లేదా 1948 నుంచి ఆరు సంవత్సరాలు కౌలుదారుగా ఉన్న వారిని రక్షిత కౌలుదారుగా గుర్తిస్తారు.
- 1953 సంవత్సరం నుంచి భూములను కౌలుకు ఇవ్వడానికి నిషేధించారు.
- సరైన సమయంలో అంటే భూమి కౌలుకు తీసుకున్న కాలంలో సక్రమంగా కౌలు చెల్లిస్తున్నప్పుడు కౌలుదారును తొలగించకూడదు.

'సరే' అను ఒక్క సారి. రేపే నిన్ను మేనేజర్‌గా ప్రకటిస్తాను.'

'నన్ను మేనేజర్ని చెయ్యడం కాదు, శ్రామికుల్లో నేను సోషలిజం మాట ఎత్తుతానని నన్ను హత్య చేయిస్తే అది కీర్తి నాకు!'

'తెలివైనవాడివనుకున్నాను. ఉద్యోగం ఊడగొట్టుకునేదాకా తెచ్చుకుంటున్నావు.'

'అది గొప్ప విముక్తి నాకు. నా కాలాన్ని ఐదేళ్లుగా నీ సేవలో నాశనం చేసుకుంటున్నాను. నీ సేవ తప్పిపోతే, నా వర్గ సేవలోనే నా కాలాన్ని రాత్రింబవళ్లూ వినియోగిస్తాను. మార్క్స్ శిష్యులు గురువు నించి ఏం నేర్చుకుని ఉంటారో ఊహించలేక నన్ను పిలిచావు. నీ ఎత్తుగడలు ఎక్కడైనా చేసుకో, మార్క్స్ శిష్యుల మీద కాదు. అవి అక్కడ సాగవు.'

(ముగిసింది)

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్స్ 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

- కౌలుదారుడు తనంతట తనే భూమిని భూస్వామికి అప్పగించ దలచినప్పుడు తహసిల్దారుకు రాత పూర్వకంగా నెల రోజుల ముందే తెలపాలి. తహసిల్దారు అంగీకరించినప్పుడు మాత్రమే అప్పగింత చెల్లుతుంది.
- కౌలుదారు తన ఆధీనంలోని భూమిని భాగాలుగా చేసి వేరే వారికి కొంత భూమి అందులో కౌలుకివ్వడం జరిగితే కౌలు ఒప్పందం రద్దు అవుతుంది.
- కౌలుదారుడు భూమికి నష్టం కలిగించినా, వ్యవసాయేతర కార్యక్రమాలకు భూమిని వినియోగించినా భూస్వామిని స్వాధీనం చేసుకోవచ్చు.
- కౌలుదారుడు తన ఆధీనంలో ఉన్న భూమిని భూ తనఖా బ్యాంకులకు, సహకార సంఘాలకు తనఖా పెట్టవచ్చు.
- భూస్వామి కౌలు తప్ప వేరే ఏ ప్రతిఫలం శ్రమ రూపంలో కాని, బహుమానం రూపంలో కాని కౌలుదారు నుంచి పొందకూడదు.

1950 సంవత్సరం కౌలుదారీ రద్దు చట్టంలోని రకరకాల షరతులను వినియోగించుకొని భూస్వాములు కౌలుదారులను భూముల నుంచి వెళ్లగొట్టారు. దాన్ని 1952లో సవరణ బిల్లు ప్రవేశపెట్టి 1953 సంవత్సరానికి భూముల నుంచి సాగుదారులను తొలగించడానికి వీలు లేకుండా 'హైదరాబాద్ ప్రివెన్షన్ ఆఫ్ ఎవిక్షన్ ఆర్డినెన్స్'ను ప్రభత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా 1952 మార్చ్ 21కు 'బేదఖల్' (కౌలుదారుకు సాగుచేసుకొనే అధికారం ఉన్నా దానిని గుర్తించకుండా భూస్వామి కౌలుదారును భూమి నుంచి తొలగించడం) అయిన భూములను మళ్లీ వారికే ఇప్పించాలని, కౌలుదారుల అనుమతి లేకుండా అమ్మిన భూములను గుర్తించి తిరిగి వారికే అప్పగించాలని, కౌలు పరిమాణాన్ని భూమి శిస్తుకు మాగాణి భూములకు మూడు రెట్లుగా, మెట్ట భూములకు నాలుగు రెట్లుగా, తోటలకు (భగత్) ఐదు రెట్లు మాత్రమే భూస్వాములు పొందాలని నిర్ణయించి ఈ చట్టం ద్వారా ప్రకటించారు.

భూస్వామి కౌలుదారునికి తప్పని సరిగా ఒక కుటుంబ కమతాన్ని వదిలి అందుకు మూడు రెట్లు భూమి తీసుకోవచ్చు లేదా కౌలుదారునికి కుటుంబ కమతంలో 1/3 వంతు భూమి వదిలి అందుకు రెండు రెట్లు భూమిని తీసుకోవచ్చునని ఆర్డినెన్స్ తెలిపింది. ముఖ్యంగా భూమిని కౌలుదారుడు కొనదలచితే తాను భూస్వామికి ఇస్తున్న కౌలుకు ఎనిమిది రెట్లుగా బావుల ద్వారా సాగుచేసే భూములకు, మాగాణి భూములకు ఆరు రెట్లు, మెట్టకు పదిహేను రెట్లు కౌలును ధరగా నిర్ణయించారు. ఈ వెలను ఎనిమిది సంవత్సరాల కాలంలో 16 వాయిదాలలో చెల్లించాడానికి కౌలుదారుకు అవకాశం కల్పించారు. కౌలుదారు తాను సాగు చేసే మొత్తం పొలాన్ని కొనలేని పక్షంలో ఎంత కొనగలడో అంతకు దానికి తగిన మొత్తం చెల్లించి కొనుక్కోవచ్చు. ఒక వేళ భూస్వామి ఇందుకు ఒప్పుకోక పోతే ట్రిబ్యునల్‌లో కేసు వేసుకొని కౌలుదారు భూమిని పొందే అవకాశం కల్పించారు. ముఖ్యంగా చట్టంలోని సెక్షన్ 38 ద్వారా కౌలుదారులు పలు విధాలుగా భూమిని పొందే అవకాశం వచ్చింది.

సెక్షన్ 38-ఎ ద్వారా భూస్వామికి ధర చెల్లించి భూమిని పొందొచ్చు. 38-బి ద్వారా భూస్వామి తనంతట తనే భూమిని కౌలుదారుకు ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా తన భూమిని వదులుకోవచ్చు. 38-సి ద్వారా భూస్వామికి కుటుంబ కమతం కన్నా ఎక్కువ భూమిలేని సందర్భంలో కౌలుదారుకు ధర చెల్లించి కొనుకునే అవకాశం ఉంది. సెక్షన్ 38-డి ద్వారా రక్షిత కౌలుదారుకు భూస్వామి నుంచి నోటీసు అందుకున్న తరువాత కౌలుదారు ఆరు నెలలకు కూడా భూమిని ధర చెల్లించి కొనుక్కునే సదుపాయం ఉంది. సెక్షన్ 38-ఇ ద్వారా ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలు సంక్రమించి, భూస్వామి రక్షిత కౌలుదారుకు భూమి ఇవ్వకూడదని నిర్ణయించుకున్నా కూడా, విచారణ ద్వారా భూమిని భూస్వామి నుంచి నిర్బంధంగా స్వాధీనం చేసుకొని కౌలుదారునకు అప్పగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. కౌలుదారుకు రెవెన్యూ విభాగాధికారి ద్వారా ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్(ఒఆర్‌సి)ని జారీ చేస్తారు. దీనిని ప్రభుత్వం తన గజెట్ సంఖ్య 29 తేదీ 1954 ఫిబ్రవరి 4న ప్రచురించిన దానికి ముందు తేదీన రక్షిత కౌలుదారు ఆధీనంలో ఉన్న భూమికి వర్తింప చేసి ఒఆర్‌సి జారీ చేస్తారు. ఒక వేళ అప్పటికే భూస్వామి ఆధీనంలో భూమి ఉన్నా కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కౌలుదారుకు భూమిని అప్పగిస్తుంది.

ఈ చట్టంలోని సెక్షన్ 40 ద్వారా రక్షిత కౌలుదారు వారుసులకు కూడా యాజమాన్య హక్కులు లభిస్తాయి.

కుటుంబ కమతానికి లెక్కించే భూమికి మూడు రెట్లు భూమిని ఒక భూస్వామి తన యాజమాన్య హక్కు కింద ఉంచుకొనే అవకాశం ఉంది. ఒక కుటుంబ కమతానికి భూమి రకాన్ని నీటి పారుదలను బట్టి ఇలా విభజించారు. నీటి పారుదల ద్వారా సంవత్సరానికి ఒక పంట పండే భూమి ఆరు నుండి తొమ్మిది ఎకరాలు. మెట్టలో నల్ల రేగడి భూమి- 24 నుండి 36 ఎకరాలు మెట్ట భూమిలో చల్క భూములు- 48 నుండి 72 ఎకరాలు ఒక కుటుంబ కమతంగా నిర్ణయించారు.

పంటకు అయ్యే ఖర్చును యాభై శాతం మినహాయించి ప్రభుత్వం అక్కడి స్థానిక పరిస్థితుల కనుగుణంగా భూమిని భూస్వామి యాజమాన్య హక్కుకు వదిలేయవచ్చు. మూడు కుటుంబ కమతాల కన్నా ఎక్కువ ఉన్న భూమిని రెవిన్యూ అధికారులు కౌలుదారులకు, ఇతరులకు చట్టంలోని వివిధ సెక్షన్ల ఆధారంగా కేటాయిస్తారు.

జాగీరు రద్దు చట్టం 1949

1949 సెప్టెంబరు 14న 'హైదరాబాదు జాగీరు రద్దు నిబంధనల చట్టం' చేశారు. ఈ చట్టం ద్వారా 1949 సెప్టెంబర్ 18 నుంచి 1949 సెప్టెంబర్ లోపు 7860 గ్రామాలలోని 975 జాగీర్దార్లను తొలగించడమే కాకుండా వారి ఆధీనంలోని భూమి శిస్తు లెక్కలను ఇతర భూ రికార్డులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వీరు వసూలు చేసే భూమి శిస్తుకు 12.5 శాతం రాయితీ కూడా ఇచ్చారు. జాగీర్దార్లకు వారు కోల్పోయిన భూమికి బదలాయింపు రుసుం (కమ్యూటేషన్) ఇవ్వడానికి జాగీరు అడ్మినిస్ట్రేటర్‌లను, సహాయ జాగీరు అడ్మినిస్ట్రేటర్‌లను నియమించారు.

జాగీర్దారులు కమ్యూటేషన్ పొందడానికి గాను వారి ఆధీనంలో ఉన్న ఇనాంలు, ఇతర భూముల విచారణ పూర్తి చేయడానికి, వారి వారసుల నిర్ధారణకు, వీరికి ప్రభుత్వాలు కాని, సమర్థ అధికారులు కాని గ్రాంట్ చేసిన పత్రాలను పరిశీలించడానికి, వాటిని సమయ నిర్ధారణకు, పత్రాలను బట్టి వారికి జాగీరు భూములలో ఇచ్చిన హక్కులకు సంబంధించి విచారణ జరిగిన తరువాత మాత్రమే వారికి కమ్యూటేషన్‌ను, పెన్షన్‌ను మంజూరు చేయడం జరుగుతుంది కాబట్టి వీటిని విచారించడానికి, 1952లో 'అతియత్ ఎంక్వైరీ యాక్ట్'ను చేశారు

(అతియత్ అంటే దానం చేయడం). ఈ చట్టం ద్వారా విచారణ జరపడానికి అతియత్ డిప్యూటీ కలెక్టర్, అతియత్ కలెక్టర్, నాజిమ్ అతియత్ చివరగా బోర్డ్ ఆఫ్ రెవెన్యూ దగ్గర అప్పీలుతో విచారణ ముగిసి అంతిమ తీర్పు వస్తుంది. ఈ అతియత్ కోర్టులు జాగీర్దారులకు భూమి మీదా, ఇతర ఆదాయాలు వసూలు చేసుకోవడానికి ఉన్న హక్కులు, లేదా వసూలయిన వాటిలో వీరికిచ్చే వంతు ప్రతిఫలాన్ని నిర్ధారించే పత్రాలను (వీటిని ముంతఖబ్ లేదా వాసిఖ్ అంటారు. వీటిని నిజాం పాలనలో జాగీర్దారులు ఇతరులకు భూమిని ఇవ్వడానికి ఎన్నుకొన్న తరువాత ఇచ్చే ధృవపత్రం. వీటిని రిజిష్టరుగా కూడా తయారు చేస్తారు.) పరిశీలించి, వీరికి వచ్చే కమ్యూటేషన్‌ను, వీరి వాటాకు వచ్చే భూమిని నిర్ణయించి ఈ అతియత్ కోర్టులు ఉత్తర్వులనిస్తాయి. అతియత్ కోర్టులు, సివిల్ కోర్టులకు వారసత్వానికి సబంధించిన, విడాకుల తరువాత వారసత్వం లాంటివి పంపిస్తేనే సివిల్ కోర్టుల విచారణ పరిధిలోకి వస్తాయి కాని, మిగతా గృహవసరాలకు ఉపయోగించుకునే స్థలాలు, వాటి చుట్టూ ఉండే పొలం తోటలకు మినహాయింపు; వీరికి జాగీరుగా గ్రాంట్ అయిన భూమి కాకుండా వీరికి ఉన్న స్వంత ఆస్తికి మినహాయింపు వీరికి వచ్చే భూమి వాటా, వాటిపై వివాదాలను అతియత్ కోర్టులే తీర్పులిస్తాయి. అతియత్ కోర్టుల తీర్పులను న్యాయ విచారణ పరిధిలోకి తీసుకొచ్చి వీటికి భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 193, 228 క్రింద న్యాయాధికార ఉత్తర్వులుగా పరిగణించారు.

ఇవేకాక జాగీర్దారుల దగ్గర పరిపాలనా వ్యవహారాలు, భూ వ్యవహారాలు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి తగిన అర్హత ఉంటే వారికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని కల్పించారు. ఇలా శతాబ్దాల తరబడి రాచరిక వ్యవస్థలు, పరాయి పాలకుల ద్వారా అధికారం పొంది సామాన్య రైతులకు, వ్యవసాయ కూలీలకు భూములు దక్కడానికి భారతదేశ ప్రజాస్వామ్య ప్రభుత్వం రాచరిక వ్యవస్థ ఆనవాళ్లైన జాగీర్దార్లను పూర్తిగా తొలగించింది. వీరి ఆధీనంలో ఉన్న భూములను కౌలుదారులకు, ఇతర భూమి లేని పేదలకు పంచడానికి గాను హైదారాబాదు కౌలుదారీ, వ్యవసాయ కమతం చట్టాన్ని 1950లో చేసింది.

మద్రాస్ ప్రెసిడెన్సీ భాగంలోని ఆంధ్ర ప్రాంతంలో మద్రాస్ ఎస్టేట్‌లు (రద్దు, రైత్వారీకి మార్పు) చట్టం 1949 ద్వారా జమీందార్లు, రాజాలు ఇనాంగా ఎవరికైనా మంజూరు చేసిన వాటికి మాత్రమే రైత్వారీ పట్టాలు ఇచ్చారు. వాస్తవానికి ఇనాం భూములలో ఎక్కువ విస్తీర్ణంలో ధనికులు లేరని, కేవలం సేవా ఇనాంల ద్వారా అతి తక్కువ భూమిని అనుభవిస్తున్న వారు మాత్రమే ఉన్నారనే వాదనతో ఆంధ్ర ప్రాంతంలో ఇనాం భూముల రద్దు చట్టాన్ని చేయలేదు. కాని వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. స్వాతంత్రం రావడానికి పూర్వం మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంతంలో ఏజెన్సీ ప్రాంతాలతో కలిపి (గంజాం, బళ్లారి జిల్లాలు తీసివేసి) రైత్వారీ భూములు చిన్న ఇనాంలతో కలిపి 3,78,06,399 ఎకరాలుండగా కేవలం ఇనాం భూములు మాత్రమే 34,16,264 ఎకరాలుంది. జమీందారీ భూములు 1,77,32,934 ఎకరాలుగా, పోరంబోకు భూములు 1,33,81,435 ఎకరాలు ఉన్నట్లుగా గుర్తించారు. వాస్తవానికి ఇనాందారీ వ్యవస్థ ద్వారా ఉద్యోగులకు సమాజానికి సేవ చేసే వారికి ఇచ్చే ఇనాంలు (మొఖాసాలు), ఒక గ్రామం లేదా కొన్ని గ్రామలను కలిపి ఇచ్చే (మేజరు) పెద్ద ఇనాంలు (శ్రోత్రియములు), గ్రామం కన్నా తక్కువ భాగం ఇచ్చే ఇనాంలు (ఖండిక) లాంటివి ఆంధ్ర భూభాగంలో 11,126 గ్రామాలు లేదా పెద్ద కమతాలలో 20.25 లక్షల ఎకరాలు ఉందని అందులో 2.10 లక్షల ఎకరాలు మేజర్ ఇనాం దారుల యాజమాన్య హక్కుల కింద ఉందని తేలింది. పైగా యాజమాన్యాలు 'పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్స్'ను అడ్డు పెట్టుకొని ఇనాం భూములలో సాగు చేసుకునే కౌలుదార్లను, ఇతర సేవా ఇనాందారులను వెళ్లగొట్టడం మొదలు పెట్టారు.

ప్రజల ఉద్యమాలు, రైతుల ఉద్యమాలు ఎక్కువై, హైదారాబాదు రాష్ట్రంలోని కౌలుదారీ చట్టం 1950 ద్వారా కౌలుదారులకు భూములపై యాజమాన్య హక్కులు మంజూరు చేస్తున్నట్లుగానే, ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన ఇనాం భూములను సాగు చేసుకునే రైతులకు యాజమాన్య హక్కులు ఇవ్వడానికి 1956లో ఇనాం (రద్దు, రైత్వారీగా మార్పు) చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ఇనాం భూములలో సాగుచేసుకునే చిన్న రైతులకు (వివిధ సేవలందించే వారికి) రైత్వారీ పట్టాలను అందజేశారు. శ్రోత్రియం భూములను 1956 రద్దు చట్టంలోని నిబంధనల ద్వారా జమీందారుకు లేదా ఇనాందారుకు 1/3 వంతు భూమిని ఇస్తూ మిగిలిన భూమిని సాగు చేస్తున్న రైతులకు లేని పక్షంలో ప్రభుత్వానికి చెందే విధంగా చట్టంలో ఉండడం వలన ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకుంది.

ఇనాం భూములలో సేవా ఇనాంలను మినహాయించి మొఖాసాలలో, శ్రోత్రియాలలో, ఖండికలలో, ఎస్టేటులలో ఎన్నో సంవత్సరాల నుండి రైతులు భూములను కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. హైదారాబాదు రాష్ట్ర భూభాగానికి సంబంధించి 1950 కౌలుదారీ రద్దు చట్టం ఉండగా మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంతానికి సంబంధించి కౌలుదారులకు రక్షణ, యాజమాన్య హక్కులు కల్పించే చట్టం లేదు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (ఇనాం రద్దు చట్టాలతో పాటు) 'ఆంధ్ర ప్రాంత కౌలుదారీ చట్టం'ను 1956లో (భూసంస్కరణల కమిటీ సిఫారసు మేరకు) చేసింది. ఇప్పటివరకు భారత ప్రభుత్వ స్వపరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూభాగానికి సంబంధించి చేసిన భూ చట్టాల ద్వారా దేవాలయ, ధార్మిక సంస్థలకు కేటాయించిన భూములలో వ్యవసాయం చేస్తున్న వారికి రక్షణ కల్పించలేదు. కాని ఆంధ్ర ప్రాంత కౌలుదారీ చట్టంలో దేవాలయాలు, వివిధ ధార్మిక సంస్థలు, మత సంబంధమైన సంస్థలకు కేటాయించిన/మంజూరు చేసిన/లీజుకిచ్చిన భూములలో 6 సంవత్సరాలకు పైబడి సాగు చేస్తున్న వారిని రక్షిత కౌలుదారులుగా గుర్తించి, వారు యాజమాన్య హక్కులు పొందే అవకాశం వచ్చింది. కౌలుదారుల గుర్తించడం, కౌలుదారులకు రక్షించడం వారికి యాజమాన్య హక్కులు పొందడంలో వచ్చే అడ్డంకులు తొలగించడానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. దీనితో పాటు ఇనాంలు రద్దు అయిన తరువాత ఆ భూముల వివరాలన్నీ 'ఇనాం ఫెయిర్ రిజిస్టరు' రూపంలో పొందు పరిచే అవకాశం కల్పించి, కౌలుదారులకు, ఇతర సాగుదారులకు, సేవా ఇనాందారులకు రైత్వారీ పట్టాలు పొందే అవకాశం రావడమే కాకుండా, రిజిష్టర్ల వలన ప్రభుత్వ రక్షణ కూడా వచ్చింది.

(ఇంకా ఉంది)

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారి)
saralareddy007@gmail.com

వీ

(...4వ పేజీ తరువాయి)
తప్పే. ఒక పొరపాటు అభిప్రాయం ఉన్నదని మొత్తానికి మొత్తాన్ని తీసిపార వేయడమూ తప్పే, అయితే అటుకొస, లేకపోతే ఇటుకొస. అయితే తెలుపు, లేకపోతే నలుపు. ఇంతే రంగనాయకమ్మ గారి తర్కం. 'గడ్డం పెంచుకున్నాడు, చేపలు తినవచ్చన్నాడు గనుక మార్క్స్‌కు మార్క్సిజం తెలియదు' అని రాసిన రచయిత్రి నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించడం అనవసరం.

- ఎస్ జనార్దన్,
మెదక్

వెనిజులా దేశ గత అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌పైన 'వీక్షణం' మే సంచికలో నేను చేసిన విశ్లేషణపై తనకు అంగీకారం ఉందనీ, కాని ఆ పేరుతో కాలం చెల్లిన మూడు ప్రపంచాల సిద్ధాంతం గురించి గొప్పగా చెప్పడమే తనకు విచిత్రంగా ఉందని లంకా వెంకట పాపిరెడ్డి జూన్ సంచికకు తాను రాసిన లేఖలో పేర్కొన్నారు. వారు నా విశ్లేషణతో అంగీకరిస్తునందుకు సంతోషం. మూడు ప్రపంచాల సిద్ధాంతంపైన పాపిరెడ్డిగా తన లేఖలో లేవనెత్తిన కొన్ని అంశాలకు మాత్రమే పరిమితమై ఈ కింది వివరణను ఇస్తున్నాను. (దానిపైన సమగ్రమైన చర్చ వీక్షణంలో చర్చ కోసం నిర్దేశించిన పరిమితిలో సాధ్యమయ్యేది కానందున). దానికి ముందు ఈ కింది వివరణ ఇవ్వడం అవసరం.

సామ్రాజ్యవాద వ్యతిరేక, అగ్రరాజ్య వ్యతిరేక పోరాటంలో భారత పాలకుల పాత్ర పూర్తిగా ప్రతికూలంగా ఉంటున్నదనీ, అందువలన వారు అనుసరిస్తున్న ఆ ప్రతికూల(నెగిటివ్) విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని నేను రాశాను. దానిపైన పాపిరెడ్డి నాకు లేని ఈ కింది అభిప్రాయాలను అంటగడ్తూ వ్యాఖ్యానించారు. 'ముందు భారత పాలక వర్గాలను అమెరికా ఆధిపత్యం నుండి బయటకు తీసుకరావాలి. తర్వాత పాలక వర్గాలు, దేశభక్తులు, కమ్యూనిస్టులు అందరూ కలసి అమెరికాకు వ్యతిరేకంగా పోరాడాలి. ఇది ఈ సిద్ధాంతం గొప్పతనం'. ఈ విధమైన అభిప్రాయాన్ని పాపిరెడ్డి ఏ ఆధారాలతో నాకు అంటగడ్తున్నట్లు? రాసిన దానితో సంబంధం కాకుండా ఈ విధమైన వ్యాఖ్యానాలు చేయడం ఆరోగ్యకరమైన చర్చలో భాగం కాలేదు. కాదు.

మూడు ప్రపంచాల సిద్ధాంతాన్ని మావో 1974 లోనే ఒక సమగ్రమైన సిద్ధాంతంగా అభివృద్ధి చేసినప్పటికీ, ప్రపంచాన్ని మూడు రకాలుగా వర్గీకరించడాన్ని మార్క్సిస్టు మాహోపాధ్యులైన లెనిన్, స్టాలిన్, మావోలు అంతకు చాలా పూర్వం నుండే అనుసరిస్తూ వచ్చారు. 1920లో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ కాంగ్రెసుకు ఇచ్చిన రిపోర్టులో లెనిన్ పెట్టుబడిదారీ ప్రపంచంలోని దేశాలను మూడు రకాలుగా

1. వలస, అర్ధ వలస దేశాలు, ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన దేశాలు.
2. తమ వెనుకటి స్థితిని కాపాడుకున్న దేశాలు.
3. యుద్ధంలో విజయం పొంది లాభపడిన దేశాలుగా విభజించినాడు.

కార్మికవర్గం పీడిత జాతులతో తప్పని సరిగా సమైక్యం కావాలనే లెనిన్ సూత్రీకరణను స్టాలిన్ కొనసాగించాడు. వాటి వర్గ స్థితి, రాజకీయ దృక్పథాలు వేరుగా ఉన్నప్పటికీ, జాతీయ విముక్తి యుద్ధంలో సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించే అన్ని శక్తులను కలుపుక రావాలని ఆయన సూచించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్, ఇటలీలకు వ్యతిరేకంగా ఫాసిస్టు వ్యతిరేక శిబిరాన్ని నెలకొలిపాడు. దాని ద్వారా ఫాసిజాన్ని ఓడించి దాని ప్రమాదం నుండి ప్రపంచాన్ని కాపాడాడు.

చైనాలో మావో నాయకత్వంలో కమ్యూనిస్టుపార్టీ సామ్రాజ్యవాదుల మధ్య ఉన్న వైరుధ్యాలను ఉపయోగించుకొని అమెరికాకు దళారులైన కొమింటాంగ్ పార్టీతో ఐక్య సంఘటన కట్టి జపాన్ దురాక్రమణ నుండి చైనాను విముక్తి చేసింది. ఆ తర్వాత దశలో అమెరికాను దేశం నుండి వెళ్లగొట్టి విప్లవాన్ని విజయవంతం చేసింది.

'సూత్రరీత్యా మావో రూపొందించిన మూడు ప్రపంచాల సిద్ధాంతం 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో మార్క్స్, ఎంగెల్స్‌లు రష్యన్ జారిస్టు సామాజ్యం పట్ల వారి దృక్పథం ఆధారంగా ఐరోపాలోని రాజకీయ శక్తులను విభజించడానికి అనుసరించిన ప్రామాణికాలతో సరిగ్గా సరిపోతుంది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచాన్ని మూడు రకాల దేశాలుగా లెనిన్ చేసిన వర్గీకరణతోనూ అది సరిపోతుంది.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఫాసిస్టు అనుకూల ఫాసిస్టు వ్యతిరేక శిబిరాలుగానూ స్టాలిన్ చేసిన విభజనకు ఈ సిద్ధాంతం అనుగుణంగా ఉంది. అంతే కాకుండా ప్రపంచ రాజకీయ శక్తుల విభజనకు సంబంధించి వారు రూపొందించిన సిద్ధాంతాల క్రమాభివృద్ధి ఫలితమే ఈ సిద్ధాంతం'.(చైర్మన్ మావో మూడు ప్రపంచాల సిద్ధాంతం మార్క్సిజం-లెనినిజానికి గొప్పకానుక-పీపుల్స్ డైలీ సంపాదకీయం 30-10-1977)

సామ్రాజ్యవాదాన్ని ప్రపంచంలో ఓడించడం కోసం ఒకే విప్లవ ఫ్రంట్ నిర్మాణం కోసం కృషి చేయాలని మార్క్సిస్టు మహోపాధ్యాయులందరూ కృషి చేస్తూ వచ్చారు. స్టాలిన్ కింద పేర్కొన్నది. దానికే ప్రతిబింబిస్తున్నది.

'ప్రపంచ స్థాయిలో ఒకే విప్లవ ఫ్రంట్ నిర్మాణాన్ని ఏర్పాటు చేసి దాన్ని సంఘటిత పర్చుకోకుండా, అభివృద్ధి చెందిన దేశాల్లో విప్లవం, సామ్రాజ్యవాదంచే అణచివేబడిన ప్రజల విముక్తి అసాధ్యం'. (లెనినిజం పునాదులు-స్టాలిన్, నుండి)

ఇక ప్రస్తుత పరిస్థితుల్లోకి వస్తే సామ్రాజ్యవాదం అమెరికా అగ్రరాజ్యం బలహీనపడ్డాయి. ఆ క్రమం కొనసాగుతున్నది. అయినా సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించే ఉంది. అందువలన మూడు ప్రపంచాల సిద్ధాంతం నేటికి కూడ తప్పకుండా వర్తిస్తుంది. ప్రపంచంలో ఇటీవల వచ్చిన, వస్తున్న అనేక మార్పులను మాత్రం పరిగణనలోకి తీసుకోవాలనేది స్పష్టమే.

'చావెజ్‌కు మద్దతుగా రెండవ ప్రపంచ దేశాలేవి ముందుకు రాలేదు. అమెరికాను వ్యతిరేకించే దేశాలపైన అది విధించే ఆకాంక్షలను వారు బలపర్చారు. అమెరికా చేసిన దాడులకు ఆర్థిక ఆయుధ, సైనిక సహాయాలు చేశారు. అమెరికాతో ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే మూడవ ప్రపంచ దేశాలను అణచడంలో అన్ని సామ్రాజ్యవాద దేశాలు ఐక్యమవుతున్నాయి' అని పాపిరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాల్సి ఉంది. రెండవ ప్రపంచానికి చెందిన దేశాలు కనీసం 30-40 వరకైనా ఉంటాయి. అందులో కొన్ని మాత్రమే సామ్రాజ్యవాద దేశాలు, మిగిలినవి కావు. ఈ విషయం పాపిరెడ్డి దృష్టిలో ఉందో లేదో తెలియదు. ఐక్య రాజ్య సమితి, భద్రతా మండలి, ప్రపంచ వాణిజ్య సంస్థలాంటి తదితర అంతర్జాతీయ సంస్థలలో రెండవ ప్రపంచానికి చెందిన అనేక దేశాలు అమెరికాను వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. ఇరాక్, అఫ్ఘనిస్తాన్ యుద్ధాల్లో వాటిలో కొన్ని మాత్రమే ప్రత్యక్షంగా సహకరిస్తున్నాయి. బ్రిటన్, జపాన్‌లాంటి కొద్ది దేశాలే దాంట్లో ఎక్కువగా పాల్గొంటున్నాయి. ఫ్రాన్స్, జర్మనీ లాంటి కొన్ని ముఖ్యమైన ఇతర సామ్రాజ్యవాద దేశాల పాత్ర వేరుగా ఉంటున్నది. ఇరాన్, సిరియా, పాలస్తీనా సమస్యల విషయంలో అమెరికాను బలపరుస్తున్న దేశాల సంఖ్య చాలా పరిమితంగానే ఉంటున్నది. రెండవ ప్రపంచంలోని మెజారిటీ దేశాలు అమెరికాను, ఇజ్రాయిల్‌ను వ్యతిరేకిస్తున్నాయి.

సామ్రాజ్యవాదానికి, అమెరికా అగ్రరాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగించవలసిన ఐక్య సంఘటనలో మూడవ ప్రపంచ దేశాలే ప్రధానమైన శక్తి అని మూడు ప్రపంచాల సిద్ధాంతం స్పష్టంగా పేర్కొంటున్నది. రెండవ ప్రపంచంలోని సామ్రాజ్యవాద దేశాలకు ద్వంద్వ పాత్ర ఉంటుంది. వారికి ఒక పక్క మొదటి ప్రపంచంతోనూ మరొక పక్క మూడవ ప్రపంచంతోనూ వైరుధ్యాలుంటాయి. అయినా ప్రధాన శత్రువును వేరు చేసి, వారికి వ్యతిరేకంగా పోరాటంలో కలుపుక రాగలిగిన శక్తులన్నింటినీ, ఐక్యం చేయాలనేది సాధారణ మార్క్సిస్టు-లెనినిస్టు ఎత్తుగడ. ప్రస్తుత అమెరికా అగ్ర రాజ్య వ్యతిరేక పోరాటానికి కూడ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఆ అవగాహనతోనే రెండవ ప్రపంచాన్ని కలుపుక రావాలని ఈ సిద్ధాంతం చెబుతున్నది.

మూడు ప్రపంచాల సిద్ధాంతంపై 30 సంవత్సరాల క్రితమే పెద్ద చర్చ జరిగిందనీ, దాని కళేబరానికి ప్రాణం పోసే ప్రయత్నమే చావెజ్ పైన నేను రాసిన వ్యాసమని పాపిరెడ్డి అంటున్నారు. అది ఒక తప్పుడు సిద్ధాంతమని కొందరు నిర్ధారించుకోవచ్చును. అలా చేయడానికి వారికి పూర్తి స్వేచ్ఛ, హక్కు ఉంటుంది. కానీ, తాము తిరస్కరించాం కాబట్టి ఇతరులు అందరూ కూడ తప్పనిసరిగా దాన్ని తిరస్కరించాల్సిందేనని అభిప్రాయ పడడం, విభేదం పట్ల ప్రజాస్వామిక వైఖరి కాదు. మొరటుగా చెప్పాలంటే అది నిరంకుశ వైఖరి అవుతుంది. అది తప్పుడు సిద్ధాంతమని దృఢ విశ్వాసాలు ఉన్న వారు అది తిరిగి ఏ విధంగా తప్పో, దానికి వారు చెపుతున్నదేమిటో వివరించాల్సి ఉంటుంది. దాని పైన ప్రజాస్వామిక పద్ధతులో చర్చించాల్సి ఉంటుంది. అంతే కాని ఆ సిద్ధాంతాన్ని మేమెప్పుడో తిరస్కరించాం. అది ఒక కుళ్లిన శవం అని అనడం దానికి సరైన ప్రత్యామ్నాయం కాబోదు. ఆ సిద్ధాంతాన్ని దృఢంగా విశ్వసించేవారు తిరిగి అలాంటి ఏదో ఒక పదజాలాన్ని వారు కూడ ప్రయోగించగల్గుతారు కదా?

- జి. సత్యనారాయణరెడ్డి
హైదరాబాద్

మావోయిస్టుల దాడిలో 29 మంది మృతి

మే 25న చత్తీస్‌గడ్‌లోని బస్తర్ జిల్లా దర్బాలో పరివర్తన్ యాత్రకు వెళ్లి తిరిగి వస్తున్న కాంగ్రెస్ నేతల కాన్వాయ్‌పై జీరా ఘాట్ వద్ద మావోయిస్టులు దాడిచేసి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సాల్వాజుడుం వ్యవస్థాపకుడు కాంగ్రెస్ నాయకుడు మహేంద్ర కర్మ, పిసిసి అధ్యక్షుడు నందన్‌కుమార్ పటేల్, మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, పోలీసు సిబ్బందితో సహా మొత్తం 29 మంది మరణించారు. 20 మంది వరకు గాయపడ్డారు.

మావోయిస్టు నేతల ఆస్తుల జప్తు

మావోయిస్టు నేతలు ముప్పాళ లక్ష్మణరావు, బలుపూరి నారాయణరావు, తిప్పర్తి తిరుపతిలపై 2010లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అక్రమంగా ఆయుధాలు కలిగిఉన్నారని కేసులు నమోదుచేసింది. కేసుల విచారణకు వీరు రాకపోవడంతో వారి ఆస్తులను జప్తుచేయాలని కోల్‌కత్తా సిటీ సెషన్స్ కోర్టు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) ను ఆదేశించింది. ఎన్.ఐ.ఎ అధికారులు ముప్పాళ లక్ష్మణరావు, బలుపూరి నారాయణరావుల స్వగ్రామాలైన కరీంనగర్ జిల్లా సారంగాపూర్ మండలం బీర్‌పూర్ గ్రామాలకు జూన్ 1న వెళ్లి దర్యాప్తు చేయగా లక్ష్మణరావుకు ఆస్తులులేవని, నారాయణరావుకు ఒక ఎకర ముప్పై ఏడు గుంటల భూమి ఉందని నిర్ధారించి దాన్ని అధికారులు జప్తు చేశారు. తిరుపతి స్వగ్రామం కరీంనగర్ జిల్లా కోరుట్ల గ్రామానికి వెళ్లి పరిశీలించగా అతనికి ఆస్తులు ఏమీ లేవని తేలింది. ఎన్‌ఐఎ అధికారి రాజ సుబ్రహ్మణ్యం కోర్టు ఆదేశాల మేరకే ఆస్తులను జప్తు చేస్తున్నామని ఈ ఆస్తులను ఎవరు అమ్మవద్దని, కొనవద్దని కొంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని గ్రామంలో చాటింపు వేయించారు.

ఆర్‌టిఐ పరిధిలోకి రాజకీయ పార్టీలు

సమాచార హక్కు చట్టానికి రాజకీయ పార్టీలు కూడా జవాబుదారీగా ఉండాల్సిందేనని కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) ప్రధాన సమాచార కమిషనర్ సత్యానంద మిశ్రా, కమిషనర్లు ఎం.ఎల్. శర్మ, అన్నపూర్ణ దీక్షిత్‌లతో కూడిన కమిటీ జూన్ 3న ఆదేశాలు జారీ చేసింది. ఆరు జాతీయ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, సిపిఐ, ఎన్‌సిపి, బిఎస్‌పిలను ఆర్‌టిఐ చట్టం కింద ప్రజా సంస్థల ప్రమాణాలను నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ ఆరు రాజకీయ పార్టీలకు అందిన విరాళాలు, నిధులు, వాటిని అందజేసిన వారి వివరాలు అందజేయాలని కోరింది. ఈ ఉత్తర్వుల మేరకు పార్టీలు నియమించిన సిపిఐఒలు నాలుగు వారాల గడువులోగా ఆర్‌టిఐ దరఖాస్తుపై స్పందించాలని కమిటీ స్పష్టం చేసింది.

ఎన్‌సిటిసి ఆమోదానికి రాష్ట్రాల నిరాకరణ

నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులతో కేంద్ర ప్రభుత్వం జూన్ 5న సమావేశం ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదం అణిచివేత కోసం ప్రతిపాదించిన ఎన్‌సిటిసి పని విధానం రాష్ట్రాల అధికారాలను నియంత్రించి, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్స్‌పై జరిపిన ఆపరేషన్‌లు, అనుభవాలకు సంబంధించిన 20 నిమిషాల ప్రత్యేక ప్రజంటేషన్ ఇచ్చారు.

అఖిలపక్ష సమావేశం

జూన్ 10న న్యూఢిల్లీలో ప్రధాని అధ్యక్షతన కేంద్రం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మావోయిస్టులను ఎదుర్కొనేందుకు అన్ని చట్టబద్ధ సాధనాలను ప్రయోగించాలని అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో నిరంతర సాయుధ చర్యలు చేపట్టడం, సమర్థ పాలన, వేగవంతమైన అభివృద్ధి చేపట్టాలని అఖిలపక్షం పిలుపునిచ్చింది. మావోయిస్టుల నిర్మూలనకోసం రాష్ట్రాలు పోరాడాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలను అందించాలని ఈ సమావేశం నిర్ణయించింది.

దర్శక నటుడు మణివణ్ణన్ కన్నుమూత

ప్రముఖ దర్శక నటుడు మణివణ్ణన్ (58) జూన్ 15న చెన్నైలోని నెసపాక్కంలో గుండెపోటుతో మరణించారు. దర్శకుడిగా సినిమారంగంలోకి ప్రవేశించిన ఆయన తమిళ, తెలుగు, మళయాళ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి, 50 చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. ఆయన మొదట ఎండిఎంకె పార్టీలో చేరి ఆ తర్వాత ఈలం తమిళుల కోసం పోరాడుతున్న నామ్ తమిళర్ పార్టీలో చేరారు.

పోలీసులపై కేసులా? - కేంద్రం

ఎన్‌కౌంటర్లలో పాల్గొనే భద్రతా సిబ్బందిపై హత్యనేరం నమోదు చేయాలన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను రద్దు చేయాలని కేంద్రం సుప్రీం కోర్టును మే 28న కోరింది. ఎన్‌కౌంటర్లపై ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వేసిన పిటిషన్‌పై 2009లో హైకోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది. ఎదురు కాల్పులు జరిగిన సందర్భంలో ఎవరైన మరణిస్తే ఆ కాల్పుల్లో పాల్గొన్న పోలీసులపై తప్పనిసరిగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ మౌలిక విధానాలను గుర్తించడంలో, దాని సార్వభౌమాధికార లక్షణాలను అర్థం చేసుకోవడంలో హైకోర్టు విఫలమైందని సుప్రీంకోర్టుకు కేంద్ర హోం శాఖ కౌంటర్ అఫిడవిట్ సమర్పించింది.

ఉత్తరాఖండ్, హిమాచల్‌లలో వరదలు

ఉత్తరాఖండ్‌లో జూన్ 15 నుండి కురుస్తున్న భారీ వర్షాలకు గంగా, యమున, మందాకిని నదులు పొంగి వరదలు వచ్చాయి. కొండ చరియలు విరిగిపడ్డాయి. ఛోటా చార్‌ధామ్ యాత్ర సందర్భంగా గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లకు వివిధ రాష్ట్రాల నుండి వెళ్లిన వేలాది మంది యాత్రికులు, స్థానిక ప్రజలు ఈ వరదలు చిక్కుకు పోయారు. ఇల్లు, వంతెనలు కూలి, కొండ చరియలు విరిగిపడి, ఆహారం అందక వేలాది మంది చనిపోయారు. ఇంకా ఎంతో మంది అక్కడే చిక్కుకుపోవడంతో వారిని హెలికాప్టర్ల సహాయంతో తరలిస్తున్నారు.

ఆర్మీ కాన్వాయ్‌పై దాడి

జూన్ 24న శ్రీనగర్ శివారులో జాతీయ రహదారిపై వెళ్తున్న ఆర్మీ కాన్వాయ్‌పై మిలిటెంట్లు దాడి చేయడంతో ఎనిమిద మంది సైనికులు మరణించారు. పంతొమ్మిది మంది గాయపడ్డారు. దాడికి పాల్పడింది తామేనని హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థ అని ప్రకటించింది. ఈ ఘటన ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యుపిఎ అధినేత్రి సోనియాగాంధీ జమ్ముకశ్మీర్ పర్యటనకు కొన్ని గంటల ముందే జరిగింది. మరోవైపు జమ్ము కశ్మీర్‌ను అనుసంధానిస్తూ 18 కిలోమీటర్ల పొడవైన బనీహాల్ – ఖాజిగుండ్ సొరంగ మార్గ రైల్వే లైన్‌ను ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జూన్ 26న ప్రారంభించారు. ఇది దేశంలోని పొడవైన సొరంగ రైల్వే మార్గం. వీ

అమెరికా - స్నోడెన్

అమెరికా భద్రతా నిఘా విభాగాలకు చెందిన అత్యంత కీలక సమాచారాన్ని వికీలీక్స్ సంస్థకు చేరవేశాడన్న అభియోగంపై అమెరికా సైనికుడు బ్రాడ్లీ మానింగ్‌కు అమెరికా ప్రభుత్వం జీవితకాల జైలుశిక్ష విధించింది. అలాగే, సిఐఎ మాజీ నిపుణుడు ఎడ్వర్డ్ స్నోడెన్ అమెరికా గూఢచర్య శాఖ ప్రిజమ్ సేకరిస్తున్న టెలిఫోన్ సంభాషణలు, ప్రముఖ ఇంటర్నెట్ సంస్థల ఆదాన ప్రదాన వివరాలు (యూజర్ డాటా) సేకరించిన సమాచారాన్ని వాషింగ్టన్ పోస్ట్, గార్డియన్ పత్రికలు జూన్ 6న ప్రచురించాయి. ఈ ఉదంతంతో అమెరికన్‌లో తీవ్ర సంచలనం రేపింది. ఈ చర్య పై అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కాగా, ఈ రహస్యాలు బయటపడిన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తనను అంతం చేస్తుందేమోననే భయంతో ఎడ్వర్డ్ స్నోడెన్ రష్యాలో ఆశ్రయం పొందాడు.

ఇరాన్ ఎన్నికలు

ఇరాన్‌లో జూన్ 14న జరిగిన ఎన్నికలలో సంస్కరణ వాది హసన్ రౌహానీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 50.7 శాతం ఓట్లు రావడంతో ఆయన ఈ పదవి దక్కించుకున్నారు.

బ్రెజిల్‌లో నిరసనలు

బ్రెజిల్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూన్ 17న, 20న బ్రెజిల్ ప్రధాన నగరాలలో లక్షలాది మంది నిరసన ప్రదర్శనలు జరిపారు. ఒక పక్క ప్రజలపై అధిక పన్నులు, రవాణా ఛార్జీలు భారీగా పెంచిన ప్రభుత్వం, మరోపక్క ప్రపంచకప్ ఫుట్‌బాల్, ఒలింపిక్ గేమ్స్‌ల నిర్వహణ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోందనీ, వాటిని వెంటనే ఆపాలనీ, ఆ సంపదను ఆరోగ్యం, విద్య, ప్రజా సేవారంగాలకు ఉపయోగించాలనీ డిమాండ్ చేశారు.

పాకిస్తాన్ - బాంబు దాడులు

జూన్ 15న పాకిస్తాన్, క్వెటలోని సర్దార్ బహదూర్ ఖాన్ వైద్య విశ్వవిద్యాలయంలో జరిగిన బాంబు దాడిలో ఇరవై ఆరు మంది మరణించారు. ఇందులో వైద్య విద్యార్థినులు కూడా ఉన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న వారిపై ఒక మహిళా మానవబాంబు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జూన్ 15న బలుచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ 1892లో నిర్మించిన 121 ఏళ్ల పురాతన భవనాన్ని పేల్చివేశారు. ఈ భవనం బ్రిటన్ పాలనలో గవర్నర్ జనరల్ వేసవి విడిదిగానూ, పాకిస్తాన్ తొలి అధ్యక్షుడు జిన్నాకు చివరి రోజుల్లో నివాసంగానూ ఉంది.

టర్కీ - గెజీ పార్క్

టర్కీ రాజధాని ఇస్తాన్‌బుల్‌లోని తక్సిమ్ స్క్వేర్ వద్ద గల గెజీ పార్క్‌లోని చెట్లను, చారిత్రక సాంస్కృతిక కేంద్రాన్ని తొలగించి షాపింగ్ మాల్ నిర్మాణానికి టర్కీ అధికార పార్టీ జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ అనుమతించింది. ఈ చర్యను నిరసిస్తూ ప్రజలు పెద్ద ఉద్యమించారు. జూన్ 1 నుండి పార్క్ వద్ద శాంతియుత నిరసనలు ప్రారంభించారు. పోలీసులు బాష్పవాయుగోళాలు, రబ్బర్ బుల్లెట్లతో ఉద్యమకారులపై విరుచుకుపడ్డారు. ఆగ్రహించిన నిరసనకారులు అధికార ఎకెపి పార్టీ కార్యాలయానికి నిప్పంటించారు. ఘర్షణల్లో నలుగురు చనిపోగా, వేలాది మంది గాయపడ్డారు. గెజీపార్క్‌లో ఆరు వందల చెట్లు, టర్కీ వ్యవస్థాపక పిత లౌకికవాది ముస్తఫా కమల్ ఆటాటుర్క్ సాంస్కృతిక స్మారక కేంద్రం ఉంది.

బంగ్లాదేశ్ - కోర్టు తీర్పులు

ఏడు సంవత్సరాల క్రితం ఢాకా పొలిమేరలల్లో ఆత్మాహుతి బాంబుదాడి జరిపి ఎనిమిది మంది మృతికి కారణమైనారని ఒక న్యాయస్థానం జమాయత్ ముజాహిదీన్ బంగ్లాదేశ్‌కి చెందిన పదిమంది ఇస్లామిస్టులకు జూన్ 20న మరణశిక్ష విధించింది. హైకోర్టు ధృవీకరణ తరువాత శిక్ష అమలు జరపాలని తీర్పు చెప్పింది. బంగ్లాదేశ్ ప్రతిపక్ష నాయకురాలు ఖలీదా జియా పెద్ద కొడుకు తారీక్ రెహమాన్‌పై మనీ లాండరింగ్, ఆగస్ట్ 2004లో ఒక ర్యాలీ మీద జరిగిన బాంబు దాడితో సంబంధం ఉన్న అభియోగాలపై విచారించడానికి అమలుపరుస్తూ ఢాకా న్యాయస్థానం మే 26న అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. 2004 ఆగస్ట్‌లో జరిగిన బాంబు దాడిలో ఇరవై రెండు మంది మరణించారు. తారిక్ లండన్‌లో ఉంటున్నారు.

అఫ్ఘనిస్థాన్ - అమెరికా విభేదాలు

మే 24న కాబుల్ కేంద్రం మీద, ఐక్యరాజ్య సమితి, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ భవనాల వద్ద తాలిబన్‌లు దాడులు చేశారు. జూన్ 6న దక్షిణ అఫ్ఘన్ కాంధహార్‌లో తాలిబన్‌లు జరిపిన ఆత్మాహుతి దాడిలో ఏడుగురు జార్జియన్‌లు మరణించారు. జూన్ 1న అఫ్ఘన్ ప్రధాన విమానాశ్రయం మీద నాటో ఏయిర్ పోర్ట్ హెడ్‌క్వార్టర్స్ లక్ష్యంగా జరిగిన దాడుల నేపథ్యంలో జూన్ 18న నాటో దళాలు అఫ్ఘాన్ ప్రభుత్వ దళాలకు దేశ భద్రత రక్షణల బాధ్యతలను పూర్తిగా ధారాదత్తం చేస్తున్నట్లు నాటో సెక్రటరీ జనరల్ అండర్స్ ఫో రాస్‌ముసెక్ ప్రకటించారు. దోహాలో కొత్త కార్యాలయంలో తాలిబన్‌లతో అమెరికా ప్రత్యక్షంగా చర్యలు జరుపుతుందని రాస్‌ముసెక్ అన్నారు. దీంతో ఆగ్రహించిన అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ అమెరికా సమక్షంలో శాంతి చర్చలను నిలిపివేస్తున్నట్లు జూన్ 19న ప్రకటించారు.

ఆఫ్రికన్ యూనియన్

ప్రపంచంలోనే పొడవైన నైలునది ఉపనదిపై ఇథియోపియా నిర్మిస్తున్న జలవిద్యుత్ ప్రాజెక్టు వల్ల ఈజిప్ట్ ఇథియోపియాల మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఇథియోపియాలో పుట్టిన నీలి నైలు సుడాన్‌లో తెల్లనైలుతో కలుస్తుంది. నైలు నదిలోని 60 శాతం నీటికి నీలు నైలే వనరు. నీలి నైలు మీద నిర్మించే ప్రాజెక్టు 74 బిలియన్‌ల క్యూబిక్ మీటర్‌ల నీటిని నిల్వ చేయడంతో సుడాన్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది.

నెల్సన్ మండేలా పరిస్థితి విషమం

గత కొద్ది కాలంగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన దక్షిణ ఆఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. ఆయనకు డాక్టర్లు కృత్రిమ శ్వాస అందిస్తున్నారు.

వాల్‌మార్ట్ పర్యావరణ విధ్వంసం

పర్యావరణానికి హాని కలిగించినందుకు వాల్‌మార్ట్ సంస్థ అమెరికా ప్రభుత్వానికి 11 కోట్ల డాలర్లు (రు. 605 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించేందుకు అంగీకరించింది. అమెరికా వ్యాప్తంగా ఉన్న తన రిటైల్ స్టోర్ల నుంచి హానికారక వ్యర్థాలను పారబోసి శుద్ధజల చట్టాన్ని, పర్యావరణ చట్టాలను ఉల్లంగించిందంటూ లాస్ ఎంజెల్స్, శాన్ ఫ్రాన్సిస్కోలలో వాల్‌మార్ట్‌పై కేసులు నమోదై ఉన్నాయి. కస్టమర్లు తిరిగిచ్చిన పురుగుమందు లను భద్రపరచడంలో విఫలమైనందుకు కూడా వాల్ మార్ట్‌పై కేసులు దాఖలయ్యాయి.

అసహజ మరణాల సూచి

సంకలనం : వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 మే నుండి 31 మే 2013 వరకు 12 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1910)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	2	–	18	12	3	3	2	1	1	3	2	1	3	19	28	–	–	–	2	28
మహబూబ్‌నగర్	–	8	–	19	18	9	8	2	3	12	6	20	20	15	53	5	–	–	–	1	31
మెదక్	–	4	–	7	19	4	14	1	–	6	2	6	1	9	65	26	–	–	–	–	70
నిజామాబాద్	–	–	–	8	17	–	–	1	–	6	–	5	4	5	22	45	–	–	–	–	18
రంగారెడ్డి	–	2	–	9	25	5	20	2	6	13	6	10	2	8	60	18	–	–	–	–	31
వరంగల్	1	8	–	18	6	8	10	11	–	–	–	–	1	25	30	22	–	–	–	–	8
ఖమ్మం	–	3	–	7	18	2	6	2	2	5	2	4	–	5	55	22	–	–	–	–	122
నెల్లూరు	–	–	–	2	2	–	–	–	–	2	–	–	–	3	26	9	–	–	–	–	3
కర్నూలు	–	5	–	7	4	5	4	9	6	3	4	6	11	8	31	28	–	–	–	–	18
శ్రీకాకుళం	–	–	–	–	3	2	–	–	–	3	2	2	3	–	29	8	–	–	–	–	47
విశాఖపట్నం	1	–	–	11	5	1	3	–	1	4	3	–	7	3	30	11	–	–	–	7	90
విజయనగరం	–	–	–	3	–	–	2	2	2	4	1	2	2	–	21	8	–	–	–	–	48
మొత్తం	**2**	**32**	**–**	**109**	**129**	**39**	**70**	**32**	**21**	**59**	**29**	**57**	**52**	**84**	**441**	**230**	**–**	**–**	**–**	**10**	**514**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 144 -July 2013 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 29/6/2013 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao